

ముగ్ధమోహనం
by విసురజ
manrobo
www.manrobo.net

## మేన్‌రోబో క్రియేషన్స్ ప్రచురణ...

రచయితగా తొలి అక్షరంతోనే మీ అభిమానాన్ని స్వంతం చేసుకున్న విసురజ ముగ్ధమోహనం ఇప్పుడు మీ చేతుల్లో వుంది. ఈ పుస్తకాన్ని మీ ఆత్మీయులకు, మీ కానుకగా అందించండి. మీరు వెచ్చించే ఈ చిన్ని మొత్తం ఒక పుస్తకంరూపంలో మీ జ్ఞాపకంగా మీ ఆత్మీయుల దగ్గర వుంటుంది. ఒక జీవితకాలం, మీరు గుర్తుండిపోతారు.


To.

**శ్రీ/శ్రీమతి./కుమారి/.................................................**

..........................................................................................

..........................................................................................

మీరు ఒంటరిగా వున్నప్పుడు, అక్షరాలతో చెలిమి చేయాలని అనుకున్నప్పుడు, ఆహ్లాదాన్ని అక్షరరూపంలో పొందాలని అనుకున్నప్పుడు.... ఈ పుస్తకాన్ని చదవండి. ఇందులోని పాత్రలు మీ వెంట నడుస్తాయి. ఈ పుస్తకం, మన అభిమానం ఒక జీవితకాలం వుండాలని కోరుకుంటున్నాను...







(మీ పేరు)

**MANROBO CREATIONS**
**Entertainments & Media works**
**ప్రచురణలు** www.manrobo.net online magazine
**సికింద్రాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీ**

# *MUGDHAMOHANAM*

***A Novel by VISURAJA***
*c/o Progressive Services, 23/9, Ist floor,*
*East Patel Nagar, New Delhi..110008*
*CELL- +91-9999055656*
*jvvj1967@gmail.com*

First Edition : May 2013

**Coverpage Concept**
MANROBO CREATIONS

**Cover & Book Design**
GOPI

**Copies availble at :**
**Vishalandhra Book House all branches**

www.avkf.org/books

www.manrobo.net

manrobocreations@gmail.com

**Printed by :** KARSHAK ART PRINTERS
Vidyanagar, Hyderabad - 44

Price : **₹ 100/-**

**ఇది నా తొలి సీరియల్.**

**ఇది నా తొలి నవల...**

మొదటి రచనతోనే మీ అందరినుంచి లభించిన అనూహ్యమైన స్పందన ఆ పై వీక్షకాభిమానం స్వంతం చేసుకున్న ఈ ముగ్ధమోహనం కథ... మీ హృదయంలో ఒక జీవితకాలం నిలిచే అక్షరాల ఆహ్లాదాల మనోహరంగా మిగిలిపోవాలన్నదే నా ఆకాంక్ష.

మేన్‌రోబోలో (www.manrobo.net.online magazine) సీరియల్‌గా వస్తున్నప్పుడే ఊహించని ఈ స్పందన నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. సీరియల్ నన్నెంత ఇష్టంగా కష్టపెట్టిందో... సీరియల్ (నవల) చివరన రాసిన వీడ్కోలు మాటలో చూడవచ్చు.

ఈ నవల మీ ఇంట్లో, మీ హోం లైబ్రరీలో ఉండాలన్న నా కోరికను మీ ముందుంచుతున్నాను. ఓ అందమైన సాయంత్రం మీరు బోర్‌గా ఫీలయ్యే క్షణం, నేను సృజించిన అక్షర ప్రపంచంలో కాసింత విశ్రమించాలన్న నా స్వార్ధాన్ని కాదనకండి. ఆనందం లభిస్తుందన్న ప్రామిస్.

ముగ్ధ, మోహన, పూర్ణిమ, కార్తికేయ... చివరికి ఉగ్రవాది జర్దార్ పాత్రలన్నిటిని కూడా ఇష్టపడి, ఈ నవల రాయడంలో పడ్డ శ్రమను, కష్టాన్ని మీ అపురూప స్పందనతో మరుస్తూ ఉత్సాహంగా రాసాను.

ఈ నవల మీద మీ అమూల్యమైన అభిప్రాయాలు నాకు తెలియజేయగలరు.

**- మీ విసురజ**

# విసురజ గురించి విజయార్కె...

నా ముప్పయి మూడేళ్ళ ప్రస్థానంలో, మొదటిసారి నా అక్షరం గొంతు విప్పు తోంది. ఒక చీఫ్ ఎడిటర్‌గా మాత్రమే కాదు... ఒక రచయితగా ఇది అక్షర సంతకం.

మేన్‌రోబోలో ముగ్ధమోహనం సీరియల్ ప్రారంభం కావడానికి ముందు... విసురజగారు రాసిన కవితలు చూపించారు మేన్‌రోబో మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి కూచ నగారు.

కవితల్లో కొసమెరుపు... పదప్రయోగాలలో నవ్యత బావుందనిపించింది. విసు రజ ఫ్రమ్ న్యూ ఢిల్లీ శీర్షిక ప్రారంభించాలని అనుకోవడానికి కారణం... ఢిల్లీ నుంచి ఒక శీర్షిక ఒకరు రాస్తే బావుంటుందని అనుకోవడం. ఆ శీర్షికకు వస్తోన్న స్పందన చూసేకా ఆ శీర్షిక ఆపడానికి కుదరదు అనిపించింది. వేరే వాళ్ళతో రాయించడం కుద రదు అన్నంత బావుందని వీక్షక స్పందన చూసాక నిర్ణయించుకున్నాను.

కవితలు, ప్రయోగాలు, హిందీలో కూడా సాహితీ విద్యుత్తు... ఇంగ్లీష్‌లో మిర్రర్...

హైదరాబాద్ వచ్చినప్పుడు మేన్‌రోబో ఆఫీసుకు వచ్చిన విసురజ వ్యక్తిత్వ విశ్వ రూపం చూసాను. సున్నితమైన మనస్తత్వం, ఎదిగినా ఒదిగి ఉండాలనుకునే వ్యక్తిత్వం... అక్షరాలపట్ల మమకారం... అనుబంధాల పట్ల అనురాగం... ఇవి ఆయన వ్యక్తిగత వ్యక్తిత్వం తాలూకు క్వాలిటీస్.

(ఆయనలోని మరోగొప్ప గుణం... నన్ను కదిలించిన కృతజ్ఞతా పర్వం... నా వ్యక్తిత్వ వికాస పుస్తకంలో ప్రస్తావిస్తాను) ఇక రచయితగా ముగ్ధమోహనం ఒక అద్భుత సంచలనం. వీక్షక స్పందన అనూహ్యం. అయితే వీక్షకులు కొద్ది నిమిషాలు చదివే ఒక అధ్యాయానికి రచయిత పడే రోజుల పర్యంతం వేదన విసురజలో చూసాను. ఎన్నోమార్పులు.. ఒక్కో అధ్యాయం మళ్ళీ, మళ్ళీ రాసిన సందర్భాలు.

తాజా సామాజిక, శాంతిభద్రత సంఘటనలను, సమకాలీన విషయాలను సీరియల్ ద్వారా అందించడం. అదీ ఒక కొత్త రచయిత ప్రయత్నించడం గొప్ప విషయం. ముగ్ధ మోహనం లాంటి నవల రాయడంసవాలు లాంటిది. ఎన్నో మలుపులు, కొత్త సన్నివే శాలు. ఒక రచయితగా జెలసీ అనిపించింది ఒక్క క్షణం... కానీ ఈ సీరియల్ రాయ డానికి విసురజ పడ్డ కష్టం ఒక రచయితగా నాకు తెలుసు... విసురజ ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు ఈ సీరియల్‌కోసం ఖర్చుచేసారో నాకు మాత్రమే తెలుసు.

ఆ కష్టాన్ని, ఆ మేథస్సుని, ఆ తపనను గుర్తించి, బ్రహ్మరథం పట్టింది వీక్షకప్ర పంచం. నేను సైతం అందులో ఉన్నాను అని గర్వంగా చెప్పుకునే అవకాశం విసురజ అక్షర వ్యక్తిత్వపు సొబగు అందించింది.

ఒక సీరియల్ పూర్తవ్వకముందే మరో సీరియల్ ప్రకటన, ప్రారంభం... వీటికి కారణం విసురజ అక్షర సృజనే.

ఆగస్టు 1... సబ్జెక్ట్‌లోని నవ్యత, ఎత్తుగడ, పాత్రల మధ్య బ్యాలెన్స్... కేవలం భావుకత్వం, భావోద్వేగాలే కాదు నవ్వించే నాన్‌స్టాప్ హాస్యం... సన్నివేశాన్ని చూస్తోన్న విజువలైజ్డ్ ఫీలింగ్ ఈ సీరియల్ ప్రత్యేకత... ఇంత మెచ్యూరిటీ నా రచన ప్రారంభం తొలినాళ్ళలో నాకుకూడా రాలేదు. ఏ సబ్జెక్ట్ అయినా అటెంప్ట్ చేయగలడనే కాన్ఫిడెన్స్ విసురజ స్వంతం.

రాముడి మాట జవదాటని లక్ష్మణుడిని ఎవరు చూడకపోవచ్చు...

స్నేహానికి ప్రాణం పెట్టే కర్ణుడికథ అందరికీ తెలియకపోవచ్చు...

విద్వత్తు సంపద, వినయాభరణం, సంస్కారభూషణం...

కలిస్తే ఒక వ్యక్తిత్వం బహువచనంగా మారుతుంది...

విసురజగా పిలువబడుతుంది.

ఒక వ్యక్తిత్వ పుస్తకంలో, నా వ్యక్తిత్వ వికాస పుస్తకంలో ఒక అధ్యాయం అవుతుంది.

విసురజకు అభినందనలతో...

తెలుగు రచనా ప్రస్థానంలో పాపులర్ రైటర్ మకుటాన్ని స్వంతం చేసుకోవా లని ఆకాంక్షిస్తూ...

**- మీ విజయార్కె**

# ప్రారంభానికి ముందు...

## సిన్సియర్లీ... మీ విసురుజ

"నా ఆలోచనలో ఊపిరిపోసుకున్న అక్షరమా.. నా భావోద్వేగాలను తర్జుమా చేసే నా నేస్తమా... వీక్షకాభిమానుల హృదయాల్లో నా పేరును చిరంజీవిని చేసే ప్రాణమా... నువ్వు వర్ధిల్లు"

... విసురజ

"చిన్నపాటి ప్రకంపనం... ఢిల్లీ నగరం నిద్రలోకి జారుకున్న సమయం. అర్ధరాత్రి ఒంటిగంట దాటింది. కిటికీలో నుంచి వీచే చల్లగాలిని ఆహ్వానిస్తూ, ఏసీకి గుడ్ బై చెప్పాను.

కీబోర్డు మీద చేతివేళ్లు కదులుతున్నాయి. తెల్లవారితే ఈ అక్షరాలూ వూపిరిపోసుకుని లక్షలాది చదువరులను పలకరిస్తాయి...

"ముగ్ధమోహనం" నా తొలి కాల్పానిక రచన. ఆ మాటకొస్తే రచయితగా నా తొలి ప్రయత్నం... నిశ్శబ్దంగా నా ప్రపంచంలో... నాతో చెలిమి చేసే కవితలతో ముచ్చట్లాడుతూ, మ్యూజింగ్స్‌లో షేర్ చేసుకుంటూ, కదిలే కాలంతోపాటు నడిచే అక్షరబాటసారిని.

ఒక ఆన్‌లైన్ మేగజైన్‌లో "డైలీ సీరియల్" రాయడమంటే.... "ఒక ముడివేస్తూ, మరో ముడి విప్పుతూ, పాత్రల మధ్య వైవిధ్యాన్ని మిస్సవకుండా రాయాలి. రచయితకు స్వేచ్ఛ అపారమే... కానీ పాత్రలు రచయితను డామినేట్ చేస్తాయి. కథాకథన కుతూహలం వీక్షకులను మెస్మరైజ్ చేయాలని నా తపన. ఇదంతా నాకు సాధ్యమా, వీలయ్యే పనేనా.

కస్టమ్స్ అధికారిగా ఉద్యోగ నిర్వహణ వేరు... రచయితగా రూపెత్తి వేలాది/లక్షలాది చదువరును ఆకట్టుకోవాలంటే కొంచెం కంగారు.

ఢిల్లీ అత్యాచార సంఘటన ఇంకా నా స్మృతిపథంనుంచి కనుమరుగవ్వలేదు. క్రైమ్ రేటింగ్... అత్యాచార సంఘటనల పునరావృతం... ఇవన్నీ ఆందోళన కలిగించే విషయాలు.

వీటిని కలగలిపిన అల్లికతో...

స్వచ్ఛమైన అమాయకపు అమ్మాయి (ముగ్ధ) పాత్రతో...

మోస్ట్ పవర్‌ఫుల్ పాయిజన్ లాంటి విషకన్య లాంటి ప్రతినాయికతో "ఢీ"కొనే హీరోదాత్త (కార్తికేయ) పాత్రతో చేసిన ప్రయోగమే "ముగ్ధమోహనం"

నా ఆలోచనల్లో ఊపిరిపోసుకున్న "ముగ్ధ" పాత్ర నన్ను డామినేట్ చేసింది. హంట్ చేసింది. కలవర పెట్టింది.

ఫస్ట్ చాప్టర్ రాసేప్పుడు ఒక చిన్నపాటి ఉద్వేగం. ముగ్ద పాత్రతో నాకు తెలియకుండానే ప్రేమలో పడిపోయా...

ముగ్ధ కుసుమారమైన కన్యకమణితో ప్రేమలో పడని వారెవరు..?

(ప్రారంభం)

# 1.

"ప్రకృతి చీరను చుట్టుకున్నట్టు ఆ వూరు. చిత్రకారుడై కుంచెలో నుంచి ప్రాణం పోసుకున్నట్టు ఇళ్ళు, కొబ్బరితోటలు...విశాలమైన వీధులు...పచ్చని పంటపొలాలు... పైరగాలి పహరాలు... కోనే... పక్కనే జగన్నాథుడి కోవెల... ఇంకా కోడి కూయకముందే ఆ డాబా ఇంట్లో లైట్లు వెలిగాయి. పడక గదిలో తాతల కాలం నాటి మంచం మీద ముసుగుతన్ని పడుకున్న ముగ్ధ దుప్పటి తొలిగించి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. రెండు అరచేతులను రుద్దుకుని కళ్ళు తెరిచింది.

పక్కగదిలో నిద్రపోతోన్న తమ్ముడిని, తండ్రిని చూసి వాకిటి వైపు కదిలింది.

పెద్ద వాకిలి... హృదయాకారంలో ముగ్గు వేసింది. చుబుకానికి చేయి ఆనించి ఆ ముగ్గు వంకో చూస్తూ, రంగులు చేతిలోకి తీసుకుంది. నడుము వంచి రంగులు నింపుతోంది. అలా అలవోకగా వంగినప్పుడు... సీతా స్వయంవరంలో శ్రీరాముడు విల్లు వంచిన దృశ్యం కనిపిస్తోంది.

తదేకంగా, తపస్సులా రంగులు అద్దుతూ వుంటే... కీట్స్ పొయెట్రీ, కృష్ణశాస్త్రి భావుకత్వం, పికాసో పెయింటింగ్, బాపు వర్ణచిత్రం... ఒకోసారి కనిపించాయి. రంగులతో తయారైన అందమైన ఆ ముగ్గులో... ఆమెకు కనిపించిన రూపం ఒక్కటే..."

"వేల వేల బాహువులతో... తన ఆలోచనలను, తనువును చుట్టేస్తోన్న కా..ర్తి...కే...య... రూపం"

"మీకోసం క్షణాలను ప్రార్థించాను త్వరగా వెళ్ళిపొమ్మని... కాలాన్ని ప్రాదేయపడ్డాను నా ప్రాణాన్ని చూడాలని వుందని... ఇప్పుడేం చేస్తున్నారో..."

ఆ క్షణం ఆమెకు తెలియదు... తన జీవితంలోకి ఓ ప్రమాదం ప్రవేశిస్తుంది... అది వూరి పొలిమేరల్లోకి వచ్చిందని...

న్యూఢిల్లీ...

కరోల్‌బాగ్...

థర్డ్‌స్ట్రీట్..

అతి ఖరీదైన ఆ కాలనిలో ఓ బిల్డింగ్..

ఇంకా చలిలో ఢిల్లీ నగరం మునగదీసుకునే వుంది. కంప్యూటర్‌ని ఆఫ్ చేసి డిజిటల్‌క్లాక్ వంక చూసాడు... వేకువ ఝాము... ఇంకా అయిదు కూడా కాలేదు. ట్రాక్‌సూట్ వేసుకున్నాడు. స్పోర్ట్స్ షూ శబ్దానికి గూర్ఖా ఉలిక్కిపడి లేచి సెల్యూట్ చేసాడు.

గ్రౌండ్‌లో జాగింగ్ చేస్తోంటే ఎప్పటిలానే ఎనిమిదేళ్ళ ఆ పాప గులాబీ పువ్వుతో కార్తికేయ దగ్గరికి వచ్చి ఆ రెడ్ రోజ్ అతనికి ఇచ్చి గుడ్‌మార్నింగ్ చెప్పింది.

"థాంక్యూ" అంటూ ఆ పువ్వు తీసుకుని ఆ చిన్నారి బుగ్గలమీద ముద్దు పెట్టుకున్నాడు.

"అంకుల్ ఎప్పుడు చంపుతారు? ఒకే ఒక ప్రశ్న ఆ చిన్నారి నుంచి. రోజు అడిగే ప్రశ్న.

# 2.

''ఒక్కక్షణం వేన వేల నిశబ్దాలు నిస్తేజమైనట్టు... సమాధానం లేని ప్రశ్న తర్జని చూపి నిలదీసినట్టు..''

''చెప్పండి అంకుల్.. ఎప్పుడు చంపుతారు? '' ఎనిమిదేళ్ళ చిన్నారి.. ప్రతిరోజు అందించే ఆ గులాబీ వెనుక వున్న ముళ్ళు తనకు మాత్రమే తెలుసు... తన కర్తవ్యాన్ని గుర్తు చేసే భగవద్గీతని.

కార్తికేయ ఆ చిన్నారిని దగ్గరికి తీసుకున్నాడు... ''అమ్మ ఒడిలో హాయిగా నిద్రపోవాల్సిన చిట్టితల్లీ, నాన్న అనురాగంతో గారాలు పోవాల్సిన చిన్నారి... అమ్మని, నాన్నని కోల్పోయి ఒంటరిగా మిగిలిన పసికూన... నిన్నెలా ఓదార్చనూ''. రెండు చేతులు కార్తికేయ మెడచుట్టూ వేసి అలానే ఉండిపోయింది. ఇంకిపోయిన కన్నీళ్ళు ఆ చిన్నారి కనుకొలకులను చీల్చుకుని బయటకు రావడానికి సిద్ధంగా వున్నాయి.

కళ్ళముందు కనిపించే అమ్మా నాన్నల మృతదేహాలు, ఈ నేపథ్యం తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వెనక్కి వెళ్ళాలి.

ఢిల్లీ అత్యాచార ఘటన జరగడానికి రెండు రోజుల ముందు...

రద్దీగా వున్న రాణా సర్కిల్.. రోడ్డు చివర చిన్న పూలకొట్టు... గులాబీలు మాత్రమే దొరుకుతాయి అక్కడ. రకరకాల రంగు రంగుల గులాబీలు. శ్యామల, చంద్రం దంపతులు

ఉదయమే గులాబీ తోటలకు వెళ్లి గులాబీలు తెస్తారు. గులాబీలతో బొకేలు తయారు చేస్తారు. విడి గులాబీలు సిగ్నల్స్ దగ్గర నిలబడి... రెడ్ సిగ్నల్ పడ్డప్పుడు అమ్ముతారు. ఆ దంపతుల ఒకే ఒక కూతురు ఎనిమిదేళ్ళ అంజలి. స్కూల్ నుంచి రాగానే తనూ వాళ్ళతో జాయిన్ అవుతుంది.

ఈ ప్రపంచంలో ఆనందాన్ని అన్వేషించకుండా, వున్నదాంట్లో ఆనందాన్ని పొందాల నుకునే కుటుంబం.

⁂

రెడ్ సిగ్నల్ పడింది. అంజలికి ఆ రోజు స్కూల్‌కి సెలవు. గులాబీ బుట్ట చేతిలోకి తీసుకుంది.

''అంజు.. నువ్వు ఇంటికెళ్ళి... అడుకో'' తల్లి శ్యామల చెప్పింది.

'' ఇదికూడా ఆటే మమ్మీ... అ రోజు మీకన్నా ఎక్కువ పూలు అమ్ముతాను... ఈరోజు మీ మ్యారేజ్ డే కదా... మీకు మంచి గిఫ్ట్ కొంటాను'' చెప్పింది అంజలి. ''కూతురిని చూస్తుంటే ముచ్చట వేసింది చంద్రానికి.. గర్వంగా కూడా అనిపించింది. ఎంత గొప్ప ఆలో చన. తమ పెళ్లి రోజుకి ''కానుక'' ఇవ్వాలనుకునే కూతురు''.

'' ఓకే.. జాగ్రత్త తల్లి'' చెప్పి గులాబీ బుట్ట కూతురి చేతికి ఇచ్చాడు.

⁂

సిగ్నల్స్ దగ్గర బైక్ ఆగింది. కొత్తగా పెళ్లైన జంట. వాళ్ళ దగ్గరికి వెళ్ళింది అంజలి.

''అంకుల్ రెడ్ రోజ్, ఎల్లో రోజ్, పింక్ రోజ్.. గులాబీ బుగ్గల ఆంటీకి ఈ పింక్ రోజ్ బావుంటుంది'' చెప్పింది.

''చిల్లర లేదు.'' అతను ముభావంగా చెప్పాడు.

'' ఆంటీ కాన్న చిల్లర ఎక్కువా? ఇంత బ్యూటీ ఆంటీకి నాలుగు గులాబీలు కొనివ్వ లేరా?'' అంజలి లాజిగ్‌గా అంది. బైక్‌మీద వున్న అతగాడి భార్య మొగుడి వంక ''చుర చుర'' చూసింది. అతని షర్టు జేబులోనుంచి ఇరవై రూపాయల కాగితం తీసి ''నువ్వు ఇవ్వమ్మా'' అంది.

''వద్దులే ఆంటీ.. మీ లాంటి'' బోల్డు అందమైన అంటీకి ఇది నా గిఫ్ట్'' అంటూ కొన్ని గులాబీలు కవరులో వేసి ఇచ్చింది.

ఆవిడకు ముచ్చట వేసింది. మొగుడి వంక చూసి '' ఆయనో వేస్ట్ అంకుల్ లే... ఇదిగో నువ్వు డబ్బులు తీసుకో'' అంటూ పువ్వులు తీసుకుని డబ్బులు ఇచ్చింది. బిక్క చచ్చిపోవడం అతడి వంతయింది. బైక్ కదిలింది ''సారీ అంకుల్'' అంటూ గట్టిగా అరిచింది. ఆఫీసుకు వెళ్ళే అమ్మాయిలు, గుడికి వెళ్ళే వాళ్ళు, అంజలి దగ్గర గులాబీలు కొనకుండా వెళ్ళరు.

రాణా సర్కిల్‌లో అంజలి తెలియనివారుండరు.

⁂

రెడ్‌సిగ్నల్ పడకపోయినా అక్కడ కార్తికేయ కారు ఆగింది.

''గుడ్‌మార్నింగ్ చిట్టితల్లీ''... కారు దిగి అంజలిని పలకరించాడు.

''గుడ్‌మార్నింగ్ అంకుల్..'' అంటూ ఓ గులాబీ ఇచ్చింది. ఉదయం జాగింగ్ వెళ్ళేట ప్పుడు... లేదా ఆఫీసుకు వెళ్ళేటప్పుడు అంజలి తప్పనిసరిగా ఎదురవుతుంది.

'' ఈ రోజు స్పెషల్ ఏమిటి?'' అంజలిని దగ్గరికి తీసుకుని అడిగాడు.

'' ఈ రోజు మమ్మీ డాడీల మ్యారేజ్‌డే... వాళ్ళకు ఈ రోజెస్ అమ్మిన డబ్బులతో మంచి గిఫ్ట్ ఇద్దామని...''

కార్తికేయకు కళ్ళు చెమర్చాయి.. ఎంత మంచి ఆలోచన? వెంటనే పర్స్‌లో నుంచి వెయ్యి రూపాయిల కాగితం తీసి అంజలికి ఇస్తూ '' కొన్ని గులాబీలకు ఇన్ని డబ్బులా'' కళ్ళు వెడల్పు చేసి అంది.

''నీ బుగ్గలోని గులాబీలకు కూడా కలిపి'' అంజలి బుగ్గమీద ముద్దు పెట్టుకుని అన్నాడు. ఆ బుట్టలోని గులాబీలు ఎదురుగా వున్న స్కూల్ పిల్లలకు పంచాడు. అంజలి తల్లి దండ్రులను పలకరించి ''మ్యారేజ్ డే విషెస్'' చెప్పాలనుకున్నాడు. ఆఫీసులో ముఖ్యమైన పని వుండడంతో ఆ ఆలోచన విరమించుకున్నాడు.

అంకుల్ ఈ రోజు మీకు పార్టీ ఇస్తాను. తప్పకుండా రావాలి కార్తికేయ వెళ్తుంటే ''టాటా''తోపాటు చెప్పింది.

అంజలి జీవితంలో అదే చివరి ఆనందమని ఆ క్షణం కార్తికేయకు తెలియదు.

❖❖❖

''యాసిడ్ యాసిక్ ఢిల్లీలో అడుగు పెట్టాడుట'' ఇరానీ హోటల్‌లో కబుర్లు మొదల య్యాయి.

''వాడిమీద రౌడీషీట్ తెరవాలి'' ఓ వ్యక్తి కామెంట్.

సాధారణంగా ఇలాంటి అవసరమైన విషయాలు... అనవసరమైనచోట చర్చిస్తారు. ప్రాక్టికల్‌గా ముందుకురారు.

యాసిడ్ యాసిక్ సరిగా గంట తర్వాత రాణా సర్కిల్‌లోకి అడుగుపెట్టాడు.

❖❖❖

''నా పేరు యాసిక్... నన్నంతా యాసిడ్ యాసిక్ అంటారు. ఢిల్లీ వీధుల్లో నేను కని పిస్తే... (ఎడిట్) పోసుకునేవారు... ఇప్పుడు నన్ను చూస్తే పురుగును చూసినట్టు చూస్తున్నారు. దీనికంతటికి కారణం... ఆ కస్టమ్స్ ఆఫీసర్ కా..ర్తి..కే..య../

అతడ్ని దెబ్బతీయాలంటే అతని బలహీనత మీద దెబ్బకొట్టాలి.

అతని బలం.. బలహీనత.. ము..గ్ధ../

❖❖❖

నా పేరు ముగ్ధ... కోనసీమ ఒడదిలో పెరిగిన నేను తెల్లవారకముందే కోయిల కూజి

తంతో నిద్ర లేస్తాను...

ఇంటి ముందు ముగ్గుతో సూర్యుడి లేలేత కిరణాలను ఆహ్వానిస్తాను. అమ్మ నేర్పిం చిన ఇంటి పని.. నాన్న వినిపించిన భగవద్గీత... తమ్ముడితో కలిసి జామ చెట్టెక్కి చిలుక కొరి కిన జామకాయలు కొసుకోవడం... ఇదే నా ప్రపంచం. అట్లాంటి నా ప్రపంచంలోకి ఓ ఉదయం పోలీసులు వచ్చారు...

నేనో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ని అన్నారు... ఇంటర్‌పోల్ నా గురించి వెతుకుందిట... రెడ్ కార్నర్ నోటీస్ ఉందిట... మా నాన్న కుప్పలా కూలిపోయారు..

నాకేడ్పు వస్తోంది.

నన్ను కాపాడే వారే లేరా?

⁂

స్థలం... ఉగ్రవాదుల దాడిలో కుప్పకూలిన వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌కు కూతవేటు దూరం...

నా పేరు మోహన...

ఐ హావ్ నో సెంటిమెంట్స్...

బ్లడ్ అన్నా, బ్లడీ మనీ అన్నా నా కిష్టం.

నా రివాల్వర్ మేగజైన్‌లో బుల్లెట్స్... నా చూపుల్లోని మిస్సయిల్స్ ఎప్పుడూ శత్రువు లను టార్గెట్ చేస్తూనే వుంటాయి.

''ది మోస్ట్ డేంజరస్ లేడీ'' గా పేరున్న నన్ను ''ఢిల్లీ ఎయిర్‌పోర్ట్''లో నిలదీసిన ఒకే ఒక మగాడు...

అతన్ని ఇప్పుడు టార్గెట్ చేసాను... నా మైండ్‌గేమ్ పవర్ ఏమిటో చూపిస్తాను...

అన్నట్టు మీకు ముగ్ధ అనే అమ్మాయి గురించి తెలుసా?

⁂

# 3.

యాసిక్..

నేర ప్రపంచానికి, పోలీసు రికార్డ్స్‌కి యాసిడ్ యాసిక్‌గా తెలుసు. ప్రతి నేరానికి ''మోటివ్'' ఉన్నట్టే ప్రతి నేరస్థుడికి ఒక ''నేర నేపథ్యం'' వుంటుంది. యాసిక్ నేరాలతో తన జీవితాన్ని ప్రారంభించలేదు. ఢిల్లీ వీధుల్లో యాసిడ్ బాటిల్స్ అమ్మేవాడు. టాయ్‌లెట్స్ క్లీన్ చేసే యాసిడ్ బాటిల్స్ ఇంటింటికి తిరిగి అమ్మేవాడు. ఓ రోజు అనుకోని సంఘటన జరిగింది. అది అతని జీవితాన్ని మార్చింది. అతనిలో వున్న నేర ప్రవృత్తికి ప్రాణం పోసింది. షాపులకు యాసిడ్ బాటిల్స్ సప్లయ్ చేసి డబ్బు వసూలు చేసుకునే ప్రయత్నంలో ''షాప్ అతనికి యాసిక్‌కి మాటా మాటా పెరిగి, యాసిల్ యాసిడ్ బాటిల్ అతనికేసి విసిరాడు. అతని మొహం కాలింది. భయంతో అతను రెట్టింపు డబ్బు ఇచ్చాడు.

యాసిక్‌కి ఈ కాన్సెప్ట్ నచ్చింది. యాసిడ్ తయారు చేసి కొద్దిపాటి లాభాలతో బ్రతకడంకన్నా " ఇలా యాసిడ్ భయాన్ని సొమ్ము చేసుకోవాలని" అనుకున్నాడు. అప్పటి నుంచి యాసిడ్ అమ్మడానికి కాకుండా జనాన్ని బెదిరించడానికి తయారుచేయడం మొదలుపెట్టాడు. అతని మొదటి నేరం ఖరీదు పదివేలు. ఓ విదేశీ టూరిస్టుని యాసిడ్ పోస్తానని బెదిరించాడు. ఆ తర్వాత తనకు జనం భయపడాలి అనుకున్నాడు. యాసిడ్ దాడి ప్రారంభించాడు.

యాసిడ్ బాటిల్స్‌తో బెదిరించి ఇద్దరు అమ్మాయిలపై అత్యాచారం చేసాడు. పోలీసులకు దొరికినా కేసు నిలవలేదు. అలా యాసిడ్ యాసిక్‌గా మారిపోయాడు. అతడ్ని సెక్స్ మానియాక్ అంటారు.

:::::

రాత్రి పది దాటింది. శ్యామల అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది. ఆ ప్రతిబింబం వెనుక చంద్రం కనిపించాడు.

కొద్దిగా సిగ్గుపడింది.

శ్యామలా... ఈ రోజు ఇంకా అందంగా కనిపిస్తున్నావ్? అన్నాడు.

"రాత్రిపూట భార్యలు భర్తలకు అందంగానే కనిపిస్తారు... అదేమిటో తెల్లవారితే అందం కనిపించదు.. ఎందుకంటే...?" అని ఆగి భర్త వంక చూసింది.

అతను తన అందాన్ని కాక తన మనసును చూస్తున్నాడని అర్థమైంది.

"అంజలి ఎక్కడ?"కూతురు కనిపించకపోవడంతో అడిగాడు చంద్రం.

"మన ఏకాంతానికి భంగం కలిగించవద్దనుకుని ఎదురుగా వున్న పార్క్‌లో ఆడుకుంటానని బుట్టతో గులాబీలు తీసుకుని వెళ్ళింది" చెప్పింది శ్యామల.

" ఆడుకోవడానికి బుట్టతో గులాబీలు ఎందుకో?" స్వగతంగా అనుకున్నాడు.

ఒక్కసారి భార్య వంక పరిశీలనగా చూసాడు. ఒంటిమీద పసుపుతాడు తప్ప మరే మీలేదు. తమ కష్టంతో కట్టుకున్న చిన్న ఇల్లు... తాము ప్రాణంగా చూసుకునే తమ బిడ్డ అంజలి.

భర్త పేదరికాన్ని ఇష్టంగా ప్రేమించే భార్య దొరకడం "తన" అదృష్టం అని అతని నమ్మకం.

ఆమెకు అభిముఖంగా నిలబడి భార్య మొహాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె కళ్ళు మూసుకుంది. అతని చేతుల్లో ఆమె అరెస్ట్‌కావడానికి సిద్ధంగా వుంది. అప్పుడే తలుపు మీద ఎవరో "దబ దబ" బాదిన శబ్దం. ఇద్దరూ ఉలిక్కి పడ్డారు. ఈ వేళలో ఎవరో...? అసలే దూరంగా వుండే ప్రాంతం... ఇద్దరూ విడిపడి వెళ్ళి తలుపు తీసారు.

ఎదురుగా అపరిచితుడు... లోపలికి వస్తూనే తలుపేస్తాడు.

''ఎవరు మీరు.. ఏం కావాలి?'' చంద్రంకోసం ధ్వనించిన స్వరంతో అడిగాడు.

'సైలెన్స్ నాకు సౌండ్ ఎలర్జీ...'' అంటూ తన చేతిలోవున్న యాసిడ్ బాటిల్ చంద్రం మొహానికి తగిలించాడు.

'' ఇదేమిటో తెలుసా? యాసిడ్ బాటిల్... సరదాగా నీ మీద స్ప్రే చేసాననుకో సీరియస్‌గా చచ్చిపోతావు. నువ్వు కాసేపు కోపరేట్ చేస్తే నా పని నేను చేసుకుని వెళ్లిపోతాను'' అంటూ శ్యామల వైపు చూసాడు.

చంద్రానికి పరిస్థితి అర్ధమైంది. మూలన వున్న రాడ్ అందుకోవడానికి వెళ్ళాడు. అప్పటికే యాసిక్ చేతిలోని యాసిడ్ బాటిల్‌లోని యాసిడ్ చంద్రం శరీరాన్ని తాకింది. పెద్ద కేక అతని గొంతులో నుంచి..

షాక్‌తో సృహ తప్పి పడిపోయింది శ్యామల.

ఒక వికృత క్రీడ అక్కడ పైశాచికత్వం సాక్షిగా కొనసాగింది.

మానవమృగం... ఉన్మాది.. కొనసాగించిన శారీరక దాడి.

తన కళ్ళముందే భార్యను...

ఆమె శరీరాన్ని, మనసును, తీవ్రంగా, అనాగరికంగా గాయపరచి అక్కడితో సంతృప్తి చెందక శ్యామలమీద యాసిడ్ పోసాడు.

వాళ్ళ ఆర్తనాదాలు ఆ నిర్మానుష్యమైన ప్రాంతంలో ఎవరికి వినిపించలేదు.

⁘⁘

అంజలి బుట్టలోని గులాబీలను నేలమీద పోసి ఒక్కో గులాబీని అక్షరాలుగా మారుస్తోంది.

అమ్మా నాన్నలకు శుభాకాంక్షలు...

గులాబీలతో పేర్చిన ప్రేమ పూర్వక అక్షరాలూ.. ఆ పచ్చగడ్డిమీద గులాబీ అక్షరాలూ...

''అమ్మకు, నాన్నకు చూపించాలి'' ఆ చిన్ని మనసు తహతహ.

వెంటనే ఇంటివైపు పరుగెత్తింది.

తలుపు తోసుకుని వెళ్ళి అక్కడి దృశ్యం చూసింది.

⁘⁘

కార్తికేయ టైం చూసుకున్నాడు. పదకొండు కావస్తుంది. అంజలి గుర్తొచ్చింది. అంజలి తల్లిదండ్రుల మ్యారేజ్ డే సంగతి గుర్తొచ్చింది. శ్యామల చంద్రంలు కార్తికేయకు బాగా తెలుసు. అంజలి ద్వారా పరిచయం అయ్యారు. మంచి వాళ్ళు. తను గ్రీటింగ్స్ చెబితే అంజలి కూడా సంతోషిస్తుంది.

స్వీట్‌షాప్ ముందు ఆగి స్వీట్ తీసుకున్నాడు. కారు అంజలి ఇంటివైపు కదిలింది.

***

ఒక్క క్షణం విషాదం... అగ్ని పర్వతమైంది. శరీరాన్ని నిప్పులకొలిమిలో కాల్చినట్టు... శ్యామల చంద్రం అపస్మారక స్థితిలో వున్నారు. ఒళ్ళంతా కాలిబొబ్బలు ఎక్కింది. మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని అలానే అమ్మను, నాన్నను చూస్తూ మాటలు మర్చి, సర్వం కోల్పోయి నట్టు... కార్తికేయ అంజలి దగ్గరికి వెళ్ళాడు.

అప్పుడు... అప్పుడు ఏడ్చింది అంజలి... వేన వేల మేఘాలు ఒకేసారి వర్షించినట్టు... ఆ.. అ.. అమ్మ... నా... నా.. నాన్న అంటూ కార్తికేయను చుట్టేసింది. కార్తికేయ అంబులెన్స్‌కు ఫోన్ చేసాడు.

***

''సారీ కార్తికేయగారు... వాళ్ళు బ్రతికే అవకాశం ఒక్కశాతం కూడా లేదు. యాసిడ్‌తో స్నానం చేయించినట్టు వుంది. ఆమె పరిస్థితి మరీ ఘోరం. అనాగరికమైన అత్యాచారం. ఆ తర్వాత యాసిడ్‌ని (ఎడిట్ ఎడిట్)'' తన సర్వీసులో ఇలాంటి కేసు ఇదే మొదటిది.

పోలీసులు వచ్చారు. మెజిస్ట్రేట్ వచ్చాడు. మరణ వాంగూల్మం ఇచ్చారు.

శ్యామల అతికష్టం మీద నోరు విప్పింది. తన మీద జరిగిన పాశవికమైన అత్యా చారం. ఆ తర్వాత యాసిడ్‌ని తన... (ఎడిట్) ఆమె చెబుతూ వుంటే మెజిస్ట్రేట్ కదిలిపో యాడు.

ఒక క్షణం బాధతో స్థాణువు అయ్యాడు.

ఇదంతా వింటోన్న అంజలి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కన్నీళ్ళు ఇంకి కసి గడ్డ కట్టింది. శ్యామల, చంద్రం చనిపోయారు. వాళ్ళ అంత్యక్రియలు దగ్గరుండి జరిపించాడు కార్తికేయ.

ఇరువురికి అంజలి తలకొరివి పెట్టింది.

***

''సారీ మిస్టర్ కార్తికేయ... ఇది ఖచ్చితంగా యాసిడ్ యాసిక్ పనే... అతను రాణా సర్కిల్ పరిసర ప్రాంతాల్లో వున్నట్టు మాకు ఇన్ఫర్మేషన్... మా ఇన్వెస్టిగేషన్ సాగుతుంది''

డిసిపి చెప్పాడు.

‘‘థాంక్యూ సర్.. ఒక జంటను నిర్దాక్షిణ్యంగా చంపాడు. పాశవికంగా అత్యాచారం చేసాడు. వాడిని ఎవరు వదిలిపెట్టినా ఈ కార్తికేయ వదిలిపెట్టడు’’ అని కార్తికేయ లేచాడు.

⁂

స్మశానంలా వుంది ఆ ఇల్లు. తనెంత చెప్పినా అంజలి ఆ ఇల్లు వదిలి రాను... అంది.

అంటే కాదు తల్లిదండ్రులు చేసి పూల వ్యాపారం తను సాగిస్తానని అంది.

అమ్మా నాన్నల ఫోటో వంక చూస్తూ వుంది. కార్తికేయ ఇంట్లోకి అడుగుపెట్టి అంజలిని దగ్గరికి తీసుకున్నాడు. చేతిలో వున్న టిఫిన్ కవర్ ఇచ్చి తినమన్నాడు.

‘‘అతన్ని ఎప్పుడు చంపుతారు అంకుల్?’’ ఒకే ఒక ప్రశ్న. తన కర్తవ్యాన్ని గుర్తుచేసే ప్రశ్న. అప్పుడే ఫోన్‌రింగ్ అయ్యింది.

‘‘సర్ నేను ఇన్‌ఫార్మర్ సత్యాన్ని. మీరు చెప్పినట్టే యాసిక్‌ని ట్రేస్ చేసాను... ఇరానీ కేఫ్‌లో వున్నాడు’’ అవతలివైపు నుంచి వినిపించింది.

అంజలి నెత్తిమీద చేయివేసి ‘‘నీ కోరిక త్వరలోనే నెరవేరుస్తాను’’ అన్నాడు.

⁂

ఇరానీ కేఫ్‌లోనుంచి బయటకు వచ్చాడు యాసిక్. తనను పోలీస్ కార్నర్ చేస్తారని గెస్ చేసాడు యాసిక్. అతని గెస్ మరోలా నిజమైంది.

‘ ఇరానీ కేఫ్ నుంచి బయటకు రాగానే కార్తికేయ కనిపించాడు. అతని చేతిలోని రివాల్వర్ కనిపించింది.

ఎప్పుడు నిర్లక్ష్యంగా ‘‘డోంట్ కేర్’’లా వుండే యాసిక్ కార్తికేయను చూడగానే ఒక్క క్షణం భయపడ్డాడు. పారిపోయే ప్రయత్నం చేసాడు. నేరస్థులను హంట్ చేయడంలో ‘‘వేటగాడు’’ అయిన కార్తికేయ నుంచి తప్పించుకోవడం అసాధ్యం అని అర్థమైంది. ఎడమవైపు చూసాడు. వెంటనే మెరుపు వేగంగా కదిలి అక్కడున్న అమ్మాయిని ఒడిసి పట్టుకున్నాడు. మరో చేతిలో యాసిడ్ బాటిల్.

ఆ అమ్మాయి గింజుకుంటుంది. తను తొందరపడితే ఆ అమ్మాయి మీద యాసిడ్ పోస్తాడు.

ఆ అమ్మాయి కార్తికేయవైపు చూసింది బేలగా...

ఆ అమ్మాయి ము...గ్ధ...

⁂

# 4.

ఒక్కక్షణం.. ఒకే ఒక్కక్షణం... మృత్యువుకు వెంట్రుకవాసి దూరంలో వున్న యాసిక్ ముగ్ధరూపంలో రక్షించబడ్డాడు.

ట్రిగ్గర్‌మీద బిగుసుకున్న అతడి చూపుడు వేలు... నిస్సహాయమైంది.

ముగ్ధచేసిన బేల చూపులో ఎన్నో భావాలు. తనను చంపేస్తాడన్న భయంకన్నా ''మీరు ఓ వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా చంపేయవద్దు'' అన్న అభ్యర్థన కనిపించింది. ఆ రెప్పపాటు క్షణం చాలు... యాసిక్‌లాంటి క్రిమినల్ ఎస్కేప్ అవ్వడానికి

''థాంక్యూ మిస్టర్ ఎక్స్... అదేంటో మీ హీరోలకు వుండే వీక్నెస్... ఈ మంచితనమే... నెక్స్ట టైం బెటర్ లక్... ఈ ఖల్‌నాయక్‌ని పట్టుకోవాలంటే ఖలేజా వుంటే సరిపోదు... ''యాంటీ సెంటిమెంట్'' వుండాలి అంటూ ముగ్ధను వెనక్కి తీసుకువెళ్ళి... బలంగా ముందుకు నెట్టాడు. ఆ విసురుకు ముగ్ధ బ్యాలెన్స్ తప్పి కింద పడబోయింది.

కార్తికేయ ఆమెను పడిపోకుండా పట్టుకున్నాడు. చిన్నపాటి కలవరం... అసరాకోసం కార్తికేయ చేయి అందుకుంది. ఇద్దరి చూపులు ఒకే సరళ రేఖ దగ్గర ఆగాయి.

⁂

''క్షమించండి... మీకు ఇబ్బంది కలిగించాను'' ముగ్ధ అంది.

'' ఇందులో ఇబ్బంది ఏముంది? మీరెక్కడికి వెళ్ళాలో చెబితే అక్కడ దిగబడతాను'' ముగ్ధ వంకే చూస్తూ అన్నాడు. మొదటిసారి అతనిలో ఏదో వ్యక్తం చేయలేని ఫీలింగ్.

''నాకు ఢిల్లీ కొత్త... మా ఫ్రెండ్‌తో వచ్చాను. పుట్టి బుద్దెరిగాక మొదటిసారి నాన్నగారిని, తమ్ముడ్ని వదిలి వచ్చాను...అయ్యో నా మతిమరుపు... అని నాలిక కరచుకొని ''నా గురించి చెప్పనేలేదు కదూ... నా పేరు ముగ్ధ... బియ్యే పాసయ్యాను... టైపు షార్టు హ్యాండ్ వచ్చు... ఇదేమిటి పాతకాలం చదువు అనుకుంటున్నారా? నాకు ఇలానే ఇష్టం...'' ముగ్ధ చెప్పుకుంటూ పోతుంటే

''మంత్ర ముగ్ధుడిలా'' వింటున్నాడు.

ఆమెలోని అమాయకత్వం...నిజాయితీ... మాట తీరు బాగా నచ్చాయి.

''మా నాన్నగారిని ఒప్పించి, తమ్ముడ్ని వదిలేసి వచ్చాను. చిన్నప్పటి నుంచి తాజ్‌మహల్ చూడాలని కోరిక... నన్ను ఇక్కడే ఉండమని చెప్పి, మా ఫ్రెండ్ డబ్బులు డ్రా చేయడానికి ఏటిమ్ దగ్గరికి వెళ్ళింది. తను వచ్చేస్తుంది... మీరు వెళ్ళండి'' అంది ముగ్ధ.

''పర్లేదు... మీ ఫ్రెండ్ మరోలా అనుకుంటుంది'' అలా అంటున్నప్పుడు ఆమె

మొహంలో సిగ్గు గులాబీ వర్ణంలోకి మారింది.

''సరే... పోనీ మీ ఫ్రెండ్‌కు ఫోన్ చేయండి'' అన్నాడు.

''నా దగ్గర ఫోన్ లేదు... మొబైల్స్ వాడితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందట... ఆ రేడియేషన్ వల్ల చాలా ప్రమాదం... అందుకే నాన్నగారు మొబైల్ కొనివ్వలేదు... నేను అడగలేదు...''

ముగ్ధ మాటలు ముచ్చటగా అనిపించాయి. ఆమెను వదిలి వెళ్ళాలని అనిపించలేదు. అయినా తప్పదు. మొదటిసారి ఓ ఆత్మీయురాలిని వదిలి వెళ్తోన్న ఫీలింగ్.

'' ఒకే అండి.. జాగ్రత్త'' అంటూ... ఆమెకు బై చెప్పి బయల్దేరాడు.

:::::

రాత్రి పది దాటింది.

కార్తికేయకు నిద్ర రావడం లేదు. ఎందుకో ముగ్ధ గుర్తొస్తుంది. పెదాల మీద అప్రయత్నంగా చిన్న చిరునవ్వు. కొన్ని పరిచయాలు చిత్రంగా వుంటాయి... విచిత్రంగా వెంటాడుతాయి... ముగ్ధ జ్ఞాపకంలా...

ఇప్పుడు ఏం చేస్తూ వుంటుంది? తనలానే... ఒక్క క్షణం తల విదిల్చాడు. ముగ్ధ ఫ్రెండ్ వచ్చి ఉంటుందా? అసలే అమాయకత్వం? పైగా ఢిల్లీలో అత్యాచారాల ఉదంతాలు ఎక్కువయ్యాయి. ఆ ఆలోచన రావడంతోనే బయటకు పరుగు వేగంతో నడిచాడు...

రెండు నిమిషాల్లో కారు రోడ్డు మీదికి వచ్చింది...

స్పీడో మీటర్ అశ్వవేగాన్ని మించింది. యాక్సిలేటర్ మీద కాలు బలంగా పడింది. ఇరవై నిమిషాల్లో అక్కడికి చేరుకొని అక్కడి దృశ్యం చూసి షాకయ్యాడు.

:::::

ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ అటూ ఇటూ పచార్లు చేస్తుంది. అలిసిన కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. ఎదురుగా కనిపించిన కార్తికేయను చూడగానే లేడి పిల్లలా పరుగెత్తుకు వచ్చింది. కార్తికేయను చుట్టేసింది. కన్నీటి మేఘం కరిగి వర్షించింది. వెక్కుతోంది. అప్రయత్నంగా అతని చేయి ఆమెను చుట్టేసింది... నేనున్నాను అన్న అభయాన్ని... ఇచ్చింది.

''మా ఫ్రెండ్ రాలేదు... వెక్కిళ్ళ మధ్య చెప్పింది'' ఎంత భయమేసిందో తెలుసా? కళ్ళు పెద్దవి చేసి రెండు చేతులు చూపిస్తూ చెప్పింది. '' ఇంత భయమేసింది''

కార్తికేయ ముగ్ధ దగ్గర నంబర్ తీసుకుని ట్రై చేసాడు. రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయబడడం లేదు.

‘‘మీకు అభ్యంతరం లేకపోతే ఈ రాత్రి మా ఇంట్లో ఉండవచ్చు... రేపొద్దున మీ ఫ్రెండ్‌ని వెతుకుదాం...’’ కార్తికేయ చెప్పాడు.

బుద్ధిగా తలూపింది. మెల్లిగా అది... ‘‘ ఒక మాట’’ ఏమిటన్నట్టు చూసాడు కార్తికేయ.

‘‘మీరు రమ్మనగానే వస్తున్నానని నా గురించి తప్పుగా అనుకోవద్దు... ఏదో మీరు మంచివారిలా కనిపిస్తున్నారని...’’

ఒక్క క్షణం నవ్వొచ్చింది కార్తికేయకు... కంట్రోల్ చేసుకున్నాడు.

:::::

‘‘ ఇంత పెద్ద ఇంట్లో మీరొక్కరే ఉంటారా? కార్తికేయని అడిగింది.

‘‘ ఈ చిన్న మనసుకు తోడుగా వుండే వారెవరూ లేరు’’ అని చెప్పలేకపోయాడు.

‘‘ ఇలా అడిగానని ఏమీ అనుకోకండి... ఏదో ఈ ఒక్క రాత్రి మీ దగ్గర తలదాచుకోవడానికి వచ్చాను’’ అంది.

‘‘హోటల్ నుంచి ఏమైనా తెచ్చేదా? అడిగాడు కార్తికేయ.

‘‘ ఎందుకూ... వంటగది చూపిస్తే పది నిమిషాల్లో వంట చేసిస్తాను’’ అంది.

‘‘వంట చేయడానికి సరుకులు లేవు... నేను బయటతింటాను.. పోనీ ఫ్రిజ్‌లోబ్రెడ్ వుంది. పళ్ళు వున్నాయి... చెప్పాడు’’

‘‘నాకు ఆకలిగా లేదు... మరి మీరు? అడిగింది ముగ్ధ.

‘‘నాకేమీ తినాలని అనిపించడం లేదు...’’ అంటూ ఆమెకు గది చూపించాడు. ‘‘గుడ్ నైట్’’ చెప్పాడు.

:::::

రాత్రి పదకొండు దాటింది. కార్తికేయకు నిద్రపట్టడం లేదు. పాపం ముగ్ధకు ఆకలి వేస్తూ వుంటుంది. బయటకు వెళ్ళి ఏమైనా తెస్తే?

ఆ ఆలోచన రాగానే గదిలోనుంచి బయటకు వచ్చి అలానే నిల్చుండిపోయాడు. కిచెన్‌లో ముగ్ధ...పాలు వేసింది. అరటిపండుతొక్క తీసి చిన్న చిన్న ముక్కలు చేసి... గ్లాస్‌లో వేసింది. పాలు, ఆరటిపండు ముక్కలు కలిపి, పంచదార వేసింది. కార్తికేయ వెంటనే తన గదిలోకి వచ్చాడు.

పాపం ఆకలి వేస్తోంది కాబోలు... అనుకున్నాడు. అతని అంచనా తలకిందులు చేస్తూ... తలుపు మీద చిన్న శబ్దం చేసింది. తలుపు తీసాడు కార్తికేయ. గ్లాస్‌తో వచ్చింది.

''ఖాళీ కడుపుతో పడుకోవద్దని మా నాన్నగారు చెబుతుంటారు. ఇదిగోండి పాలు, అరటిపండు... కలిపి తయారుచేసాను. ఆరోగ్యానికి కూడా మంచిది'' అంటూ పాలగ్లాస్ ఇచ్చింది.

ఒక్క క్షణం కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''అరరె... కళ్ళలో ఆ నీళ్ళేమిటి... నలుసు పడిందా అంటూ దగ్గరికి వచ్చి రెండు బ్రొటన వ్రేళ్ళతో కనురెప్పలు వెడల్పు చేసి '' ఉఫ్'' అని ఊదింది.

కళ్ళలో పడింది ''నలుసుకాదు నీ రూపం, మనసు'' అని చెప్పాలన్న బలమైన కోరి కను అణుచుకున్నాడు.

''మరి మీకు? ఫ్రిజ్‌లో పాలు గ్లాసుడు మాత్రమే వున్నాయి...''

''నాకు ఆకలి లేదు. మధ్యాహ్నం చక్కెర పొంగలి తిన్నాను'' చిన్నగా నవ్వి ''ఫిఫ్టీ ఫిఫ్టీ'' అని మరో గ్లాస్ తెచ్చి సగం ముగ్ధకు ఇచ్చాడు.

***

సరిగ్గా అదే సమయం యాసిక్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. భయంకరమైన విషస ర్పాలు కొన్నే... అన్ని పాములు విషపూరితం కావు. కానీ విషసర్పం కన్నా ప్రమాదకరమైన వ్యక్తి యాసిక్.

ఒకసారి తనమీద ఎవరైనా దృష్టిని సారిస్తే వెంటనే అతని క్రిమినల్ బ్రెయిన్ పదునె క్కుతుంది. ఎప్పుడైతే కార్తికేయ తన మీద ఎటాక్‌కు ప్రయత్నించాడో ఆ క్షణం తన క్రిమినల్ నెట్‌వర్క్‌ను కదిలించాడు.

కార్తికేయ కస్టమ్స్ ఆఫీసర్ అని తెలిసింది. ఒక్కసారి కార్తికేయ నోటీసులోకి వస్తే అతను ఎవరినీ వదిలిపెట్టడని తెలిసింది.

తనూ కార్తికేయను వదలిపెట్టకూడదు.

యాసిక్ చేతిలో యాసిడ్ బాటిల్. అతి భయంకరమైన యాసిడ్.

ఈ యాసిడ్ బాటిల్ కార్తికేయ అందమైన మొహాన్ని వికృతంగా మార్చాలి.

యాసిక్ అన్న పేరు వింటేనే జనం ఒంట్లో వణుకు రావాలి.

సరిగ్గా ఇరవై నాలుగు గంటల్లో ''కస్టమ్స్ ఆఫీసర్ కార్తికేయపై యాసిడ్ దాడి'' అన్న వార్త రావాలి.

అదే సమయంలో... అమెరికాలోని ఓ రహస్య ప్రాంతంలో ఆల్‌ఖైదా సమావేశ మైంది. ఆ సమావేశం సమాచారం ఎఫ్ బి ఐకి తెలిసిపోయింది. ఏజెంట్ ఫెడరిక్ ఏ క్షణమైనా

ఎటాక్ చేయవచ్చు.

ఈ సమావేశానికి మిస్సయిన వ్యక్తి ఒక్కరే... మనీకి స్మెల్లు, సెంటిమెంట్ ఉండవని నమ్మిన వ్యక్తి. ప్రపంచంలోని అతి ప్రమాదకరమైన పది మంది నేరస్తుల లిస్టులో వున్న మో...హ...న.

ఆమెకోసం ఎదురుచూస్తున్నారు. కాన్ఫరెన్స్ హాలులోని సీక్రెట్ ఓపెన్ అయింది. చక్రాలు కలిగిన శపేటి లోపలికి వచ్చింది. వివిధ దేశాల నుంచి వచ్చిన తీవ్రవాద సంస్థల నేతలు ఉలిక్కిపడ్డాడు. శవపేటిక ఒపెన్ అయింది. ఆటోమేటిక్ సిస్టంతో...

లోపల... ఆల్‌ఖైదాని తిప్పలు పెట్టిన అమెరికా గూడాచార సంస్థ ఏజెంట్ ఫెడరిక్ మృతదేహం.

అందరి దృష్టి ఆ కాన్ఫరెన్స్ హాలు ఎంట్రెన్స్ వైపే...

⁂

# 5.

మౌనం మౌనాన్ని చూసి... శబ్దం నిశ్శబ్దం అవుతుంది... కొన్ని గంటల క్రితం ఇద్దరూ అపరిచితులే... కానీ కొద్ది నిమిషాల్లో ఎంతో పరిచయం వున్నవాళ్ళయ్యారు.

''నాకు నిద్ర రావడం లేదు... కొత్త ప్రదేశం కదా... పైగా నా స్నేహితురాలు ఏమైందో? అంది కార్తికేయ ఎదురుగా నిలబడి.

''భయమా? ఎందుకు''?

'' ఒక అపరిచితుడి ఇంట్లో... ఒంటరిగా రాత్రి ఉండవలసి రావడం? పూర్తి చేయలేక పోయాడు.

చిన్నగా నవ్వింది ముగ్ధ.

బహుశ సన్న జాజులకు ఆ బ్రహ్మ దేవుడు నవ్వే వరం ఇస్తే ఇలానే ఉంటుందేమో... ముగ్ధలానే సన్నజాజులు నవ్వుతాయి కాబోలు!

''స్మశానంలో వుంటే భయపడాలి కానీ, దేవుడి గుడిలో వున్న నాకు భయం ఎందుకు?

గుండె కవాటాల తలుపు తట్టినట్టు... కన్నీటి చెమ్మ మెరుపమ్మయి మెరిసి మురిసి నట్టు...

'' ఆర్ధ్రతా... ఎందుకే ఆ భావోద్రేగ ప్రకంపనం? ఏవీ నిరుడు కురిసిన హిమసము

హాలు.. నేడెందుకు హిమం వర్షించడం లేదు?

శిథిల ప్రాయమైన తన ఇల్లు దేవాలయమా? శిలా సదృశ్యమై తన దేహం దైవ సమానమా? ఓ తరుణీ... నువ్వెరవు?

కార్తికేయ ఆమె వంక చూస్తోండిపోయాడు. ఒక చిన్న అభిప్రాయాన్ని, గొప్ప భావంగా కమ్యూనికేట్ చేయడం ఎంత గొప్ప విషయం.

'' ఏమండి... మీరు ఏమీ అనుకోనంటే ఒకటి అడగొచ్చా?

'' ఏమిటి? అన్నట్టు చూసాడు.

'' ఒక మనిషి, మరో మనిషిని చంపవచ్చా? ఆ అధికారం మనకు ఎవరిచ్చారు?

ఉదయం జరిగిన సంఘటన గురించి అని అర్థమైంది.

''అన్యాయం జరిగినప్పుడు.. అధర్మం విర్రవీగినప్పుడు.. అరాచకం పెచ్చు పెరిగినప్పుడు.. ఆయుధం పట్టడం తప్పుకాదు.

కురక్షేత్రంలో అర్జునుడికి ఇది సందేహం వచ్చింది'' అని ఆగి...

''మీ ప్రశ్నకు సమాధానం రేపు చెబుతాను'' అన్నాడు.

''నాకు నిద్ర రావడంలేదు... ఏదైనా కథ చెప్పండి... అని

వెంటనే ''క్షమించడండి... ఇంట్లో నిద్ర పట్టకపోతే నాన్నను కథ చెప్పమనేదాన్ని. పోనీ మీకు అభ్యంతరం లేకపోతే మీ గురించి చెప్పండి.

''నాపేరు ముగ్ధ.. మా నాన్న పోస్ట్ మాస్టరుగా రిటైర్ అయ్యారు. ఒక తమ్ముడు... అల్లరి... నేనంటే ప్రేమ రెండూ ఎక్కువే... కట్నం కింద నీతోపాటు నన్ను తీసుకువెళ్ళే బావగారినే పెళ్ళి చేసుకో...'' అంటారు.

కోనసీమలో చిన్ననాటి కోరిక. అంతే..''

మీ గురించి చెప్పండి?

''ఈ సామ్రాజ్యంలో నేనే రాజుని... నేనే బంటుని.. నేనే సైన్యాన్ని... యేలుకోవడానికి ప్రజలు లేని రాజుని... ఈ ఒంటరి ప్రపంచంలో నేనే అనాథని...''

చప్పున ముందుకు వచ్చి అతని పెదవులపై తన చేతిని వుంచి...

''పైన తథాస్తు దేవతలు వుంటారు. అలా అనకండి'' ఆ చేతిని తన గుండెలకు ఆన్చుకుని తన గుండె శబ్దాన్ని ఆమెకు వినిపించాలని అనిపించింది.

అలిసిన ఆమె కళ్ళలో గొప్ప సౌందర్యాన్ని ఆ విధాత నిక్షిప్తం చేసాడేమో... అనిపిం

చింది.

చిన్న పిల్లలా గల గల మాట్లాడుతూ అలాగే నిద్రలోకి జారుకుంది, సోఫాలో, కూచోనే...

ఉదయం నుంచి అలసిపోయి వుంటుంది. నిద్రలో అమ్మాయిలు ఇంత అందంగా ఉంటారా?

మెడ ఓ పక్కకు వాలింది. నిద్రలో లేపితే డిస్ట్రబ్ అవుతుంది. తన గదిలో ఓ అమ్మాయి... ఊహించని విషయం. ఈ గది తన మదిగా మారిపోతే ఎంత బావుండు...?

ఒక్క క్షణం ''సందేహించి, మరుణం ''ముగ్ధ''ను రెండు చేతుల్లో తీసుకుని తన మంచం మీద పట్టుకోబెట్టాడు. తలను ఎడమ పక్కకు వాల్చింది. దిండు మీద తల సరిచేసాడు. చెదిరిన పైట సరిచేసాడు.

ఒక్క క్షణం... ఉద్వేగ కణం.. కడలి కెరటం అయింది. గాలికి చెదిరిన ఆమె ముంగురులు సరిచేస్తూ, కిందికి వంగి ఆమె విశాలమైన నుదురుని చుంబించాడు.

''విధాతా... నీ లలాట లిఖితం నాకు తెలియదు. కానీ నా తల రాతను ఈ అమ్మాయి నుదురుమీద పునర్లిఖించాను. నా సాహసాన్ని మన్నించి ఈ అమ్మాయిని శతాయుష్మాన్ భవ అని దీవించు''.

తథాస్తు దేవతలు ''తథాస్తు'' అన్నారు. నిశ్శబ్దంగా వెనుతిరిగి బయటకు నడిచి ఆ గది తలుపు వేసాడు.

ముగ్ధ కంటి నుంచి సన్నటి కన్నీటి ధార.. ఆమె చెంపల నుంచి జారింది.

అమ్మాయి పైట ఎప్పుడు జారుతుందా అని ఎదురుచూసే మదనుల, మగ పురుషుల ప్రపంచంలో ఒంటరిగా ఓ అందమైన అడపిల్ల నిద్రలో వున్నా అమ్మలా పైట సర్ది, నాన్నలా ముద్దు పెట్టి, నా మనసైన వాడిగా ఆ విధాతనే కదలించిన... నా ప్రాణమా.. ఏమిటీ విచిత్రం?

# 6.

అమెరికా.. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్...

అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వున్న ఆ కార్యాలయంలోని పదహారవ అంతస్థులో అత్యవసర సమావేశం జరుగుతోంది. కాకలు తీరిన ఏంజెట్స్ వున్నారు. అందులో సద్దామ్ హుస్సేన్‌ని వేటాడిన రాబర్ట్ ఒకడు.

బ్యూరో చీఫ్ అసహనంగా వున్నాడు. పది నిమిషాల క్రితమే ప్రెసిడెంట్ కార్యాలయం

నుంచి అందిన మెసేజ్.

ఫెడరిక్‌ను చంపేసారన్న వార్త ఎంత సీక్రెట్‌గా ఉంచినా మీడియాకు లీక్

అయింది. ప్రపంచంలోనే అతి శక్తివంతమైన గూడచార సంస్థ ఏజెంట్‌ని చంపేసారంటే... ప్రజల్లో తమపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఉగ్రవాద సంస్థలు విర్రవీగుతాయి. ఇలాంటివి అమెరికానే కాదు ఏ దేశము భరించలేదు.

బ్యూరో చీఫ్ ఎదురుగా వున్న ఏజెంట్స్ వైపు చూసడు. రాబర్ట్ కొద్దిగా ముందుకు వచ్చి చెప్పాడు.

''సర్... ఫెడరిక్ నిర్లక్ష్యమే అతని ప్రాణాలు తీసింది.

... శత్రువును తక్కువ అంచనా వేసాడు''

''వాడ్డూయూ మీన్.

''యస్సార్.. ఫెడరిక్ శత్రువును ట్రాప్ చేయాలని అనుకున్నాడు... కానీ తనే శత్రువు ట్రాప్‌లో ఇరుకున్నాడు అంటూ ఒక్క క్షణం ఆగి తన చేతిలో వున్న ''ఫైల్''ని చీఫ్ చేతికి ఇచ్చాడు.

''మోహన... ఏజ్ ట్వంటీ సిక్స్... హైట్ ఫైవ్ పాయింట్ త్రీ... వెయిట్ ఫిఫ్టీత్రీ... కలర్ వైట్... తండ్రి మోసం చేసాడని ఏడేళ్ళ వయసులోనే అమెరికన్ తండ్రిని, విస్కీలో పాము విషం కలిపి చంపేసింది.

తల్లి ఆత్మహత్య చేసుకోవటానికి కారణమైన నీగ్రోలను అంటే ఇండియాలోని గోవాలో బీచ్ దగ్గర తల్లిపై అత్యాచారం చేసిన ఆ ముగ్గురు నీగ్రోలను రివాల్వర్‌తో కాల్చి చంపింది. ఆ రివాల్వర్ కూడా ఆ నీగ్రోలదే...

మెంటల్‌గా డిస్టబ్ అయింది. కొన్నాళ్ళు మాదకద్రవ్యాలకు బానిసైంది. అప్పుడే మాదక ద్రవ్యాలను గోవాకు వచ్చే వారికి అమ్మడం... వాళ్ళను మత్తుకు బానిసలను చేయడం మొదలుపెట్టింది.

అప్పుడే జరిగిన గ్యాంగ్‌వార్‌లో మోహన తప్ప అంతా చనిపోయారు. మోహన అక్కడ నుంచి పారిపోయింది. పాకిస్తాన్ బార్డర్‌లో ఓ ఉగ్రవాద సంస్థ చేతుల్లో చిక్కింది. అక్కడ హ్యూమన్ బాంబ్‌గా మారింది. అక్కడే గన్ షూటింగ్.. రాకెట్ లాంచింగ్‌లో శిక్షణ పొందింది. కొందరు ఉగ్రవాదులు తనను లైంగికంగా వేధించడంతో... వీళ్ళ సమాచారాన్ని సరిహద్దు సైనికులకు చేరవేసింది. దాంతో ఆ ఉగ్రవాద సంస్థ సగానికిపైగా తుడిచిపెట్టుకుపోయింది. మోహన ఆ తర్వాత చాలా కాలం అజ్ఞాతంలో వుంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి జరిగినప్పుడు ఆమె పేరు బయటకు వచ్చింది.

చాలా ప్రమాదకరమైన వ్యక్తి. ఆమెకు సెంటిమెంట్స్ లేవు. డబ్బుకోసం ఏదైనా చేస్తుంది. ఆల్‌ఖైదాతో సంబంధాలు ఉన్నాయన్న సమాచారం మన దగ్గర వుంది'' చెప్పడం ఆపి చీఫ్ వంక చూసాడు. మిగతా ఆఫీసర్స్ కామ్‌గా వుండిపోయారు.

''వెల్.. గుడ్ ఇన్ఫర్మేషన్... బట్.. ఇప్పుడు మనకు మోహన కావాలి... డెడ్ ఆర్ ఎలైవ్... మనకు ఇంత వరకు ఫెడరిక్ డెడ్ బాడీ కూడా దొరకలేదు...'' చీఫ్ ఆందోళనగా చెప్పాడు.

''ష్యూర్‌సర్...'' చెప్పాడు రాబర్ట్. తర్వాత మిగతా ఆఫీసర్స్‌తో చర్చించాడు చీఫ్.

రాబర్ట్ బయటకు వచ్చాడు. అసలు ఫెడరిక్ లాంటి ఆఫీసర్‌ని మోహన ఎలా చంపింది? అదే పెద్ద పజిల్‌లా వుంది. ఆ పజిల్ ముడి త్వరలో కాసేపట్లో విడిపోతుంది. మోహన తన ట్రాప్‌లో చిక్కుకుంటుంది. అనుకున్నాడు. అది ఎంత ఓవర్ కాన్ఫిడెన్సో ఆ క్షణం అతనికి తెలియలేదు.

***

ఒక్కసారిగా ఆ కాన్ఫరెన్స్ హాలులో కలకలం.

మోహన పేరు వినడమే కానీ ఆమెను చూసినవారు కొద్ది మంది మాత్రమే.

పెన్సిల్ హీల్ వున్న బ్లాక్ షూ... బ్లాక్‌జీన్స్... గాగుల్స్ మొహంలో నిర్లక్ష్యం.

''హాయ్... మీరంతా నా కోసమే ఎదురు చూస్తున్నారు కదూ... సారీ ఫర్ డిలే... ఒక హత్య అదీ ఎఫ్ బి ఐ ఏజెంట్‌ని చంపడమంటే కొద్దిగా టైం తీసుకోవాలి కదా... అన్నట్టు మీట్ మిస్టర్ ఫెడరిక్'' అంటూ శవపేటికలో వున్న ఫెడరిక్ శవంవైపు తిరిగింది. ఒక్క క్షణం అక్కడ వున్న వాళ్ళలో చిన్న గగుర్పాటు.

నేను ఇతన్ని ఎలా చంపానో తెలుసుకోవాలని లేదా? అందరివైపు చూసి అడిగింది మోహన.

నిజానికి ఆ క్యూరియాసిటి అక్కడ వున్నవాళ్ళలో వుంది. కుడి కాలితో శవపేటికను ముందుకు నెట్టింది. ఆ శవపేటిక ఎదురుగా వున్న గోడ దగ్గరికి వెళ్లి ఆగింది.

నేకెడ్‌గా వున్న ఫెడరిక్ మృతదేహం...

''ముప్పై మందిని నిర్ధాక్షిణ్యంగా కాల్చి చంపిన ఫెడరిక్.. బందీలుగా చిక్కిన మహిళా టెర్రరిస్టుల బట్టలు విప్పదీసి... వారితో అనాగరిక పనులు చేయించిన శాడిస్ట్ ఫెడరిక్... లైఫ్ ఎండ్ చేసుకున్నాడు... అదేలానో మీరూ చూడండి అంటూ ఫెడరిక్ డెడ్ బాడీ దగ్గరికి వెళ్ళి అతని తలకింద వున్న పెన్‌డ్రైవ్ తీసి అక్కడున్న వారికి ఇచ్చి ఎదురుగా వున్న సోఫాలో కూచొని ''ప్లే'' అంది.

ఎదురుగా స్క్రీన్‌మీద దృశ్యం మొదలైంది. సీక్రెట్‌గా ఫెడరిక్ ''మోహన'' బెడ్‌రూం లోకి ప్రవేశించాడు.

*:*:*

''వెల్‌కమ్ మిస్టర్ ఫెడరిక్''... అ గదిలోకి ప్రవేశించగానే వినిపించిన మాటలు... అతని చేతిలో రివాల్వర్ వుంది.

''అమ్మాయి బెడ్‌రూంలోకి ఆయుధంతో వెళ్లాలని మీకు శిక్షణ టైంలో చెప్పారా? చిన్న నవ్వు ఆ తర్వాత మాటలు వినిపించాయి. అయినా నాతో ప్రైవేట్‌గా మాట్లాడాలని ఇలా అఫీషియల్‌గా గన్‌తో వచ్చారేంటి ఫెడరిక్... ఈ మోహన అంటే అంత భయమా?''

ఫెడరిక్ సమాధానం కోసం తడుముకున్నాడు... అప్పుడు గమనించాడు... తన ఎదురుగా బ్రాతూం... తలుపులు తెరచుకున్నాయి. ట్రాన్స్ పరెన్సీ నైటీలో మోహన... అప్పుడే స్నానం చేసి వచ్చినట్టు... అక్కడక్కడ తడి... ఒక్క క్షణం పెదాలు తడుపుకున్నాడు. కొద్ది క్షణాల్లోనే అక్కడి వాతావరణం మారిపోయింది... కాదు మార్చేసింది మోహన.

*:*:*

బెడ్‌మీద నేకెడ్‌గా ఫెడరిక్... పక్కన మోహన....

''నేను సినిమాల్లోనే అనుకున్నాను... ఈ వీక్నెస్ నిజంగానే ఉందన్న మాట... నన్ను పట్టుకోవాలని రెండు నెలల పదిహేను రోజులగా ట్రై చేస్తున్నారు... ఇంతకీ నేను కవాలా? నన్ను అరెస్ట్ చేయడం కావాలా'' మోహన నవ్వుతూనే అడిగింది.

''ముందు నువ్వు... మీ అందం కావాలి'' అని నాలిక్కర్చుకున్నాడు.

''యస్... ముందు నేను కావాలి.. మీ కోరిక తీరాక... నేను చావాలి... అదే నన్ను చంపాలి... రైట్..? ఈ సారి మోహన మొహంలో నవ్వులేదు.

ఫెడరిక్ షాకయ్యాడు... మోహనను తక్కువ అంచనా వేసాడు. తన తప్పు దిద్దుకోవడానికి రివాల్వర్ దగ్గరికి వెళ్ళబోయాడు. అప్పటికే ఆలస్యం అయింది. తలదిండు కింద వున్న నీడిల్ తీసింది... క్షణాల్లో మెడలో దిగింది... పాయిజన్ నీడిల్... క్షణాల్లో ప్రత్యేకమైన లాబ్‌లో తయారు చేసిన ఆ నీడిల్‌లోని విషం ఫెడరిక్ ప్రాణాలు క్షణాల్లో తీసింది. మనిషిని చంపాలంటే రివాల్వర్. అందులో బుల్లెట్స్ మాత్రమే వుంటే సరిపోదు. క్రిమినల్ బ్రెయిన్ షార్ప్‌గా వుండాలి. అతని డెడ్‌బాడీని శవపేటికలోకి మార్చింది.

*:*:*

స్క్రీన్‌మీద దృశ్యం ఆగిపోయింది.

'' ఎలా వుంది ఫ్రెండ్స్.. మంచి రొమాంటిక్ క్రైమ్ సినిమా చూస్తున్నట్టు ఉందా?

అక్కడున్న వారికి నోట మాటరాలేదు.

సోఫాలో నుంచి లేచి అక్కడున్న వారి వైపు చూసింది... తర్వాత సెల్ బయటకు తీసి ఓ నంబర్ డయల్ చేసింది.

''హలో మిస్టర్ రాబర్ట్... ఎలా వున్నారు... మీరింకా ఎఫ్ బి ఐ దగ్గరే ఉన్నట్టున్నారు... ఇప్పుడే నేను మీ ఫెడరిక్‌ను ఎలా చూపించాను...''

కాన్ఫరెన్స్ హాలులో పిన్‌డ్రాప్ సైలెన్స్... ఓసారి వాళ్ళ వైపు చూసి...

'' అల్‌ఖైదా మనుష్యులం అని చెప్పగానే నేను వచ్చి మీ ట్రాప్‌లో పడిపోతానని అనుకున్నారా... మిస్టర్ రాబర్ట్... పదిహేను మంది ఏజెంట్స్... ఈ బిల్డింగ్ టోటల్‌స్మాష్.

ఆగి హాలు వున్న ఎఫ్ బి ఐ ఏజెంట్స్ వైపు చూసి ''మీ ఫ్రెండ్ ఫెడరిక్ నాకు చనిపోయాక కూడా ఉపయోగపడుతున్నాడు. ఎలాగంటే... అతని డెడ్‌బాడీ కింద పవర్‌ఫుల్ బాంబు ఉంది.

మోహన్ బయటకు నడిచింది. ఆటోమేటిక్ డోర్స్ క్లోజ్ అయ్యాయి. లోపల వున్న వాళ్ళు ఎలర్ట్ అయ్యేలోగానే... మోహన్ తనచేతిలో వున్న రిమోట్ నొక్కింది.

క్షణాల్లో ఆ బిల్డింగ్ నామరూపాలు లేకుండా పోయింది. అమెరికా వెన్నులో చలి పుట్టింది. ఇంటర్‌పోల్ కదిలింది. రెడ్ కార్నర్ నోటీసు సిద్ధంగా వుంది.

ముగ్ధ జీవితంలో అల్లకల్లోలాన్ని సృష్టించడానికి ఈ సంఘటన నాంది అయింది.

## 7.

అమెరికా వెన్నులో వణుకు పుట్టించిన సంఘటన... ఎఫ్.బి. ఐ.కి సవాల్ విసిరిన మోహన.

రాబర్ట్‌కు బుర్ర తిరిగిపోయింది. ఫెడరిక్ మరణము పెద్ద అవమానంగా భావించిన ఎఫ్.బి. ఐ.ల ఇప్పుడు తమ ఏజెంట్స్‌ని కోల్పోయింది.

రాబర్ట్‌కు ఎంత ఆలోచించినా అంతుబట్టడం లేదు. ఆరు నెలలుగా ప్లాన్ చేసి మొదలు పెట్టిన ఆపరేషన్. తమ డిపార్టుమెంటులో కూడా ఎవరికీ తెలియదు. మోహన అమెరికా దాటకముందే అరెస్ట్ చేయాలి... కాదు... కాదు చంపేయాలి. ఇంతక్రితం మోహన చేసిన నంబర్ డయల్ చేసాడు. రింగ్ అవుతోంది.

ఒకటి...రెండు...మూడు... ఫోన్ లిఫ్ట్ చేస్తుందా? చేయదా?

''యస్ మిస్టర్ రాబర్ట్... మీ ఏజెంట్స్ డెడ్ బాడీస్ కలెక్ట్ చేసుకున్నారా?'' చిన్న నవ్వుతో మట్లాడింది

''మిస్... మోహన ఐ క్యూ వున్న అమ్మాయిలు సెక్స్‌లో మంచి సుఖం ఇస్తారని ఎక్కడో చదివాను'' ఆమెను రెచ్చగొడుతూ అన్నాడు.

''అఫ్‌కోర్స్... ఆ సంగతి... పైకెళ్ళిన మీ ఫ్రెండ్ ఫెడరిక్ కి బాగా తెలుసు'' మోహన కూల్‌గా అంది.

సైఫ్‌తో చర్మం కోసం ఫీలింగ్.

''మిస్టర్ రాబర్ట్... నన్ను మాటలో పెట్టి నేనెక్కడ వున్నానో ట్రేస్ చేయడం పూర్త యిందా? బై... ఇక ఈ నంబర్ పనిచేయదు.

''వన్ సెకన్'' అన్నాడు రాబర్ట్. ఆ తర్వాత చెవులు రిక్కించి మరీ విన్నాడు. ట్రైన్ అనౌన్స్‌మెంట్...''

సెలాఫ్ చేసింది మోహన. సిమ్‌కార్డు తీసి చిన్న చిన్న ముక్కలు చేసింది. రైల్వే అనౌన్స్‌మెంట్... టేప్ చేసింది మోహన. దాన్ని రాబర్ట్‌తో మాట్లాడుతున్నప్పుడు ప్లే చేసింది.

మోహన ఫోన్ పెట్టేయగానే రాబర్ట్ ఎక్సయిట్‌మెంట్‌లో ఓ పొరపాటు చేసాడు. సెల్‌లో మోహనతో మాట్లాడుతున్నప్పుడు వెనగ్గా వినిపించిన అనౌన్స్‌మెంట్ విని మోహన రైల్వేస్టేషన్‌లో వుందని'' అన్ని రైల్వే స్టేషన్స్ రౌండ్ అప్ చేయమన్నాడు రాబర్ట్.

అదే సమయంలో మోహన మారు పేరుతో ఇండియా వెళ్ళే ఫ్లయిట్ ఎక్కేసింది.

'' ఇప్పుడు మోహనను చూస్తే ఎవరూ గుర్తుపట్టలేరు.. ఎవరూ గుర్తుపట్టలేరు.

యాభై ఏళ్ళ గృహిణి గెటప్‌లో వుంది. ఫ్లయిట్ ఎక్కి ముందు యాసిక్‌కు ఫోన్ చేసింది.

***

ఇండియా

న్యూఢిల్లీ

ఎర్లీ మార్నింగ్

ఇంకా మంచు దుప్పటి తొలగనే లేదు. హోం మినిస్టర్ నివాస కార్యాలయం. హోం మినిస్టర్, సి.బి. ఐ. చీఫ్, ఇద్దరే వున్నారు. కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత... సి.బి. ఐ.చీఫ్ గొంతు విప్పాడు.

''చెప్పండి సార్... ఎంతో అర్జెంటయితే తప్ప మీరు ఈ టైంలో నన్ను రమ్మనరు''

''యస్... మీరు సి.బి. ఐ. చీఫ్ కన్నా ముందు నాకు చిన్ననాటి క్లాస్‌మేట్, ఈ ప్రోటో కాల్ జస్ట్ ఫార్మలిటినే... మీతో ఓ ముఖ్యమైన పని పడింది'' లేచి టీపాయ్ మీద వున్న కాఫీ కెటిల్ తీసాడు.

సి.బి. ఐ. చీఫ్ సుందర రామమూర్తి రెండు కప్పుల్లోకి కాఫీ వంపాడు.

''చెప్పండి... సిబి ఐ చీఫ్ గా లేక మీ స్నేహితుడిగా అయిన ఏం చేయమంటారు..'' అడిగాడు.

వృత్తిలో అంకితభావం కనిపించే సుందర రామమూర్తి ఎన్నో విపత్కర పరిస్థితుల్లో దేశాన్ని కాపాడాడు. ప్రతీ పౌరుడు యూనిఫాం లేని పోలీస్ అని గట్టిగా నమ్మినవాడు. సి.బి. ఐ. చీఫ్‌గా ఏ రాజకీయాన్ని దగ్గరకు రానివ్వడు.

''మూడేళ్ళక్రితం మీరు ఇండియా నుంచి తరిమేసిన ఓ మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్... మళ్ళీ ఇండియాలో అడుగుపెట్టబోతుంది... నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఇక్కడ ఏదో విధ్వంసం జరుపబోతుంది. మీ సి బి ఐ గాని డైరెక్ట్‌గా ఇన్వాల్వ్ అయితే ఆ విషయం బయటవాళ్ళకు తెలిసిపోతుంది. తెలిసిపోయే అవకాశముంది''

''డేర్ డెవిల్ మోహన ఇండియా వస్తుందా?

''యస్. ఎఫ్. బి. ఐ. ఏంజెట్స్‌ని ముప్పుతిప్పలు పెట్టింది. అక్కడి నుంచి ఎస్కేప్ అయింది.

''అంటే మా సి బి ఐ కాకుండా వేరే మరొకరు ఈ కేసుని డీల్ చేయాలంటారా''

'' ఎగ్జాక్ట్ లీ... ఎందుకంటే సి బి ఐ, పోలీస్ డిపార్టుమెంటులో మోహనకు వున్న నెట్‌వర్క్ మీకు తెలుసు. పైగా మనం కేసు టేకప్ చేసిన వెంటనే ఆ విషయం మోహనకు తెలుస్తుంది. అందుకే ఒక సమర్ధుడైన వ్యక్తి కావాలి. మీరు ఎవరిని ఈ కేసు డీల్ కోసం నియమిస్తారో మీ యిష్టం. అతనికి అన్ని పవర్స్ ఇద్దాం. మోహనను అవసరమైతే చంపేయడానికి కూడా షూట్ ఎట్ సైట్ ఆర్డర్ ఇద్దాం. అఫ్‌కోర్స్... మోహన కోసం ఇంటర్‌పోల్ రెడీగా వుంది''.

'' ఒకేసర్... ఈ ఆపరేషన్‌ని సక్సెఫుల్‌గా చేయగల గట్స్ దండిగా వున్న వ్యక్తి ఒకరున్నారు. నాకు బిడ్డలాంటివాడు, హీ ఈజ్ కార్తికేయ... కన్ను మూసి తెరిచేలోగా కనురెప్పను రెండుగా చీల్చగల సమర్థుడు. ప్రాణాలు అతనికి తృణప్రాయం.. కస్టమ్స్‌లో ఆఫీసర్.. ఆఫ్ కోర్స్ అది మీకు సమ్మతమైతేనే, అదీ విత్ యువర్ పర్మిషన్'' చెప్పాడు సి బి ఐ చీఫ్.

''సుందర రామమూర్తిగారు చెప్పారంటే అతను సమర్ధుడే. యోగ్యుడే అయి ఉంటాడు. అనుకొని ''ప్రోసీడ్'' అన్నాడు హోం మినిస్టర్.

***

సాంబ్రాణి ధూపం ఆకాశాన్ని వర్షించే మంచులా ఆ ఇంటిని చుట్టేసింది.

సుప్రభాతం కోకిల స్వరంలోనుంచి.. గానామృత సుస్వర శుభోదయం పలుకుతుంది.

అప్పుడే కళ్ళు తెరిచిన కార్తికేయకి, ప్రకృతిని ఎవరో తనింటికి తీసుకువచ్చారన్న భ్రమలో... విభ్రమలో... ఆశ్చర్యానందాల వాస్తవ స్వప్నంలో స్వాప్నికుడయ్యాడు.

తలారా స్నానం చేసి... నందివర్ధనం పూవులా... అప్పుడే వికసించిన గులాబిలా... ఉదయమే రెండు ఉషోదయాలను చూసినట్టు కార్తికేయకు వుంది.

''గుడ్ మార్నింగ్... బెడ్ కాఫీ తాగుతారా?''

వద్దు, అన్నట్టుగా అడ్డంగా తలూపి ఇంత పొద్దున్నే ఎక్కడిది పాలప్యాకెట్...?

''మీ కాలనీ చివర వున్న షాప్ దగ్గరికి వెళ్ళాను.''

''మీకెందుకు శ్రమ...''

'' ఇష్టమైన పని ఏదీ కష్టంకాదు... అవి మా నాన్నగారు చెబుతుంటారు. మీరు త్వరగా ఫ్రెషప్ అయితే వేడి వేడి పొగలు కక్కే కాఫీ రెడీగా వుంటుంది'' చెప్పింది ముగ్ధ. అలానే ముగ్ధ వంక చూస్తూ ఉండిపోయాడు. అదే సమయంలో ప్రమాదం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయింది.

ఆ ప్రమాదం పేరు మోహన.

# 8.

మ...న...సు...

ఆకారం లేదు... ఉనికి భౌతికంగా కనిపించదు. రక్తాన్ని నిరంతరం పంప్ చేస్తూ... అనుక్షణం కొట్టుకుంటూ వుండే హృదయమే మనసా? మెదడు పొరల్లో, జ్ఞాపకాల అరల్లో నిలిచిపోయే ఇష్టమే మనసా?

ముగ్ధ మంచం మీద వెల్లికిలా పడుకుంది. ఎదురుగా గోడకు కార్తికేయ లైఫ్ సైజ్ ఫోటో. నవ్వుతూ తన వంకే చూస్తున్నట్టు...

'' ఇప్పుడే వస్తానని వెళ్ళాడు.. వెళ్ళి అరగంట అయింది ఇంకారాలేదు'' అప్పటి నుంచి అతని ఆలోచనలే... తను తన స్నేహితురాలిని మిస్ అయిన విషయం కూడా మర్చిపోయింది.

రాత్రి తన పైట సరిచేస్తూ.. వుండగ తన హృదయ భాగాన్ని అప్రయత్నంగా తాకిన అతని చేతివ్రేళ్ళ స్పర్శ... మంచువెన్నెల్లో చుట్టేసిన తొలి నులి వెచ్చని సూర్యోదయ కిరణాల ఆలింగనంలా వుంది. తన నుదురుని చుంబించిన అదర చుంబనం గులాబీని ముద్దెట్టుకున్న నీహారికా బిందువులా తోచింది. తను కృష్ణశాస్త్రి అయితే ఎంత బావుండు? తను తిలక్‌లా మారిపోతే? కీట్స్ పొయెట్రీ అయితే?

వెల్లికిలా పడుకుని ఒక అబ్బాయి గురించి ఆలోచిస్తే ఆ అబ్బాయి ప్రేమలో పడ్డట్టే...

వెంటనే బోర్లాపడుకుని చుబుకానికి రెండు చేతులు ఆన్చి మళ్ళీ కార్తికేయ ఫోటో వైపు చూసింది. బోర్లాపడుకుని చుబుకానికి రెండు చేతులు ఆన్చి అబ్బాయి ఫోటో వంక చూస్తే '' ఆ అబ్బాయి ఆలింగనంలో కరిగిపోవాలన్న కోరిక ఉన్నట్టే...

తల విదిల్చి లేచి కూచుంది.

ఏమైంది తనకీ వేళ?

కార్తికేయ ఫోటో వైపు చూసింది.

పెరట్లో వున్న గులాబీ పువ్వులన్నీ ఆమె బుగ్గల్లోకి వచ్చి చేరాయి.

⁂

కాలింగ్ బెల్ మోగింది. తన గుండెల్లో గంట మోగినట్టు... ఎదురుగా కార్తికేయ అతని చేతిలో కవర్ ముగ్ధ చేతిలో పెట్టాడు.

'' ఏమిటి? అడుగుతూనే కవర్ ఓపెన్ చేసింది...

''చీర... కాదు చీరలు... గులాబీలలో ఎన్ని రంగుల రకాలు వున్నాయో అన్ని చీరలు...

''నాకా ఎందుకు? ఆనందం... బిడియం... కలగలసిన ప్రశ్న

''నేను కట్టుకుంటే బావోదు కదా'' చిన్న నవ్వు నవ్వి... ''సారీ...'' అన్నాడు.

''శారీ'' అనాలి... అనాలనుకుంది సరదాగా... కానీ అనలేదు... కార్తికేయ ఫీలింగ్స్‌ని అనుభూతినిస్తోంది.

⁂

ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చింది మోహన... క్యాబ్‌ని పిలిచింది. అడ్రస్ చెప్పింది.. యాసిక్‌కి ఫోన్ చేసింది.

మధ్యలో ఓ హోటల్ దగ్గర ఆగింది. లోపలికి వెళ్ళింది. తిరిగి వచ్చేప్పుడు చుడీదార్‌లో వచ్చింది. క్యాబ్ డ్రైవర్ ముందు ఆశ్చర్యంగా ఆ తర్వాత భయంగా చూసాడు. ఆ భయాన్ని పసిగట్టింది మోహన.

భయం రెండు రకాలు... ఒకటి మనసులోనే దాచుకుని కామ్‌గా వుండటం... రెండు ఎవరికైనా చెప్పడం... పోలీసులకు ఇన్ఫామ్ చేయడం...

ఆ క్యాబ్ డ్రైవర్ మొహంలో రెండో భయాన్ని చూసింది. తన సెల్ఫ్ డిఫెన్స్ కోసం ఈ సమాచారాన్ని పోలీసులకు చెప్పవచ్చు.... రేపు తన యాభైయేళ్ళ గెటప్ విషయం అమెరికా నుంచి ఇండియాకు వస్తే తన రూపాన్ని గుర్తుపట్టే ఏకైక సాక్షి.

సాక్ష్యాన్ని చంపాలంటే ఆ సాక్షిని...

సరిగా పదిహేను నిమిషాల తర్వాత కారు... పార్లమెంటు భవనానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆగింది. కారు దిగి మరో క్యాబ్‌ని పిలిచి కూచుంది. మొదటి క్యాబ్ రోడ్డు మధ్యలో ఆగి వుంది. క్యాబ్ డ్రైవర్ తల స్టీరింగ్ మీద వాలపోయి వుంది.

అతను చనిపోయి రెండు నిముషాలు అవుతుంది.

***

ఒక్క క్షణం అలానే చూస్తోండిపోయాడు... పింక్ కలర్ చీరలో చాలా అందంగా వుంది. ఎప్పుడూ ఇలా అమ్మాయిలను పరీక్షగా చూసింది లేదు. అతని చూపుల స్పర్శ ఆమె హృదయాన్ని తాకింది.

''మా ఫ్రెండ్ కలిసిందా? అడిగింది టాపిక్ డైవర్ట్ చేస్తూ...

''లేదు... రింగవుతుంది కానీ లిఫ్ట్ చేయడంలేదు. మీరేం కంగారు పడకండి. ఈవినింగ్‌లోగా మీ ఫ్రెండ్ దగ్గరికే చేర్చే పూచీ నాది. మనమిప్పుడు ఓ వ్యక్తిని కలవడానికి వెళ్తున్నాం'' చెప్పాడు.

'' ఎవరు? ఏమిటి? ఎందుకు? లాంటి ప్రశ్నలు అడగలేదు. అతని వెంట నడిచింది. రాముని వెంట నడిచిన సీతలా...

***

కారు వెళ్తోంది. గమ్మత్తుగా వుంది ముగ్ధకు...

తనిలా ఒక వ్యక్తితో కలిసి... డ్రైవ్ చేస్తోన్న కార్తికేయను అలానే చూస్తోండిపోవాలని అనిపించింది.

''మీరు ఏమనుకోనంటే ఒకటి అడగనా?

''అడగండి''

'' ఇంత పొద్దునే చీరలు...? అని అడిగింది.

'' ఏ షాప్‌కు కన్నం వేశానని అనుకుకుంటున్నారా?

''ఛ..ఛ నా ఉద్దేశం అది కాదు...''

''మీరు నవ్వనంటే చెబుతాను... పొద్దున్నే షాప్‌కు వెళ్ళి బోర్డు మీద ఫోన్ నంబర్ చేసాను... ఫోన్ చేసాను. '' ఐశ్వర్యారాయ్ ఇంటినుంచి మాట్లాడుతున్నాను'' అని చెప్పాను. పెద్ద బేరమే అని పరుగున వచ్చాడు... షాప్ తీసాడు... నేను వెళ్లి నాకు కావాల్సిన చీరలు తీసు కున్నాను... వాడింకా ఐశ్వర్యారాయ్ కోసం చూస్తూనే వున్నాడు.''

మనస్ఫూర్తిగా నవ్వింది. సీరియస్‌గా కనిపించే కార్తికేయలోని... అల్లరి నచ్చింది.

చాలా మంది మగాళ్ళలో కనిపించే '' ఈగో'' కార్తికేయలో మచ్చుకైనా కనిపించదు.

***

కారు సడెన్‌గా ఆగింది. జనం గుమిగూడి వున్నారు. కార్తికేయ కారు దిగి జనాన్ని తోసుకుని వెళ్లి చూసాడు. క్యాబ్ డ్రైవర్ శవం... మోహన చేతిలో చచ్చిన డ్రైవర్ శవం. అది ఆత్మహత్య కాదని తెలుస్తోంది. బాడీ నీలం రంగులోకి మారింది. సరిగ్గా అప్పుడే యాసిక్ అక్కడికి చేరుకున్నాడు. అతను కార్తికేయ కారును ఫాలో అవుతూ వస్తున్నాడు. ఇదే మంచి అవకాశం... అతని చేతిలో యాసిడ్ బాటిల్ రెడీగా వుంది.

***

# 9.

''ఈ ప్రయాణం ఇలానే కొనసాగితే ఎంత బావుంటుంది దేవుడా... నా కోసం నేనె ప్పుడూ ఏదీ కోరలేదు... ఎందుకో ఇప్పుడు నిన్నో కోరిక కోరాలని వుంది...''

కళ్ళు మూసుకుంది... ఒక ఉద్వేగ కెరటం... కనురెప్పను కన్నీటి చుక్కతో... కుశ లమా... నాకిక సెలవా...'' అని కుశిలం అడిగింది.

''నా మనసును ఆకాశంలా చేసి... నా శరీరాన్ని ఇంద్రధనస్సులా మార్చి... నా స్వరాన్ని... స్వరాన్ని సమస్త భావోద్వేగాలను అతని పరం చేసి వరమివ్వు ప్రభూ...''

ఆమె ఇంకా కళ్ళు మూసుకునే వుంది. యాసిక్‌కారు దగ్గరికి వచ్చాడు... కారు గ్లాసెస్ కిందికి దించే వున్నాయి. అతని కుడి చేతిలో యాసిడ్ బాటిల్ గాల్లోకి లేచింది.

''కళ్ళు తెరిస్తే ఆ దేవిడికి తన నివేదన చేరదేమో...'' అన్నంత ఇష్టంగా మూసిన కళ్ళు కలలను ఆహ్వానిస్తున్నాయి. క్షణంలో వెయ్యోవంతు చాలు... ఆమె మొహం యాసిడ్‌తో వికృ తమవ్వడానికి.

***

అప్పుడే ఓ సంఘటన జరిగింది. వెనక నుంచి అరుపులు... చోర్... చోర్... దొంగ...

దొంగ...

ఓ ముప్పయ్ ఏళ్ళ యువకుడు హ్యాండ్ బాగ్‌తో పరుగెడుతున్నాడు. వెనగ్గా ఓ అరవై సంవత్సరాల మహిళ తన చేతిలో వున్న కుక్కపిల్లను కంట్రోల్ చేస్తూ, ఆ దొంగతో పరుగెత్త లేక అరుస్తోంది. ఆ దొంగ కార్తికేయ కారు దగ్గరికి వచ్చాడు. కారు డోర్ సమీపంలో యాసిడ్ బాటిల్‌తో యాసిక్ రెడీగా వున్నాడు. దొంగ యాసిక్‌ని నెట్టుకుంటూ పరుగెత్తాడు. ముసలా విడ చేతిలో వున్న కుక్కపిల్ల ఆ దొంగ వెంట పడాలని కిందికి దూకింది. అదే సమయంలో దొంగ యాసిడ్‌ని గుద్దుకుంటూ పారిపోవడంతో అతని చేతిలోని యాసిడ్ బాటిల్ అటు పరుగెత్తుకు వచ్చిన కుక్కపిల్ల మీద పడింది. యాసిడ్ బాటిల్‌లోని యాసిడ్ మీద పడ్డంతో కుక్కపిల్ల శరీరం ఒక్కకసారిగా కాలి పొగలు వచ్చాయి. మనిషి శరీరాన్ని వికృతంగా మార్చే యాసిడ్. క్షణాల్లో జరిగిన సంఘటన... రోడ్డు మీద బాధతో విలవిల కొట్టుకుంటుంది కుక్క పిల్ల.

కార్తికేయ క్షణంలో జరిగింది ఊహించాడు. పారిపోతున్న యాసిక్‌ని గుర్తించాడు. ఒక్కక్షణం ఆలస్యం అయితే ఆ యాసిడ్... ఆ పైన ఊహించలేకపోయాడు. అప్పటి వరకు తన ఊహా ప్రపంచంలో వున్న ముగ్ధ జరిగిన సంఘటనతో షాక్‌తింది.

కార్తికేయ ఆ కుక్కపిల్లని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ ముసలావిడ తన హ్యాండ్ బ్యాగ్ సంగతి వదిలేసి కుక్కపిల్ల గురించి ఆందోళన పడుతుంది... కార్తికేయ కారులో వున్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తీసాడు. ఫస్ట్ ఎయిడ్ చేసిన తర్వాత అటుగా వెళ్తోన్న ఓ క్యాబ్‌ని పిలిచి ఆ ముసలావిడను ఆ క్యాబ్‌లో ఎక్కించి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళమని చెప్పి క్యాబ్ అతనికి కొంత డబ్బు ఇచ్చాడు.

ఆ ముసలావిడ కార్తికేయ వంక కృతజ్ఞతాపూర్వకంగా చూసింది.

⁂

ఇంకా ఆ షాక్‌లో నుంచి కోలుకోలేదు ముగ్ధ. అసలేం జరిగింది? డ్రైవ్ చేస్తోన్న కార్తి కేయ వంక చూసింది. చాలా సీరియస్‌గా కనిపించాడు. అతని మొహం ఎర్రబడింది. ముగ్ధ మీద ఎటాక్‌కు ప్లాన్ జరిగిందని అర్థమైంది.

⁂

కారు రాణా సర్కిల్ దగ్గర ఆగింది. ఓ పక్కన కారు పార్క్ చేసి వస్తుంటే అంజలి ముగ్ధ దగ్గరికి వెళ్ళింది గులాబీబుట్టతో.

''మేడం ఈ గులాబీలు మీ జడలో వుంటే ఇంకా అందంగా వుంటాయి''

అంజలి వంక చూసింది. ఇంత చిన్న అమ్మాయి... పూలు అమ్ముకుంటూ.. వూళ్ళో గులాబీ తోట... ఇక్కడ గులాబీపువ్వు కూడా కొనుక్కోవాలి. మార్పు యాంత్రికమైన అభివృ

ద్ధివైపు పయనిస్తుందా?

ముగ్ధ వంగి '' ఇంత చిన్న వయసులో... ఇలా పూలు అమ్ముకునే బదులు చదువుకో వచ్చుగా'' అనునయంగా అంది.

''పూలు అమ్ముకుంటూ చదువుకుంటున్నాను మేడం'' చెప్పింది అంజలి.

''పూలు అమ్ముకుంటూ చదువుకోవడం ఏమిటి? మీ అమ్మా నాన్న?

''లేరు'' సమాధానం కార్తికేయ నుంచి వచ్చింది.

***

''అదే జరిగింది... నేను చంపబోతుంటే నిన్ను అడ్డుపెట్టుకుని తప్పించుకున్న వ్యక్తి చేతిలో అంజలి అమ్మా, నాన్న చనిపోయారు. ఇప్పుడు తను ఒంటరి. నేను రమ్మని పిలిచినా రాలేదు. వయసులో చిన్నదే... ఆత్మాభిమానంలో పెద్దది. కొంత డబ్బును పక్కన వున్న అనాథశరణాలయంలోని పిల్లల కోసం ఖర్చు చేస్తుంది.

ముగ్ధ అంజలిని దగ్గరికి తీసుకుంది.కళ్ళకింద నల్లటి చారికలు గుండెలకు హత్తుకుంది.

''నాతో మా వూరికి రారాదు. నాకో తమ్ముడు వున్నాడు... చెల్లెలు లేదు..'' చెప్పింది ముగ్ధ.

అంజలి కార్తికేయ వైపు చూసింది ''మారణహోమం'' జరగాలి... అన్న భావం కనిపించింది. అంజలి జీవితంలో జరిగిన విషాదం తలచుకుంటుంటే బాధగా వుంది.

***

''క్షమించండి'' అంది కారులో తిరిగి వస్తున్నప్పుడు.

'' ఎందుకు? కారు డ్రైవ్ చేస్తూనే అడిగాడు కార్తికేయ

''మనుష్యులను చంపడం పాపం కదా అన్నాను... క్రూరమృగాలను వేటాడి చంపడం క్షత్రియ లక్షణం... రాజ లక్షణం... చంపేయండి...'' మనస్ఫూర్తిగా చెప్పింది ముగ్ధ. అతని భుజం మీద తలవాల్చింది. అలిసిన ఆ కళ్ళు కాసింత విశ్రాంతిని కోరుకుంటున్నాయి. అప్పుడే కార్తికేయ ఫోన్ రింగ్ అయింది. ముగ్ధ స్నేహితురాలి దగ్గరి నుంచి వచ్చిన ఫోన్‌కాల్ అది.

***

''వెల్... చేతిలో యాసిడ్ బాటిల్ వున్నా పారిపోయి వచ్చావా?'' చేతిలో వున్న ఆపిల్‌ని నైఫ్‌తో ముక్కలుగా కోస్తూ యాసిక్ వంకే చూస్తూ అడిగింది.

''కొద్దిలో మిస్ అయింది మేడం'' యాసిక్ చెప్పాడు.

మోహన గోడవైపు తిరిగి వెనక్కి చూడకుండానే చేతిలోనే నైఫ్‌ని విసిరింది. యాసిక్ వైపు టార్గెట్ చేస్తూ... ఆ నైఫ్ గాలిని చీల్చుకుంటూ యాసిక్ వైపు వస్తోంది.

∴∴

# 10.

భయంతో వణికిపోయాడు యాసిక్... అతనికి మోహన మెంటాలిటీ తెలుసు... కొన్ని విషయాల్లో క్రూరంగా బిహేవ్ చేస్తుంది. గాలిని చీల్చుకుంటూ నైఫ్ యాసిక్ తలమీదుగా వెళ్ళి వెనకన వున్న వార్డ్‌రోబ్‌లోకి దిగింది.

''నా గురి తప్పలేదు... నా టార్గెట్ నీ తల ఐతే ఈ పాటికి మొండెం నుంచి వేర య్యేది'' చాలా కూల్‌గా చెప్పినా అందులో వార్నింగ్ వుంది.

యాసిక్ మౌనంగా వుండిపోయేడు. మోహనకు ఎదురు చెబితే ఏమవుతుందో అను భవమే.

కొన్నాళ్ళ క్రితం మోహన ఇండియా వచ్చినప్పుడు మాదకద్రవ్యాలు సప్లయ్ చేసే టోనీ మోహనను కలిసాడు. హెరాయిన్ టేస్టు చేస్తూ... వుండగా'' అమ్మాయిలు వాడే హెరా యిన్ కాదు'' అన్నాడు కాస్త వ్యంగంగా... టోనీకి మోహన గురించి తెలియదు.

కిందికి వంగి ఐరన్‌రాడ్ చేతిలోకి తీసుకుని టోనీ తలమీద గట్టిగా కొట్టింది. టోనీ వేసిన కేక ఢిల్లీ నగరంలో ప్రతిధ్వనించింది. హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రయత్నించింది. అంత బాధలోనూ టోనీ ప్రాణాలు కాపాడుకోవడానికి మోహన కాళ్ళ మీద పడిపోయాడు.

'' ఇంకెప్పుడూ... హెరాయిన్ అమ్మకు... అమ్మినట్లు తెలిస్తే చస్తావ్'' వార్నింగ్ ఇచ్చింది.

''చెప్పండి మేడం నన్ను ఏం చేయమంటారు? ఎవరిమీదైనా యాసిడ్‌తో ఎటాక్ చేయాలా?''

''నాకు నీ ప్రాణాలు కావాలి'' కూల్‌గా అంది మోహన. అదిరిపడ్డాడు... మేడం? అంటూ ఆగిపోయాడు.

మోహన చెప్పసాగింది. అంత చలిలోనూ... చెమటలు. మాఫియాకు కూడా రాని భయంకరమైన ఆలోచన... ఇది.. ఇది జరుగుతుందా?

మోహన ఇండియా రావడం వెనుక వున్న అసలు విషయం ఇదా?

అతని శరీరం కంపించింది.

❖❖❖

''మీకో గుడ్ న్యూస్'' చెప్పాడు కార్తికేయ.

ఏమిటని అడిగలేదు... ఏమిటన్నట్టు చూసింది ముగ్ధ.

''మీ ఫ్రెండ్ దొరికింది. ఎ టి ఎం నుంచి వస్తోంటే యాక్సిడెంట్ అయిందిట... ఎవరో హాస్పిటల్‌లో చేర్పించారుట... ఇందాకే స్పృహలోకి వచ్చిందట... నా సెల్ నుంచి వచ్చిన కాల్స్ చూసి ఫోన్ చేసింది... మీ గురించి కంగారుపడుతుంది'' చెప్పాడు కార్తికేయ.

ఏమాత్రం ఆసక్తి చూపించలేదు.

అప్పుడే దొరకాలా? మరో రెండు రోజులాగితే ఏమైంది? ముగ్ధ మనసులోని ఆలో చన.

తన ఆలోచన తనకే చిత్రంగా అనిపించింది. అవున్నిజం... ఇప్పుడు కార్తికేయ తనను తన స్నేహితురాలి దగ్గరికి తీసుకువెళ్తాడు...

'' ఇదిగోండి మీ ఫ్రెండ్ అని చెబుతాడు... అది చాలా థాంక్స్ అంటుంది. తను అక్కడే వుండిపోతుంది.

కార్తికేయ ఇంటికి వెళ్ళిపోతాడు... ఇక తనకు కార్తికేయ క...ని...పిం...చ...డు...

ఒక్కసారిగా ఏడుపు తన్నుకు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. కార్తికేయ వైపు చూసింది. అతను సీరియస్‌గా డ్రైవ్ చేస్తున్నాడు. అతని చొక్కా పట్టుకుని నిలదీయాలని అనిపించింది...''

''మాట్లాడండి... సైలెంట్‌గా వున్నారేంటి?'' అడిగాడు కార్తికేయ.

'' ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్తున్నాం?'' ఉక్రోషంగా అడిగింది ముగ్ధ.

''మీ ఫ్రెండ్ దగ్గరికి''... అదేమిటి అలా అడిగారు?

'' ఇంటికి వెళ్దాం'' ముక్తసరిగా అంది.

'' ఇంటికా?'' కార్తికేయ గొంతులో ఆశ్చర్యమ్...

''మీ శారీస్ మీకు ఇచ్చి నా చీర తెచ్చుకుంటాను'' ఏడుపు దిగమింగుతూ అంది...

ముగ్ధ వంక చూసాడు... గోదావరి ఆమె కళ్ళలో నుంచి ఉప్పొంగడానికి సిద్ధంగా వుంది. అప్పుడే ఫోన్‌కాల్. డిస్‌ప్లేలో నంబర్ రాలేదు... అంటే ఆ ఫోన్ కాల్...?

❖❖❖

# 11.

మౌనాన్ని యుద్ధంగా ప్రకటించింది ముగ్ధ. ఇంటికి వచ్చే వరకూ ఏమీ మాట్లాడలేదు. తనకు కేటాయించిన గదిలోకి వెళ్ళింది. ఓరకంట కార్తికేయను గమనిస్తూనే వుంది. సీరియస్‌గా సోఫాలో కూచోని ఏదో ఆలోచిస్తున్నాడు. ''బహుశా తనను పంపించడం కోసమే కాబోలు'' కోపంగా అనుకుంది. కార్తికేయ ఇచ్చిన చీర విప్పి గిరాటు వేసి తన చీర కట్టుకుంది. దుఖం తన్నుకొస్తుంది. ఇంత జరిగినా తనతో ఒక్క మాటైనా మాట్లాడాడా? విసురుగా బయటకు రాబోయి ఆగింది. మూలకు గిరాటు వేసిన ఆ చీరను గుండెలకు హత్తుకుంది. కొన్ని గంటలపాటు తనను అంటిపెట్టుకున్న చీర. నిజం చెప్పాలంటే కార్తికేయ తనను చుట్టేసిన అనుభూతిని మిగిల్చిన చీర. ఆ చీరను భద్రంగా ఓ కవర్‌లో పెట్టింది. బయటకు నడిచింది. కేవలం కొన్ని గంటలే గడిపిన గది. అయినా తన మదిని ఈ గదిలో వదిలి వెళ్తోన్న ఈ ఇది ఏమిటిక్ష. ఈ ఇంటితో తనకిక ఏ సంబంధం వుండదా.

:::::

కార్తికేయ ఆలోచిస్తున్నాడు. కారులో వుండగా వచ్చిన ఫోన్‌కాల్ సి బి ఐ నుంచి వచ్చిన ఫోన్... అర్జెంటుగా కలవాలన్న మెసేజ్. ''వెళ్దామా'' ముక్తసరిగా అడిగింది ముగ్ధ. అలాగే అన్నట్టు లేచాడు.

''పొద్దున్న తెచ్చిన పాలు కాచి, చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టాను. ఫిల్టర్ పెట్టాను... నన్ను పంపించి వచ్చాక కాఫీ చేసుకొని తాగండి'' కోపం... ఉక్రోషం కలిసిన గొంతుతో ముగ్ధ. కార్తికేయ ఏం మాట్లాడలేదు. వెళ్దామా అన్నట్టు చూసాడు. మీరు తెచ్చిన చీరలు ఆ గదిలోనే వున్నాయి... కోపాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ అంది. ఇక అక్కడ వుండలేనట్టు బయటకు నడిచింది.

కారులో మౌనంగా కూచుంది ముగ్ధ. ''చా.. ఈ మగాళ్ళంతా ఇంతే... కనీసం కాఫీ తాగి వెళ్దాం'' అనవచ్చుగా.

:::::

హస్పిటల్...

రూం నంబర్ పదమూడులో ముగ్ధఫ్రెండ్...

''సారీ ముగ్ధ... ఏ టి ఏంలో మనీ డ్రా చేసి వస్తుంటే ఎదురుగా వస్తోన్న కారును చూసుకోలేదు. కార్తికేయగారు నువ్వు తన దగ్గరే వున్నావని తెలిసాక రిలాక్సయ్యాను.

నీకో విషయం తెలుసా... నేను నీ ఫ్రెండ్‌ని అతి తెలిసాక ఇక్కడ డాక్టర్స్‌తో మాట్లాడి నన్ను స్పెషల్‌వార్డ్‌లో షిఫ్ట్ కార్తికేయగారు చేయించారు. వద్దన్నా వినకుండా బిల్ పే చేసారు'' అని కార్తికేయవైపు తిరిగి థాంక్స్ అండీ... అంది.

ఒక్క క్షణం ముగ్ధ కార్తికేయవైపు చూసింది. తన ఫ్రెండ్ అని తెలిసి '' ఇంత సాయం చేసాడా''? అయినా తానేమీ చేయనట్టు వున్నాడు.

'' ఏయ్... ముగ్ధా ఏమిటీ... నాకింత యాక్సిడెంట్ అయిన షాక్‌లోనే వుందింకా... అన్నట్టు ఇంకాసేపట్లో మిమ్మల్ని డిశ్చార్జి చేస్తారు'' చెప్పాడు కార్తికేయ.

''హాస్పిటల్‌లో వుండి బోర్ కొట్టింది. మా ముగ్ధకు తాజ్‌మహల్ చూపించాలి. మరో రెండు రోజుల్లో వెళ్లిపోవాలి'' ముగ్ధ స్నేహితురాలైన హేమంత అంది.

''మీకు అభ్యంతరం లేకపోతే ఈ ముగ్ధగారు రెండురోజులు మా ఇంట్లో గెస్ట్‌గా వుంటారు. రేపు మీరు తాజ్‌మహల్ చూసే ఏర్పాటు నేను చేస్తాను''.

''కదిలిన కాలం పూలవానలతో కలిసొచ్చి వింజామర వీస్తూ చుట్టేసినట్టు...

గుండెగోంతుకలోని స్వరం వరమిస్తూ... దీవించినట్టు...

''కార్తికేయకు పక్కగా రెండు అడుగుల దూరంలో వున్నా ముగ్ధ రెండు అడుగులను వేసి మూడో అడుగు ఇదే అన్నట్టు అతని పక్కగా నిలబడి అతని చేతిని పట్టుకుంది...

ఆ... ప్రయత్నంగా ఒక్క క్షణం ఏడుస్తూ నవ్వాలనిపించింది.

ఆనందభాష్పమా... భావోద్వేగానికి ఇది నువ్వు చెప్పిన భాష్యమా...

హేమంత అది గమనించింది. చిన్న నవ్వు... ఈ ప్రపంచంలో ''నేను... తమ్ముడు అంతే'' అనే ముగ్ధ... ఎప్పుడూ చలించని ముగ్ధ... ఇప్పుడిలా...

'' మా ముగ్ధకు ఓకే అయితే నాకు ఓకే'' అంది ముగ్ధవైపు చూసి.

కార్తికేయ చేతిని మరింత గట్టిగా పట్టుకుంది.

''తను రాయని రాతను... ముగ్ధ నుదుట కార్తికేయ ఆభిలిఖించిన ఆర్తి గీత.

భగవద్గీతలో అన్నట్టు లలాట లిఖితం. విధాత సంకల్పం''.

⁘⁘

ముగ్ధ, కార్తికేయ బయల్దేరాడు. హేమంత డిశ్చార్జి అయి ఇంటికి వెళ్ళింది. కార్తికేయ డ్రైవ్ చేస్తున్నాడు. మౌనంగా వున్నా ఆ మౌనంలో ఎన్నో కబుర్లు ఆమె గొంతులో సేదతీరుతున్నాయి.

ఇంటికి వచ్చాక కార్తికేయ ముగ్ధను అడిగాడు. ''కాఫీ చేయగలరా?

ఆ మాత్రానికే చెంగున లేడి పిల్లలా కిచెన్‌లోకి పరుగెత్తింది. అయిదు నిమిషాల్లో పొగలు కక్కే కాఫీతో వచ్చింది. కాఫీ తాగేక చెప్పాడు కార్తికేయ ''నేను ఆఫీసు వరకు వెళ్లి వస్తాను వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. లంచ్ ఆర్డర్ చేస్తాను. ఇంటికి వస్తుంది''

''పర్లేదు మీరు వచ్చాకే చేస్తాను. ఆకలి లేదు... ఫ్రిజ్‌లో వున్నా పళ్ళు తింటాను'' చెప్పింది ముగ్ధ.

⁘⁘

సి బి ఐ కార్యాలయం

రిసెప్షన్ దగ్గరికి రాగానే సులోచన ఎదురొచ్చింది. సి బి ఐ చీఫ్‌కు సెక్రటరీ, ఆమె అయిదడుగుల ఎనిమిది అంగుళాల పొడవు. పెదవులపై చెదరని చిరునవ్వు...

''గుడ్‌మార్నింగ్ సర్... మీ కోసం చీఫ్ వెయిట్ చేస్తున్నారు... ప్లీజ్'' అంటూ దారి చూపించింది.

''మీ పెళ్లి ప్రయత్నం ఎంత వరకు వచ్చింది? అడిగాడు కార్తికేయ.

''థాంక్ యు సర్... నేను గుర్తు వున్నందుకు... నా హైట్ నా పాలిట విలన్ అయింది... పెళ్లి చూపుల్లో మగవాళ్ళ ఈగోను సంతృప్తి పరచడానికి వంగి నడవాల్సి వస్తుంది. ఓ నవలలో చదివిన గుర్తు. దేవుడా... పొడవైన అమ్మాయిలకు, ఇంకా పొడవైన అబ్బాయిలను సృష్టించు. లేదా అబ్బాయిల హృదయాల్లో విశాలమైన మనసును సృష్టించు'' ఒక కన్నీటి చుక్కను కొన గోటితో తుడుచుకొని చెప్పింది.

ఈలోగా చీఫ్ క్యాబిన్ వచ్చింది. డోర్ తీసి కార్తికేయ లోపలి వెళ్ళగానే వెనక్కి వచ్చింది.

చీఫ్ క్యాబిన్ బయటి రెడ్‌లైట్ వెలుగుతుంది. ఎవరూ లోపలికి రావద్దని అర్ధంగా.

⁂

సి.బి. ఐ. కార్యాలయం ఎదురుగా వున్న బిల్డింగ్‌లో మూడో అంతస్తులో గ్లాస్ విండోస్ ఓపెన్ చేసి... బైనాక్యులర్స్‌ని అడ్జస్ట్ చేసింది మోహన. సరిగ్గా సి బి ఐ చీఫ్ క్యాబిన్‌కు ఎదురుగా వుంది ఆ ఫ్లాట్‌లోని బెడ్‌రూం. బైనాక్యులర్స్‌కి అది శక్తివంతమైన గన్ అమర్చబడి వుంది. అది ఏ క్షణమైనా నిప్పులు గక్కడానికి సిద్ధంగా వుంది.

⁂

కార్తికేయ గది సర్దుతున్న ముగ్ధకు ఏదో అనుమానం వచ్చింది. ఎవరో ఆ ఇంట్లోకి ప్రవేశించినట్టు...

⁂

# 12.

కార్తికేయ గది చూస్తోంటే...అది తన మదిని మాయచేసి కట్టిన ప్రకృతి ఒడిలా వుంది. మొదటిసారి పరిశీలనగా చూసింది. మగవాళ్ళ గదులు... అందులో బ్రహ్మచారుల గదులు ''సిగరెట్ పీకలతో... మందు బాటిల్స్‌తో, మగువల అర్ధనగ్న చిత్రాలతో.. చిందర, వందరగా ఉంటాయని అనుకుంది. కానీ కార్తికేయ గది ప్రకృతిని ఇటుకలుగా పేర్చి, ప్రశాంతతను గది గోడలకు రంగులుగా వేసి, అద్దాలను ప్రతీ అంగుళంలో బిగించినట్టు, అద్దంలా మెరిసేట్టు... మంచులో తడిసిన అమ్మాయి సౌందర్యంలా ఎంత బావుందో....

కార్తికేయ భావుకత్వానికి నగిశీలు చెక్కినట్టు....

ఓ పక్కన రంగులద్దిన వర్ణచిత్రం... కింద కార్తికేయ అన్న సంతకం. షాకైంది. కార్తి కేయ చిత్రకారుడా?

అతని జ్ఞాపకాల అరని కదిలిస్తే ఆ దొంతరలో వుండే భావోద్వేగాలు ఎన్నో... ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చింది. తనెంత అమాయకంగా ప్రవర్తించింది? తన అమా

యకత్వాన్ని ఎంత ఇష్టంగా భరించాడు. ఓ మూలన ఉదయం ఉక్రోషంతో విసిరేసిన చీర వుంది. ఆ చీరను చేతుల్లోకి తీసుకుంది. గుండెలకు ఆన్చుకుంది. టేబుల్ మీద కార్తికేయ ఫోటో... తననే చూస్తున్నట్టు... ఆ ఫోటోను తన చీర కొంగుతో తుడిచింది. ఫోటో టేబుల్ మీద పెట్టి... గది సర్దుతుంటే ఏదో అనుమానం... ఇంట్లోకి ఎవరో ప్రవేశించినట్టు.

⁘⁘

కార్తికేయ లోపలికి రాగానే సి బి ఐ చీఫ్ సుందరరామమూర్తి లేచి ఎదురొచ్చాడు.

''కమాన్ మై సన్... ఎలా వున్నావ్ కార్తి? ఆప్యాయంగా అడిగాడు.

''మీరెలా వున్నారు నాన్నా? అడిగి కిందికి వంగి చీఫ్ పాదాలకు నమస్కారం చేసాడు.

కార్తికేయను కార్తి అని ప్రేమతో పిలుస్తాడు చీఫ్.

గాడ్ బ్లెస్ యు... అని కార్తికేయను గుండెలకు హత్తుకున్నాడు. కార్తికేయ అంటే ప్రాణం చీఫ్‌కు... ఎందుకంటే తన ప్రాణాలే కాదు... దేశాన్నీ కాపాడాడు. తను చేసిన సాహ సాన్ని ఎవరికీ తెలియనివ్వకుండా తన దగ్గర మాట తీసుకున్నాడు.

తన చేతిలో వున్న వాకింగ్ స్టిక్‌ని మూలకు గిరాటు వేసాడు. ''నువ్వు వచ్చేక ఈ కర్ర తోడు అక్కర్లేదు'' అన్నాడు.

''నాన్న... మీరే మాత్రం మారలేదు'' మనస్ఫూర్తిగా అన్నాడు కార్తికేయ.

పంచభూతాలు మారాయా? నా కార్తి మారాడా? నేనెందుకు మారాలి... నవ్వి ''కాఫీ తీసుకుంటావా? లేదా ఏదైనా జ్యూస్? అని ఇంటర్ కం నొక్కి ''రెండు జ్యూస్'' చెప్పాడు.

⁘⁘

''కార్తీ. ఇది నువ్వు కాపాడిన ప్రాణం''

''నాన్నగారు ఇప్పుడు ఇదంతా ఎందుకు? మొహమాటంగా అన్నాడు కార్తికేయ.

''లేదు కార్తీ... నీ గురించి తెలియాలి... ఆ రోజు నువ్వు చేసిన సాహసం ప్రపంచానికి తెలియాలి.

'' ఓ సారి టేబుల్ మీద వున్న భారతదేశ పటానికి తగిలించిన మెడల్ వంక చూసాడు.

సరిహద్దుల్లో దొంగతనంగా చొరబడిన పొరుగుదేశం ఉగ్రవాదుల ఆచూకి పసిగట్ట డానికి వెళ్ళిన సి బి ఐ చీఫ్‌ని చుట్టుముట్టారు.

తన దగ్గర వున్న శాటిలైట్ ఫోన్ ద్వారా ఎమర్జెన్సీ మెసేజ్ పంపించాడు. ఆ మెసేజ్ పొరపాటున కార్తికేయకు చేరింది. తనకు సంబంధంలేని విషయం అనుకోలేదు... ఎవరికో ఇన్ఫర్మేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవాలని అనుకోలేదు. ఆఘమేఘాల మీద సరిహద్దులకు చేరుకున్నాడు. వన్‌మేన్ ఆర్మీగా మారాడు.

సింహంలా గర్జించాడు... పులిలా కదిలాడు... మెరుపై విస్ఫులింగాల అగ్ని కణాలు శత్రువుల శరీరాలను తూట్లుగా మార్చింది. కరుడుగట్టిన సిక్వీ అనే తీవ్రవాది సి బి ఐ తలకు

తల్వార్ గురిపెట్టాడు. ఏమాత్రం తొందరపడ్డా పదును తేలిన తల్వార్ చీఫ్ తలను మొండెంను వేరు చేస్తుంది.

గాలిని చీల్చుకుంటూ సిక్వీని చేరి తల్వార్ చివరన ఒడిసిపట్టుకున్నాడు. రక్తం ఏరు లైంది. అయినా తల్వార్ వదలలతే... వదిలితే చీఫ్ తల నేల రాలుతుంది.

కార్తికేయ పట్టు ముందు... పట్టుదల ముందు తల్వార్ తల వంచింది. అదే తల్వా ర్‌తో సిక్వీ కుడి చేతిని నరికాడు.

''మా దేశాన్ని కన్నెత్తి చూసిన కత్తి దూసినా, పట్టుకోవడానికి చేయి ఉండదని ఉగ్రవా దులతో చెప్పు'' అంటూ తరిమేసాడు.

:::::

ఎందుకింత సాహసం చేసావ్? నీకు సంబంధం లేని విషయంలో నీ ప్రాణాలను ఎందుకు ఫణంగా పెట్టావ్?

చీఫ్ అడిగిన ప్రశ్నకు కార్తికేయ చెప్పిన సమాధానం.

'' ఎందరో... ఎన్నో త్యాగాలు చేసి తెచ్చుకునన్న స్వాతంత్ర్యం... మీలాంటి వాళ్ళ ప్రాణాలు ఫణంగా పెట్టి ఈ వయసులో సరిహద్దుల్లో పోరాడుతున్నారు. మీ ప్రాణాలు మాకు అమూల్యం''.

ప్రభుత్వానికి తను చేసిన సాహసం చెప్పనివ్వలేదు. కార్తికేయకు దక్కవలసిన మెడల్ తనకు దక్కింది. అదే విషయం కార్తికేయ దగ్గర ప్రస్తావిస్తే...

''నాకు మెడల్ వద్దు... మిమ్మల్ని నాన్న అని పిలిచే అవకాశం ఇవ్వండి'' అన్నాడు.

'' ఇది నేను నీకు ఇచ్చే అవకాశం కాదు... ఆ దేవుడు నాకు ఇచ్చిన వరం'' అన్నాడు చీఫ్.

ఆరోజు నుంచి వాళ్ళు తండ్రి కొడుకులు.

:::::

జ్యూస్ తాగుతూనే ఐ ఫోన్ ఓపెన్ చేసాడు. ఇంట్లో వున్న రహస్య కెమెరాల్లో అక్కడి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఓ అపరిచిత వ్యక్తి తన ఇంట్లోకి ప్రవేశించాడు. మొహం క్లియర్‌గా కనిపించడంలేదు.

ఆ అపరిచితుడు ఇంటి వెనుక నుండి తన బెడ్‌రూంలోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తు న్నాడు.

అతను...

:::::

యాసిక్ కార్తికేయ బెడ్‌రూం వైపు అడుగులు వేస్తున్నాడు. ఉదయం నుంచి కాపుకా సాడు. కార్తికేయ వుండగా ఆ ఇంట్లోకి వెళ్లడం అసాధ్యం. తను కార్తికేయను ఏమీ చేయలేడు. అతని దగ్గర ఆశ్రయం పొందుతున్న అమ్మాయిని ఏమైనా చేస్తే అది కార్తికేయను దెబ్బతీసి

నట్టే...

⁂⁂

''నాన్నగారు విత్ యువర్ పర్మిషన్ మన ఇంటికి దగ్గరలో మీకు తెలిసిన డిటెక్టివ్ ఎవ రైనా వున్నారా?

చీఫ్‌కి కొంత అర్థమైంది. అవసరమైతే తప్ప ఎవరి సాయమూ తీసుకోడు. కార్తికేయ ఇల్లు ఎక్కడుందో తెలుసు. వెంటనే ఆ ఏరియాకు దగ్గరలో వున్న డిటెక్టివ్ ఏజెన్సీకి ఫోన్ చేసాడు. కార్తికేయ ఐ ఫోన్‌లో గమనిస్తూనే వున్నాడు.

''మిస్టర్ శ్యాంసన్ నేను చీఫ్‌ని''

''చెప్పండి సర్'' వృత్తిపరమైన అనుభవం. అందుకే ఎలాంటి ప్రశ్నలూ వేయలేదు.

''జస్ట్ వన్ సెకన్... ఫోన్ మా అబ్బాయికి ఇస్తున్నాను. ఆ ఇన్‌స్ట్రక్షన్ ఫాలో అవండి'' అంటూ ఫోన్ కార్తికేయకు ఇచ్చాడు.

''మిస్టర్ శ్యాంసన్ నేను చెప్పిన అడ్రెస్‌కు ఎన్ని నిముషాల్లో వెళ్ళగలరు? అంటూ తన అడ్రెస్ చెప్పాడు.

వెంటనే చెప్పాడు అతను... పదినిమిషాల్లో.

'' ఒకే అంతకన్నా ముందు వెళ్ళడానికి ట్రై చేయండి. సేఫ్ సైడ్ అంబులెన్స్‌కి ఫోన్ చేయండి. క్విక్... అంటూ అక్కడికి వెళ్ళి ఏం చేయాలో చెప్పాడు.

మరో ఫోన్‌కాల్ చేసాడు... ముగ్ధకు...

⁂⁂

హాల్‌లో ల్యాండ్‌ఫోన్ రింగ్ అవుతుంది. ముగ్ధలో సంశయం. తను తీయాలా? వద్దా?

ఫోన్ కట్ అయింది... మళ్ళీ రింగ్ అవుతుంది... ఏం చేయాలి? తెస్తే?

యాసిక్ హాల్ వైపు వచ్చాడు... ముగ్ధ హాలులోకి వస్తే అతని పని సులువు అవుతుంది.

కార్తికేయలో టెన్షన్... ముగ్ధ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడాన్ని అతను అర్థం చేసుకోగ లడు. కానీ ఇప్పుడు ముగ్ధ తలుపు తీస్తే?

డోర్‌బెల్ శబ్దం... ఒక్క క్షణం ముగ్ధ ఎలర్ట్ అయింది. కార్తికేయ వచ్చి వుంటాడు. ఫోన్ రింగ్ అవుతూనే వుంది? ఫోన్ లిఫ్ట్ చేయాలా? ఎటూ కార్తికేయ వచ్చాడుగా... ఆ వచ్చింది కార్తికేయ అని ఆమె అనుకుంటుంది...

యాసిక్ మరోసారి డోర్ బెల్ ప్రెస్ చేసి డోర్ పక్కకు వచ్చాడు. అతని చేతిలో యాసిడ్ బాటిల్ రెడీగా వుంది. ఇదంతా ఐ ఫోన్‌లో చూస్తూనే వున్నాడు... శ్యాంసన్ కార్తికేయ ఇంటికి అతి దగ్గరలో వున్నాడు. ఈ సారి డోర్ బెల్ నాన్‌స్టాప్‌గా వినిపిస్తుంది. ముగ్ధడోర్ తీయడానికి వెళ్ళింది. మరో రెండు నిమిషాల్లో శ్యాంసన్ అక్కడికి చేరుకుంటాడు. లాంగ్ వ్యూలో శ్యాంసన్ కారు కనిపిస్తుంది.

కానీ ఒక నిముషం... ముప్పయి సెకన్లు... పది సెకన్లు... డోర్ బోల్ట్‌మీద ముగ్ధ చేయి పడింది...

కార్తికేయ మెదడు కంప్యూటర్‌కన్నా వేగంగా మెగాబైట్లు.. గిగాబైట్లు... దాటింది.

బోల్డ్ తీసే చివరి క్షణంలో కార్తికేయ చేతివేలు చురుగ్గా కదిలింది... ఐ ఫోన్ మీద...

# 13.

ఆ క్షణం మరణమృదంగం మొదలవుతుందా? యాసిక్ పెదవుల మీద వికృతానందం. ముగ్ధ బోల్డ్ మీద చేయివేయగానే క్లిక్ అన్న సౌండ్ వినిపించింది. డోర్ ఆటోమేటిక్ లాక్ అయింది. ముగ్ధ తలుపు తెరవడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. అప్పుడే శ్యాంసన్ వెహికల్ ఆ ప్రాంగణంలోకి వచ్చింది. వస్తూనే కిందికి దూకాడు. యాసిక్‌కు సీన్ అర్థమైంది. ముందుకు పరుగెత్తాడు. క్షణాల్లో ఎస్కేప్ అయ్యాడు.

కార్తికేయ లాక్ రిలీజ్ చేసి శ్యాంసన్‌కు ఫోన్ చేసి ముగ్ధకు ఫోన్ ఇవ్వమన్నాడు. జరిగిందేమీ చెప్పకుండా శ్యాంసన్ తన ఫ్రెండ్ అని, తనకోసం వచ్చాడని, తను మరో గంటలో వస్తానని చెప్పాడు.

''కార్తీ ఏమైనా ఏనీ ప్రాబ్లం? అడిగాడు చీఫ్.

క్లుప్తంగా చెప్పాడు కార్తికేయ.

పోనీ ఆ ఏరియా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పనా?

''వద్దు నాన్నగారు... చెప్పండి నాన్న ఏమిటి విషయం?

చీఫ్ ఓ ఫైల్ ఇచ్చాడు. అందులో మోహనకు సంబంధించిన డిటెయిల్స్ వున్నాయి.

''కార్తీ... మోహన ఇక్కడికి రావడం వెనుక ఏదో వుంది. బహుశా ఇక్కడ విధ్వంసం సృష్టించడానికి వచ్చి వుంటుంది. ఈ కేసు నువ్వే డీల్ చేయాలి. నువ్వు మాత్రమే అందుకు సమర్థుడివి.''

''మోహన ఇప్పుడెక్కడ వుందో ట్రేస్ చేసారా? అడిగాడు కార్తికేయ.

''ట్రై చేసాం... ఇంకా ట్రేస్ అవ్వలేదు. కాకపోతే ఈ రోజు ఓ క్యాబ్ డ్రైవర్ హత్య జరిగింది. ఆతను ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తున్నాడు. అతని క్యాబ్‌లో వచ్చింది ఎవరో తెలియడయం లేదు. అతి శక్తివంతమైన పాయిజన్ వల్ల చనిపోయాడు. అతని క్యాబ్‌లో యాభై ఏళ్ళ మహిళ ఎక్కిందని ఎయిర్‌పోర్టులో వున్నా ఓ క్యాబ్ డ్రైవర్ చెప్పాడు.''

'' ఓకే నాన్నగారు నేను చూసుకుంటాను'' అంటూ లేచాడు. చీఫ్ లేచి ''కార్తీ ఓ సారి ఇంటికి రాకూడదూ... అమ్మ కూడా అడిగింది. ముగ్గురు కొడుకులు వున్నా అమ్మలో ఒంటరితనం. కొడుకులంతా విదేశాల్లో...

వెబ్‌కామ్‌లో చూసి ఆనందం పడవలిసిందే''... నిట్టూరుస్తూ చెప్పాడు.

''తప్పకుండా అమ్మను కలుస్తాను. అమ్మను నేను అడిగానని చెప్పండి'' అని బయటకు నడిచాడు.

రిసెప్షన్‌లో సులోచన కనిపించింది.

'' ఈ సారి వచ్చినప్పుడు మీరు మొసెస్ సులోచనగా కనిపించాలి'' నవ్వి చెప్పాడు సులోచనతో.

బదులుగా నవ్వి ''వెయిట్‌తో పాటు హైట్ కూడా తగ్గించే క్లినిక్స్ వుంటే బావుండేది.

''తనకన్నా పొడవువున్న అమ్మాయిలు భార్యగా పనికిరారనే ఆలోచన. ఈగో పోతే మీ కోరిక నెరవేరుతుంది'' చెప్పింది.

సులోచన ఎత్తు ఆమె పెళ్ళికి ప్రతిబంధకంగా మారింది. తమ కన్నా లావుగా వున్నా పర్లేదు కానీ అమ్మాయి ఎత్తుగా వుంటే పెళ్లి కొడుకుల్లో కాంప్లెక్స్. ఎప్పటికైనా తన బాధను అర్ధం చేసుకునే మగవాడు తన జీవితంలోకి ప్రవేశిస్తాడని నమ్ముతూ వచ్చిన సులోచనలో ఆ నమ్మకం సన్నగిల్లిపోతుంది.

:::::

కార్తికేయ శ్యాంసన్‌కు ఫోన్ చేసాడు. తర్వాత మరో ఇద్దరికీ ఫోన్ చేసాడు. సరిగ్గా పావుగంట తర్వాత అతని కారు టెర్మినల్ దగ్గర ఆగింది.

ఓ వ్యక్తి వచ్చి ఓ బాటిల్ అందించి వెళ్ళాడు. చేతులకు గ్లౌస్ వేసుకున్నాడు. కారు దిగి ఎడమవైపు సందులోకి వెళ్ళాడు.

:::::

ఆ ఏరియాలోకి రావడానికి మామూలువాళ్ళు ధైర్యం చేయరు. చిన్న చిన్న గల్లీలు. అక్కడక్కడ అనుమానంగా చూసే శాల్తీలు.

వాళ్ళకు ఏ మాత్రం అనుమానం వచ్చినా నిర్దాక్షిణ్యంగా చంపిస్తారు. నేరస్తులకు అడ్డా... మరో పక్క వ్యభిచారం జరుగుతుంది.

కరెక్ట్‌గా చెప్పాలంటే అమ్మాయిలను కిడ్నాప్ చేసి ఇక్కడ వాళ్ళతో బిజినెస్ చేస్తారు.

ఆ సందులో వున్నా చివరి ఇంట్లో వున్నాడు యా...సి...క్ అమ్మాయిల పెదవుల మీద ప్లాస్టిక్ పువ్వుల నవ్వులు... శరీరంలో కష్టానికి గురిచేసి సుఖవ్యాధులు, ఎక్కడెక్కడో నుంచో ఇక్కడికి తీసుకురాబడ్డ ఆడబిడ్డలు...

'' ఏయ్ చమేలీ ఇలా రావే... ఓ అమ్మాయినిలాగి ఆమె బుగ్గను పళ్ళతో గట్టిగా కొరికాడు.

ఆ అమ్మాయి బాధగా కేక వేసింది. ఆ బాధను అనుచుకునే ప్రయత్నం చేస్తూ రెండు చేతులు జోడించి

''మీ ఇష్టం వున్నట్టు చేసుకోండి. డబ్బులు ఇవ్వండి. నా బిడ్డను హాస్పిటల్‌లో చూపించాలి'' అని వేడుకుంది.

''నా దగ్గర యాసిడ్ వుంది... తీసుకో... తీసుకో అంటూ యాసిడ్ బాటిల్ తీసి ఆమె మొహమ్మీద పెట్టాడు.

భయంతో ఓ అడుగు వెనక్కి వేసింది. అక్కడ వున్న దాదాపు నలభై మంది మహిళల దీనగాథ. పదిహేనేళ్ళ అమ్మాయిల నుంచి వున్నారు. డబ్బు ఇవ్వకుండా అతి వికృతంగా తన పైశాచిక వాంఛ తీర్చుకుంటాడు.

నిస్సహాయంగా నేలమీద పడుకుంది.

''దేవుడా మాకీ కష్టాలు ఎందుకు... నువ్వే పుట్టించావు... నువ్వే ఇలాంటి శాపాలు ఎందుకిస్తున్నావ్? మళ్ళీ జన్మంటూ వుంటే మమ్మల్ని జంతువులుగా పుట్టించు. అప్పుడు ఏ మగ కామ జంతువూ మా జోలికి రాదు...''

కన్నీటితో వేడుకుంది... ఈ బాధల నుంచి విముక్తి కలిగించడానికి భువిమీదికి రమ్మని వేడుకుంది. యాసిక్ యాసిడ్ బాటిల్‌తో పైశాచిక వంచతో ఆమె మీదికి వంగాడు. కళ్ళు మూసుకుంది. అతను సెక్స్‌లో చూపించే నరకం తల్చుకుని వణికిపోతూ దేవుడా నిన్ను పిలిస్తే దెయ్యాన్ని పంపించావా... అనుకుంది.

కానీ యాసిక్ వెనుక అగ్రమోదగ్ర, మహోగ్ర రూపంతో వున్న కార్తికేయను గమనించలేదు.

అప్పటికే కార్తికేయ సూచన మేరకు టీవీ చానెల్స్ ఆ ఏరియాను చుట్టుముట్టేసాయి. కార్తికేయ చేయి వేగంగా కదిలింది. మూడు నెలలలో ఆపరేషన్ పూర్తికాబోతుంది.

ఓబి వ్యాన్లు రెడీగా వున్నాయి. అక్కడి దృశ్యాలు లైవ్‌లో రాబోతున్నాయి.

అప్పుడే ముగ్ధ టీవీ ఆన్ చేసింది. టీవీ చానెల్స్ తిప్పుతూ సడెన్‌గా ఆగింది.

టీవీలో ఓ దృశ్యం... ఆ దృశ్యంలో కార్తికేయ.

⁂

# 14.

అప్పటి వరకూ దేవుడ్ని తలుచుకుని పళ్ళ బిగువున బాధను అనుభవించిన ఆ అమ్మాయి విప్పారిత నేత్రాలతో చూస్తోంది.

ఆదిశక్తి రూపంలో సాక్షాత్తు ఆ దేవుడి వేన వేల బాహువులతో. విశ్వరూపుడై దుష్ట శిక్షణకై కదిలి వచ్చినట్టు అనిపించింది.

కార్తికేయ చేతిలోని యాసిడ్ బాటిల్ యాసిక్ మొహమ్మీద పడింది. నిప్పుల వర్షం కురిసినట్టు పెద్ద గావుకేక... చావుకేక అతని గొంతులో నుంచి బయటకు వచ్చింది.

'' ఇది ఇండియన్ పీనల్‌కోడ్‌లో లేని శిక్ష... ఎవిడెన్స్ ఆక్ట్... సాక్ష్యాలు... వాయిదాలు లేని శిక్ష. ఇది ఒక హెచ్చరిక.

యాసిక్ అరుస్తున్నాడు... మొదటిసారి అతనిలో ప్రాణభయం. కార్తికేయ ఆ అమ్మాయి వైపు తిరిగి ''మిమ్మల్ని ఈ స్థితికి తెచ్చిన వాళ్ళ మీద మీకు కోపం లేదా? అడిగాడు.

''వుంది... వాళ్ళ ( ఎడిట్) ఏడుస్తూ చెప్పింది.

''నీ లాంటి వాళ్ళు ఇక్కడ ఎంత మంది వున్నారు? అడిగాడు కార్తికేయ.

''నలభై మందికిపైగా వున్నారు'' చెప్పింది.

''బయట వంద యాసిడ్ బాటిల్స్ వున్నాయి... అవి తీసుకోండి... మిమ్మల్ని ఈ స్థితికి తెచ్చిన వారి మీద యాసిడ్ గుమ్మరించేయండి'' చెప్పాడు కార్తికేయ.

బయట యాసిడ్ బాటిల్స్‌తో సిద్ధంగా వున్నాడు శ్యాంసన్. క్షణాల్లో ఆ ప్రాంతం నైసర్గిక స్వరూపం సమూలంగా మారిపోయింది. ఇన్నాళ్ళ వాళ్ళ కసి... కన్నీళ్లు.. భయం... బాధ..

అన్నీ యాసిడ్ రూపంలో బయటకు వచ్చాయి. ఆ ఏరియాలో కాపుకాస్తో తమని చిత్రవధ చేసిన గూండాలను యాసిడ్‌తో కడిగిపారేశారు. స్త్రీ శక్తిస్వరూపాన్ని చూపించారు.

ఆ ప్రాంతమంతా హాహాకారాలు. అప్పటి వరకు తమకు పట్టినట్టు... తమకు మామూళ్ళు ఇస్తే చాలు అన్నట్టు ఆ ఏరియావైపుకన్నెత్తిచూడని పోలీసులు పరుగెత్తుకొచ్చారు.

టీవీ ఛానెల్స్ లైవ్ మొదలు పెట్టాయి. బలవంతంగా ఈ వృత్తిలోకి నెట్టబడ్డ మహిళలు కార్తికేయ పాదాల మీద పడిపోయారు.

'' ఈ రోజు నుంచి మీరు స్వేచ్ఛాజీవులు మీ మీ ఇళ్ళకు వెళ్ళండి. ఒక వేళ మీకు అక్కడ నిరాదరణ ఎదురైతే మీకు అండగా ఓ సోదరుడిగా నేను వున్నాను.''

⁂

ఆ ఏరియా ఇన్స్పెక్టర్ వచ్చాడు.. వస్తూనే నానా హంగామా చేసాడు. గుండాలు, రౌడీలు హాహాకారాలు చేస్తూనే వున్నారు. అంబులెన్స్ వచ్చింది. '' ఏం జరుగుతుందిక్కడ? లా అండ్ ఆర్డర్‌ని చేతిలోకి తీసుకుంది ఎవరు? రెచ్చగొడుతూ యాసిడ్‌దాడి చేయమన్నది ఎవరు?

తన దర్పాన్ని చూపిస్తూ అడిగాడు.

''నేనే'' అంటూ ముందుకు వచ్చాడు తాపీగా కార్తికేయ. జనాన్ని రెచ్చగొట్టి ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టిస్తావా? కోపంగా అని కార్తికేయ చేయి పట్టుకుని ''స్టేషన్''కు నడువ్ అన్నాడు. అప్పటి వరకు తమకీ దుస్థితి కలిగించిన గుండాల మీదా యాసిడ్‌దాడి చేసిన అమ్మాయిలు దండులా కదిలారు... కార్తికేయను అరెస్ట్‌చేస్తే వూర్కోమన్నారు. కార్తికేయ వాళ్ళను సమాధానపరిచాడు...

''చట్టాన్ని తన పని తానూ చేసుకోనివ్వండి'' అంటూ పోలీస్ జీపువైపు నడిచాడు. యాసిక్ అతనితోపాటు ఆ ఏరియాలో వున్నా గూండాలను అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు.

ఆ ఏరియాని ప్రభుత్వం తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. అక్కడ మహిళా ఉపాధి కేంద్రం ప్రారంభంకాబోతుంది. నరకకూపంలోకి నెట్టబడ్డ మహిళలకు ఉపాధి కలుగుతుంది.

⁂

కార్తికేయ పోలీస్ స్టేషన్‌కు వెళ్తోన్న దృశ్యంచూసి షాక్ అయింది ముగ్ధ. తను చూస్తున్న ది నిజమేనా? కార్తికేయను పోలీసులు పట్టుకు వెళ్ళడం ఏమిటి?

ఆమె మనసులో ఆందోళన... ఇప్పుడు తనేం చేయాలి. పోలీసులు కార్తికేయను కొడ తారా? ఆమె చిన్ని ప్రపంచంలో చూసిన సినిమాలు... పేపర్‌లలో వచ్చే వార్తలు... భయాందో ళనకు గురిచేసాయి.

''అయ్యో దేవుడా... కార్తికేయలాంటి మంచి మనిషికి ఇన్ని కష్టాలు పెడతావా? తనకి ఏమీ కాకుండా చూడు స్వామీ'' మనసులోనే దేవుడికి మొక్కుకుంది.

అమాయకత్వం, మనుష్యులను ప్రేమించడం స్వచ్ఛంగా బ్రతకడమే తెలిసిన అమ్మాయి.

తనను ఎలాగైనా కాపాడుకోవాలి. తన స్నేహితురాలికి చెబితే... ఊహూ... కార్తికేయ పోలీస్ స్టేషన్‌లో ఉన్నదంటే తన గురించి మరోలా అనుకోవచ్చు.

తనే వెళ్తే సరి. పోలీసులకు డబ్బులిస్తే వదిలేస్తారని ఆమెకు పత్రికలు చదివిన జ్ఞానం. తన పర్స్‌లో వున్నా డబ్బులు తీసుకుంది.

ఇవి కూడా సరిపోకపోతే? వెంటనే చెవులకు నాన్న ప్రేమగా చేయించిన జూకాలు తీసేసింది.

అదీ సరిపోకపోతే మెడలో సన్నటి చెయిన్ వుంది. అన్నే ఇచ్చి కార్తికేయను కాపాడు కోవాలి. పోలీస్ స్టేషన్‌కు బయల్దేరింది.

* * *

సరిగా గంట తర్వాత ముగ్ధ పోలీస్‌స్టేషన్‌లో వుంది. అడ్రెస్ కనుక్కుని వచ్చేసరికి ఆ టైం అయింది.

'' ఏం కావాలి? తన ఎదురుగా వున్నా ముగ్ధను అడిగాడు ఇన్స్పెక్టర్.

''మీరు ఇందాక అరెస్ట్ చేసారే... వారిని విడిచిపెట్టాలి''

'' ఎవరు? ఇన్స్‌పెక్టర్ అడిగాడు. ఇంత రాత్రివేళ ఓ అమ్మాయి వచ్చి ఇలా అడిగేస రికి...?

''కా...కార్తికేయ.. చాలా మంచివారు... ప్లీజ్ అతన్ని వదిలేయండి'' రెండు చేతులు జోడించింది.

కార్తికేయ అన్న పేరు వినగానే ఇన్స్‌పెక్టర్ లోపలికి పరుగెత్తాడు. రెండు నిమిషాల తర్వాత వచ్చాడు.

''ప్లీజ్ ఇన్‌స్పెక్టర్ గారు... వారిని వదిలేయండి.

''బ్రతిమిలడుతూనే వుంది. ఇదిగోండి డబ్బు... నా చెవి జూకాలు, చెయిన్... అంటూ అతని ముందు పెట్టింది. అప్పుడే ఆమె వెనుక అలికిడి. తలతిప్పి చూసింది. అలిసిపోయిన మొహంతోకార్తికేయ పరుగెత్తుకు వెళ్ళింది. అతడ్ని గట్టిగా పట్టుకుంది.

మీకు మీకేమీ కాలేదుగా... ఇన్‌స్పెక్టర్‌గారికి చెప్పాను... డబ్బు. నా చెవి జూకాలు,

మెడలో చెయిన్ కూడా ఇచ్చేశాను... నాకు నాకెంత భయమేసిందో తెలుసా... వీళ్ళు మిమ్మల్ని ఏమీ చేయలేదు. కదా...'' చెబతూ, ఏడుస్తూ, సంతోషం, బాధ, దుఖం...

కార్తికేయకు మాటాలు రావడం లేదు. వారధి కడుతుంటే ఉడత సాయం గుర్తొచ్చింది. తన కోసం తెలియని ఢిల్లీలో పడ్డ పాట్లు.

ఇంకా తనెంత తపించిపోయిందో చెబుతూనే వుంది. తన ఒంటిని తడిమింది. పోలీసులు చేయిచేసుకున్నారేమో...నని.

ఇన్స్పెక్టర్ కళ్ళూ చెమర్చాయి. టేబుల్‌మీద ముగ్ధ పెట్టిన డబ్బు, జూకాలు, చెయిన్ తీసుకువచ్చి ముగ్ధచేతిలో పెట్టాడు. స్టిఫ్‌గా నిలబడి కార్తికేయకు సెల్యూట్ చేసాడు.

''అయాం సారీ సర్'' అన్నాడు.

కార్తికేయ ముగ్ధ చేయి పట్టుకుని బయటకు నడిచాడు.

ఇంటికి వచ్చారు ఇంకా ట్రాన్స్‌లోనే వుంది ముగ్ధ. తను భయపడింది. కానీ పోలీస్ స్టేషన్‌లో కార్తికేయకు సెల్యూట్... ఆ విశ్వరూపాన్ని చిట్టెలుకలా తను కాపాడాలని వెళ్ళిందా?

''సారీ పిచ్చిదాన్ని... మిమ్మల్ని తక్కువగా అనుకును. అపోహపడి భయపడి... పిచ్చి దానిలా... ఆమె మాటలు పూర్తి కాకుండానే... ఆమెను మంచం మీద కూచోబెట్టడు. తను నేల నీడ కూచోని ఆమె ఒడిలో తలపెట్టాడు...

అతనికిప్పుడు ఏడ్వాలనిపిస్తుంది. ఓ చిన్నిప్రాణం విల విల్లా డి పోవడం చూసాడు. అదీ తనలాంటి ఓ అనాథకోసం రెండు చేతులతో ఆమె నడుంని చుట్టేసాడు.

ముగ్ధ చేతులు కార్తికేయ తల మీద వున్నాయి.

# 15.

''మౌనం ఎంతందంగా వుంటుంది. స్పర్శ ఎంత గొప్పగా వుంటుంది. మండువేసవిలో మంచు గదిలో విశ్రమిస్తున్నట్టు వుంది.. బీడు భూమిలో కుంభవృష్టిగా వర్షం కురిసినట్టు.. ఓదార్పు మేఘం తన మదిచుట్టూ పరిభ్రమిస్తున్నట్టు...''

కాలంతో పని చేలు... ఒంటరితనం జాడ లేదు... వేదనల ఊసులేదు''

''రామాలాలీ మేఘశ్యామా లాలీ... వటపత్రశాయికి వరహాలలాలీ'' చిన్నప్పుడెప్పుడో అమ్మ లీలగా పాడి తనని నిద్రపుచ్చిన జ్ఞాపకం. ఇప్పుడు కార్తికేయను నిద్రపుచ్చాలని కాదు... కాదు అతని అలసటను తరిమేయాలని ప్రయత్నిస్తోంది ముగ్ధ. చిత్రంగా తను పెళ్ళి కాని అమ్మాయి అని గుర్తుకు రాలేదో... తన వాడే కదా... పెళ్లి అయితేనే తనవాడా? తాళి కడితేనే మనువాడినట్టా? అన్న భావమో... ఆమె లేత పొట్టమీద కార్తికేయ పెదాలు విశ్రమిస్తున్నాయి. ఎంత గొప్ప భద్రతా భావం?

ముగ్ధ తన కోసం ఎంతగా తాపత్రయపడింది. తనను కాపాడుకోవాలన్న ఆ ఫీలింగ్

గొప్పగా వుంది. అతనిలోని ఆ భావాలను అతని పెదవులు కమ్యూనికేట్ చేస్తున్నాయి. అసలు జరిగింది వేరు. ఇన్స్పెక్టర్ తనని అరెస్ట్ చేయడం... తను ఆడిన నాటకమే... కొద్దిగంటలు వెనక్కి వెళ్తే అసలు ఏం జరిగిందో తెలుసుకోవచ్చు.

కార్తికేయను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ... అప్పుడు... జరిగిం దేమిటి?

⁂

పోలీస్ స్టేషన్

కార్తికేయ లోపలికి అడుగుపెట్టగానే సెంట్రీ డ్యూటీ చేస్తోన్న గార్డ్స్ పిలిచి మరో గంట వరకు ఎవ్వరినీ లోపలికి రానివ్వ వద్దని చెప్పాడు. కార్తికేయ దగ్గరికి వెళ్లి సెల్యూట్ చేసాడు.

సారీ సర్ అంత మంది ముందు మిమ్మల్ని... ఇంకా ఏదో అనబోతుండగా ''నో నో మిస్టర్ శ్రీ మీరు సిన్సియర్ పోలీస్ ఆఫీసర్... ఇంతకు ముందు వున్న వాళ్ళు డబ్బుకు ఆశప డ్డారు. గూండాలకు సాయపడ్డారు. పోలీసుల్లో మీలాంటి నిజాయితీ పరులు ఉంటారని నిరూపించారు. ఆ ఏరియాలో గత ఇరవై సంవత్సరాలుగా ఈ దారుణం జరగుతుంది. అది ప్రభుత్వం స్థలం... రాజకీయ నాయకులు, గూండాలు కలిసి చేసిన కుట్ర. ఎప్పుడైతే మీడియా దృష్టి ఫోకస్ అయిందో... రాజకీయ నాయకులు సైలెంట్ అవుతారు. ఇదే టైంలో అక్కడ అన్ని, ఆక్రమిత కట్టడాలను కూల్చేస్తే... సమస్య సగం సాల్వ్ అవుతుంది చెప్పాడు కార్తికేయ. ఎక్సలెంట్ సర్... ఎప్పుడూ ఎవరో ఒకరి ఒత్తిళ్లకు తలొగ్గుతూ వృత్తిపరమైన ఆనందాన్ని కోల్పోతున్నాం సర్. ప్రతీ ఒక్కరూ మమ్మల్ని వేలెత్తి చూపేవారు... మాకు వుండే ప్రెషర్స్... మీలాంటి వాళ్ళకే తెలుసు. నా నిజాయితీకి గుర్తింపుగా ప్రభుత్వం సస్పెన్షన్ ఇస్తే... మీరు తిరిగి నా పోస్టు ఓ విజయాన్ని ఇచ్చారు... సిన్సియర్‌గా చెప్పాడు శ్రీ.

'' ఒకే... ఇంతకీ యాసిక్ ఎక్కడ... అతడి కోసమే మనం ఇంత డ్రామా ఆడింది. వాడి ద్వారా నిజాలు కక్కించడానికి...'' చెప్పాడు కార్తికేయ.

''యస్ సర్. వాడి మొహం కొంత కాలిపోయింది. ఈ పరిస్థితుల్లో... వాడు...?

''మాట్లాడాలి శ్రీ... మనం మాట్లాడించాలి...'' అన్నాడు.

''అంబులెన్స్‌లోనే యాసిక్‌కు చికిత్స జరుగుతుంది. ఇంకాసేపట్లో అంబులెన్స్ వస్తుందని చెప్పాడు. సరిగా పది నిమిషాల్లో అంబులెన్స్ వచ్చింది. కార్తికేయ అంబులెన్స్ లోకి ఎక్కాడు. డాక్టర్స్ చికిత్స చేస్తున్నారు.

'' ఎలా వుంది డాక్టర్? ... ఓ డాక్టర్‌ని ఉద్దేశించి అడిగాడు కార్తికేయ.

''క్రిటికల్‌గానే వుంది... కాకపోతే యాసిడ్‌ని ఎక్కడ పోస్తే తీవ్రత తగ్గుతుందో అక్కడే ప్లాన్డ్‌గా పోశారు. లేకపోతే ఈ పాటికి మేజిస్ట్రేట్ రావాల్సి వచ్చేది'' డాక్టర్ చెప్పాడు.

''యస్... డాక్టర్... అని యాసిక్‌వైపు తిరిగాడు. మొహంలో విపరీతమైన పెయిన్. అంత బాధలోనూ తన మీద యాసిడ్ పోసి పలకరించడానికి వచ్చిన కార్తికేయ వంక భయంగా చూసాడు.

''హలో మిస్టర్ యాసిక్... ఎలా వున్నావ్? అంటూ కుడి చేతిలో వున్న యాసిడ్ బాటిల్ తీసి'' అన్నట్టు నువ్వు బాత్‌రూమ్స్ క్లీన్ చేయడానికి కాకుండా అమ్మాయిల మొహాలు కాల్చడానికి, జనాన్ని భయభ్రాంతులను చేయడానికి స్పెషల్ యాసిడ్ తయారు చేస్తావటగా... కుటీర పరిశ్రమ అన్న మాట...

వెరీగుడ్... నీకో విషయం తెలుసా... అంటూ తన చేతిలో వున్న యాసిడ్ బాటిల్ చూపిస్తూ... ఇది నీ తయారీనే... బోల్డు డబ్బులు పోసి కొన్నాను... ఈ యాసిడ్ పని చేస్తుందా? లేదా అన్నది చెక్ చేయాలిగా... అందుకే'' అంటూ యాసిడ్ బాటిల్ మూత తీసాడు. అదంతా చూస్తోన్న డాక్టర్ షాక్ అయ్యాడు. '' ఏమిటది? మీరేం చేస్తున్నారు? ట్రీట్ మెంట్ ఇప్పించేది మీరే... యాసిడ్ పోసేదీ మీరేనా?

సారీ... దీనికి నేను ఎంత మాత్రం ఒప్పుకోను'' సీరియస్‌గా చెప్పాడు.

''డాక్టర్ కపర్థి... లాస్ట్ ఇయర్ మీ అమ్మాయి ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తుండగా యాసిడ్ మొహం మీదపడి మీ అమ్మాయి మొహం కాలిపోయింది కదూ'' అడిగాడు కార్తి కేయ.

''అవును ఆ విషయం మీకెలా తెలుసు?

'' ఆ యాసిడ్ పోసింది ఓ రాజకీయ నాయకుడి కొడుకు. భయంతో మీరు ఆ నిజం దాచారు. ఆ యాసిడ్‌ను తయారు చేసి వాడితో కలిసి మీ అమ్మాయి మీద యాసిడ్‌దాడి చేసింది వీడే... వదిలేయమంరా? అడిగాడు కార్తికేయ.

'' ఆ డాక్టర్‌కి కాలిపోయిన కూతురు మొహం గుర్తొచ్చింది. కోపం తన్నుకు వచ్చింది''.

''చంపేయండి సార్... ఈ నా... ( ఓ బూతు మాట మాట్లాడి) కాల్చేయండి'' ఏడుస్తూ అన్నాడు.

కార్తికేయ ఆ డాక్టర్స్ బృందంవైపు చూసి ''ప్లీజ్ అయిదు నిమిషాలు వాన్ బయట వెయిట్ చేయండి...

అంతా కిందికి దిగారు. కార్తికేయ యాసిక్‌వైపు తిరిగి ''నేను అడిగే ఒకే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పు... తెలిసి చెప్పకపోయినా, తెలియక చెప్పకపోయినా నీ మొహం, నువ్వు తయారు చేసిన యాసిడ్‌లో కాలిపోతుంది. అంటూ యాసిడ్ బాటిల్ మూత తీసి పైకిలేపి అతని మొహానికి కాస్త ఎత్తులో పెట్టాడు.

'' ఏ.. ఏం చెప్పాలి? కార్తికేయ అన్నంత పని చేస్తాడని అర్థమైంది.

''మొహన ఎక్కడుంది?

షాక్ అయ్యాడు... అంటే కార్తికేయ సామాన్యుడు కాదు.

''సారీ మిస్టర్ యాసిక్... నువ్వు ఎక్కువ ఆలోచించి ఏదో చెప్పి ప్రయోజనం లేదు. నేను నమ్మేలా చెప్పాలి''

''రాణా'' సర్కిల్‌లో ఏషియన్ లాడ్జ్‌లో వుంది.

వెంటనే కార్తికేయ మెదడు పనిచేయడం మొదలుపెట్టింది. అది చాలా చవక లాడ్జ్... అక్కడ ఆడవాళ్ళు వుండే అవకాశం లేదు. అదే ప్రశ్న కార్తికేయ ఆడిగాడు.

''మోహన మగవాడిలా ఆ హోటల్‌లో రూం తీసుకుంది'' యాసిక్ చెప్పాడు.

''అంటే మరో హత్య తప్పదన్నమాట'' అనుకున్నాడు.

నిజం చెప్పానుగా... నిజం చెబితే వదిలేస్తాడని అన్నారుగా? అడిగాడు యాసిక్.

''నేను మాట తప్పను.. వదిలేస్తాను... అంటూ. యాసిక్ మొహం పైన పెట్టిన యాసిడ్‌బాటిల్ వదిలేసాడు యాసిక్ మొహం మీద పడేలా...''

అంబులెన్స్ నుంచి బయటకు వస్తోన్న కార్తికేయ సెల్‌కు ఓ మెసేజ్ వచ్చింది.

భారత పార్లమెంట్‌పై దాడి కేసులో ''అఫ్జల్ గురుకు ఉరి శిక్ష అమలు'' మెసేజ్ అది.

# 16.

ఎన్నో యుగాల అలసట... ఒక్క క్షణంలో ముగ్ధ సమక్షంలో సేదరితే, ఓదార్పు పొందినట్టుగా వుంది. కళ్ళు తెరిస్తే ఇది కలలా మిగిలిపోతుందేమో అన్నంత భయం...

అనతి చేతి వ్రేళ్ళకు ముగ్ధ నడుమును చుట్టేసిన స్పర్శ తెలుస్తోంది. మరింత గట్టిగా ఆ చేతులు ముగ్ధ నడుమును చుట్టేసాయి. ఆ స్పర్శను మిస్ అయితే తన జీవిత కాల నిరీక్షణ వృథా అవుతుంది. ఇది వరకు ఎన్నడూ లేని స్వాంతన. ఒక స్పర్శలో ఇంత గొప్పతనం ఉంటుందా? ఒక స్పర్శలో ఇంత గొప్ప భద్రతా భావం ఉంటుందా?

''ముగ్ధా...'' తొలిసారి ఏకవచన ప్రయోగం.

''చెప్పండి'' ముగ్ధ అతని జుట్టులోనికి చేతులు పోనిచ్చి అంది.

'' ఇది కలా? నిజమా? భ్రాంతా? ఏమీ తెలియడం లేదు. మొదటిసారి నన్ను నేను ఆవిష్కరించుకుంటున్నాను. నాకు ఊహ తెలిసాక ఈ ఢిల్లీ వీధుల్లో తిరిగాను. నేనెవరో నాకే తెలియదు. వీధి బాలలతో నా బాల్యం గడిచింది. ఈ ఢిల్లీ నగరంలో ఎన్నో అనుభవాలు నేర్పింది.న ప్రతీ అనుభవం ఒక జీవిత సత్యాన్ని నేర్పింది. పేపర్లు వేసాను..

రైల్వే స్టేషన్‌లో నా మకాం. పనికి రాని బోగీ నా ఇల్లు... హోటల్‌లో కప్పులు కడగడానికి కూడా సిగ్గుపడలేదు. నా ధ్యేయం ఒక్కటే... అందరికి ఉపయోగపడేలా బ్రతకాలని... కానీ... కానీ ముగ్ధా...

అతని గొంతు పూడుకు పోతుంది. మనసులోని మాట గాద్గాదికం అవుతుంది.

''నాకంటూ ఒక ఓదార్పు... నాకంటూ ఓ మనిషి... నగరం నిద్రపోయేవేళ నేనింకా మెలుకువగానే వుంటాను.

ఎక్కడో... ఎప్పుడో... ఎవరో... నా కోసం వస్తారని... మేఘాల్లో తేలి, వర్షంతో పాటు కిందికి దిగి వస్తారు... నన్ను వెతుక్కుంటూ, నా కోసం వస్తారు.

ఇది నా ఊహా... నేను ఇంట్రావర్ట్‌నా? ఏమో నాకే తెలియదు. నాకు తెలిసిన ప్రపంచం

ఈ ఇల్లు... నా ఉద్యోగం... ఈ అక్షరాలూ...

'' ఇప్పుడు ఈ ప్రపంచంలోకి, నా ప్రపంచంలోకి నువ్వే నా ప్రపంచమై...

జయదేవుని అష్ట పదులో, సప్తపదిని నా ఇష్టపదిగా మార్చి, నా మనసు గది సప్తవ ర్ణాలతో రంగులు వేసి, ఇంద్ర ధనస్సును, నేను విశ్రమించే పడకగా మార్చి, నా సాన్నిహి త్యాన్ని ఆకాశపు కప్పుగాచేసి, హిమం సైతం అందించలేని చల్లదనాన్ని నీ మనసు, వెచ్చద నాన్ని నీ స్పర్శ అందిస్తుంటే...''

ఆగి తలెత్తి ముగ్ధవైపు చూసాడు.

అతని ప్రమేయం లేకుండానే, అతని అనుమతి లేకుండానే రెండు కన్నీటి చుక్కలు, కనుకొలకుల సరిహద్దులు దాటి, బుగ్గల నుంచి జారి ఆత్మార్పణకు సిద్ధమయ్యాయి. చప్పున తన తలను కిందికి వంచి ఆత్మార్పణకు సిద్ధపడ్డ ఆ కన్నీటి చుక్కలను బంధించడానికి పెదవు లను ఆశ్రయించింది.

పరమ శివుడు గరళాన్ని గొంతులో బందిస్తే... ముగ్ధ తన కార్తికేయుడి కన్నీళ్ళను నేల పాలు కానివ్వకుండా, వాటి ఆయుష్షు తీరిపోకుండా తన పెదవులతో అడ్డుకట్ట వేసింది. అతని తల ముగ్ధమొహం అనబడే ఆకాశాన్ని చూస్తోంది.

'' ఆ దేవుడే... ఈ దేవుడే నా ముందు నిలిచి తన భావాలను మంత్రాక్షరాలుగా విని పిస్తూ వుంటే...

ఈ దేవుడు నా దేవుడే అన్న అద్భుతమైన భావం... వాస్తవం నా మనసును ఆక్రమిం చుకుంది. నన్ను ధన్యురాలిని చేసింది. ప్రభూ ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోను?''

ముగ్ధ మాటలు పెదవులు దాటలేదు... కానీ అవి అశ్వవేగాన్ని మించి, మనోవేగాన్ని అధిగమించి కార్తికేయ హృదయాన్ని చేరి ఆమె సందేశాన్ని విన్నవించింది. ముగ్ధలేచి అతని పక్కనే కూచుంది. అతన్ని చుట్టేసింది. అక్కడ రెండు మనసులు ముచ్చట్లాడుకుంటున్నాయి.

⁂⁂

ముగ్ధ, కార్తికేయ మధ్యన బలపడే సాన్నిహిత్యం, చిగురించే ప్రేమ మమేకమయ్యే దగ్గరితనం... రాయడానికి నాలుగు గంటల సమయం తీసుకున్నాడు. ప్రేమను సృష్టించ లేము... ఎందుకంటే ప్రేమే ఓ సృష్టి, ఆ సృష్టి ఇద్దరు వ్యక్తులను దగ్గరికి చేసి..

తను (ప్రేమ) వారి చుట్టూ పూల తీగలా అల్లుకుంటుంది... నా ప్రమేయం లేకుండా నేను ముగ్ధ ప్రేమలో పడిపోయాను. నేనే కార్తికేయను అయిపోయాను.

ఇది ఓ అందమైన అమ్మాయి నా దృష్టికి తెచ్చాక కలిగిన అందమైన ఫీలింగ్. ముగ్ధ పాత్ర చాలా మందిని హంట్ చేస్తుంది. ఐడెంటి ఫై చేసుకునేలా చేస్తుంది.

కార్తికేయ పాత్ర '' ఐడియల్ హీ'' గా నిలిచింది. రచయిత ఓ సంఘటన సృష్టించడా నికి, ఆ సంఘటనకు అర్థవంతమైన నేపథ్యం సమకూర్చడానికి పడే పెయిన్ చాప్టర్ పూర్త య్యేక పూర్తయ్యేక మర్చిపోతాం. అలాంటి అందమైన బాధ ఈ చాప్టర్‌లో ఇద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని అక్షరాలతో పెనవేసినప్పుడు కలిగింది.

సమయం తెల్లవారు ఝాము... అయిదు గంటలు... మరో గంటలో ఎయిర్‌పోర్ట్‌లో వుండాలి. ముంబై ప్రయాణం. చాప్టర్ రాయడం పూర్తయింది. నా అక్షరాలూ నాకు గుడ్‌మార్నింగ్ చెప్పాయి. అవి మిమ్మల్ని పలకరించడానికి సిద్ధమవుతున్నాయి.

:::::

ఏషియన్ లాడ్జ్...

చాలా పురాతనమైన లాడ్జ్... ఢిల్లీ నగరంలో అతి చవకైన లాడ్జ్ అదే... చిన్న చిన్న గదులు... అటాచ్ట్ బాత్రూమ్స్... ఫ్యాన్ తిరిగిన చప్పుడు స్టీరియో ఫోనిక్‌లో వుంటుంది. ఇనుప మంచాలు శబ్దం చేస్తాయి... దోమలు... ప్లాస్టిక్ ముగ్గులో నీళ్ళు... పోర్టబుల్ టీవీ... శిథిలావస్థలో వున్న రిమోట్...

మోహన చికాగ్గా వుంది, ముప్పయేళ్ళ పురుషుడి గెటప్‌లో వుంది. హాలీవుడ్‌లో ఓ మేకప్‌మాన్ దగ్గర పనిచేసింది... కేవలం మేకప్ మెలకువలు తెలుసుకోవడానికి... హెయిర్ స్టైల్ నుంచి నకడ, ఆహార్యం, మాట తీరు వరకు... మిమిక్రీ నేర్చుకుంది.

ఏదైనా వర్క్ చేసినప్పుడు మోహనలో వున్న (క్రిమినల్ మైండ్) డెడికేషన్. ఎక్కడా నిర్లక్ష్యం వుండదు. టీవీ ఆన్ చేసింది. పార్లమెంట్ మీద దాడి చేసిన అఫ్జల్‌గురుని ఉరి తీసిన వార్తా వస్తోంది.

ఈ సందర్భంగా చాలా చోట్ల రెడ్ ఎలర్ట్ ప్రకటించారు. టీవీ కట్టేసింది. లేచి బాత్‌రూం వైపు నడిచింది.

:::::

డేవిడ్‌కు డ్యూటీ అయిపోయింది. అయినా ఇంకా లాడ్జ్‌లోనే వున్నాడు. అతనో గే... అతనికి రిచర్డ్‌ని చూసినప్పటి నుంచి ఒకలాంటి ఫీలింగ్ కలుగుతుంది. అందుకే శబ్దం చేయకుండా రిచర్డ్ రూంలోకి అడుగుపెట్టాడు. అతని దగ్గర డూప్లికేట్ కీ వుంది. బాత్‌రూంలో స్నానం చేస్తున్నట్టు శబ్దం.

బాత్‌రూంలో వుంది రిచర్డ్ వేషంలో వున్న మోహన.

:::::

# 17.

డేవిడ్ ఓ సారి గదిని నిశితంగా పరిశీలించాడు. అతనికి ఆ లాడ్జ్‌లో ప్రతీ గది కొట్టిన పిండి. చిన్నప్పటినుంచి ఆవారాగా తిరిగాడు... చెడు స్నేహాలు... ఆరేళ్ళ వయసులో కొందరు కొజ్జాలు డేవిడ్‌ని ఎత్తుకెళ్ళారు. ఎలాగోలా వాళ్ళ నుంచి తప్పించుకుని హోటల్స్‌లో పనిచేసాడు. ఆ తర్వాత లాడ్జ్‌లో చేరాడు. హిజ్రాలతో తిరగడం, మగవాళ్ళతో పరిచయాలు పెంచుకోవడం చేస్తాడు. మంచం మీద చొక్కాలు వున్నాయి. సిగరెట్ ప్యాకెట్... వుంది. అతని దృష్టి సూట్‌కేసు మీద పడింది. అతను సూట్‌కేసులు వెతికేది డబ్బుకోసం కాదు. పోర్న్ మేగజైన్‌లు ఉంటాయేమోనని.

సూట్‌కేసు ఓపెన్ చేసి ఒక్క క్షణం షాకయ్యాడు. బట్టల అడుగున కనిపించింది రివాల్వర్... అంతకన్నా మరో షాక్... అందులో ఆడవాళ్ళ దుస్తులు వుండటం.

అంటే లాడ్జ్‌కు ఇద్దరు వచ్చారా? ఒక ఆడ, ఒక మగ? తనకు తెలియకుండా మరో వ్యక్తి వచ్చే అవకాశం లేదు.

భయం... బాత్‌రూంలో నుంచి నీళ్ళధార... మెల్లిగా శబ్దం చేయకుండా బాత్‌రూం వైపు నడిచాడు.

⁂⁂

మోహన్ షర్టు విప్పింది. ఆమె ఒంటి మీద అండర్ గార్మెంట్స్ తప్ప మరేమీ లేవు. ఎదురుగా చిన్న అద్దం. మసకబారిన అద్దం. ఆ అద్దంలో చూసుకుంది. మోహనది చాలా అందమైన పర్సనాల్టీ...

ఒక్కో అవయవాన్ని పొందికగా కూర్చినట్టు వుంటుంది. ఈ అందాన్ని ఎందరి మీదో ఆయుధంగా ప్రయోగించింది. ఇంతవరకు ఆమె శరీరాన్ని టచ్‌చేసే ధైర్యం ఎవరూ చేయలేదు.

రెండు సంవత్సరాల క్రిందట ఓ ఉగ్రవాద సంస్థలో కలిసి పనిచేసింది. వాళ్లకు అత్యాధునిక ఆయుధాలు వాళ్ళున్న అడివి ప్రాంతానికి వెళ్ళి సమకూర్చింది. ఆ సంస్థలోని ఓ కరుడుగట్టిన ఉగ్రవాది కన్ను మోహన అదంమీద పడింది. ఆ రాత్రి మోహన టెంట్‌లో పడుకుంది. ఆమె తల కింద రివాల్వర్ వుంది. మోహన నైటీలో వుంది. గాలికి నైటీ చెదిరి ఆమె కాళ్ళు ఆ వెన్నలతో పోటీ పడి మెరుస్తున్నాయి. మోహన ప్రతీక్షణం ఎలర్ట్‌గా వుంటుంది. చిన్న అలికిడి అయినా మెలుకవ వస్తుంది. ఉగ్రవాది టెంట్‌లోకి రాగానే కళ్ళు తెరిచింది. ఆమె కుడి చేయి దిండు కింద వున్న రివాల్వర్ని టచ్ చేసింది.

''కూల్ కూల్... కోమాలో వున్న వాడిని కూడా నిద్రలేపే అందం నీది. నాతో చేతులు... సారీ... నీ శరీరం కలిపావనుకో... ఈ సంస్థ నీ చేతుల్లో పెడతా... ఈ సంస్థకు నువ్వే చీఫ్. మోహనను చూస్తూ అన్నాడు... అతని చూపులు మోహన తల మీదుగా, మెడదాటి కిందికి వస్తున్నాయి... వ...చ్చే...సా...యి... క్షణంలో వెయ్యోవంతు... మోహన చేతిలో వున్నా సైలెన్సర్ అమర్చిన రివాల్వర్‌లోని బులెట్ అతని కనుబొమ్మల మధ్య నుండి దూసుకువెళ్ళింది. ఉగ్రవాది వెనక్కి పడిపోయాడు. అతని ప్రాణం ఆ అడవిలో ఎగిరిపోయింది.

⁂⁂

ఉగ్రవాదులంతా సమావేశమయ్యారు. మోహనలో ఏ మాత్రం బెరుకు, భయం లేవు. చనిపోయిన ఉగ్రవాది చివరగా మోహనతో మాట్లాడిన మాటలు ప్లే చేసింది.

'' ఉగ్రవాద సంస్థ ఎవడి స్వంత ప్రాపర్టీ కాదు. మీ చీఫ్ స్థానంలో నేను వాడి పక్కలో పడుకుంటే నన్ను చీఫ్‌ని చేస్తానన్నాడు. అది మొదటి తప్పు. నేను ఆయుధాలు అమ్మడానిక వచ్చాను... నా శరీరాన్ని బేరం పెట్టడానికి కాదు. నేను కూడా ఆ ఆయుధాలలో ఒక ఆయుధాన్ని. బుల్లెట్ అవసరంలేని వెపన్‌ని. నేను ఖర్చు చేసిన బుల్లెట్ ఖర్చు నా ఏకౌంటులో రాసు

కోండి.

⁘⁘

అదీ మోహన క్యారెక్టర్.

డేవిడ్ బాత్‌రూం డోర్ దగ్గరికి వచ్చాడు. బాత్‌రూం డోర్‌కి చిన్న కన్నం వుంది. ఆ కన్నం దగ్గరికి వెళ్లి ఎడమ కన్ను ఆ కన్నం దగ్గర పెట్టి...

తలుపు విసురుగా తెలుసుకుంది. ఎదురుగా మోహన... ఆమె చేతిలో పదునైన కత్తి సరిగ్గా పది నిముషాల తర్వాత ఆ లాడ్జ్‌లో నుంచి బయటకు వచ్చింది. మోహన గదిలో డేవిడ్ శం...

భయానకంగా...అతని కళ్ళు పీకివేయబడి... తన అర్థనగ్న శరీరాన్ని ఒక కన్నుతో చూసినందుకు మోహన వేసిన శిక్ష.

⁘⁘

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్

ఎఫ్.బి. ఐ. ఏజెంట్ 'రాబర్ట్' ఎయిర్ పోర్ట్ బయటకు వచ్చాడు. క్యాబ్‌ని పిలిచి అడ్రెస్ చెప్పాడు... ఏషియన్ లాడ్జ్. అక్కడ మోహన ఉందన్న విషయం తెలుసుకుని అక్కడి వెళ్తు న్నాడు. రాబర్ట్ ఏషియన్ లాడ్జ్‌కు వెళ్లేసరికి అక్కడ పోలీసులు వున్నారు. డేవిడ్ శవం వుంది.

⁘⁘

# 18.

ఒక అనాథ ఆకలితో అలమటిస్తూ, భుక్తి కోసం రోడ్డు మీద అందమైన బొమ్మలు వేసి యచిస్తుంటే పెద్దగా పట్టించుకోని జనం.

అక్కడే ఒక హత్య జరిగితే ఇసుక వేస్తే రాలనంతగా పోగవుతారు... అన్నదానికి నిద ర్శనంగా వుంది అక్కడి దృశ్యం.

ఏషియన్ లాడ్జ్ అంటే ఓ పురాతనమైన అతి చవకైన లాడ్జ్... ఒకేసారి ఆ లాడ్జ్ వార్త ల్లోకి ఎక్కంది. నెగటివ్ ఎప్పుడూ ఆకర్షణీయంగానే వుంటుంది.

డేవిడ్ హత్య ఆ పరిసర ప్రాంతాల్లోనే కాదు ఢిల్లీలో సంచలనం సృష్టించింది. టీవి ఛానెల్స్‌లో స్క్రోలింగులు మొదలయ్యాయి. ఇలాంటి నేరాలు సర్వసాధారణమే... క్రైమ్ రేటిం గ్‌లో ముందుంటుంది అనే అపవాదు మూట కట్టుకునే ఢిల్లీలో, బస్సులో అత్యాచార సంఘ టన జనం మర్చిపోకముందే డేవిడ్ హత్య సంచలనం సృష్టించింది.

దానికి కారణాలు రెండు... ఒకటి హత్య చాలా ఘోరంగా జరిగింది. హతుడి కను గుడ్డు పెకిలించి వేయబడ్డాయి.

రెండు... డేవిడ్ ఒక గే... అన్న వార్త వెలికి రావడం. ఒక హత్య జరగగానే తమ రేటింగ్స్ పెంచుకోవడం కోసం కొన్ని చానెల్స్ (చాలా వరకు) చేసే ప్రయత్నం...

ఆ హత్య పూర్వాపరాలు సేకరించడం. ఆ విధంగా డేవిడ్ గురించి కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. పైగా టీవీ చానెల్‌లో పనిచేసి క్రైమ్ రిపోర్టర్ పూర్వాశ్రమం ఓ పోలీస్ అధికారి.

డేవిడ్ రూంలో దొరికిన ఆధారాలతో అతనో గే గా గుర్తించారు.

అయితే డేవిడ్ గురించి ఇన్వెస్ట్‌గేట్ చేసిన ఆ రిపోర్టర్ హత్యచేసిన వ్యక్తి రిచర్డ్ అని... డేవిడ్ రిచర్డ్‌ని లైంగికంగా వేధించడం వల్లే ఆ హత్య జరిగిందని భావించారు...

వార్తా కథనాన్ని ప్రసారం చేసారు. రిచర్డ్ చిరునామా లభ్యం కాలేదు. చిన్న లాడ్జ్ కావడం, రికార్డ్స్ సరిగ్గా మెయింటేన్ చేయడం మరో లోపం.

ఆ హత్య చేసింది మోహన అని తెలిసిన వ్యక్తి రాబర్ట్.

ః

ఒక్క క్షణం షాక్ అయ్యాడు రాబర్ట్. మోహన అంత త్వరగా ఎస్కేప్ అవుతుందని ఊహించలేదు. తనకు వచ్చిన సమాచారం ప్రకారం మోహన మరికొంత కాలం అక్కడే వుండాలి. టీవీ చానెల్‌లో వచ్చిన వార్త వాస్తవం కాదని తెలుసు. బహుశా మోహన విషయం తెలిసినందుకే ఆ హత్య జరిగివుంటుంది. అయితే అంత ఘోరంగా ఎందుకు చంపినట్టు? ఇప్పుడు తనేం చేయాలి? సి బి ఐని కలిస్తే? ఈగో అడ్డొచ్చింది. మోహనను తనే ట్రేస్ చేయాలి. తనే ఫినిష్ చేయాలి.

మోహన గురించి తెలిసిన వ్యక్తులు ఇద్దరే ఒకరు యాసిక్... మరొకరు సి...క్వీ. కరుడుగట్టిన ఉగ్రవాది.

ః

ఆ గదిలోకి రావడానికి గాలి సంశయిస్తుంది. ఉద్వేగం సైతం ఉగ్విగ్న భరతమ్‌గా వుంది. చెలియ కట్ట దాటిన మౌనం వారిద్దరి మధ్యా వున్న బాధను పంచుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంది.

''అదేవిటి...' అంతకు మించి ఏం మాట్లాడాలో తెలియలేదు కార్తికేయకు.

'' ఈ రోజు సాయంత్రమే బయల్దేరుతున్నాను.. ఇప్పటికి ఆలస్యం అయింది'' గొంతు పెగల్చుకొని బాధగా చెప్పింది ముగ్ధ.

కార్తికేయతో గడిపిన ఈ మూడ్రోజులూ మూడు జన్మల అనుబంధంగా అనిపించింది.

ఇష్టమై వ్యక్తితో గడిపితే యుగాలు క్షణాలై మంచులా కరిగి మనసులో అందమైన జ్ఞాపకాలు అవుతాయి. అలాంటి జ్ఞాపకాలను తన మనసు గదిలో భద్రపరిచి, తన మనసును మాత్రం ఇక్కడే వదిలి వెళ్ళాలని నిర్ణయించుకుంది ముగ్ధ.

''నువ్వు లేకుండా నేను ఉండగలనా? కార్తికేయ అన్నాడు. ఆమె పరుగెత్తుకు వచ్చిందో... అతనే ఆమెను చేరాడో.. రెండు దేహాలు ఏకాత్మగా అనిపించింది.ప ముగ్ధను కార్తికేయ చుట్టేసాడు... కార్తికేయను ముగ్ధ తన ఆలింగనంతో బంధించిందో...

కాసేపు అలానే వుండిపోయారు. అతడి నుంచి విడిపడడానికి ఆమె మనసూ, తనువూ రెండు సిద్ధంగా లేవు.

''వెళ్తున్నది ఈ శరీరం మాత్రమే... మనసు కాదు అది మీ దగ్గరే వదిలి వెళ్తున్నా'' ముగ్ధ చెప్పింది. ఈ మూణ్రోజులూ వాళ్ళ మధ్య సాన్నిహిత్యం పెరిగింది. కార్తికేయ కోసం తనే వంట చేసింది. సాయంత్రాలూ అతని కోసం ఎదురుచూసింది. అతనే ప్రపంచంగా గడిపింది. ఫ్రెండ్ నుంచి ఫోన్ వస్తే కూడా లిఫ్ట్ చేయడానికి ఇష్టపడనంత ఇష్టాన్ని కార్తికేయ మీద పెంచుకుంది.

***

రైల్వే స్టేషన్

కార్తికేయ, ముగ్ధ, ఆమె స్నేహితురాలు. ముగ్ధ మనసు దిగులుగా వుంది. ఆ విషయం ఆ స్నేహితురాలికి అర్థమవుతూనే వుంది. ట్రైన్ అనౌన్స్‌మెంట్ వినిపించింది. శరీరంలో ఒక భాగాన్ని కోసి, సగభాగాన్ని తీసుకు వెళ్తున్నట్టు వుంది.

'' ఎక్కువగా హోటల్స్‌లో తినకండి.. ఫ్రిజ్‌లో పెరుగు తోడేసి పెట్టాను. తినడం మర్చిపోకండి...

అని తన ఫ్రెండ్ వైపు తిరిగి ''నువెటూ రావడం లేదు... రెండ్రోజులకొకసారి వెళ్లి తనకు వంట చేసి పెట్టి రావచ్చుగా'' అంది.

కార్తికేయకు ఈ అనుభవం కొత్తగా వుంది. కొత్తగా పెళ్లైన జంట... భార్య పుట్టింటికి వెళ్తూ భర్తకు జాగ్రత్తలు చెబుతున్నట్టు వుంది.

ట్రైన్ వచ్చింది. కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి డోర్ దగ్గర నిలబడింది.

''నీకు ఇష్టమైన ఎప్పటినుంచో నువ్వు చూడాలని అనుకుంటున్న తాజ్‌మహల్‌ని చూడకుండానే వెళ్తున్నావ్? అడిగాడు కార్తికేయ.

''చూడకుండా ఎందుకు వెళ్తున్నాను... అని కార్తికేయ కళ్ళలోకి చూసి...

'' ఈ మూణ్రోజులూ తాజ్‌మహల్‌లోనే గడిపాను... షాజహాన్ సమక్షంలోనే గడిపాను. ఈ షాజహాన్ సమక్షంలో గడిపాను.

దేవాలయంలాంటి తాజ్‌మహల్‌లో గడిపిన నాకూ ఆ సమాధితోపనేమిటి?

రైలు కదిలింది... అతని గుండె చెమర్చింది.

***

# 19.

ఆకాశం మేఘావృతం కాలేదు... కానీ ఒంటరితనం మేఘాలుమనసు ఆకాశంలో ఆక్రమిస్తూ తిరుగాడుతున్నాయి. ఇంట్లోకి అడుగు పెట్టాడు. నిన్నటి జ్ఞాపకాలు... కన్నీటి తర్జని చూసి నిలదీస్తున్నట్టు, కాసేపటి కిందటి జ్ఞాపకం... గుండె గొంతుకలో విషద స్వరమై ఆలపించినట్లు... విలపించినట్టు... అలాగే నేల మీద కూచుండి పోయాడు. సర్వ సామ్రా

జ్యాన్ని కోల్పోయిన సామ్రాట్టు శూన్య సింహాసనాన్ని అధిరోహించినట్టు... ముగ్ధ జ్ఞాపకం ఒక దృశ్యమై కనుల ముందుట నిచినట్టు...

⁘⁘

కార్తికేయ పక్కన కూచుంది ముగ్ధ.

'' ఏమిటాలోచిస్తున్నారు? అతని నుదురు మీద చేయి వేసి అడిగింది.

ఆ చేతిని అలానే పట్టుకుని వదిలిస్తే ఎక్కడికి వెళ్తుందేమో అన్నంత ఆర్తిగా ఆ చేతిని పట్టుకుని తన గుండెల మీద పెట్టుకున్నాడు. గుండెలమీద వుండాల్సిన చేయి కాదు అంటూ అతని చొక్కాకు వున్న మొదటి గుండీ తీసి అతని హృదయ భాగం మీద తలపెట్టి అంది. ఆమె ఉశ్చ్వాశ, నిశ్వాసాలు, ఆరోహణ, అధిరోహణలు అయ్యాయి. అతని చెక్కిలిపై జాలు వారిన కన్నీటి చుక్క ఆమె బుగ్గని తాకి కుశలం అడిగింది. తన రెండు చేతులు ఆమె చుట్టూ బిగించాడు. ఇది దిగ్భందనం... ఇష్ట దిగ్భందనం.

'' ఇది ధృతరాష్ట్ర కౌగిలి కాబోలు అనుకున్నాను... కానీ నా మనో హృదయాధినేత గాడాలింగనం అని అర్థమైంది. అతని చెవి కొసని కొరికి'' అది ముగ్ధ. అతను ఆ భావాన్ని, ఆ ఊహను అనుభూతిస్తున్నాడు. ఆ ఊహను డిస్టర్బ్ చేస్తూ ఫోన్‌కాల్. ఏషియన్ లాడ్జ్‌లో ఓ హత్యజరిగింది. ఈ రెండింటి కన్నా మూడవ సమాచారం అతడ్ని ఆందోళనకు గురి చేసింది.

యాసిర్ రాణా సర్కిల్ ప్రాంతంలో కనిపించాడు.

అంటే? అంజలిని ఏమైనా? దిగ్గున లేచాడు బయటకు పరుగెత్తాడు.

యాసిక్ అంజలి ఇంటికి సమీపంలో వున్నాడు.

కార్తికేయకు బుద్ధి చెప్పాలి. తన కాలిన మొహానికి ప్రతీకారం తీర్చుకోవాలి. అంజలి ఇంటిని సమీపించాడు.

⁘⁘

అంజలి తల్లిదండ్రుల ఫోటో ముందు నిలబడింది. మొన్నటి వరకు తనకు అమ్మ, నాన్న వున్నారు. ఈ రోజు లేరు. తనను నిద్ర లేపేవారు, తన బాగోగులు చూసేవారు... ఎవరూ లేరు. అమ్మ, నాన్న ఫోటో పక్కన దేవుడి ఫోటో, ''దేవుడూ, నేను చిన్నపిల్లని కదా... నేనేం తప్పు చేసాను. నాకు అమ్మని, నాన్నని లేకుండా చేసావు. నీకు ఎలాగూ లేరని నన్ను అనా థను చేసావా? నువ్వు నాలా ఒంటరిగా ఈ భూమ్మీద బ్రతుకు... అప్పుడు తెలుస్తోంది ఆ బాధేమిటో... నా బాధేమిటో''... ''మె బుగ్గల మీద కన్నీళ్ళు చిరపుంజి వర్షపాతమైంది. ఒక్క క్షణం నొప్పి... కడుపులో మెలిపెట్టి తిప్పినట్టు... భరించలేని కడుపునొప్పి.

'' ఆ... ఆ... మ్...మ్..మ్ మ్మా... అమ్మా''... మోకాళ్లను కడుపులో పెట్టుకుంది. అప్పుడే తలుపు దడేలుమని తెరచుకుంది.

ఎదురుగా యా...సి...క్...

⁘⁘

కార్తికేయ కాలు యాక్సిలేటర్ని తొక్కిపెట్టింది. కారు డెబ్బై, ఎనభై దాటింది. విపరీత మైన ట్రాఫిక్‌ని లెక్క చేయకుండా డ్రైవ్ చేస్తున్నాడు. అతని మనసెందుకో కీడును శంకిస్తుంది.

యాసిక్ ఎలాంటి క్రూరుడో తెలుసు. అసలు ఎలా తప్పించుకున్నాడు? అంజలికి ఎదైనా అపకారం తలపెడితే? మరో పది నిముషాల్లో తను అంజలి ఇంటిని చేరుకుంటాడు. కానీ ఈ లోగా...?

⁂

తలుపు తోసుకుని వచ్చిన యాసిక్ వైపు భయంగా చూసింది అంజలి. రక్తంతో తడిసిన దుస్తులు, భయంతో చెమటపట్టిన మొహం. నిస్సహాయతతో కూడిన చూపులు. అతని పైశాచిక, వికృతానందం... యాసిక్ జేబులు నుంచి సెల్‌ఫోన్ తీసాడు. మరో చేతిలో యాసిడ్ బాటిల్.

⁂

# 20.

మనసు... తనువూ అనే రెండు పట్టాలపై జ్ఞాపకమనే రైలు వెళ్తోంది. నిన్నటి అనుభూతుల స్టేషన్లూ దాటుతుంది. కార్తికేయ అనే నాలుగు అక్షరాలు, నాలుగు దిక్కులా విస్తరించి... తనను చుట్టుముట్టేస్తుంది.

నా మనసును ఆహ్లాదపరిచే జ్ఞాపకమా... నీకు వందనం... కదులుతోన్న రైలులో తన మనసులో కదలాడుతోన్న కార్తికేయను గుర్తుచేసుకుంటోంది.

ఈ క్షణం కార్తికేయ కనిపిస్తే... తన మనసును వినిపిస్తే?

''కదిలిపోయే చెట్లుచేమలు... కార్తికేయ కానరాడు
కనుమరుగయ్యే కాంతిదీపాలు... కార్తికేయ అందిరాడు
ఎదకమనుమలలో వేదనాఝురులు... కార్తికేయ అందనివాడు
కనుకొలనులలో నీటి వీచికలు... కార్తికేయని తలవంగా
మధనపడే మనసు మూగ రోదనలు... కార్తికేయని విడిచిరాగా
హృదిన వలపు పల్లవించిన వైనాలు... కార్తికేయ స్మృతిరాగా...''

ముగ్ధకు ఒక్క క్షణం ఏడవాలనిపించింది... కార్తికేయ గుండెలమీద తలపెట్టి... ఇప్పుడేం చేస్తున్నాడో?

అలా ఆలోచిస్తూ వుంటే అంజలి గుర్తొచ్చింది. అమాయకత్వం, ఆత్మవిశ్వాసం నిండిన చిన్నారి ఇప్పుడేం చేస్తుందో?

⁂

యాసిక్‌ని చూసి భయంతో వణికిపోయింది. సిగ్గుతో చితికిపోయింది. దగ్గరగా ముడుచుకుంది. యాసిక్‌లోని పైశాచికత్వం వికృతమైంది. ఓసారి అంజలి చుట్టూ తిరిగి..

''ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ హౌ ఐ వండర్ అంజలి వేర్? అంటూ సెల్‌ఫోన్‌లోని కెమెరా ఆన్ చేస్తాడు.

అంజలి తలను మోకాళ్ళ మధ్య పెట్టుకుంది. చచ్చిపోతే బావుందనిపిస్తోంది.

''వావ్... మీ అమ్మ కన్నా బావున్నావ్...స్మైల్...'' అంటూ కెమెరాని అంజలి మొహం దగ్గరికి తెచ్చాడు.

మనిషిలోని విచక్షణ లేని పశువులా ప్రవర్తిస్తున్నాడు యాసిక్....

బస్సులో ప్రవర్తించిన పైశాచిక ఉన్మాదానికి దీనికి పెద్ద తేడాలేదు.

''నిన్నేమీ చేయను... జస్ట్ ఇప్పుడే వికసించిన నీ అందాన్ని నెట్‌లో పెడతా...రకరకాల యాంగిల్స్‌లో నీ ఫీలింగ్స్ క్లిక్ చేస్తాను... అంతే సింపుల్'' అంటూ కెమెరాతో షూట్ చేస్తున్నాడు.

ఒకటి...రెండు... మూడు... పది నిముషాల వికృత క్రీడ. ఆ తర్వాత తాపీగా వెళ్తూ

''ఇలాంటి క్లిప్పింగ్స్‌కి బోల్డు డిమాండ్... నిన్ను యాసిడ్‌తో చంపి ఆ కార్తికేయకు బుద్ధి చెప్పాలనుకున్నాను. ఇప్పుడు ఈ క్లిప్పింగ్స్, ఫోటోస్‌తో బుద్ధి చెబుతా... బై'' అంటూ వెళ్ళిపోయాడు యాసిక్.

❖❖

లేవలేని నిస్సహాయత... కడుపులో నొప్పి, రక్తసిక్తమైన స్త్రీత్వపు బేలతనం, చిన్నారి విలాపం.

దేవుడా... తెలియక నిన్ను తిట్టాను.. అందుకే నాకీ శిక్ష వేసావా? అమ్మానాన్న లేని నన్ను ఇలా బాధపెడతవా? నన్ను కాపాడడానికి ఏ దేవుడూ రాడా?

❖❖

కార్తికేయ కారు అంజలి ఇంటిని సమీపించింది. కారు దిగుతూనే లోపలికి పరుగెత్తాడు. లోపలి దృశ్యం చూసి షాక్ అయ్యాడు. ఆ గది మరుభూమిలా, చితిపై పేర్చబడ్డ ప్రామణమున్న బొమ్మలా... అం...జ...లి.

విషాధానికి తానే అర్థమై, దుఖంతో చెలిమి చేస్తూ భయంతో బాధించబడుతూ బేలగా...

కార్తికేయను చూడగానే ప్రాణం లేచివచ్చింది. ధైర్యం అమ్మయింది. లేవబోయింది... శరీరం సహకరించడం లేదు. క్షణాల్లో కార్తికేయకు పరిస్థితి అర్థమైంది. మనసు అర్థమైంది. చిన్నారి అనుభవించిన క్షోభ కళ్ళముందు నిలిచింది.

పరుగెత్తుకు వెళ్ళాడు. అంజలిని గుండెలకు హత్తుకున్నాడు. కార్తికేయను గట్టిగా పట్టుకుంది. వెక్కుతోంది.

కార్తికేయలో అమ్మలాలన కనిపిస్తోంది. నాన్న ప్రేమ కనిపిస్తుంది. అన్నింటికన్నా ఆ దేవుడే కనిపిస్తున్నాడు.

'' ఏడవకు చిట్టితల్లీ...

నేనే నీకు అమ్మని, నాన్ననై, సోదరినై... నీ కంటి పాపనై నిన్ను నా బిడ్డలా చూసుకుంటాను.''

ఆమెను ఓదారుస్తున్న కార్తికేయకు అంజలి పరిస్థితి చూస్తోంటే గుండె తరుక్కుపోతుంది. అంజలి ఎడుస్తూనే యాసిక్ వచ్చి వెళ్లిన విషయం... అతను బెదిరించిన సంగతీ చెప్పింది.

ఆ క్షణం కార్తికేయకు విధాతపై కోపం వచ్చింది.

''విధాత ఏమిటీ తలరాత... ప్రకృతి ధర్మాన్ని, వికసించే పుష్పాన్ని ఇలా రక్తసిక్తం చేస్తావా? ఇంతటి వేదన కలిగిస్తావా? తల్లీ సరస్వతీ నువ్వు స్త్రీ మూర్తివే కదమ్మా? నీకీ చిట్టి తల్లి రోదన వినిపించలేదా? ఏమయ్యా బ్రహ్మయ్యా... నువ్వు స్త్రీగా జన్మించు... అప్పుడు నీకు ఈ వేదనకు అర్ధం తెలుస్తుంది.''

కార్తికేయ ముగ్ధ స్నేహితురాలు హేమంతకు ఫోన్ చేసాడు. పరిస్థితి క్లుప్తంగా వివరించాడు.

ఇరవై నిముషాల్లో హేమంత వచ్చింది. వస్తూ అంజలి కోసం దుస్తులు తెచ్చింది.

''నా చిట్టితల్లికి అమ్మ,నాన్నలేని లోటు తెలియకూడదు. జాగ్రత్తగా చూస్తూ వుండండి''

''మీరు... మీరెక్కడికి వెళ్తున్నారు ''కార్తికేయ ఆవేశాన్ని చూసి అడిగింది హేమంత.

''శత్రు సంహారానికి...'' ఎర్రబడ్డ కళ్ళతో... త్రినేత్రాన్ని తెరిచిన ముక్కంటి అయి...

చేత సుదర్శన చక్రం ధరించిన జగన్నాథుడై కదిలాడు. మరి కాసేపట్లో రుద్రభూమిలో మారణహోమం మొదలవుతుంది.

# 21.

హేమంత క్షణాల్లో రంగంలోకి దిగింది. కార్తికేయ బయట కూచున్నాడు. అరగంటలో కడిగిన ముత్యంలా తయారుచేసింది అంజలిని.

ఇల్లంతా నీట్‌గా సర్దింది. కార్తికేయ లోపలికి వచ్చాడు. అంజలి వచ్చి కార్తికేయ కాళ్ళకు నమస్కరించబోయింది. చప్పున కిందికి వంగి అంజలిని లేపి దగ్గరికి తీసుకున్నాడు. ఒక్క క్షణం తన మనసుకెవరోచేతబడి చేసినట్టు విలవిల్లాడిపోయాడు.

తల్లి చెప్పాల్సిన మాటలు... దగ్గరుండి తల్లి చూడవలసిన పనులు.

స్త్రీ ఔన్నత్యం ఇంత గొప్పగా ఉంటుందా? ఒక చిట్టితల్లి అంజలి... ఒక నేస్తం హేమంత... ఒక తన ప్రాణం ముగ్ధ. ఆ సృష్టికర్త స్త్రీని సృష్టించకపోతే ఈ సృష్టికి అర్ధం ఏముంది? హేమంతవైపు తిరిగి రెండు చేతులు జోడించాడు. అమ్మలా అంజలిని ఆదుకున్నారు... ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోను?

హేమంత కార్తికేయవైపు చూసి...

'' ఈ ప్రపంచంలోని మగవాళ్ళంతా ఒకేలా వుంటారనే భ్రమలో వున్నాను. కానీ మిమ్మల్ని చూసేక... మగవాళ్ళు అంటే గౌరవం పెరిగింది. స్త్రీని సెక్స్ సింబల్‌గా చూసే మగ వాళ్ళు తెలుసు... స్త్రీని ప్రకృతిగా చూసే మిమ్మల్ని చూస్తే గర్వంగా వుంది. ఒక చిన్నారి తపన చూసి తండ్రిలా తపించిన మీలాంటి వారినిచూసి కాముకతతో కన్న కూతురిపై అత్యాచార ప్రయత్నం చేసే కామాంధులు సిగ్గుతో చచ్చిపోవాలి.

కృష్ణుడు కూడా నిండు కొలువులో ''అన్నా నన్ను కాపాడు'' అంటేనే వచ్చి కాపా డాడు.

కానీ ఈ కార్తికేయుడు అడగముందే ప్రాణాన్ని పణంగా పెట్టాడు. మళ్ళీ జన్మ వుంటే నాకు అన్నయ్యగా పుట్టు...

ముగ్ధ మీద ఎందుకు ఇంత ప్రేమ పెంచుకుందో ఇప్పుడు అర్థమైంది'' మనస్ఫూర్తిగా అంది.

***

టాప్ సీక్రెట్ నెట్ సర్వీసెస్

పాత ఢిల్లీలో ఓ మారుమూల వున్న నెట్ సెంటర్ అది. పోర్నో సైట్స్ చూడాలనుకున్న వాళ్ళు... సంతకాలు ఫోర్జరీ చేసేవాళ్ళు, దొంగనోట్లు స్కాన్ చేసుకునే వాళ్ళ అడ్డా అది.

అందులోకి ప్రవేశించాడు యాసిక్. అతని చేతిలో సెల్ ఫోన్‌వుంది. కార్తికేయను దెబ్బ తీసే పథకం అతని మెదడులో రూపుదిద్దుకుంది.

చాలా వికృతమైన ఆలోచన అది.

ఆ నెట్ ముందు కారు ఆపాడు కార్తికేయ. వాతావరణంలో మార్పు చోటుచేసుకుం టుంది. ఆకాశం మేఘావృతమైంది. ఢిల్లీ నగరంలో చాలాకాలం తర్వాత అంధకారం నెల కొంది. ఓ పక్కన కొబ్బరి బోండాలు అమ్మే బండీ వుంది. కొబ్బరి బోండాలు నరికే కత్తి చేతి లోకి తీసుకున్నాడు. నెట్‌లోకి అడుగుపెట్టాడు.

అకాశం ఉరిమింది. ఎక్కడో పిడుగు పడింది. ఓ మెరుపు.. ఆ మెరుపులో ఎరుపు వర్ణం దాల్చిన రుద్రమూర్తిలా... అపర నరసింహావతారంలా... ఆగ్రహోదగ్ర ఉగ్రమూర్తి. కాల యముడిలా నెట్‌లోకి అడుగు పెట్టిన కార్తికేయను నిలువరించే సాహసం ఎవరూ చేయలేదు.

''నేను మూడవ అంకె లెక్కపెట్టేలోగా ఒక్కరు కూడా వుండకూడదు... వుంటే ఎవరూ ప్రాణాలతో మిగలరు'' అనౌన్స్ చేసాడు కార్తికేయ.

అది హెచ్చరిక కాదు... ఆజ్ఞ..

గ్రెనేడ్ పిన్ లాగాడు. అప్పటికే నెట్‌లో వున్న జనం పరుగులు తీసారు. కొద్ది క్షణాల వ్యవధి అంటే... పెద్ద విస్ఫోటనం... పిడుగులాంటి శబ్దాన్ని వింది. ఆకాశం హర్షించినట్టు కుండపోత.. అప్పుడే ఆ నెట్‌లో నుంచి పరుగు తీస్తోన్న యాసిక్ కార్తికేయ కంటపడ్డాడు.

పెద్ద పెద్ద అంగాలు వేస్తూ యాసిక్‌ను వెంబడించాడు. ప్రాణభయం ఎలా

వుంటుందో అనుభవంలోకి వచ్చింది యాసిక్‌కి.

అప్పటికే ఆలస్యమైంది.

నరమాంస భక్షకుడిని వేటాడే పులిలా... సింహంలా... కదిలాడు. ఆకాశమే భయంతో వణికింది...

వేన వేల స్త్రీల వేదనలకు బలైన వాళ్ళ జీవితాలకు అంకితంగా యాసిక్ బలిని సమర్పించబోతున్నాడు. నేర వ్యవస్థలోని ఒక రాచ పుండుకు తన కత్తితో శస్త్రచికిత్స చేయబోతున్నాడు.

యాసిక్ ప్రాణభయంతో పరుగెడుతూనే మోహన్‌కు ఫోన్ చేసాడు. ఆయాసంతో రొప్పుతున్నాడు. భయంతో వణికి పోతున్నాడు.

మరణశిక్షకైనా క్షమాబిక్ష వుంటుంది... కార్తికేయ శిక్షకు అపీల్ లేదని అర్ధమైంది.

నాలుగు రోడ్ల కూడలిలోకి వచ్చాడు. నడిరోడ్డుపై వర్షంలో తడిపోతూ యాసిక్... అతని ఎదురుగా పొడవాటి కత్తితో కార్తికేయ...

అప్పుడే వ్యాన్‌లో వచ్చింది మోహన.. ఆమె చేతిలో రివాల్వర్.

# 22.

పరమశివుడు ప్రళయకాలరుద్రుడైతే... మహావిష్ణువు సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తే...

దుష్టశిక్షణ... శిష్టరక్షణకు ఇది ఆ దేవదేవుడే నిర్ణయించిన ముహూర్తమే అనిపిస్తే...

కుండపోత వర్షంలో యాసిక్ రోడ్డు మధ్య ప్రాణభయాన్ని అనుభవిస్తూ యాసిక్, కార్లు, బైకులు, జనం...

కార్తికేయ పబ్లిక్ అడ్రస్ సిస్టం దగ్గరికి వచ్చాడు. అతని గొంతు నలుదిశలను చేరుతుంది.

''ప్రజలారా ఈ రోజు నేను యాసిక్ అనబడే ఈ నరరూప మదోన్మాద మృగానికి మరణశిక్ష విధిస్తున్నాను. చట్టం మరణ శిక్ష విధిస్తే, రాష్ట్రపతి క్షమాభిక్ష వుంటుంది. వీడివల్ల ఎందరో మహిళలు ప్రాణాలు కోల్పోయారు... వీడి అత్యాచారానికి బలయ్యారు. వీడి యాసిడ్ దాడికి గురయ్యారు. వీడికి నేను విధించే మరణశిక్షను క్షమాభిక్షగా మార్చమనే వారుంటే నేను వాడిని వ...ది...లి...వే...స్తా...ను'' అతని కుడిచేతిలోని పొడవాటి కత్తి. ఈ దృశ్యాన్ని చూస్తోన్న ఓ ముస్లిం సోదరి కొద్దిగా బురఖాను తొలగించింది.

ఆరె నెలల క్రితం యాసిక్ చేతిలో యాసిడ్ దాడికి గురైంది.

''భయ్యా... మార్ డాలో...'' అరిచింది. ఆ అల్లాకూడా సంతోషిస్తాడు. తోటి వారిని ప్రేమించమని అల్లా ఇలాంటి దుర్మార్గులను శిక్షించడానికి తన బదులు మరొకరిని పంపిస్తాడని ఆ సోదరి భావిస్తుం.

జనంలో కదలిక వచ్చింది. నడిరోడ్డు మీద మానవత్వాన్ని హత్య చేస్తోంటే, నిర్ధాక్షి

ణ్యంగా ఒకరిని చంపుతుంటే... అత్యాచారం చేస్తోంటే...

భయంతో, నిర్లిప్తతో మిన్నకుండే జనం... ఓ వ్యక్తి కత్తి చేతపట్టి నరరూప రాక్షసుడు తల నరుకుతానంటే... ఇప్పుడైనా కదలిక రాకపోతే...

జనం కదిలారు. కార్తికేయ యాసిక్‌ని సమీపించాడు యాసిక్ రెండు చేతులూ పైకి లేపాడు దాడిని అడ్డుకోవడానికి, తెగబడిన కార్తికేయ చేతిలోని కత్తి ఆ రెండు చేతులను అతడి శరీరం నుంచి వేరు చేసింది. రక్తం చివ్వున చిమ్మింది. రెండు చేతులూ రోడ్డుమీద పడ్డాయి. అదే సమయంలో వీధి దీపాల సాయంతో కొందరు కళాకారులు రుద్రతాండవం నృత్యరూపకం ప్రదర్శిస్తున్నారు. కత్తి చివర నుంచి రక్తం కారుతుంది. యాసిక్ కేక ఆ ప్రాంత మంతా ప్రతిధ్వనించింది. రోడ్డు మీద పడ్డ తన చేతులను చూసుకున్నాడు. ఎందరినో యాసిడ్ చూపించి బెదిరించిన చేతులు... అత్యాచారం చేసిన చేతులు... కార్తికేయ వంక భయంగా చూసాడు. కార్తికేయ కత్తి మరోసారి గాల్లోకి లేచింది... ఈ సారి మొండం నుంచి యాసిక్ తల వేరైంది...

కొన్ని గజాల ఆవల పడింది. కొద్ది క్షణాలే గిల గిల కొట్టుకుంది. యాసిక్ చరిత్ర అతి భయానకంగా ముగిసిపోయింది. ఇదంతా కెమెరాలో రికార్డు అవుతుంది. కార్తికేయ మొహం కనిపించకుండా జాగ్రత్తగా షూట్ చేసారు.

***

ఆటో ఆగింది. అందులోనుంచి హేమంత, అంజలి దిగారు. కార్తికేయ యాసిక్‌తల పడివున్న ప్రాంతానికి వెళ్ళాడు. ఇంకా రక్తం కారుతూనే వుంది. జుట్టుతో తలను చేతిలోకి తీసుకున్నాడు.

ఆ ఆదిశక్తి ఆ మహిషాసురమర్ధిని చేతిలో వున్న అసురుడి తలలా వుంది. ఆ మొడం లేని తలను అంజలి పాదాల ముందు పెట్టాడు.

అంజలికి యాసిక్ తన తల్లిదండ్రులను చంపిన దృశ్యం... తనను సెల్‌లో షూట్ చేసిన సంఘటన కళ్ళముందు కదలాడింది.

కార్తికేయ మోకాళ్ళమీద కూచున్నాడు. అంజలి కార్తికేయ చేతిలోని కత్తిని నేలమీద జారవిడిచింది. కుండపోత వర్షంలో ఆ కత్తి కొట్టుకుపోతోంది. దుష్ట సంహారం చేసిన ఆ కత్తి కాలగర్భంలోకి వెళ్తోంది. వర్షం వెలిసింది. ట్రాఫిక్ పోలీస్, పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసాడు.

''సార్... ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని దారుణంగా చంపేశారు'' అంటూ సమాచారం అందించాడు.

ఆ హత్యకు, అది హత్యకాదు సంహారం... దానికి సాక్ష్యంలేదు. వున్నా ఎవరూ చెప్పరు.

ఢిల్లీ నగరం అంధకారం నుంచి వెలుగులోకి వచ్చింది. సరిగ్గా అరగంట తర్వాత ఢిల్లీ లోని టీవీసెట్ల ముందు కూచొన్న జనానికి ఫ్లాష్‌న్యూస్...

''నడిరోడ్డుపై నరరూప మదోన్మాద మృగాన్ని సంహరించిన కల్కి అవతారం'' అన్న వార్త...

న్యూస్ రీడర్ స్క్రీన్‌మీదికి వచ్చింది. ఢిల్లీ ప్రజలు ఈ రోజు దీపావళి జరుపుకుంటు న్నారు.

నలభై మంది అమ్మాయిలపై పాశవికంగా అత్యాచారం చేసిన కేసులో నిందితుడు...

ముప్పై మంది అమ్మాయిల మీద యాసిడ్ పోసిన కేసులో ఇంకా పలు నేరాలతో పన్నెండు పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు వున్న యాసిక్‌కు గుర్తు తెలియని వ్యక్తి మరణశిక్ష విధించాడు. జనం చూస్తుండగానే అతని చేతులు, తల నరికాడు. వీటి విజువల్స్ మీకు అంది స్తున్నాం.

ఇతన్ని అపర కల్కి అవతారంగా భావిస్తున్నారు. ఇప్పుడు ఈ సంఘటన గురించి జనం స్పందన తెలుసుకుందాం.

కెమెరా జనం మీద వుంది. '' ఈ హత్య ఎవరు చేసారో తెలుసా? యాంకర్ అడి గింది ఓ అమ్మాయిని.

'' ఇది హత్య కాదు... అల్లా సైతాన్‌కు విధించిన శిక్ష'' చెప్పిందా అమ్మాయి.

''యుగానికో అవతారం. ఈ యుగంలో వచ్చిన కల్కి దేవుడు విధించిన శజక్ష'' మరొ కరు చెప్పారు.

ఆ జనంలో ఏ ఒక్కరూ కార్తికేయ గురించి చెప్పలేదు.

***

న్యూస్ రీడర్ స్క్రీన్ మీదికి వచ్చింది. ''యాసిక్ మరణాన్ని ప్రజలు దీపావళి పండు గలా భావిస్తున్నారు. ఈ సంఘటన మీద మీ అభిప్రాయాలు మాకు మెయిల్ చేయండి లేదా ఫోన్ చెయ్యండి.

ఛానెల్ ఆఫీసు నుంచి బయటకు వచ్చింది న్యూస్ రీడర్. తర్వాత ఓ నంబర్‌కు ఫోన్ చేసింది.

''సార్ మీరు చెప్పినట్టే న్యూస్ వచ్చింది. జనంలో స్పందన వుంది'' అంది.

''థాంక్యూ... మీరు చేసిన మేలు మర్చిపోలేను'' అవతలివైపు నుంచి కార్తికేయ అన్నాడు.

''నో సర్... ఇట్స్ మై ప్లెజర్'' అంది ఆ న్యూస్ రీడర్.

***

మోహన చేతిలోని ఫ్లవర్ వాజ్ టీవీని తాకింది. భళ్ళుమని శబ్దం. పిక్చర్ ట్యూబ్ పేలిన శబ్దం.

'' ఇదంతా మీ వల్లే... చేతిలో రివాల్వర్ వుండి కూడా చంపలేదు'' సిక్కీ అన్నాడు.

మోహన వేగంగా లేచి సోఫాలో కూర్చున్న సిక్కీ గుండెల మీద కుడి పాదం పెట్టి

రివాల్వర్‌ని అతని కణత మీద ఆన్చి ట్రిగ్గర్ మీద వేలు బిగించింది.

⁘⁘

# 23.

ఆ వూరు పచ్చదనంతో పెయింట్ చేసినట్టు వుంది. ఏసీల పొగరు ఆ వూరులో పని చేయదు...

చెట్టు చల్లదనాన్ని దాంతో పాటు చల్లగాలిని వూరి వారందరికీ సమానంగా పంచు తుంది. కోవెల ఎదురుగా వున్నా కోనేరులో కోవెల ప్రతిబింబం కనిపిస్తుంది. స్వచ్ఛమైన మనుష్యుల అచ్చమైన పదహారు అణాల పల్లెతనం ధనం అక్కడ సుసంపన్నమై వర్ధిల్లు తుంది.

⁘⁘

చీరకొంగు బొడ్లో దోపి అటూ ఇటూ చూసి జామచెట్టు ఎక్కింది ముగ్ధ.

చిటారు కొమ్మన మిటాయి పొట్లంలా ఊరిస్తున్న ఒక దోరజామకాయ ముగ్ధను టెంప్ట్ చేస్తోంది. చేతికి అందడంలేదు...

పాదం మీద నిలబడింది. ఆమె తెల్లటి పాదాలు చూసి ఆ జామకొమ్మ కాసింత ఉద్వే గానికి గురైంది. ఆమె నడుంమీద వున్న మడతని చూసి ఆ దోరజామ మోము కంది ఎర్రజా మగా మారింది.

''దేవుడా దేవుడా దేవుడా'' కళ్ళు మూసుకుని ఆ జామను అందుకునే ప్రయత్నం చేస్తోంది.

''అక్కా ఏం చేస్తున్నావ్? ఎక్కడున్నావ్?'' తమ్ముడు చంద్రు అక్కని వెతుక్కుంటూ వచ్చాడు.

ఓసారి కిందికి చూసింది. తమ్ముడు కనిపించాడు. ఇప్పుడు వాడు తనని చూస్తే

'' ఏయ్ కోతి ఏం చేస్తున్నావని ఆటపట్టిస్తాడు. అందుకే కామ్‌గా వుంది. దృష్టిని జామకాయ మీద లగ్నం చేసింది. ముగ్ధ ప్రయత్నాన్ని చూసి ఆ చిటారు కొమ్మకు జాలేసి, గాలి సాయం తీసుకుని కాస్త కిందికి వచ్చింది. ముగ్ధ చేతికి చిక్కింది. ముగ్ధ చేతిలో దోర జామ. అదీ చిలుక కొరిక జామ. ఆ కొమ్మ చివర సన్నాయి నొక్కులు నొక్కుతూ బడాయి పోతూ ఓ చిలుక కలుకులు పోతుంది.

'' ఏయ్ మాయదారి చిలుకా... దీన్ని కొరికావా? ఇప్పుడు నీ ఎంగిలి నా కార్తికేయకు ఎలా పంపేది...

ముద్దుగా ఆ చిలుకను చిరాకుపడుతు దులిపేసింది. కోపంతో చిలుక ముక్కు ఎర్రబ డింది. ఉక్రోషంతో చిలుక ముద్దు పలుకులు పలికింది.

'' ఇంకోసారి నీ పెరట్లో జామచెట్టుమీద వాలి, నీ జామకాయలు ముట్టుకుంటే ఒట్టు...

ఏదో నేను కొరిక చూస్తే తియ్యగా వుంటాయి కదాని... చిలుక గొణుక్కుంటూ వెళ్ళింది''.

ఎగిరిపోతోన్న చిలుక వంక చూసి గట్టిగా అరిచింది.

'' ఏయ్ చిలుకా, ఏమి నీ అలుకా... మనం చిన్నప్పటి నుంచి నేస్తాలంగా... నేనైతే నీ ఎంగిలి తింటాను... మరి నా కార్తికేయకు ఎలా ఇవ్వనే... సారీ...''

అంటూ ఆ దోరజామను తన చీరకొంగుతో తుడిచింది. ఆపై తన గదిలోకి వెళ్ళింది...

మదిలోని కార్తికేయ గది తలుపు తెరిచి అతని తలపును ఆహ్వానించింది.

***

ముగ్ధ ఒళ్లో జామకాయ. చాలా పెద్దగా వుంది. చూస్తోంటే వెంటనే తినేయాలన్నంత బావుంది.

ఆ జామకాయను కార్తికేయకు పంపించాలన్న ఆలోచన. తన ఆలోచన తనకే గమ్మత్తుగా అనిపించింది. కార్తికేయ నవ్వుకుంటాటా?

నవ్వుకుంటే నవ్వుకోని... తన పెరట్లోని జామకాయ రుచిని కార్తికేయ ఆస్వాదించాలి. బొటనవేలి గోరుతో అక్షరాలను చెక్కుతోంది. ఆమె గోరే ఉలిగా మారింది.

''నా ప్రాణానికి ఈ ఫలం.. చిన్న కానుక''. ఒక్క కన్నీటి చుక్క ఆ జామకాయ మీద. ఆమె నఖంతో చెక్కిన అక్షరం చెక్కిలి మీద పడింది.

'' ఇది ఏ ప్రేమికురాలు తన ప్రియతముడికి ఇవ్వని అపురూపమైన కానుక...''

కొన్నింటికి లాజిక్కులు వుండవు...

ఇష్టానికి, అది వ్యక్తం చేసే మార్గానికి రహదారులు వుండవు... మనమే నిర్మించుకోవాలి.''

జామకాయను ప్రేమతో నిమిరింది. తన పెదవులకు ఆన్చుకుంది. ఒక్క క్షణపు కిలికించితమా నాలో ఈ వుద్వేగమేలనో?

చిలుక కొరికిన జామకాయ తియ్యగా వుంట, ఆ చిలుకతో పాటు తనూ... ఆమె బుగ్గల్లో

గులాబీ తోటలు... ఇదంతా ఆ ఇంటి కిటికీలో నుంచి చూస్తోన్న చిలుక సంబరపడి రివ్వున ఎగిరింది.

***

ముగ్ధ పుస్తకాల అర దగ్గరికి వెళ్ళింది. చిన్నడబ్బా... అట్ట పెట్టెతో తయారైన డబ్బా.

దాంట్లో జామపండు పెట్టింది. వేరే ఉత్తరం ఏమీ రాయలేదు. తన మనసే ఎన్నో భావాలను అతనికి తెలియజేస్తుంది. అన్న నమ్మకం ఆమెది...

నీట్‌గా ప్యాక్ చేసింది. దాని మీద కార్తికేయ చిరునామా రాసింది. ముత్యాల్లాంటి అక్షరాలు.

సిటీలో కెళ్ళి కొరియర్ చేయాలి. తను సిటికి వెళ్ళాలంటే తనకో సాయం కావాలి. ఆ సాయం చేసేది ఎవరు?

ఆ సాయం చేసే... తన ప్రాణ స్నేహితురాలు... పూర్ణిమ, ఇప్పుడెక్క వుందో?

⁂

సాక్షాత్తు ఆ జగన్నాథుడు కొలువైన కోవెల... భక్తి పారవశ్యంతో హారతి కైమోడ్పు అంటుంది. పూజారి తీర్థాన్ని, ప్రసాదాన్ని అందజేస్తున్నాడు. అచ్చ తెనుగు చీరకట్టులో, పద హారణాల కొంటెతనాన్ని మేళవించి పూజారితో

''పూజారిగారూ, నాదో ధర్మసందేహం... అడగమంటారా? అంది పూర్ణిమ.

''అమ్మా తల్లీ నీ ధర్మసందేహాలకు ఆ యక్షుడు కూడా సమాధానాలు చెప్పలేడు.

దేవుడుని నమ్మవు... తీర్థప్రసాదాలు స్వీకరిస్తావు... మనుష్యులను నమ్మనంటావు... ఎవరికే సాయం కావాలన్నా చేస్తావు... స్నేహం, ప్రేమ ఒక ముసుగు అంటావు...

నీ ప్రాణ స్నేహితురాలి కోసం ప్రాణమైనా ఇస్తావు. ఇదంతా ఏమిటి తల్లీ? పూజారి అడిగాడు.

ఆ గుడికి వచ్చే భక్తుల్లో పూర్ణిమ గురించి తెలియని వారెవ్వరూ వుండరు. పదహారేళ్ళ క్రితం ఇదే గుడి ఆవరణలో ముగ్ధ కంటపడింది రెండేళ్ళ వయసున్న పూర్ణిమ. అప్పుడు ముగ్ధ వయసు అయిదేళ్ళు. అప్పటి నుంచి పూర్ణిమ బాగోగులు ముగ్ధే చేస్తోంది. గుడి వదిలి ఇంటికి రమ్మని ఎన్ని సార్లు ముగ్ధ పోరినా రానంది. తను చేసిన తప్పుకు ఈ దేవుడే పాశ్చాత్తాపపడి తన తల్లిదండ్రుల దగ్గరికి చేర్చాలని అంటుంది. ఆ దేవుడు తనకు బాకీ అంటుంది.

ఈ ప్రపంచంలో వున్న ఒకే ఒక ఆత్మీయురాలు ''ముగ్ధ అంటుంది పూర్ణిమ.

⁂

కోనేరు గట్టు మీద ముగ్ధ, పూర్ణిమ కూచున్నారు.

'' ఇప్పుడు నీ ప్రాణానికి ఈ కొరియర్ పంపించాలంటావు... అందుకే తలూపింది ముగ్ధ.

''అయినా నాకు తెలియక అడుగుతాను... నీకిలాంటి ఐడియాలు ఎలా వస్తాయే? కాబోయే మొగుడికి జామకాయ గిఫ్ట్ పంపడమేమిటో? ఏమిటీ మాంచి జామకాయలా ఉంటాడా? సరదాగా ఆటపట్టిస్తూ అడిగింది పూర్ణిమ.

ఇంకా బుద్ధిగా తలూపింది.

ఇంకా ముగ్ధను ఆటపట్టించాలని అనుకోలేదు పూర్ణిమ. ముగ్ధచేతిలో జామకాయ ప్యాక్ చేసిన బాక్స్. అప్పుడే రివ్వున ఎగిరి వచ్చి ఆ బాక్స్మీద వాటింది చిలుక.

సీతాపహరణలో జటాయువు చేసిన మేలు మర్చిపోలేదు జానకిరాముడు. ఆ జటా యువే ఈ చిలుక రూపంలో జన్మించిందేమో...

పూర్ణిమ లేచింది సిటికి బయల్దేరడానికి...

ఆ క్షణం తెలియదు పూర్ణిమకు ఈ దేవుడు తనను ఈ గుడిలోనే ఎందుకు వదిలేసా డని?

※※

# 24.

ఎన్నో ఉగ్రవాద సంస్థలతో పరిచయం... నిర్ధాక్షిణ్యంగా ఊచకోతకోసిన రాక్షసత్వం వున్న సిక్కీ రెండవసారి భయంతో వణికిపోయాడు. దేశసరిహద్దుల్లో కార్తికేయ తల్వార్‌తో తన చేతిని ఒకే వేటుతో నరికేసినప్పుడు... ఇప్పుడు మోహన పాయింట్‌బ్లాక్ రేంజ్‌లో రివాల్వర్ పెట్టి ట్రిగ్గర్ మీద వేలు బిగించినప్పుడు, ఒకరు దేశంకోసం ప్రాణాలిచ్చే వ్యక్తి అయితే... మరొకరు ఆ దేశాన్ని...?

''చావు నీకు వెంట్రుక దూరంలో వుంది. తల వుంటే సరిపోదు సిక్కీ... తలలో ఉండాల్సిన మెదడు కనీసం వంద గ్రాములైనా వుండాలి. నీ మెదడు బోర్డర్‌లో పాతిపెట్టి వచ్చావా?

''యాసిక్ ఢిల్లీలో వున్న నాలుగు వేల మూడు వందల నలభై మంది గూండాలలో ఒకడు. కేవలం అతనికి వున్న అమ్మాయిల పిచ్చి వల్ల వార్తల్లోకి వెళ్ళాడు. వాడు కాకపోతే మరొకడు. వాడిని కాపాడితే కార్తికేయ దృష్టి మనమీద పడుతుంది'' అతడి గుండెల మీద కాలుతీసి అంది.

''కానీ నాకు అర్థం కాని విషయం ఒకటుంది మేడం'' పలకరింపులో భయంతో కూడిన గౌరవం వచ్చింది.

''మీలాంటి వ్యక్తి కార్తికేయ లాంటి ఒక కస్టమ్స్ ఆఫీసర్‌కు ఎందుకు భయపడుతున్నారు? ఎఫ్ బి ఐని ముప్పుతిప్పలు పెట్టారు. రష్యా కె జి బి కూడా మిమ్మల్ని ఏమీ చేయలేక పోయింది. అలాంటిది ఆఫ్టాల్...'' అతని మాట పూర్తి కాకముందే అరిచింది మోహన ''స్టాపిట్''

''అసలు కార్తికేయ గురించి నీకేం తెలుసు? బోర్డర్‌లో వున్న నువ్వు సి బి ఐ చీఫ్‌ని చంపుతుంటే రెక్కలు కట్టుకుని వచ్చి నీ చేయి నరికాడని అనుకుంటున్నావా?

పులికళ్ళు, ఉడుంపట్టు... మెరిసే మెరుపులోని విద్యుత్‌శక్తి... పిడుగుపాటు పవర్ ఇలాంటివన్నీ కలిస్తే 'కా...ర్తి...కే...య...'

చెప్పడం ఆపి, సిక్కీ వంక చూసింది. సిక్కీ ఆశ్చర్యంగా మోహన వంక చూస్తున్నాడు.

ఎవరి గొప్పతనాన్ని ఆంగీకరించని మోహన... ఎవరినైనా నిర్లక్ష్యం చేసి మోహన ఓ వ్యక్తి గురించి అదీ శత్రువు గురించి... అతని ఉద్దేశం అర్థమైనట్టు కొనసాగించింది.

''యుద్ధంలో శత్రువును ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు... సైనికుడిని నిర్లక్ష్యం చేయవచ్చు... కానీ సైనికుడి చేతిలో వున్న ఆయుధాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఎందుకంటే ఆయుధానికి దయాదాక్షిణ్యాలు ఉండవు. కార్తికేయ బలమైన ఆయుధంలాంటి వాడు.

అతడే ఆయుధం... అతనే సైన్యం...''

:::::

ఒక్క క్షణం ఊపిరి పీల్చడం మర్చిపోయాడు.

సిక్కీ... శత్రువులను అంచనా వేయడంలో మోహనకు వున్న తెలివితేటలూ చూసి విస్తుపోయాడు. శత్రువు గురించి తెలుసుకోవడం వేరు... తెలుసుకున్నదానిని ఎనలైజ్ చేయడం వేరు. మోహన కొనసాగించింది''

దేశరాజధాని నడిబొడ్డులో యాసిక్‌ని అతి కిరాతకంగా చంపితే... ఆ దృశ్యాలు టీవీ చానెల్‌లో కూడా వచ్చాక కూడా పోలీసులు పట్టించుకోవడం లేదనే అనుకుంటున్నావా? ఢిల్లీ పోలీసులను తక్కువ అంచనా వేస్తున్నావా? ఆలోచించు సిక్కీ? ఆగింది మోహన. అక్కడ వాతావరణం ఉద్విగ్నంగా వుంది. ఇప్పుడు మోహన చెప్పబోయే విషయం సిక్కీ వెన్నులో చలి పుట్టించబోతుంది.

:::::

కార్తికేయ షవర్‌కింద నిలబడ్డాడు. షవర్‌ధారలో తడిసిపోతున్నాడు. యాసిక్‌ని చంపాక అతనిలో కొంత రిలాక్స్ కనిపించింది. అంజలి ఆచూకి తనకు, హేమంతకు తప్ప మరెవ్వరికీ తెలియదు. అంజలి శ్రేయస్సు దృష్ట్యా ఆ పని చేసాడు. షవర్ కట్టేసి డ్రెస్సింగ్ మిర్రర్ దగ్గరికి వచ్చాడు. అద్దంలో ముగ్ధ కనిపించింది. తన ఆలోచన ప్రతిబింబమే అది. తన వంకే చూస్తోంది. ముగ్ధ మాటలు గుర్తొచ్చాయి. ఇన్నాళ్ళు తాజ్‌మహల్‌లోనే వున్నాను... షాజ హాన్ సమక్షంలోనే వున్నాను. ఎంత గొప్ప భావం. ముగ్ధ జ్ఞాపకం అతనికి మండువేసవిలో మలయమారుతంలా వుంది.

అతని ఆలోచనలకు బ్రేక్‌వేస్తూ... సెల్ రింగ్ అయ్యింది. డిటెక్టివ్ శ్యాంసన్ దగ్గరి నుంచి వచ్చిన ఫోన్‌కాల్. ఒకే బటన్ ప్రెస్ చేసి ''చెప్పండి శ్యాంసన్'' అన్నాడు.

''సిక్కీ అడ్రెస్ ట్రేస్ చేసాం...'' అంటూ అడ్రస్ చెప్పాడు.

''థాంక్యూ శ్యాంసన్'' చెప్పి సెల్ ఆఫ్ చేసాడు.

:::::

ఒక్క క్షనం సిక్కీ వంక చూసి దీర్ఘంగా విశ్వసించి ''సారీ సిక్కీ ఇప్పుడు నీకో భయం కరమైన నిజం చెప్పబోతున్నాను... విని తట్టుకోగలవా? అంది మోహన.

సిక్కీ షాకింగ్‌గా చూసి '' ఏమిటది? అని అడిగాడు.

కార్తికేయ నెక్స్ట్ టార్గెట్ నువ్వే... సి బి ఐ చీఫ్ మీద హత్యాప్రయత్నం చేసాక నీ గురించి వేట మొదలైంది. నిన్ను ఫినిష్ చేయాలని నిర్ణయించుకున్నాడు. పార్లమెంట్ దాడి సంఘటన సమయంలో నువ్వు ఢిల్లీలోనే వున్నావన్న ఆధారాలు సంపాదించాడు. నిన్ను అరెస్ట్ చేయడం... కోర్టులో ప్రొడ్యూస్ చేయడం వాయిదాలు... వురి... ఆ తర్వాత క్షమాభిక్ష... ఇవన్నీ కార్తికేయకు నచ్చవు. డైరెక్టుగా నిన్ను చంపాలనే నిర్ణయించుకున్నాడు. మరో ప్రక్క మీ సంస్థ

కూడా నీ గురించి వెతుకుంది. పట్టుకుంటే మీ సంస్థ రహస్యాలు ఎక్కడ చెప్పిస్తావేమోనని వాళ్ళ భయం. తాపిగా చెప్పింది మోహన.

''నేను నమ్మను'' గట్టిగా అరిచాడు సిక్వీ.

''గట్టిగా అరిస్తే నిజం అబద్ధం అయిపోదు సిక్వీ... ఒకటి నీ వాళ్ళ చేతిలో చస్తావా?

రెండు... కార్తికేయ చేతిలో చిత్రహింసలు అనుభవించి చస్తావా?

లేదా... అని ఆగి

''సింపుల్‌గా పాయింట్ బ్లాక్ రేంజ్‌లో ఒకే ఒక బులెట్‌తో నా చేతిలో చస్తావా?''

సిక్వీ హిస్టీరియా వచ్చినట్టు ఊగిపోయాడు.

టైం లేదు సిక్వీ... నీ యిష్టం... ఓ సారి అటు చూడు...అంటూ తన చేతిలో వున్న రిమోట్ బటన్ ప్రెస్ చేసింది.

ఎదురుగా సి సి టీవిలో దృశ్యం... కార్తికేయ ఎంట్రన్స్‌లో వున్నాడు. లోపలికి నడిచి వస్తున్నాడు.

అటు ఊడు అంటూ మరో బటన్ ప్రెస్ చేసింది. ఉగ్రవాద సంస్థకు చెందిన కరుడుగట్టిన ఉగ్రవాదులు... చేతిలో ఆయుధాలతో లోపలికి ప్రవేశిస్తున్నారు. టైం లేదు సిక్వీ... మరణం అనివార్యం అనుకున్నప్పుడు... సులువైన మరణాన్ని కోరుకోవాలి... రివాల్వర్‌ని ముద్దు పెట్టుకుంటూ అంది.

సిక్వీ మెదడు పనిచేయడంలేదు. అతనిలో మొదటిసారి పశ్చాత్తాపం... తనేం సాధించాడు...

అనుక్షణం భయపడుతూ, ఇతరులను భయపెడుతూ... కుటుంబానికి దూరంగా... తను ఎవరి చేతిలో మరణించాలి? భయం స్థానంలో వైరాగ్యంతో కూడిన నవ్వు... భయం... అయోమయం... వైరాగ్యం అతని ఆలోచనను మొద్దువారేలా చేసాయి.

''నిర్ణయించుకో సిక్వీ టైం లేదు''

నిర్ణయించుకున్నాడు సిక్వీ...

''మీరు వెళ్ళండి మోహన... నా ప్రాణం ఎవరి చేతుల్లో పోతుందో అల్లా నిర్ణయిస్తాడు''

## 25.

చాలా తెలివిగా మైండ్‌గేమ్ ఆడింది మోహన... ఆ గేమ్‌లో ఆమె పందెం... సిక్వీ ప్రాణం.

మోహన ఆ హాల్‌లో వున్న సీక్రెట్ ద్వారం గుండా వెళ్ళిపోయింది. సిక్వీ ఒంటరిగా మిగిలాడు. ఏ క్షణమైనా అటు కార్తికేయ... ఇటు తనను చంపడానికి వచ్చే తన వాళ్ళు మొదటిసారి అతనిలో పశ్చాత్తాపం మొదలైంది. అతని తన భార్యాబిడ్డలు గుర్తొచ్చారు.

ఏ చీకటిలోనో... ఏ రహస్య బంకర్‌లోనో... కట్టుకున్న భార్యతో కూడా... భయం భయంగా ఎప్పుడు ఎటువైపు నుంచి ఎవరు దాడి చేసి చంపుతారో అన్న భయంతో కాపురం చేయాలి. పుట్టిన బిడ్డల మొహం కూడా గుర్తు ఉండని పరుగుల జీవితం భయంకరమైన శిక్షణ... బంధాలు అన్నీ వదిలేసి ఎవరికోసం ఈ ఆత్మాహుతి జీవితాలు?

ఇన్నాళ్ళు తను ఎవరికోసం పోరాడాడో వాళ్ళే తనను చంపుతారా? వాళ్ళ చేతిలో చచ్చిపోవాలా? తన శత్రువు చేతిలో చచ్చిపోవాలా? తన చావు రహస్యాన్ని చెప్పిన మోహన చేతిలో చచ్చిపోవాలా? వీళ్ళ చేతిలో చచ్చిపోకూడదు. ఇన్నాళ్ళు తనకు ఈ జీవితాన్ని, జన్మని ఇచ్చిన అల్లాను తన తప్పు క్షమించమని, మరో జన్మలో తనను మంచివాడిగా పుట్టించమని అల్లాకు క్షమాపణలు చెబుతూ చచ్చిపోవాలి.

సిక్కీ టేబుల్ మీద వున్న రివాల్వర్ తీసుకున్నాడు. తనకణతకు గురిపెట్టుకున్నాడు.

✲✲✲

అసలు జరిగిందేమిటో తెలుసుకోవాలంటే కొద్ది గంటలు వెనక్కి వెళ్ళాలి.

కార్తికేయ సిక్కీ కోసం వేట మొదలుపెట్టాడని తెలిసింది మోహనకు. ఖచ్చితంగా సిక్కీని పట్టుకుంటాడు. అతని నుంచి తన రహస్యాలు రాబడతాడు. తన గురించి వివరాలు తెలిసిన వ్యక్తి సిక్కీ మాత్రమే.

✲✲✲

సిక్కీ బ్రతికి వుంటే ఎప్పటికైనా సమస్యే... మోహన శత్రువులనే కాదు... తన ప్రాణానికి ముప్పు అని తెలిస్తే తన వాళ్ళనూ వదలదు. ఇప్పుడు సిక్కీ కార్తికేయకు దొరక్కూడదు... అంటే సిక్కీ చచ్చిపోవాలి లేదా పారిపోవాలి... ఎంత దూరం పారిపోగలడు... ఉగ్రవాదసంస్థ సిక్కీ ప్రాణాలను కాపాడుతుందా? పోనీ తనే సిక్కీని చంపితే? అప్పుడు ఉగ్రవాద సంస్థ హిట్ లిస్టులో తను ఉండిపోతుంది. మరో వైపు కార్తికేయ...

ఉగ్రవాద సంస్థను కార్తికేయ మీదికి ఉసిగొల్పితే? అప్పుడొచ్చిన ఆలోచన అమలు చేసింది. సిక్కీ ప్రాణాలు అపాయంలో వున్నాయని, కార్తికేయ అతడ్ని ఎన్‌కౌంటర్ చేయబోతున్నాడని... ఆ విషయాన్ని ఉగ్రవాద సంస్థకు చేరవేసింది. ఉగ్రవాదుల మూక కదిలివచ్చింది.

అదే సమయంలో సిక్కీతోపాటు తను ఇక్కడ వున్న విషయం కార్తికేయకు తెలిసేలా చేసింది. సిక్కీ భయం మీద చిన్న ట్రిక్ ప్లే చేసింది. తన చుట్టూ మృత్యువలయం ఉందన్న భ్రమని కలిగించింది.

కార్తికేయ సిక్కీని చంపితే ఉగ్రవాదమూక చేతిలో చావక తప్పదు... లేదా ఇద్దరి మధ్య డెత్ గేమ్ మొదలవుతుంది. సిక్కీ ఒకరి చేతిలో చావడానికి ఇష్టపడడు.... తనను తాను కాల్చుకుని... నవ్వుకుంది... మనిషి బలహీనత మీద గేమ్...

✲✲✲

చనిపోయే ముందు మరోసారి అల్లాని ప్రార్థించాడు. ''నేను చేసిన పాపాలకు శిక్షను నా కుటుంబానికి విధించకు... మతాన్ని ఉన్మాదంగా మార్చే మతోన్మాదులకు బుద్ధి చెప్పు... నీ

బిడ్డలకు మంచి బుద్ధి ప్రసాదించు... నా లాంటి చావు ఎవరికీ రాకుండా చూడు... అల్లా హో...''

బుల్లెట్ అతని కణతలో నుంచి దూసుకు వెళ్ళింది. అతను పొరపడి తన ప్రాణాలు తీసుకున్నాడు... కానీ అతనిలోని పశ్చాత్తాపం కొందరినైనా ఆలోచింపజేస్తుంది... ఎందుకంటే సిక్వీ చనిపోయే ముందు సూసైడ్‌నోట్ రాసాడు...

ఉగ్రవాదంతో మానవసంబంధాలను ఉరి తీయవద్దన్న కోరిక ఆ నోట్‌లోవుంది. సిక్వీ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి... ఉగ్రవాదమూక లోపలికి వచ్చేలోగా స్పెషల్ ఫోర్సు వాళ్ళని చుట్టుముట్టింది.

ప్రమాదాన్ని ముందే ఊహించి కార్తికేయ చేసిన ఏర్పాటు అది. కొందరు పారిపోయారు... కొందరు దొరికారు... వాళ్ళలో ముఖ్యమైన వ్యక్తి రజ్వీ.

⁂

సిక్వీ మృతదేహం ముందు కొద్దిక్షణాలు మౌనం పాటించాడు... సిక్వీలోని పశ్చాత్తాపం అతడి మీద వున్న దేశద్రోహి ముద్ర చెరిపేసింది. అతని కుటుంబానికి ఆసరా కలిపించవలసిన బాధ్యత కూడా వుందని భావించాడు కార్తికేయ. మోహన ఎస్కేప్ అయిన విషయం గుర్తించాడు కార్తికేయ... రజ్వీని ఇంటారేగట్ చేస్తే మోహన విషయం తెలిసే అవకాశం వుంది.

⁂

న్యూ ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్...

ఆ రోజు కొరియర్ చేయాల్సిన లిస్టులో వున్న బాక్స్ టేబుల్ మీద పెట్టాడు కొరియర్ బాయ్...

కార్తికేయ పేరుతో వున్న బాక్స్ అది.

⁂

# 26.

సిక్వీ మరణం కార్తికేయను కదలించింది. అతను ప్రాణభయంతో మాత్రమే ఆత్మహత్య చేసుకోలేదు. పశ్చాత్తాపం అతడి ప్రాణాలను పరిహారంగా అడిగింది. మీడియాకు పరిస్థితి వివరించాడు. రేటింగులు... పోటీ అనేవి వదిలేసి సిక్వీ వార్తను ప్రముఖవార్తగా గుర్తించాయి. తీవ్రవాదులకు పునరావాసం కలిగించి, కేసులను సైతం ఎత్తివేసిన సందర్భాలు వున్నాయి. బందిపోట్లకు క్షమాభిక్షలు వున్నాయి. పశ్చాత్తాపానికి గుర్తింపు ఉండాలి. సక్వీ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలి. తన మనసులోని మాటను మెయిల్ రూపంలో పెట్టాడు. అది రాష్ట్రపతికి వెళ్ళిన మెయిల్. నలభై ఎనిమిది గంటల తర్వాత సిక్వీ భార్యకు పోలీసు శాఖలో ఉద్యోగం వచ్చింది.

అల్లా వున్నాడు... సిక్వీ పశ్చాత్తాపం మొర విన్నాడు... కార్తికేయ వున్నాడు.

⁂

న్యూ ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్...

ఆ కొరియర్ బాయ్‌కి ఓ చెడ్డ అలవాటు వుంది. తను డెలివరి చేయాల్సిన కవర్‌లు ఓపెన్ చేయడం. కవర్‌లో కానీ, గిఫ్టబాక్స్‌లో కానీ ఏమైనా విలువైనవి వుంటే తస్కరిస్తాడు.. ఈ కారణంగా అతడ్ని చాలాచోట్ల పనిలో నుంచి తొలగించారు.

ముగ్ధ ప్యాక్ చేసిన బాక్స్ అందంగా వుంది. అందులో విలువైనది ఏదో ఉంటుందన్న నమ్మకం. డెలివరి చేసే టైంలో ఆ బాక్స్ ఓపెన్ చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆ బాక్స్‌ని భద్రంగా ఓ పక్కన పెట్టాడు. అతని ఢిల్లీలో సందులన్నీ కొట్టినపిండే.

మూన్ కేఫ్ దాటితే మూడవ సందులో ఎంట్రీగేట్ నెంబర్ ఫైవ్ కార్తికేయ ఇల్లు. తను మూన్ హోటల్‌లో కూచొని బాక్స్ సెట్ చెయాలి అనుకున్నాడు. అతని బైక్ మూన్ హోటల్ వైపు వెళ్తోంది.

⁂

మోహన ఇరవై మూడేళ్ళ యువకుడి గెటప్‌లో వుంది. చాలా రఫ్‌గా కనిపిస్తోంది. ఢిల్లీలో తన గురించి వేట మొదలైందని అర్థమైంది. రాబర్ట్ ఇండియాలో అడుగుపెట్టాడు. ఈ పరిస్థితుల్లో తను ఢిల్లీలో వుండడం క్షేమం కాదు. ఎక్కడికి వెళ్ళాలి? మొదటి ప్రశ్న. ఆ ప్రశ్నలో ఎన్నో సమాధానాలు వున్నాయి.

హోటల్ మూన్ దగ్గరికి వచ్చింది. ఆకలిగా అనిపించింది. సమోసా తిని టీ తాగితే?

మోహనకు అన్ని దేశాల ఆహారపు అలవాట్లు తెలుసు. ఎలా అయినా అడ్జస్ట్ అవ్వగ లదు.

మూన్ హోటల్‌లోకి అడుగుపెట్టి ఓసారి చుట్టూ చూసింది. ఆమె డేగ కళ్ళు పరిసర ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి. కార్నర్ టేబుల్ దగ్గర కూచుంది. అక్కడ ఓ కొరి యర్ కుర్రాడు ఉన్నాడు. అటు ఇటు బిత్తర చూపులు చూస్తున్నాడు. వెళ్ళి అతని ఎదురుగా కూచింది.

ఓసారి అబ్బాయి గెటప్‌లో వున్న మోహనవైపు చూసి అతని (మోహన) వల్ల తనకేమీ ప్రమాదం లేదని నిర్ధారించుకుని బాక్స్ ఓపెన్ చేయడానికి కుస్తీ పడుతున్నాడు.

మోహన ఓ కంట అతడ్ని కనిపెడుతూనే వుంది. క్షణాల్లో అక్కడి సీన్ అర్థమైంది.

''బాక్స్ అలా ఓపెన్ అవ్వదు'' మోహన చెప్పింది.

కొరియర్ కుర్రాడు భయంగా చూసాడు... తత్తరపడ్డాడు.

''భయపడకు... అదెలా ఓపెన్ చేయాలో నేను చూపిస్తాను'' అంటూ బాక్స్ ఓపెన్ చూసి చూపించాడు.

ఆ కుర్రాడు షాకయ్యాడు. ఎంత ఈజీగా ఓపెన్ చేసింది. అంతకన్నా షాకైంది మోహన.

లోపల జామకాయ... అది కాదు ఆమెను షాక్‌కు గురిచేసింది. ఆ జామకాయ మీద

గోటితో అందంగా చెక్కిన అక్షరాలూ.

కా...ర్తి...కే...య

బాక్స్ మీద అడ్రస్ చేసింది. అది కార్తికేయ అడ్రస్. మోహన మొమంలో మారుతోన్న రంగులు కొరియర్ కుర్రాడు చేసి వెంటనే భయంతో చచ్చేవాడు.

అతని మొహంలో నిరాశ.

మోహన కుర్రాడివంక చూసింది. పోనీలే... ఇంకో బాక్స్ ఓపెన్‌చెయ్...అంది.

'' ఇదే లాస్ట్'' అన్నాడాకుర్రాడు.

''పోనీలే... నాకో పని చేసి పెడతావా? అంటూ జేబులో నుంచి అయిదు వందల నోట్ల కట్ట తీసి అందులో నుంచి ఓ అయిదు వందల నోటు ఇచ్చి

'' ఓ మినరల్ వాటర్ బాటిల్'' తీసుకురా చిల్లర నువ్వే ఉంచుకో అంది.

ఆ కుర్రాడు ఆశ్చర్యంగా చూసాడు. మోహన నిజంగానే అన్నట్టు చూసింది.

'' ఒక్క క్షణంలో వస్తాను'' అంటూ బయటకు పరుగెత్తాడు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. ప్యాంట్‌లో వున్న పాయిజన్ బాటిల్ తీసింది. బ్యాక్ పాకెట్‌లో వున్న చిన్న సిరంజి తీసి పాయిజన్ బాటిల్‌లోని విషాన్ని జామకాయలోకి ఇంజక్ట్ చేసింది. ఇదంతా క్షణాల్లో జరిగింది.

ఆ కుర్రాడు వగరుస్తూ వాటర్ బాటిల్ తెచ్చి మిగిలిన డబ్బు ఇవ్వాలా? వద్దా? అని ఆలోచిస్తున్నాడు.

మోహన కామ్‌గా బయటకు నడిచింది. కొరియర్ కుర్రాడు జామకాయను ఎప్పటిలా ప్యాక్ చేసి కార్తికేయ ఇంటివైపు బయల్దేరాడు.

''మై డియర్ ఎనిమీ... కార్తికేయా నీ ప్రాణం విలువ కేవలం అయిదు వందలు'' అను కుంది.

ప్రియురాలు ప్రేమగా పంపించిన ఫలం తింటాడు. ఫలితం అనుభవిస్తాడు... మరణి స్తాడు.

హుషారుగా ఈల వేసింది మోహన.

⁂

ఒక్క క్షణం ఆందోలనకు గురయ్యాడు కార్తికేయ. అతనికి వచ్చిన సమాచారం ప్రకారం మోహన హైదరాబాద్ వెళ్తుంది. అక్కడ ఏం చేయబోతుంది? అక్కడ మోహన కద లికలు కనిపెట్టాలంటే ఒక నమ్మకమైన వ్యక్తి కావాలి. ఎవరతను... చిరుతవేగం... ప్రమాదానికి ఎదురె వెళ్ళే ధైర్యం... మృత్యువును చూసి డోంట్‌కేర్ అనే నిర్లక్ష్యం... అలాంటి ఆఫీసర్ ఎవ రున్నారు? అప్పుడు గుర్తొచ్చిన పేరు శ్రీనివాస్... శ్రీనివాస్ ఈడూరి. ఒకప్పుడు సిట్ ఆఫీసర్. ఇప్పుడు?

⁂

# 27.

శ్రీనివాస్ ఈడూరి...

హైదరాబాద్‌లోగోకుల్‌చాట్‌లో బాంబు పేలుళ్ళ తర్వాత అదే తరహాలో రాష్ట్ర అసెం బ్లీని టార్గెట్ చేసారు కొందరు ఉగ్రవాదులు.

పార్లమెంట్‌పై దాడితోదేశాన్ని, అసెంబ్లీపై దాడితో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే ప్రయ త్నాన్ని గమనించిన ప్రభుత్వం సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం)ని ఏర్పాటు చేసింది. కర్తవ్య నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించే శ్రీనివాస్ రాజకీయ నాయకులకు టార్గెట్ అయ్యాడు. హోం మినిస్టర్‌ని కూడా విచారించాలన్నాడు. ఇతర పార్టీల్లోవున్నా ఫాక్షనిస్టుల రక్తచరిత్ర వెలికితీసాడు. నిజాయితీని టిష్యూ పేపర్‌లా వాడుకుని వదిలేయాలని అతని ఉన్న తాధికారులు సలహా ఇచ్చారు. అది నచ్చని శ్రీనివాస్, తనలోని నిజాయితీని వదులుకోవడా నికి ఇష్టపడని శ్రీనివాస్ ఉద్యోగాన్ని వదిలేసాడు.

అసెంబ్లీ ఎదురుగా చిన్న కిరాణాకొట్టు పెట్టుకున్నాడు. ఐ.పి. ఎస్. చేసిన అతను కిరాణా కొట్టు ఎందుకు పెట్టుకున్నట్టు? ఆ విషయం తెలియాలంటే మనం ముందుకు వెళ్ళాలి.

⁘⁘

డోర్ బెల్ విని తలుపుతీసాడు కార్తికేయ... ఎదురుగా కొరియర్ బాయ్.

''సార్ కొరియర్'' బాక్స్ ఇచ్చి కార్తికేయ చేత సంతకం పెట్టించుకున్నాడు కొరియర్ బాయ్.

ఫ్రమ్ ముగ్ధ అన్న అడ్రస్ చూడగానే గొప్ప ఫీలింగ్ అతని హార్ట్‌ని టచ్‌చేసింది. ఆ బాక్స్‌ని అపురూపంగా పట్టుకున్నాడు.

వెంటనే డోర్ తీసి కొరియర్‌బాయ్‌ని కేకేసాడు. అప్పటికే అతను బైక్ స్టార్ట్ చేసాడు.

కార్తికేయ పిలువగానే ఒక్క క్షణం భయపడిపోయాడు. తను కవర్ ఓపెన్ చేసిన విషయం తెలిసిపోయిందా? మెల్లిగా బైక్ ఆపి భయంగా కార్తికేయ దగ్గరికి వచ్చాడు. కార్తి కేయ జేబులో ఎంత డబ్బు వుందని చూడలేదు. మొత్తం ఇచ్చేసాడు.

''థాంక్యూ మై బాయ్'' అన్నాడు. కార్తికేయ మొహంలో చూసిన ఆనందానికి కొరియ ర్‌బాయ్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తను చాలా పొరపాటు చేసాడు. ఇంకా నయం... అందులోని జామకాయని ఏమి చేయలేదు. ఒక్కోసారి చిన్న సంఘటన మనిషిని మారుస్తుంది. కొరియర్ బాయ్‌ని కూడా ఆ సంఘటన మార్చింది. ఇంకెప్పుడూ కొరియర్ కవర్‌లు ఓపెన్ చేయకూడదు... అని నిశ్చయిం చుకున్నాడు.

మోహన విషం ఇంజెక్ట్ చేసిన విషయం తెలియని కొరియర్‌బాయ్ కార్తికేయకు థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. అతను ఎంట్రీగేటు దాటుతుండగా ఒక పంజాబీ ముసలావిడ

చిన్న కుక్కపిల్లతో ఎదురైంది.

:::::

గది తలుపులు మూసి ముగ్ధ జ్ఞాపకాల తలుపులు తెరిచి జామకాయను చేతిలోకి తీసుకున్నాడు. చిన్నప్పుడు చూసిన జానపద సినిమాల గుర్తొచ్చాయి. కథానాయకుడు... కథా నాయిక పరకాయ ప్రవేశం చేయడం...

అవును ఇప్పుడు కూడా తన ముగ్ధ ఈ జామకాయలోకి పరకాయ ప్రవేశం చేసిందా? దాన్ని పెదవులకు ఆన్చుకున్నాడు.

చాకు కోసం కిచెన్‌లోకి వెళ్ళాడు. చాకు తీసుకు వచ్చి జామకాయను చేతిలోకి తీసు కున్నాడు. ఒక్క క్షణం కార్తికేయ మనసు విల విల్లాడింది. ముగ్ధ పంపిన జామకాయను చాకుతో ముక్కలు చేయడమా? చేత్తో కలుపుకు తినే అన్నానికి, స్పూన్‌తో తినడానికి ఎంత తేడా వుంటుంది?

దాన్ని తన పెదవుల మధ్య బంధించి పళ్ళతో కొరికి తినాలి. చాకు టేబుల్ మీద పెట్టి కాయను చేతిలోకి తీసుకున్నాడు.

:::::

పంజాబీ ముసలావిడ ఒక్క క్షణం రోడ్డు మీదే నిలబడి ఆయాసం తీర్చుకుంది. ఆమె ఎడమ చేతిలో అడ్రెస్ కాగితం... కుడిచేతిలో కుక్కపిల్లలను కట్టేసిని గొలుసు. ఆ రోజు కార్తి కేయ చేసిన మేలు మర్చిపోలేదు పంజాబీ ముసలావిడ...

కార్తికేయ అడ్రెస్ వెతికి పట్టుకుని కార్తికేయకు కృతజ్ఞత చెప్పడానికి బయల్దేరింది. ఒక్కర్తే వద్దామనుకుంటే కుక్కపిల్ల కూడా వెంట పడింది...

విశ్వాసం అలాంటిది.

'' ఇదిగో అబ్బాయి కాస్త ఈ అడ్రెస్ చెబుదూ'' అంది బైక్ మీద కొరియర్ అన్న అక్ష రాలూ చూసి. అడ్రెస్ కాగితం మీద కార్తికేయ అన్న పేరు చూసాడు. అప్పటికే అతనికి కార్తి కేయ మీద అభిమానం పెరిగింది. వెంటనే బైక్ ఆపి కార్తికేయ ఇంటి దగ్గరికి తీసుకువెళ్ళి అడి గాడు బాయ్...''సార్ మీకు ఏమవుతారు?

''నాకు బిడ్డలాంటివాడు... అంటూ ఆ రోజు తన కుక్క పిల్లను కార్తికేయ కాపాడిన విషయం చెప్పింది'' దానితో అతనికి కార్తికేయ అంటే మరింత ఇష్టం పెరిగిపోయింది.

:::::

జామకాయను కొరుకబోతుండగా డోర్‌బెల్ శబ్దం... ఈ టైంలో ఎవరొస్తారు? ఎవరో చూస్తే సరి... అనుకుని జామకాయను టేబుల్ మీద పెట్టాడు. వెంటనే జేబులో నుంచి కర్చీఫ్ తీసి టేబుల్ మీద పెట్టి దానిమీద జామకాయ పెట్టాడు.

హాలులోకి వచ్చి తలుపు తీసాడు. ఎదురుగా పంజాబీ ఆవిడ... ''మీరా? ఆశ్చర్యంగా అన్నాడు.

''అవును బేటా... కొడుకుని వెతుక్కుంటూ తల్లి వచ్చింది'' చెప్పింది ఆవిడ.

''చాలా సంతోషంగా వుంది అమ్మా'' అంటూ వంగి ఆవిడ పాదాలకు నమస్కరించ బోయాడు.

మధ్యలోనే అడ్డుకుని పైకి లేపి ప్రేమగా ఆలింగనం చేసుకుంది. కుక్కపిల్ల ఆమె చేతిలో వున్న గొలుసును వదిలించుకోవడానికి పాట్లు పడుతుంది.

కార్తికేయ ఒళ్లోకి వెళ్ళడానికి నానా పాట్లు పడుతుంది...

''చూసావా బేటా... దీనికి నువ్వంటే ప్రాణం... తన ప్రాణం కాపాడింది నువ్వేగా'' మనస్ఫూర్తిగా అంది ఆవిడ.

కార్తికేయ ప్రేమగా కుక్కపిల్ల తల నిమిరాడు. కుక్కపిల్ల లోపలికి పరుగెత్తబోయిది.

తన యజమాని మందలించడంతో గుర్రుగా చూస్తోంది.

''వెళ్ళనీ అమ్మా'' అంటూ కుక్కపిల్ల గొలుసు తీసేసాడు. అది లోపలికి పరుగెత్తింది.

సరాసరి జామకాయ వున్న గదిలోకి.

***

కార్తికేయ కిచెన్‌లోకి వెళ్లి కాఫీ కలుపుకొని వచ్చాడు... దాదాపు అరగంటసేపు మాట్లా డుకున్నారు. ముగ్ధ గురించి అడిగింది ఆవిడ... తన ఇంటికి ఆహ్వానించింది. తన పిల్లలు విదే శాల్లో వున్నారని తనకు తోడూ కుక్కపిల్లే అని చెప్పింది.

అప్పుడు గుర్తొచ్చింది. ఏ మాత్రం అలికిడి లేదు... ఎప్పుడూ సైలెంట్‌గా వుండటం అలవాటు లేదు.

ఇద్దరూ వెళ్ళి వెతుకుతున్నారు. కార్తికేయ తన గదిలోకి వచ్చి అక్కడి దృశ్యం చూసి స్థాణువు అయ్యాడు.

పంజాబీ ఆవిడ స్పృహ తప్పి పడిపోయింది... కారణం... కుక్కపిల్ల నేలమీద పడి చని పోయి వుంది. దాని నోట్లో నురగలు.

తన ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతగా కార్తికేయ ప్రాణాలు కాపాడి తన ప్రాణాలు వదలింది.

***

# 28.

ఒక్క క్షణం ఆ గదిని విషాదం చుట్టుముట్టింది. మోకాళ్ళ మీద కూచుండి పోయాడు కార్తికేయ.

ఒక ప్రాణి... నోరు లేని ప్రాణి...

''భౌ'' ఈ పదానికి శబ్దరత్నాకరం ఏమని అర్థం చెబుతుంది. మాటలు నేర్చిన బిడ్డ అమ్మా అంటుంది...

మాటలే తెలియని ఈ జంతువు ఏమని పిలుస్తుంది. ''మిత్రమా నేను నీ జాతి కాదు...

నీ మిత్రుడనీకాను... అయినా మిత్రమా అని సంభోదిస్తున్నాను... మీ మనుష్యులకు విశ్వాస పాత్రమైన శునకాన్ని. నాకు తెల్సినదల్లా విశ్వాసంగా వుండటం. మీలా మాకు ఈర్ష్యాద్వేషాలు లేవు. నీకోసం చనిపోవడం నాకు సంతోషమే... నా యాజమానిని వదిలి వెళ్ళిపోతున్నాను... ఒక రోజు నువ్వు కాపాడిన ప్రాణమే కదా ఇది. సెలవిక''.

కుక్కపిల్ల తలను నిమిరాడు. ''భౌ'' చిన్న శబ్దం ఆ చిన్న ప్రాణిని భౌతికంగా దూరం చేసింది. ఎదురుగా పంజాబీ ఆవిడ. '' ఏమని వోదార్చగలడు?

''అమ్మా నన్ను క్షమించు'' రెండు చేతుల జోడించాడు కార్తికేయ.

ఆ రెండు చేతులు పట్టుకుని ''వద్దు బేటా... ఒక విధంగా సంతోషంగా వుంది. నీ ప్రాణం ఎంతో విలువైనది. నీ ప్రాణాన్ని కాపాడి ఆ చిన్నిప్రాణం మంచి పని చేసింది. చిన్న కోరిక బేటా.. దీన్ని పాతిపెట్టినచోట ఒక గులాబీ మొక్క నాటించు'' గద్గద స్వరంతో చెప్పింది ఆవిడ.

కార్తికేయ అలానే అన్నట్టు తలూపాడు.

***

ఓ ప్రాణికి వీడ్కోలు చెప్పాడు. కొద్ది క్షణాల అటాచ్మెంట్... అంతలోనే సెలవంది. తన ప్రాణాలు కాపాడింది. లైటు కూడా వేసుకోవాలనుకోలేదు. అలానే కూచుండిపోయాడు. విషాదం అనుభవించిన కొద్ది మనల్ని నిస్తేజులను చేస్తుంది. జామకాయలో విషం ఇంజక్ట్ చేసింది ఎవరు? అతి ప్రమాదకరమైన విషం. ఎంతో ప్లాన్డ్‌గా చేసిన పని.కార్తికేయ అను మానం కొరియర్ బాయ్ మీదికి వెళ్ళింది. అతనికి మాత్రమే అవకాశం వుంది. కానీ ఇంత తెలి విగా తనని చంపాలని చూసే తెలివి, అవసరం అతనికి లేవు. ఈ కొరియర్ విషయం ఎవరికి తెలుసు?

అప్పుడే సెల్ రింగ్ అయింది. ఆ నంబర్ ల్యాండ్ ఫోన్ ది. ముగ్ధ నుంచి వచ్చిన ఫోన్... జరిగినదంతా తెలిస్తే తను తట్టుకోలేదు. చెప్పకూడదు. ఓ నిర్ణయానికి వచ్చాడు. ఆన్ బటన్ నొక్కాడు.

''నేను ముగ్ధని'' గొంతులో అమృతం గాలిలో తేలి వస్తోన్న ఫీలింగ్.

''చెప్పు ముగ్ధ... ఎలా వున్నావ్? నాన్న, తమ్ముడు బావున్నారా?

''బావున్నారు. తమ్ముడితో మీ గురించి చెప్పాను. అప్పుడే బావగారిని ఎప్పుడు చూపిస్తావు?'' అని అడుగుతున్నాడు. సంబంరంగా చెప్పింది.

''త్వరలో మీ వూరికి వస్తాను... మీ నాన్నగారితో మాట్లాడుతాను. మా ఫ్రెండ్ పూర్ణి మకు చెప్పను. మీ గురించి'' అంది కాసింత సిగ్గుపడుతూ ముగ్ధ.

'' ఇంకా ఎవరెవరికి చెప్పావ్? నవ్వుతూ అడిగాడు కార్తికేయ.

''మా వూరి కోవెల్లో వున్న జగన్నాథుడికి నాక్కాబోయే నాథుడి గురించి చెప్పాను... మా వూరి పంట పొలాలకు చెప్పాను. కొబ్బరి తోటలకు చెప్పాను. గోధూళికి, గోపన్నలకూ చెప్పాను. మా పెరట్లో వున్న జామచెట్టుకీ, ఆ చెట్టు కాయలు ఎంగిలి చేసి, చిలుక కొరికిన

పండు తీయనా... అని గారాలుపోయే మా ఇంటి చిలుకకు...'' చెప్పాను.

ఆ క్షణం ముగ్ధను దగ్గరికి తీసుకోవాలని అనిపించింది.

ఎంత గొప్ప ఆలోచన.

బంధుమిత్రులకు కాదు... అందమైన ప్రకృతిలోని ఎన్నింటికో తమ ప్రేమకథ చెప్పిందట...

ముద్దుగా అనుకున్నాడు.

''నేను పంపిన...'' ఆగి సిగ్గుపడింది.

''నీ ప్రేమ నైవేద్యాన్ని ఆరగించాను''.

'' ఎలా వుందో చెప్పనే లేదు?

''గుండె గొంతుకలో కొట్టుమిట్టాడుతూంది. నీ జ్ఞాపకాన్ని గొంతులో నుంచి హృదయానికి చేర్చి వస్తానని చెబుతోంది''

ల్యాండ్ ఫోన్ ఆమె గుండెల మధ్య కూచుంది. ఆమె ఎద సవ్వడి వైబ్రేషన్స్‌గా మారి, టెలిఫోన్ తీగల ద్వారా అతని చెవులను చేరి ప్రబంధాన్ని ప్రవచిస్తున్నట్టు వుంది.

'' ఇంకా మాట్లాడాలని వుంది. నాన్నగారు చూస్తే బావోదు. ఉండనా మరి'' అంది ముగ్ధ.

''సరే మరి...శుభరాత్రి'' నవ్వుతూ అన్నాడు కార్తికేయ.

''మీ జ్ఞాపకాలు ఎప్పుడూ నాకు శుభప్రదమే...'' అనుకుంది. ఈలోగా తండ్రి లేచిన అలికిడి కావడంతో ఫోన్ పెట్టేసి అటు తిరిగి పడుకుంది.

వచ్చింది తండ్రికాదు... ఓ అపరిచిత వ్యక్తి.

కొరియర్ ఆఫీసు ముందు నిలబడ్డాడు. ''లోపలికి వెళ్ళి ఎంక్వయిరీ చేయడం, అందరి ముందే ఆ కుర్రాడిని బెదిరించడంకన్న, ఆ కుర్రాడి ద్వారా జరిగింది ఏమిటో తెలుసుకోవాలి'' అనుకున్నాడు. మరో అయిదు నిమిషాల తర్వాత ఆ కొరియర్‌బాయ్ వచ్చాడు. మొహాన విభూది. కార్తికేయను చూస్తూనే సంతోషంగా దగ్గరికి వచ్చాడు.

''నమస్కారం సార్... ఇప్పుడే గుడికి వెళ్ళి మీ పేరు మీద అర్చన చేసి వస్తున్నాను. మీకు తెలుసా సార్... ఎప్పుడో చిన్నప్పుడు గుడికి వెళ్ళాను. మళ్ళీ ఇప్పుడు'' సంతోషంగా చెప్పాడు.

''నా పేరు మీద అర్చన ఎందుకు?'' అర్థం కాక అడిగాడు కార్తికేయ.

'' ఎందుకంటే నేను మీ వల్లనే మారాను సార్... ఒకరి కవర్‌లు విప్పడం ఎంత తప్పో తెలిసింది. ఇక జీవితంలో ఏ తప్పూ చేసయను సార్'' అన్నాడు కుర్రాడు.

''కవర్ విప్పారా?'' ఆశ్చర్యంగా అడిగాడు కార్తికేయ.

నిన్న జరిగినదంతా చెప్పాడు ఆ కుర్రాడు.

''నువ్వు చాలా పెద్ద పొరపాటు చేసావు. ఒక ప్రాణం పోయింది'' అంటూ నిన్న జరిగిన ఇన్సిడెంట్ చెప్పాడు కార్తికేయ.

''సార్ ప్రామిస్‌గా చెబుతున్నాను... నేనేతప్పూ చేయలేదు... అని ఆగి ''సార్ నా ఎదురుగా కూచున్న యువకుడు... నన్ను వాటర్ బాటిల్‌కోసం పంపించాడు'' అని చెప్పాడు.

''యువకుడా''?

''అవును సార్... పాతికేళ్ళు వుంటాయి. అందంగా వున్నాడు... అతని దగ్గర బోల్డు డబ్బు వుంది. నాకు అయిదు వందలు ఇచ్చి వాటర్ బాటిల్ తెప్పించుకుని చిల్లర కూడా నన్నే వుంచుకోమన్నాడు'' చెప్పాడు.

''షిట్'' నుదురు మీద కొట్టుకున్నాడు కార్తికేయ.

ఆ యువకుడి వేషంలో వచ్చింది మోహనే... ఇదంతా ఆ కొరియర్ కుర్రాడికి చెప్పినా అర్థం కాదు.

''నువ్వు చేసిన పనివళ్ళ ఒక మూగజీవి ప్రాణం కోల్పోయింది'' చెప్పాడు కార్తికేయ. ఆ కొరియర్ కుర్రాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. జేబులో నుంచి నిన్న మోహన వేషంలో వున్న యువకుడు ఇచ్చిన డబ్బులు వున్నాయి.

ఎదురుగా రెడ్‌క్రాస్ వాళ్ళు విరాళలు సేకరిస్తున్నారు. ఆ డబ్బు తీసుకు వెళ్లి విరాళాల బాక్స్‌లో వేసాడు. రెండు చేతులు జోడించాడు క్షమించమన్నట్టు కార్తికేయ వైపు చూసి.

చేసిన తప్పు తెలుసుకుని మారిన అతడ్ని క్షమించాడు కార్తికేయ.

అప్పుడే హైదరాబాద్ నుంచి ఓ విషాదకరమైన వార్త...

హైదరాబాద్‌లో దిల్‌షుఖ్‌నగర్ ప్రాంతంలో బాంబ్ పేళుళ్ళు... చాలా మంది మరణించాడు అన్న వార్త.

❖❖❖

# 29.

హైదరాబాద్...

ఎందరో పొట్టచేత్తో పట్టుకుని ఇక్కడికి వచ్చి బ్రతుకు పోరాటం చేసే నిరుద్యోగులు, నిరక్షరాస్యులు, నిరుపేదలు...

అందరికీ నీడనిచ్చే భాగ్యనగరం. విభిన్న సంస్కృతులను తనలో కలుపుకున్న హృదయ వైశాల్యం వున్నా చార్ సౌ కా హమారా షహర్...

గోల్కొండకోట, నవాబుల అలనాటి దర్జా, ట్యాంక్‌బండ్ అందాలు, ఒక్కప్పటి టాంగాలు మట్టి రోడ్లు...

అలనాటి వైభవాల ఆనవాళ్ళు...

క్రమక్రమంగా కనుమరుగవుతూ, కాంక్రీట్ మయమయ్యే రహదారులే కాదు మానవ సంబంధాలు వ్యక్తిత్వపు ఉనికిని కోల్పోతున్న వేళ...

మనుష్యులకు పట్టని మతం, మతోన్మాదులకు ఆయుధమైంది. ఉగ్రవాదం ఉన్మాదం అయింది. ప్రతీకారేచ్ఛ పైశాచికత్వమైంది. నగరం బాంబులమోతతో దద్ధరిల్లింది. దిల్‌సుక్ నగర్ రక్తసిక్తమైంది. ప్రభుత్వ స్పందన, రాజకీయనాయకుల పరామర్శలు, మీడియా హడా వుడి షరా మామూలే. కొద్ది క్షణాల క్రితం చనిపోతామన్న వూహ కూడా వచ్చి వుండదు. ఈ నరమేధం వెనుక వున్నవాళ్ళు దొరికేదెప్పుడు?

పోలీసులే వెతకాలా? ప్రజలూ సైనికులై కదలాలి. ఉగ్రవాదజాడ కనిపిస్తే సమూ లంగా పెకిలించివేయాలి.

సికింద్రాబాద్ రైల్వేస్టేషనులో దిగింది మోహన. ఆమె దిగిన పదినిమిషాల తర్వాత హైదరాబాద్‌లో బాంబ్ బ్లాస్ట్ జరిగింది.

⁘⁘

రజ్వీ... ఉగ్రవాద సంస్థలకు సుపరిచితమైన పేరు. ప్రపంచంలో డబ్బు తప్ప మరేదీ ఉపయోగపడదు అని నమ్మే వ్యక్తి. కేవలం కిరాయి డబ్బుల కోసమే ఉగ్రవాది అన్న ట్యాగ్ లైన్ ధరించాడు.

''సుపారీ'' తీసుకుని హత్యలుచేసే మాఫియాకు, రజ్వీకి పెద్ద తేడాలేదు. ఆయుధాలు ఉపయోగించడంలో శిక్షణ ఇవ్వడం, ఆయుధాలు అక్రమ రవాణ చేయడం అతని వృత్తి. సిక్వీని కాపాడే పనిమీద వచ్చి స్పెషల్‌ఫోర్సు చేతిలో చిక్కాడు. రెండు రోజులగా అతడిని ఎవరూ ఏమీ అడగడంలేదు. అతనితోపాటు పట్టుబడిన వాళ్ళను ఏం చేసారో తెలియదు. పెద్ద గది కూలర్ వుంది. టీవీ వుంది, ఫ్రిజ్ వుంది. ఫ్రిజ్‌లో తినడానికి పళ్ళ వున్నాయి. ల్యాండ్ ఫోన్ ఉంది.

చాలా ఆశ్చర్యంగా ఉంది రజ్వీకి... తను పట్టుకోగానే టార్చర్ చేస్తారని ఊహించాడు. టార్చర్‌ని తట్టుకునే శిక్షణ తీసుకున్న వాడు. తప్పనిసరి అయితే మెడలో వున్న సూసైడ్‌పిల్ మింగాలి...

అప్పుడు తడిమి చూసుకున్నాడు... సూసైడ్ పిల్ లేదు. అసలు తనని ఏం చేస్తారు? రెండు రోజులుగా అతడ్ని కుదురుగా ఉండనివ్వడంలేదు ఈ ఆలోచన. తన సెల్‌ఫోన్ లేదు... జేబులో వున్న పర్స్ భద్రంగా వుంది.

⁘⁘

ఇప్పుడు తననేం చేస్తారు? తనను విడిపించడానికి ఎవరొస్తారు? మిగితా వాళ్ళంతా ఏమైనట్టు?

తనను రక్షించమని ఫోన్ చేయాలి. ల్యాండ్ ఫోన్ దగ్గరికి వెళ్లి రిసీవర్ తీసి నంబర్ డయల్ చేయబోయి ఆగిపోయాడు.

ఈ పోలీసులను నమ్మడానికి వీల్లేదు. తను ఏ నంబర్‌కి ఫోన్ చేస్తున్నాడో తెలుసుకో వడం కష్టంకాదు.

రెండు నిమిషాల తర్వాత మెల్లిగా తలుపు తెరుచుకున్న శబ్దం...

ఓ మూలాన వున్న ఫ్లవర్‌వాజ్ చేతిలోకి తీసుకున్నాడు. కుడిచేత్తో పట్టుకున్నాడు. ఎవ డొచ్చినా వాడి తల బద్దలు కొట్టాలి... అని మైండ్‌లో ఫిక్స్ అయ్యాడు.

తలుపు తెరచుకుంది. రెండు తలుపులు తెరచుకున్నాయి. కానీ ఎవరూ రాలేదు. ఓపిగ్గా ఎదురుచూస్తున్నాడు.

ఒకటి... రెండు... మూడునిమిషాలు గడిచాయి... ఎవరూ రావడంలేదు. అదేమిటి?

ఫ్లవర్‌వాజ్‌ని అలాగే పట్టుకొని బయటకు నడిచి షాక్ అయ్యాడు. తలుపుల బయట చుట్టూ గోడ... బయటకు వెళ్ళడానికి లేదు.

మరి తలుపులు ఎవరు... ఎలా తెరిచినట్టు? లోపలికి వచ్చి మరోసారి షాక్ తిన్నాడు. టేబుల్‌మీద బిర్యాని ప్లేట్... పొగలు కక్కుతోంది.

''త్వరగా చల్లారకముందే తినేసెయ్... ''వెనుక నుంచి మాటలు వినిపించాయి. వెనక్కి తిరిగి చూస్తే ఆరడుగుల మనిషి దృఢంగా వున్నాడు.

'' ఎలా వచ్చాడు? తనలో తనే గొణుకున్నాడు. ఆరడుగుల మనిషి ముందుకు నడిచి వార్డ్ రోబ్ తెరిచి లోపలికి వెళ్ళాడు.

వార్డ్‌రోబ్ డోర్ మూసుకుంది. అందులోంచి అతను తిరిగి బయటకు రాలేదు. చుట్టూ నాలుగు వైపులా నాలుగు వార్డ్ రోబ్స్... అంటే?

రజ్వీ తల తిరిగిపోయింది. ఎదురుగా గోడమీద ప్లాస్మా టీవిలాంటి స్క్రీన్లో ఓ దృశ్యం.

'' ఇందాక తను ఫ్లవర్‌వాజ్ తీయడం. చేత్తో పట్టుకోవడం... దగ్గరినుంచి బిర్యాని తింటున్న సన్నివేశం వరకు లైవ్‌లో వస్తున్నట్టు వస్తుంది.''

అంతకన్నా బుర్ర తిరిగిపోయే వార్త...

బోర్‌గా అనిపించి రిమోట్‌తో టీవీ ఆన్ చేసాడు.

# 30.

హైదరాబాద్...

బంజారాహిల్స్ రోడ్ నంబర్ పన్నెండు...

అర్థరాత్రి రెండు దాటింది. అక్కడ వున్న ఓ భవంతిలో లైట్లు వెలుగుతూనే వున్నాయి. నలభై ఏళ్ళు దాటిన ఒకావిడ కంప్యూటర్ ముందు కూచొని వుంది. ఆమె పొడవాటి చేతివ్రేళ్ళు కీబోర్డు మీద చక చక కదులుతున్నాయి. దాదాపు మూడు గంటలుగా ఆమె అవిశ్రాంతంగా పని చేస్తూనే వున్నా ఆమె మొహంలో అలసట కనిపించటం లేదు. ఆమె కళ్ళ ముందు దిల్ సుఖ్‌నగర్ బాంబ్ దుర్ఘటన వెన్నాడుతుంది. బాధితుల ఆక్రందనలు వినిపిస్తున్నాయి... వారి లోకొందరికి రక్తం అత్యవసరం. వెంటనే రంగంలోకి దిగింది. ముందుగా తన రక్తం ఇచ్చింది. ఆమెను వెన్నంటి వున్న సేన రామదండులా కదిలింది. దిల్‌సుక్ నగర్ చేరింది. అర్థరాత్రి

దాటినా ఒంటరిగా బయల్దేరింది.

''అత్తయ్యా నన్ను రమ్మంటారా?'' కోడలు అడిగింది.

''వద్దు తల్లీ ఉదయం నుంచి పని చేస్తూనే వున్నావ్... వెళ్ళిపడుకో'' ప్రేమగా చెప్పింది.

కష్టాల్లో వున్న వారికి విజిటింగ్ అవర్స్ వుండవన్నది ఆమె నమ్మకం. యు ఎస్‌లో వున్న హైదరాబాద్‌లో వున్నా తన మూలాలు మరచిపోని వ్యక్తి.

రెండు గంటలక్రితమే కార్తికేయ నుంచి ఫోన్. హైదరాబాద్‌లో వున్న బాంబ్ బాధితులను ఆదుకోమని... అప్పటికే ఆ పనిలోనే వుంది ఆవిడ. ప్రజాసేవ చేయాలంటే రాజకీయాలే అక్కర్లేదని నమ్మిన మనిషి. తండ్రి నుంచి రాజనీతి శాస్త్రాన్ని నేర్చుకుంది. రాజకీయ విలువలకు పట్టం కట్టిన కోన ప్రభాకర్‌రావ్ తనయగా గర్వపడుతూనే ఆ తండ్రి ఆశయాలు కొనసాగిస్తున్న ఆవిడ... మాలతి దేచిరాజు.

కొన్నాళ్ళ క్రితం ఏర్పడ్డ ఓ చిన్న సంస్థ

ఆసరా... శ్వాసించడమే కష్టమైపోతున్న మానవత్వానికి ఆసరా ఇవ్వాలని... విలువలు వలువలు కోల్పోయే వ్యవస్థకు ఆసరగా నిలబడాలని చేసిన ఉడతా ప్రయత్నం ఇప్పుడు వారథిగా మారింది. వ్యక్తికి బహువచనం శక్తిగా అవతరించింది.

ఆమె డ్రైవ్ చేస్తుండగానే ఫోన్... కార్తికేయనుంచి. ''మాలతిగారు నేను ఓ ముఖ్యమైన పనిమీద హైదరాబాద్ వస్తున్నాను'' అన్న సందేశం.

కార్తికేయ రాక ఈకథను మరో మలుపు తిరుగుతుందని ఆ క్షణం తెలియదు మాలతికి. ఆమెకు తెలిసింది సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడమే.

మాలతి కారు హాస్పిటల్‌లోకి ప్రవేశించింది. అప్పుడే హాస్పిటల్ నుంచి బయటకు వచ్చింది మోహన. ఈ సంఘటన జరగడానికి గంట ముందు.

***

రజ్వీ టీవిలో కనిపించిన దృశ్యం చూస్తూ అలాగే వుండిపోయాడు. తను చూస్తున్నది నిజమేనా?

టీవీ ఛానల్‌లో వార్తలు.

సిక్వీ మరణం తర్వాత స్పెషల్‌ఫోర్సుకు దొరికిన కొందరు ఉగ్రవాదులు గంటక్రితం పారిపోయే ప్రయత్నం చేయడంతో స్పెషల్‌ఫోర్సు వారిని ఎన్‌కౌంటర్ చేసింది.

స్క్రీన్‌మీద మృతదేహాలు... కుప్పగా పోసినట్టు... వారు వేసుకున్న దుస్తులు రక్తసిక్తం అయ్యాయి. గుర్తుపట్టడానికి వీలులేని విధంగా వున్నాయి.

రజ్వీ గుండె వేగంగా కొట్టుకుంటుంది. నిజంగా పారిపోయారా? పారిపోయేలా చేసి చంపేసారా?

ఇప్పుడు తన పరిస్థితి...? బలి ఇవ్వడానికి ముందు మేకను మేపినట్టు... తనని... అందుకే ఇంత ఫ్రీగా వదిలిపెట్టారా? తన వెనుక వార్డ్ రోబ్ తెరుచుకున్న చప్పుడు... టీవీ రిమోట్‌తో టీవీ కట్టేశాడు. ఏమీ తెలియనట్టు వున్నాడు.

కార్తికేయ అతనితోపాటు మరో ఇద్దరు ఆఫీసర్లు వచ్చారు. కార్తికేయ రజ్వీ ఎదురుగా వున్న కుర్చీలో కూచున్నాడు. ఇద్దరు ఆఫీసర్ల వైపు చూసాడు.

''సర్... మనం తెలుగులో మాట్లాడుకుందాం. వీడికి తెలుగురాదు'' ఒక ఆఫీసర్ చెప్పాడు.

''ఓకే... వీడిని కూడా పారిపోయేలా చేసి ఎన్‌కౌంటర్ చేసేద్దాం. కోర్టుకు ప్రొడ్యూస్ చేయడం... సాక్ష్యాలు... ఎవిడెన్స్... అపీల్, క్షమాబిక్ష ఇవన్నీ అవసరమా''? కార్తికేయ అన్నాడు.

''మీ యిష్టం సర్.. వీడికి కాపాల కాయలేక చచ్చిపోతున్నాం. అప్పటికీ మీరు చెప్పి నట్టే రోజూ ఫుడ్డులో స్లో పాయిజన్ ఇస్తున్నాం.. మిగతా వాళ్ళు మన మాట వినక ఎన్‌కౌం టర్ అయ్యారు. వీడొక్కడే మిగిలాడు. వీడ్ని కూడా ఆ ఖాతాలో కలిపేస్తే లెక్క సరిపోతుంది'' మరో ఆఫీసర్ చెప్పాడు.

'' ఓకే వీడ్ని వదిలేస్తున్నామని చెప్పండి... వద్దొద్దు మనం వెళ్లిపోదాం... డోర్స్ ఓపెన్ చేయండి. పారిపోయే ముందు షూట్ చేయండి'' అంటూ లేచాడు కార్తికేయ.

ఆ సంభాషణ అంతా వింటున్నాడు రజ్వీ. అతను ఆంధ్రప్రదేశ్‌లో రెండేళ్ళు వున్నాడు... తెలుగు నేర్చుకున్నాడు. వీళ్ళ మాటలు శ్రద్ధగా విన్నాడు.

''సర్ వీడి తలమీద పాతికలక్షల రివార్డ్ ఉంది. ఒక లక్ష వీడిపేరుమీద సమాధి కట్ట డానికి ఖర్చు చేస్తే మిగతా ఇరవైనాలుగు లక్షలు పంచుకుంటే ఎనిమిది లక్షలు తల ఒక్కిం టికి'' ఓ ఆఫీసర్ చెప్పాడు.

''వీడ్ని ప్రాణాలతో అప్పగిస్తే మోహన కోటిరూపాయలు ఆఫర్ చేసింది. మోహన రహస్యాలు వీడి దగ్గర వున్నాయి. అప్పుడు మన అమౌంట్ షేర్ పెరుగుతుంది. కార్తికేయ తాపీగా చెప్పాడు''

రజ్వీ మెదడు పని చేయడం మానేసింది. తన వెనుక ఇంత కుట్ర ఉందా? రజ్వీ వెంటనే కార్తికేయ దగ్గరికి వెళ్ళాడు. అతని రెండు చేతులు పట్టుకున్నాడు.

''సర్ నన్ను క్షమించండి. నాకు తెలుగు వస్తుంది''

''వాట్... అదిరి పడ్డారు... అలా నటించారు.

''అవును సాబ్... నేను డబ్బుకోసం ఏ పనైనా చేసే బేవార్స్‌ని, ఆ మోహన గురించి మొత్తం చెబుతాను, నన్ను వదిలేయండి. నన్ను పట్టుకుంటే మహా అయితే కోటి... అదే ఆ మోహన అయితే కోట్లు...కోట్లు వస్తే? కార్తికేయ కాళ్ళమీద పడిపోయాడు రజ్వీ.

రజ్వీ చెప్పడం మొదలుపెట్టాడు. అందరి మొహాలకు చెమటలు పట్టాయి.

మహా విధ్వంస రచన...

లేచాడు కార్తికేయ...రివాల్వర్ రజ్వీకి గురి పెట్టాడు.

''సాబ్ అంతా చెప్పాను... రజ్వీ భయంగా అన్నాడు.

''వందల మందిని చంపి, ఊచకోత కోసి ప్రాణభయంతో నిజం చెప్పిన నీలో పరివ

ర్తన రాదు రజ్వీ... నిజం. ఇప్పటికైనా చెప్పావు కాబట్టి చిత్రహింసలు లేని మరణాన్ని ప్రసాది స్తున్నాను ‘‘సైలెన్సర్ అమర్చబడ్డ ఆ రివాల్వర్ నిశ్శబ్దంగా తన పని పూర్తి చేసింది. మిగతా ఉగ్రవాదుల మృతదేహాలు ఇలానే పక్కగదిలో వున్నాయి.

జస్ట్ కార్తికేయ ఆడిన మైండ్ గేమ్.

విశాలమైన ఆ గదిలో నిరుద్యోగ యువత మత్తులో ఉంది. ఎదురుగా డయాస్ మీద మోహన. వాళ్ళంతా ట్రాన్స్‌లో వున్నారు. ఇప్పుడు వారిని ట్రాన్స్‌లోకి పంపుతుంది మోహన...

# 31.

‘‘ ఎక్కడ ప్రజల అమాయకత్వం వూపిరిపోసుకుంటుందో... ఎక్కడ నిరాశగా, నిస్పృ హలతో యువత నిస్తేజమవుతుందో... అక్కడ అవకాశవాదం తన వికృత క్రీడ మొదలుపెడు తుంది.

లక్ష్యాన్ని ఏర్పరుచుకుని అవాంతరాలను అధిగమించి గమ్యపు నింగికి ఎగిసే స్ఫూర్తి దాయక యువత ఓ పక్క నిరాశ, అభద్రతాభావం, డ్రగ్సు, బానిసయ్యే బలహీనతతో పాతా ళానికి జారిపోయే యువత మరోపక్క...

సరిగ్గా అలాంటివారినే టార్గెట్ చేస్తుంది మోహన. డ్రగ్స్‌ని ఎరగా వేస్తుంది. అందమైన ప్రపంచం అంటే మత్తులో వుండడం అని నమ్మిస్తుంది. అలాంటి వారిని తన ఆధీనంలోకి తెచ్చుకుంటుంది. హైదరాబాద్, ముంబైలాంటి ప్రాంతాల్లో ఇలాంటి వారిని తయారు చేసింది. అక్కడవున్న వాళ్ళంతా పాతిక నుంచి ముప్పయేళ్ళ వయసు వున్నవారే... ఎక్కడైనా విధ్వంసం సృష్టించాలంటే వీళ్ళను ఉపయోగించుకుంటుంది. ఇక్కడి వ్యవహారాలూ చూసే వ్యక్తి నిక్సన్. గోవానుంచి మత్తు మందులు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తుంటాడు. కొందరు సినిమావాళ్ళనూ ఈ రొంపిలోకి దింపిన క్రెడిట్ అతనిదే. ఉగాండ నుంచి చదువు కోసం వచ్చి గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారిని, డిప్రెషన్‌లో వున్నవారిని ట్రాప్ చేస్తాడు. లేదా అలాంటి పరిస్థితి సృష్టిస్తాడు. నిక్సన్ వల్ల దాదాపు రెండు వేల మంది డ్రగ్స్‌కు అలవాటుపడి తమ కెరీర్ నాశనం చేసుకున్నారు. నిక్సన్ మాత్రం డ్రగ్స్ తీసుకోడు.

మోహన ఎదురుగావున్న వారివైపు చూస్తోంది. వాళ్ళ కళ్ళలో కాంతిలేదు... ఆశ...

కాసేపు వెయిట్ చేస్తే డ్రగ్స్ ఇస్తారని మొహాలు పాలిపోయి వున్నాయి. మోహన ఎదు రుగా వున్న టేబుల్ మీద హెరాయిన్ పాకెట్స్ వున్నాయి. అందరూ వాటివంక ఆశగా చూస్తు న్నారు. అది గమనించింది మోహన. ఈ ప్రపంచంలో డబ్బుకన్నా, మత్తు ఎక్కువ కిక్కుని ఇస్తుంది... మనుష్యులను బలహీనంగా మారుస్తుందన్న నమ్మకం ఆమెది.

ఒక్కసారిగా ఆ హాల్‌లో లైట్లు ఆరిపోయాయి. ఓ లైట్ మోహన మొహం మీద ఫోకస్ అయింది. ఆమె మొహం ఎరుపు రంగులో ప్రమాదాన్ని సూచిస్తున్నట్టు వుంది.

***

''మీరంతా నావైపే చూస్తున్నారు... నా మాటలే వింటున్నారు. మీకేది కనిపించడం లేదు... ఇంకేమీ వినిపించడం లేదు ''మోహన్ గొంతు గంభీరంగా ఆ హాల్‌లో ప్రతిధ్వని స్తుంది.

ఓసారి అందరివైపు చూసి ''మీరు చాలా తెలివైనవాళ్ళు... అయినా మీకు గుర్తింపు లేదు. బాధ పడకండి. మన రాజ్యం వస్తుంది... మీరే మోనార్క్‌లు అవుతారు. అప్పటివరకూ ఎంజాయ్ చేయండి. జల్సా చేయండి. భయాలు, బిడియాలు వదిలేయండి. ఎంజాయ్...''

హలంతా చప్పట్లతో మార్మోగింది. మోహన మాటలకు అందరూ ట్రాన్స్‌లోకి వెళ్ళిపో యారు... ఒక్కరు తప్ప... సంధ్యారాని... జర్నలిస్ట్... డ్రగ్స్ రాకెట్ మీద పరిశోధన చేస్తోన్న ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్. కేవలం ప్రెస్‌మీట్స్, మంత్రుల వాగ్ధానాలు, అసెంబ్లీ కవరేజీలు ఆమెకు సంతృప్తిని ఇవ్వలేదు. అందుకే మూడు నెలలుగా ఈ ఆపరేషన్ మొదలుపెట్టింది. మోహనను సంధ్యారాణి చూడ్డం మొదటిసారి. ఏ హిప్నాటిస్ట్ అయినా ఎదుటివారి అంగీకారం లేకుండా, తమ ట్రాన్స్‌లోకి తీసుకువెళ్ళలేరు. వాళ్ళ బలహీనతను ఆసరా చేసుకుంటే తప్ప. తను చేస్తు న్నది రిస్కీ ఆపరేషన్ అని దీని పర్యవ్యసానం తీవ్రంగా ఉంటుందని తెలియదు ఆమెకు. ఆమె కళ్ళముందు డ్రగ్స్‌కు బానిస అవుతోన్న యువత భవిత కన్నీళ్ళతో కనిపించింది.

***

నిక్సన్, మోహన ఎదురెదురుగా వున్నారు... దూరంగా బలిష్టులైన పదిమంది దృఢ కాయులు వున్నారు.

''నిక్సన్ మనం రిస్క్‌జోన్‌లో వున్నాం... యాసిక్ చనిపోయాడు... సిక్వీ ఆత్మహత్య చేసుకున్నాడు. నా అనుమానం నిజమైతే ఈ పాటికి రజ్వీ కూడా చనిపోయి ఉంటాడు. నెక్స్ట టార్గెట్ నువ్వే అవుతావు'' అతని మొహంలోకి చూస్తూ చెప్పింది మోహన.

''మీరేం కంగారు పడకండి మేడం... హైదరాబాద్‌లోకి అడుగుపెట్టే ధైర్యం ఎవరికి వుంటుంది? నిర్లక్ష్యం అన్నాడు నిక్సన్.

అంతే... రెండో క్షణంలోనే నిక్సన్ చెంప చెల్లుమంది. ఆ విసురుకు నిక్సన్ తూలీ పడి పోయాడు. అతని బుగ్గ ఎర్రగా కందిపోయింది. దూరంగా వున్న నిక్సన్ అనుచరుడు కోపంగా మోహన వైపు రివాల్వర్ గురిపెట్టి ట్రిగ్గర్ మీద వేలు బిగించాడు... నిక్సన్. వారిస్చే లోగా మోహన చేతిలోని రివాల్వర్ నిశ్శబ్దంగా బులెట్ రిలీజ్ చేసింది. ఆ అనుచరుడు కుప్ప కూలిపోయాడు. చచ్చిపోయాడు. ఇదంతా క్షణాల్లో జరిగింది.

''మేడం వాటీజ్ దిస్'' అసహనంగా అన్నాడు నిక్సన్.

''నిక్సన్ ఇక్కడ నా ప్రశ్నలకు జవాబులు మాత్రమే వుండాలి... ఎదురు ప్రశ్నలు వుండ కూడదు. ముందు ఆ స్టుపిడ్స్‌ని బయటకు పంపు'' అంది ఆజ్ఞ.

క్షణాల్లో ఆ హాల్‌లో వాళ్ళు లేరు. తమ సహచరుడి మృతదేహం తీసుకుని వెళ్లారు.

''సారీమేడం'' నిక్సన్ అన్నాడు.

''నేను సారీని ఒక్కసారే యాక్సెప్ట్ చేస్తాను. శత్రువు బలం తెలుసుకోకుండా నిర్ల క్ష్యంగా వుండడం ప్రమాదకరం. యముడిలా ఇక్కడికి వచ్చేది ఎవరో తెలుసా కార్తికేయ.

అతనెవరో తెలుసా... ఆరు నెలలుగా మూడు వందల మందిని నియమించి తెలుసు కున్న నిజం...'' కళ్ళు మూసుకుంది మోహన.

కార్తికేయ గుర్తొస్తేనే ఆమె వణికిపోతుంది.

❋❋❋

ఎప్పటిలానే దేవుడి ముందు నిలబడి రెండు చేతులు జోడించి ''నేను నిన్ను పూజిం చడం లేదని ఫీల్ అవ్వకు. అలాగే నీ ప్రసాదం తింటున్నానని అనుకోకు. నువ్వు చాలా బాకీ. నా ప్రశ్నకు సమాధానం చెప్పే వరకు నా బ్రతుక్కో అర్థం నిఘంటువులో కనిపించే వరకు నీకూ, నాకూ మధ్య గొడవ ఇలానే వుంటుంది. త్వరగా సెటిల్‌చేసుకో'' దేవుడితో చెప్పేసి పూజారి ఇచ్చిన ప్రసాదాన్ని తీసుకుని గుడిమెట్ల వరకు వచ్చి తినబోతుండగా

'' ఆకలి తల్లీ... మూడ్రోజులుగా పస్తు'' ఓ బక్కచిక్కిన వ్యక్తియాచించాడు. ప్రసా దాన్ని తినబోతున్న పూర్ణిమ తన చేతిలోని ప్రసాదం అతని చేతికి ఇచ్చి ఓసారి గుడివైపు తిరిగి దేవుడి వైపు చూసి '' ఆర్యూ హ్యాపీ'' అని అడిగింది నిన్నటి నుంచి దాడి చేస్తోన్న ఆక లిని గుర్తు చేసుకుంటూ...

ఆ యాచకుడు... పూర్ణిమవైపుచూస్తూ ఉండిపోయాడు.

❋❋❋

# 32.

''మై డియర్ ఎనిమి. ప్రియాతి ప్రియమైన ఆకలీ... నువ్వంటే నాకు భయం... గౌరవం... ఎక్కడో ఓ రచయిత ఈ వాక్యం రాసినప్పుడు నవ్వుకున్నాను... ఇప్పుడేంటో నవ్వు బదులుకలే ముందు వస్తోంది'' రెండు చేతులు పొట్టమీద పెట్టుకుని ఆకలితో మాట్లాడు తోంది.

మనిషిని సృష్టించిన దేవుడు అక్కడితో వూర్కోకుండా ఆకలినీ వెంటనే పుట్టించాలా? దేవుడికి ఆకలిదప్పుడు లేవు కాబట్టి వుండవు కాబట్టి... ఆకలి బాధ తెలియదు.

'' ఆకలిమేఘం, ఆకాశమనే దేహాన్ని కమ్ముకొని బాధను వర్షించింది.

ఆ యాచకుడు పూర్ణిమ ఇచ్చిన ప్రసాదం తిని, కోవెలలో కొలువైన నాథుడిని చూసి జగన్నాధార్పణం... అనుకున్నాడు. ఆ తర్వాత పూర్ణిమవైపు చూసాడు. నిండుగోదారి, ఆకలి కావేరిగా మారినట్టు అనిపించింది. దేవుడు కూడా ఏడుస్తాడా? ఆ యాచకుడు ముగ్ధ ఇంటి వైపు కదిలాడు. ఆకాశం మేఘావృతమైంది.

❋❋❋

''దేవరొచ్చాడు... జంగమదేవరొచ్చాడు... జాగుసేయక రాతల్లీ...''

హాల్‌లో కూచొని కాళ్ళకున్న పట్టీలు సరిచేసుకుంటున్న ముగ్ధ ఆ మాటలు విని బయటకు వచ్చింది.

ఆరడుగుల ఆజానుభావుడు... నుదిట విభూది... చేతిలో ఢమరుకం... చూడగానే చేతులెత్తి మొక్కాలనిపించే రూపం...

''కీడు కూతవేటు దూరంలో వుంది తల్లీ... రాకాసి ఒక్కటి నిన్ను చేరవచ్చే... చీకటి మేఘాలు కమ్ముకొచ్చే... భద్రం తల్లీ...''

జంగమదేవర మాటలు విని క్షణకాలం భయపడిపోయింది. భీతావహరిణి అయింది.

ఏమిటి స్వామీ మీరు చెప్పేది? భయంగా అడిగింది.

''జరుగబోయే సత్యం తల్లీ... నిన్ను కాయడానికి జగన్నాథుడే వస్తున్నాడు తల్లీ... ఇది ఆ జగన్నాథుని ప్రసాదం.

ఈ పంచ భక్ష్య పరమాన్నాలు నీకు కావలసినవారికి పెట్టి వారి కడుపు నింపితే అంతా మంచే జరుగు'' అంటూ తన జోలెలో ఉన్న పెద్ద అరటాకులోని ఆహార పదార్థాలు ఉన్న విస్తరి ముగ్ధ చేతిలో పెట్టాడు.

వాటిని కళ్ళకు అద్దుకుని తీసుకుంది. ''స్వామీ చిన్న సందేహం'' భక్తిగా అడిగింది ముగ్ధ.

''దేహానికి వచ్చే సందేహాలు... చెప్పేను జీవిత సత్యాలు... అడుగు తల్లీ''

''మీరు శివ...'' ముగ్ధ మాట పూర్తి కాకుండానే...

''శివకేశవులు వేరు వేరు కాదు తల్లీ...'' చెప్పి ''వర్షపు చినుకు ఆహారం మీద వాలక ముందే ప్రసాదం గొంతు దాటి వెళ్ళాలి తల్లీ'' అంటూ వడి వడిగా పెద్ద పెద్ద అంగాలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు... అదృశ్యమైపోయాడు.

⁂

ముగ్ధకు పూర్ణిమ గుర్తొచ్చింది. గుడి దగ్గరే వుంటుంది. దేవుడ్ని తిట్టుకుంటూ... వెంటనే ఆకాశం వంక చూసింది... మేఘాలు కమ్ముకొస్తున్నాయి. తండ్రి పూజగదిలో వున్నాడు. తమ్ముడు కార్టూన్ నెట్‌వర్క్ చూస్తున్నాడు. పూల సజ్జలో ఆహారపదార్థాలు తీసుకుని బయల్దేరింది.

⁂

గుడిలో స్తంభానికి ఆనుకుని కూచొని మూసి ఉన్న గుడి తలుపుల వైపు చూస్తూ ''నన్ను తప్పించుకోవడానికి తలుపులు వేసుకున్నవా? రేపు తలుపులు తెర్చుకున్నాక చెబుతాను'' తలను వెనక్కి వాల్చి అంది.

''దేవుడ్ని కాసేపు రెస్ట్ కూడా తీసుకోనివ్వవా? ముగ్ధ వచ్చి పూర్ణిమ పక్కన

కూచుంటూ అడిగింది.

''నాకూ, ఆయనకు రోజూ ఉండేదే కానీ నువ్వేంటి... ఈ టైములో... కొంపదీసి నా కోసం ''పంచభక్ష్య పరమాన్నాలు తేలేదు కదా'' నవ్వుతూ అడిగింది.

''కొంపతీసి తెచ్చాను. సజ్జలో నుంచి అరటాకుతీసింది. నిజంగానే పంచ భక్ష్య పర మాన్నాలు.

'' ఏయ్... ఏమిటివి? ఏమిటీ విశేషం... కడుపులో శ్రీహరికోట రాకెట్లు పరుగెడుతు న్నాయి.''

జంగమ దేవర గురించి చెప్పలేదు. చెబితే కొట్టి పారేస్తుంది. తినకపోతే?

పూర్ణిమ గబగబ తింటోంది. పొల మారింది...

'' ఏయ్ ముగ్ధ నన్నెవరో తలచుకుంటున్నారు. నీ దేవుడేమో...?'' అంది.

వాటర్ బాటిల్ ఇచ్చింది. చివరి మెతుకు వరకూ తిన్నది. చీర కొంగుతో మూతితుడు కుంది.

''ముగ్ధా నువ్వు నాకో, నేను నీకో బాకీ వున్నాం... లేకపోతే ఈ రుణానుబంధం ఏమిటి? కళ్ళు కన్నీటి చెలమలు అయ్యాయి.

''కాదు మన ఇద్దరికీ ఆ దేవుడు ''మన స్నేహం'' బాకీ వున్నాడు'' అంది ముగ్ధ.

ఆకాశంలో మెరుపులు. ''ముగ్ధా... నువ్వు ఇంటికి వెళ్ళిపో వర్షం వచ్చేలా వుంది'' అంది పూర్ణిమ.

''పూర్ణిమా నువ్వూ రారాదు. ఈ వర్షంలో ఇక్కడెందుకు? ముగ్ధ అంది.

తల అడ్డంగా తిప్పి ''అయినా నేను వస్తే నీ దేవుడు ఒంటరైపోడూ... నువ్వెళ్ళు'' అంది.

పూర్ణిమ మొండితనం తెలుసు. అందుకే సజ్జ తీసుకుని లేచింది. గుడి ఆవరణ దాటు తుండగా పెద్ద పిడుగు శబ్దం. ఒక చినుకు ముగ్ధ నుదురుని తాకింది.

# 33.

ప్రమాదం ఎప్పుడు... ఎటువైపు నుంచి దూసుకు వస్తుందో ఎవరూ ఊహించలేరు. ముగ్ధ వర్షం పడకముందే ఇంటికి చేరుకోవాలని పరుగులాంటి నడకతో బయల్దేరింది. మరో చినుకు... దట్టమైన మేఘాలు ఏదో చీకటి విపత్తును చూపిస్తున్నట్టు...

అదే సమయంలో ఆ వూరి పొలిమేరల్లోకి ఓ ఆకారం ప్రవేశించింది. చేతిలో అత్యా ధునికమైన కెమెరా.

సందు మలుపు తిరుగుతుండగా పెద్ద మెరుపు... అది ఆకాశంలో నుంచి వచ్చిన మెరుపు కాదు... కెమెరా ఫ్లాష్. అలాంటి మెరుపులు వస్తూనే వున్నాయి. ముగ్ధను వివిధ యాంగిల్స్‌లో ఫోటోలు తీస్తుంది ఆ ఆకారం.

ఆ ఆకారం ముగ్ధను ఫాలో అవుతూనే వుంది. ఊరంతా చీకటి దుప్పటి కప్పుకున్న, మబ్బులున్నీ ఆ ఊరిని ఆక్రమించుకున్నట్టు... వుంది.

ముగ్ధ ఇంటికి చేరింది. అప్పటికే వర్షం మొదలైంది. ఆ ఆకారం వెనుతిరిగింది.

ఆ ఆకారం పేరు నిక్సన్.

***

మోహన రెస్ట్‌లెస్‌గా వుంది. ఎలాంటి ప్రమాదాన్ని అయినా ఫేస్ చేయగల మోహన...

తనను పోలీసులు చుట్టుముట్టినా కూల్‌గా వుండే మోహన ఆ క్షణం రెస్ట్‌లెస్‌గా వుంది. టేబుల్ మీద ఫోటోలు... అవి ఫోటోలు మాత్రమే కావు... మృత్యువు చాయాచిత్రాలు. ఆ ఫోటోలలో వుంది కార్తికేయ.

రాజస్థాన్ ఎడారిలో... మే నెల ఎండల్లో మిట్ట మధ్యాహ్నం ఎడారి మధ్యలో ఇసుక దిబ్బలు... నాలుగు వైపులా రేకులు. పైన రేకు కప్పు... లోపల ఒంటికాలిమీద కార్తికేయ... సూర్యుడి తీక్షణత రేకుల మీదుగా లోపల వున్న కార్తికేయను మల మల మాడుస్తుంది. బొబ్బ లెక్కిన చేతులు... కాళ్ళు... అసలు మనిషేనా? బండరాళ్ళ మీద పిడి గుద్దులు గుద్దుతూ, ఇసుక బస్తాలను టార్గెట్ చేస్తూ... యుద్ధంలో సైనికులకు ఇచ్చే శిక్షణలా...

ఈ ప్రపంచానికి తెలిసి కార్తికేయ కస్టమ్స్ అధికారి... సి బి ఐ దృష్టిలో తమ కోసం మోహనను పట్టుకునే ఆఫీసర్...

కానీ... కానీ ప్రపంచానికి తెలియని...ప్రధానికి తెలియని, కేంద్రప్రభుత్వానికి తెలియని నిజం...

కా...ర్తి...కే...య...ర...క్ష...కు...డు...

భారత రాష్ట్రపతి తనకున్న విశేష అధికారాలను ఉపయోగించుకుని భారతదేశాన్ని రక్షించడానికి సర్వ అధికారాలను కట్టబెడుతూ... ఇచ్చిన రాజశాసనం. మూడు వందల మంది... ఆరు నెలల పరిశోధన, గూఢాచార సంస్థల రహస్య శోధన.. చివరికి పాకిస్తాన్ గూఢాచార సంస్థకూడా శోధించి తెలుసుకున్న నిజం.

శాటిలైట్ ద్వారా తీయించిన చాయాచిత్రాలు. యసిక్‌ని చంపింది వ్యక్తిగత కోపంతో కాదు... శత్రువు బలాన్ని తగ్గించడానికి... శత్రువును మానసికంగా బలహీనపరచడానికి...

కార్తికేయను ఎదురించడానికి ఆయుధాలు సరిపోవు... బుల్లెట్స్ పనిచేయవు... అతనికి బలహీనతలులేవు... అతని బలం మొండితనం... ఆ మొండితనాన్ని ఎదుర్కునే అస్త్రం ము...గ్ధ.

ఒక్క క్షణం తల విదిల్చింది మోహన. ఎదురుగా పేపర్... ఆ పేపర్లో ఓ వార్త...

ప్రపంచంలోని ప్లాస్టిక్ సర్జరీ చేయగలిగిన అతికొద్ది మంది సర్జన్స్‌లో వున్న ఒకే ఒక మహిళా సర్జన్ డాక్టర్ రాధారాణిని ఇంటర్‌వ్యూ చేసిన వార్తా పత్రిక.

అచ్చమైన పదహారణాల తెలుగమ్మా... అతి చిన్న వయసులోనే కీర్తి ప్రతిష్టలు అందుకున్న వ్యక్తి. అమెరికాలో డగ్లస్, రష్యాలో పెమ్లిట్, ఇండియాలో రాధారాణి...

ముంబైలో సెటిల్ అయింది. ముఖ్యమైన కాన్ఫరెన్స్‌కు అటెండ్ అవ్వడానికి హైదరాబాద్ వచ్చింది. మోహన రాధారాణి ఫోటో వైపు చూసింది. రెడ్ కలర్ మార్కర్‌పెన్‌తో రాధారాణి మొహం చుట్టూ రౌండప్ చేసింది.

⁂

సాదా కాటన్ చీర... మెడలో సన్నటి గొలుసు... పాపిట సిందూర్... వరల్డ్‌బుక్ ఆఫ్ గిన్నీస్‌లో చోటు సంపాదించిన ప్రముఖ సర్జన్ అంటే నమ్మలేనంత సింపుల్... మొహంలో చెదరని చిరునవ్వు... కళ్ళలో ఎదుటివారికి ధైర్యాన్ని ఇచ్చే భరోసా...

రాధారాణి కారు డోర్ ఓపెన్ చేసి కారు స్టార్ట్ చేసింది. కారు బంజారాహిల్స్ మీదుగా వెళ్తోంది.

''గుడ్ మార్నింగ్ డాక్టర్... గ్లాడ్ టు మీట్యూ''

డ్రైవ్ చేస్తోన్న రాధారాణి ఉలిక్కిపడి మిర్రర్‌లో నుంచి చూసింది. వెనుక సీట్‌లో ఓ అపరిచిత వ్యక్తి. చేతిలో సైలెన్సర్ అమర్చబడ్డ రివాల్వర్. ఆ వ్యక్తి మోహన.

⁂

# 34.

ముగ్ధ ''ఆ గదలోకి వెన్నెలను స్వాగతించింది... తన మదిలోకి కార్తికేయను ఆహ్వానించింది... రెండు మొకాళ్ళ మధ్య చుబుకాన్ని ఆన్చి కార్తికేయ రూపాన్ని కళ్ళ ముందు ఆవిష్కరించింది. తన ఎదురుగానే వున్నాడు... తననే చూస్తున్నాడు.

తపన కంటి చూపయింది... తనువూ వెన్నెల్లో తడిసిన మంచు పుష్పం అయింది.

తన రెండు చేతులతో ముగ్ధ మొహాన్ని బంధించేసాడు. నుదురు మీద చుంబనం కుంకుమ సూర్యోదయమ్మైంది.

నా పెదవుల స్పర్శనే కాటుకగా దిద్దనా? కను రెప్పలను పలకరించిన పెదవుల మాటలు అవి.

కళ్ళు తెరిచే ధైర్యం చేయలేదు ముగ్ధ. కళ్ళు తెరిస్తే ఇది కల అని తెలిస్తే తను భరించగలదా? ఎదురుగా పెద్ద బల్ల... దాని మీద వీణ. అమ్మ చేతివ్రేళ్ళతో పులకించిన వీణ... ముగ్ధకు వీణ నేర్చుకోవాలని అనిపించింది. ఎప్పటినుంచో వున్న కోరిక ఇప్పుడు బలంగా మారింది.

తొలిరేయి... తన కార్తికేయ సమక్షంలో తన భావాలను... తనలోని ఫీలింగ్స్‌ను వీణలోని రాగాలతో... రోమాంచిత గారాలుపోతూ... చెప్పాలి. ఒక్కక్షణం తన ఆలోచన తనకే చిత్రంగా అనిపించింది. జీవితంలో కొన్ని సంఘటనలు మెలోడ్రామాగా ఉంటేనే బావుంటుందేమో... కార్తికేయ కోసం వీణ నేర్చుకోవాలి.

ఐ ఫోన్‌లో పాటలు, మిడ్‌నైట్ ప్రోగామ్స్ ఇవ్వలేని ఆనందం తన వీణాగానం అందించాలి. తను వీణ నేర్చుకోవాలి.

అప్పుడు గుర్తొంచ్చింది లక్ష్మి... లక్షిమ పిరాట్ల...

ఎవరి చేతివ్రేళ్ళ స్పర్శ తగిలి వీణలోని తీగలు పులకరించిపోతాయో. ఏ.. స్వరరాగా మృతాన్ని చూసి నారద తుంబరులు పరవశమైపోతారో... సంగీతం అజరామరమైన చోట... పాట పల్లవించి... స్వరం కోయిలతో కలిసి ఆలపించి... సప్తస్వరాలు ఆమెకు సంగీత ఆర ణాలు అయి, వినమ్రమై కొలువైన చోట... ఒక విధి అనే తీగ, ప్రమాదం అనే అపశ్రుతిని ఆల పించి, విలపించి.. ఆమె గొంతును మూగగా మార్చిన సంగీత వాగ్దేవి కొలువైన చోటు అది.

⁂⁂

హైదరాబాద్...

రవీంద్రభారతికి కూతవేటు దూరంలో...

లక్ష్మీ స్వర నిలయం. అక్కడ గాలిలో స్వరాలు వినిపిస్తున్నాయి. పూల మొక్కలలో రాగాలు గారాలు పోతున్నాయి. నేలమీద పరిచిన తివాచీ ఆ సంగీత సామ్రాజ్ఞి రాకను ఆహ్వా నిస్తుంది. కంచి పట్టు చీరలో సత్యలోకం నుంచి వస్తోన్న వాగ్దేవిలా వుంది. మూడు సంవత్స రాల క్రితం న్యూ ఢిల్లీలో జరిగిన సంగీత కచేరిలో జరిగిన అగ్నిప్రమాదంలో మంటల్లో కాలి పోతోన్న తన వీణను చూసి తన ప్రాణమే దహించుకుపోతుందన్న షాక్‌తో మాట మరి చింది... స్వరం అపస్మారకంలోకి వెళ్ళింది.

⁂⁂

''నమస్తే మేడం..'' ముగ్ధ, పూర్ణిమ చేతులు జోడించి నమస్కరించారు.

కూచోమన్నట్టు సైగ చేసింది. ఇద్దరూ కూచున్నారు. పూర్ణిమ వచ్చిన విషయం సూటిగా చెప్పింది. ముగ్ధ తన మనసులోని మాట చెప్పింది. లక్ష్మిం ముగ్ధవైపు చూసింది. ఆమె సంగీతం నేర్పించడం మానేసి చాలా కాలమైంది.

''స్వరాలు పలకలేని మూగను... నేనేం నేర్పించగలను? పలకమీద రాసింది.

''మీ చేతివ్రేళ్ళ కదలికకు తీగలే గొంతెత్తి పాడుతాయి. మీ కంటి కదలికలు సప్తస్వ రాలై వర్ధిల్లుతాయి... సరిగమపదనిసలు సప్తవర్ణాల శోభితమై మాకు స్వరాలు నేర్పుతాయి'' ముగ్ధ అంది.

చిన్నగా నవ్వింది... వెన్నెలపుష్పం అరవిరిసిన నవ్వు, స్వచ్ఛమైన నవ్వు.

''బ్రహ్మదేవుడు సృష్టిని కొనసాగిస్తూ, లలాట లిఖితాలను అలిసి లిఖిస్తూ వుంటే ఆ సరస్వతీదేవి ''బ్రహ్మ అలసట తీర్చడానికి సప్తస్వరాలను ఆలపించిందిట... నీకా స్వరం నేర్పు తాను... నీ పెళ్ళికి నేనిచ్చే స్వరకానుక...'' పలకమీద రాసింది.

ముగ్ధ లక్ష్మి పాదాలకు నమస్కరించింది. ఎక్కడి నుంచో రివ్వున వచ్చిన చిలుక లక్ష్మి పిరాట్లు పాదాల మీద వాలి తన ముక్కుతో ఆమె పాదాలకు నమస్కారాలు తెలియజేసింది. చిన్న జామపిందె, చిలుక చిట్టి పెదవుల నుంచి జారిపడింది. ఆ జామ ముగ్ధ పెరట్లో వున్న జామ చెట్టుది.

''చిలుక పలుకులే తప్ప కోయిల కూజితాలు తెలియవు.. మా ముగ్ధకు నేర్పించండి'' అని చెబుతున్నట్టు వుంది.

స్వరమే ప్రాణమైన సంగీతం... మౌనంగా తీగల సరాగాలతో స్వర శిక్షణ మొదలైంది. మరోవైపు మరణ మృదంగ ధ్వనులు మొదలైన విషయం తెలియదు వారెవ్వరికీ...

⁂

''గుడ్ మార్నింగ్ సంధ్యారాణిగారు... ఏమిటి ఈ వేళ విశేషం... మేమంతా న్యూస్ వండుతాం... మీరేమో న్యూస్‌ను వెతుక్కుంటూ వెళ్లి తయారు చేస్తారు.'' కాస్త వ్యంగ్యం జోడించి అన్నాడు సబ్ ఎడిటర్.

ఇలాంటి కామెంట్స్ ఎక్కడైనా సర్వసాధారణమే... జెలసీ... ఒక కవితలు రాసుకూంటూ, ఆసక్తితో ఓ కథో, సీరియలో రాస్తే వెంటనే కడుపుమంట కలం మంటగా మారుతుంది. వ్యంగ్య బాణాలు మొదలవుతాయి.

విలన్ వేషాలు వేసే వ్యక్తి హీరో అయితే అదో టాపిక్... అభద్రతా హావం... సెక్యూర్డ్ ఫీలింగ్‌లో నుంచి బయటకు వచ్చే అభద్రతాభావం. సంధ్యారాణి ఇలాంటి కామెంట్స్‌ని డస్ట్ బిన్‌లో వేయడం మొదలుపెట్టిచాలా కాలమైంది. తను చేయవలసిన ముఖ్యమైన పనులు రెండు. ఒకటి డ్రగ్స్‌రాకెట్ వివరాలు సేకరించడం, రెండు డాక్టర్ రాణి సంధ్యను ఇంటర్వ్యూ చేయడం. తెలుగువారే కాదు... ప్రపంచం గర్వపడే సర్జన్ రాణి సంధ్య ఇంటర్వ్యూ చేయాలి.

⁂

విశాలమైన గది... ఓ పక్కన ఆపరేషన్ టేబుల్... ఆ గది అండర్ గ్రౌండ్‌లో వుంది. మోహన చేతిలో రివాల్వర్... మరో చేతిలో ముగ్ధ ఫోటో... ఎదురుగా కుర్చీలో డాక్టర్ రాణి సంధ్య.

⁂

# 35.

ఎవరి ప్రపంచం వారిది... ఎవరి సమస్యలు వారివి... రాత్రిపదకొండు దాటినా తగ్గని జనసంచారం. రోడ్డు మీద వెళ్ళే వారిని కదిలిస్తే ఎన్నెన్ని కథలో.. నేరాలు ఊపిరిపోసుకనే రాత్రి, కష్టాన్ని మర్చి అలిసి నిద్రపోయే రాత్రి.. దొంగలకు సరైన సమయం... నేరసామ్రాజ్యానికి సూర్యోదయం...

అదో స్లమ్ ఏరియా... చిన్న చిన్న గుడిసెలు... తలవంచి వెళ్ళాల్సిందే. అక్కడక్కడ విసిరేసినట్టు వుండే ఇళ్లు. సిటికి దూరంగా వున్న ఏరియా, అరగంట నుంచి అక్కడ కాపు కాసింది సంధ్యారాణి. గాలికి చున్నీ ఎగిరి ఆమె అందమైన మొహాన్ని టచ్‌చేస్తూ అల్లరి చేస్తోంది. కళ్ళు అలసినట్టు వున్నాయి. ఆ రాత్రి అక్కడ డ్రగ్స్ చేతులు మారుతున్నట్టు సమాచారం వచ్చింది. సినిమా వార్తల, ఉమెన్స్ పేజీలోని ఏ కాలమో రాసినా సరిపోతుంది... కానీ జర్నలిజం ఆమె దృష్టిలో ఒక నిర్విఘ్న యజ్ఞం.

జీవితం అంటే కొందరికి నడిచే రైలు... మనం ఒక్కో మజిలీ దాటి వెళ్తుంటాం. కానీ

మనమెక్కే రైలు ఏ గమ్యానికి చేరుతుందో తెలుసుకుని ఆ రైలు ఎక్కితే ఎన్నో లక్ష్యాల స్టేషన్లు దాటుతూ వెళ్ళవచ్చు. నెలకు కొంత జీతం.. భర్త, పిల్లలు, ఇంటికి రాగానే కాసేపు టీవీలో వార్తలు చూసి, మరి కాసేపు నిట్టూర్చి, ఆ పైన వంట డిన్నర్, పడక... ఇదీ నిత్యకృత్యం...

మనం నిద్రపోయే రాత్రి ఎన్ని సంఘటనలు జరుగుతాయి. కానీ మనం వాటిని పట్టించుకోం... పొద్దున్నే పేపర్ చదివి ప్రపంచాన్ని తెలుసుకుంటాం. కొందరు మొదటి పేజీ, మరి కొందరు సినిమా పేజీ.

వంటలు, వార్పులు... నిట్టూర్పులు... సమాజాన్ని నిప్పుతో కడగమని చెప్పినా, నిగ్గదీసినా నిస్తేజమైన ప్రజలు అంతా క్షమించేస్తారు. గాడ్సేని కూడా క్షమించే ఉదార హృదయం మనది... భయంతో, నిర్లిప్తతతో, నిస్సహాయతతో... మనకెందుకులే... అనే తత్త్వంతో... సంధా రాణి తల విదిల్చింది. నిద్ర వచ్చేస్తుంది. సరిగ్గా అప్పుడే ఆ ఏరియాలో ఓ జీప్ వస్తోన్న శబ్దం.

***

క్యాబ్ స్పీడ్‌గావెళ్తోంది. కార్తికేయ తల వెనిక్క వాల్చి కళ్ళు మూసుకున్నాడు. తను మరో గంటలో అర్జెంటుగా ఢిల్లీ వెళ్ళాలి. ప్రెసిడెంట్ నుంచి అత్యవసర సందేశం. బేగంపేటలో హెలికాప్టర్ రెడీగా వుంది. శ్రీనివాస్‌ని కలుద్దామనుకున్నాడు... ఆసరా నడిపే మాలతిని ఢిల్లీ వచ్చినప్పుడు తన ఇంట్లో ఆతిథ్యం స్వీకరించి తన కోసం స్నేహరాగాన్ని ఆలపించిన సంగీత సామ్రాజ్య లక్ష్మి పిరాట్లను కలుద్దామని అనుకున్నాడు. ఎవరినీ కలవకుండానే వెళ్తున్నాడు...

ముఖ్యంగా తన శ్వాసని, ప్రస్తుత తన అస్తిత్వంకి ఆలంబనైన ముగ్ధని పలకరించకుండా వెళ్తున్నాడు. క్యాబ్ స్లమ్ ఏరియాని దాటింది. దూరంగా ఏదో గొడవ. డ్రైవర్ కారు అటువైపుపోనీ... అన్నాడు ఎలర్ట్ అవుతూ...

జీప్ శబ్దం విని ఓ గుడిసె చాటుకు వెళ్ళింది సంధ్యారాణి.

జీప్ ఆగింది. అందులో నుంచి నిక్సన్ దిగాడు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. ఓ గుడిసెలోకి వెళ్ళాడు. సంద్యారాణి బటన్ కెమెరా సరిచేసుకుంది... మెల్లిగా ఆ గుడిసె వైపు వెళ్ళింది. గుడిసెలోకి తొంగి చూసింది. లోపల ఎవరూ లేరు. ఒక్క క్షణం షాక్ అయింది. ఆమె సిక్స్‌సెన్స్ ఏదో హెచ్చరిస్తుంది. ఆమె వెనుక అలికిడి... తిరిగి చూస్తే నిక్సన్.

''వాహ్... అందమైన ఆడపిల్ల.. అర్ధరాత్రి.. గ్రేట్.. ఆ రోజు మీటింగ్‌లో వచ్చినప్పుడే సి సి కెమెరాలో గమనించాను... హెరాయిన్.. కిక్కిస్తే.. ఈ విమెన్ మత్తెక్కిస్తుంది..''

సంద్యారాణి చేయి పట్టుకున్నాడు.

మెరుపు వేగంతో కదిలింది. ఆమె కుడిచేయి పిడికిలిగా మారి అతని దవడని తాకింది. ఊహించని పరిణామం... వెంటనే ఎలర్ట్ అయి తన వెహికల్ దగ్గరికి వెళ్ళింది. అప్పటికే నిక్సన్ ఆమెను సమీపించాడు. అతని జేబులో నుంచి రివాల్వర్ బయటకు వచ్చింది. ఆమెకు గురి పెట్టాడు... అతని వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంది... అప్పుడే అతని వీపుకు రివాల్వర్ మొన తగిలింది.

నిక్సన్ తల వెనక్కి తిప్పబోయాడు. అప్పటికే నిక్సన్ చేతిలోని రివాల్వర్ లాక్కు

న్నాడు కార్తికేయ. దూరంగా జరుగుతున్న గొడవ చూసి ప్రమాదాన్ని ఊహించాడు. అయితే ఆ చీకట్లో అతను నిక్సన్‌ని గుర్తించలేదు.

నిక్సన్ పరిస్థితిని అంచనా వేసాడు. గొడవకు ఇది సమయం కాదు... ఆ ఆలోచన రావడంతోనే కిందికి వంగి మట్టి గుప్పిట్లోకి తీసుకుని కార్తికేయ కళ్ళలోచల్లాడు. ఆ క్షణం లోనే అతడి నుంచి విడిపించుకుని జీప్ దగ్గరికి వెళ్ళాడు. జీప్ స్టార్ట్ చేసాడు. ఇదంతా క్షణాల్లో జరిగింది.

***

''థాంక్యూ సర్'' మనస్ఫూర్తిగా అంది సంధ్యారాని.

ప్రతిగా చిన్న నవ్వు నవ్వి'' మీ కమిట్‌మెంట్ గొప్పదే... కానీ ప్రమాదాలను నిర్లక్ష్యం చేయరాదు'' చెప్పాడు కార్తికేయ.

''యస్ సర్... ఇక ముందు జాగ్రత్తగా వుంటాను.. ఎప్పుడూ మీరు రారుగా''చిన్నగా నవ్వి అంది సంధ్యారాణి.

అప్పటికే బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి పైలట్ ఫోన్‌కాల్... హడావుడి..

అలా కాక సమయం వుండి వుంటే కార్తికేయ ఢిల్లీ వెళ్ళాల్సిన అవసరం కానీ ప్రెసిడెం ట్‌ని కలవడంకానీ అవసరపడి వుండేది కాదు.

కార్తికేయ క్యాబ్ ఎయిర్‌పోర్ట్ వైపు వెళ్తోంది.

***

మోహణ రాధారాణి వైపు చూసి ''మీరు సింపుల్‌గా అందంగా వున్నారు... మీ గురించి లాస్ట్ ఇయర్ అనుకుంటా... ఓ మెడికల్ జర్నల్‌లో చదివాను... ప్రపంచం గర్వించ దగ్గ సర్జన్ కదా...''అంది.

'' ఇది చెప్పడానికి నన్ను కిడ్నాప్ చేసారా? సూటిగా అడిగింది రాధారాణి.

''గ్రేట్... మీరు కిడ్నాప్ అయ్యారని తెలిసినా భయపడడం లేదు...'' మోహన అంది.

''చెప్పండి... నేను ప్లాస్టిక్ సర్జరీ ఎవరికి చేయాలి? అడిగింది రాధారాణి.

షాక్ అయింది మోహన...

***

హెలికాప్టర్ ఢిల్లీ వైపు వెళ్తోంది. కార్తికేయ ఆలోచనలు వెనక్కి వెళ్లాయి... తను ప్రెసి డెంట్ ఆఫ్ ఇండియాను ఢీకొన్న రోజు...

అసలా రోజు ఏం జరిగింది?

***

# 36.

ట్యాంక్‌బండ్...

వర్షానికి ముందు మట్టివాసన తాలూకు అనుభూతి ఎంత బావుంటుంది? ఎందుకో అలాంటి ఫీలింగ్ కలిగింది ముగ్ధకు. అర్థరాత్రికి ఇంకా కొద్దిగా టైం బాకి వుంది. నందమూరి తారకరాముడి ఊహలలోని సొబగే ట్యాంక్‌బండ్ అందాలకు చిరునామా.. ఎదురుగా బుద్ధ విగ్రహం... ఏకశిలా విగ్రహం... ఒకసారి నీటిలో మునకేసినా దర్జాగా నిలచివున్న బుద్ధుడు... కొత్త అందాలతో మెరుస్తున్నాడు. రైయిలింగ్‌కు అనుకుని నిలబడి తదేకంగా బుద్ధవిగ్రహం వైపే చూస్తోంది ముగ్ధ.

పూర్ణిమ ముగ్ధవైపు చూసి, నువ్వు నువ్వేనా? అంది.

''ఎందుకలా అడిగావు? ముగ్ధ అడిగింది.

''ఎందుకంటే ఊరొదిలిరాని నువ్వు వందల మైళ్ళు దాటి వచ్చావు... నన్నూ లాక్కొచ్చావు..

లాక్కొచ్చావ్ పో... అక్కడితో ఊరుకున్నావా? రాత్రి తొమ్మిది కొడితే ముసుగు తన్నే నువ్వు... ఎంత రాత్రి అయినా వెనక్కి వెళ్ళిపోదామనే అనే నువ్వు... ఈ టైంలో ఇక్కడి తీసుకువచ్చావు?

ముగ్ధా.. నువ్వు చాలా మారిపోయావు. ఎదిగిపోయావ్...'' ముద్దుగా అంది పూర్ణిమ.

''ఏమో తెలియదు పూర్ణిమా... కానీ నాకీ రోజు చాలా సంతోషంగా వుంది.

సంగీత రాణి లక్ష్మిగారిని కలిసాను... ఆవిడ అంగీకారం తీసుకున్నాను...

నా మనసులో ఏదో చెప్పలేని భావం... నా కార్తికేయ ఇక్కడే నా ఎదురుగా వున్నట్టుగా...

అదే సమయంలో ట్యాంక్‌బండ్ మీదుగా హెలికాప్టర్ ఎగురుతుంది... చాలా కింది నుండి...

మాట్లాడ్డం ఆపి పైకి చూసింది. పూర్ణిమ కూడా...

''చిన్నప్పుడు విమానాలు ఎగురుతూ వుంటే బయటకు వచ్చి చేతులు వూపేవాళ్ళం కదా'' పూర్ణిమ అంది.

అవును.. వాళ్లకు టాటాచెప్పడం అన్నమాట.. అంటూ అప్రయత్నంగా చేతులు గాల్లోకి లేపింది.

ఏదో భావం... ఏదో పరిమళం... ఏదో తన మనసును చుట్టుముట్టుడుతున్నట్టు...

ఆ హెలికాప్టర్ ఢిల్లీ వైపు వెళ్తోంది. అందులో వున్నది కార్తికేయ.

ఏ రచయితా సృష్టించలేని మెలోడ్రామా విధి ద్వారా జీవితంలో తారసపడుతూ వుంటుంది.

:::::

రాధారాణి మోహన వైపే చూస్తోంది.

''చెప్పండి మిస్..'' అని అడిగింది.

''మీ ఐక్యూ చూస్తోంటో ముచ్చటేస్తుంది. కరెక్ట్‌గా గెస్ చేసారు? అంత కరెక్ట్‌గా ఎలా గెస్ చేసారు.

''డబ్బు కోసం నన్ను కిడ్నాప్ చేయడానికి నేను బిజినెస్ విమెన్‌ని కాదు.. నాలాంటి డాక్టర్ని ఇలాంటి పనుల కోసమే కిడ్నాప్ చేస్తారు'' రాధారాణి అంది కూల్‌గా.

''గుడ్.. గుడ్ ఎనాలిసిస్.. మీరు ఇద్దరమ్మాయిలకు ప్లాస్టిక్ సర్జరీ చేయాలి...'' మోహన చెప్పింది.

''మంటల్లో లేదా యాక్సిడెంట్‌లో మొహం కాలిపోయిందా? రాధారాణి అడిగింది.

''నా మొహం చూస్తోంటే కాలిపోయిన మొహంలా కనిపిస్తుందా? నాకు తెలిసిన నావి మిస్ యూనివర్స్ కొలతలు...'' కాసింత గర్వంగా అంది మోహన.

రాధారాణి ఓసారి మోహనవైపు చూసింది... మోహన అన్నదాంట్లో అతిశయోక్తి లేదు.. చాలా అందంగా వుంది.

''యస్.. మీరు చాలా అందంగా వున్నారు'' సిన్సియర్‌గా అంది రాధారాణి.

''టు బి ఫ్రాంక్, మీరు బావున్నారు... ఐ థింక్ ఫార్టీప్లస్ అయినా మంచి ఫిజిక్'' అంది మోహన.

రాధారాణికి నవ్వొచ్చింది. తను కిడ్నాప్ అయింది. తనకు కిడ్నాపర్‌కు మధ్య ఇలాంటి సంభాషణ?

రాధారాణిగారు... ఇప్పుడు చెప్పండి... నాకు మీరు ఫ్లాస్టిక్ సర్జరీ చేయాలి... నాతో పాటు మరొకరికి...''

అంటే...?

''నన్ను మరొకరిగా మార్చాలి... మరొకరిని నన్నుగా మార్చాలి''.

''మీరు ఇంగ్లీష్ సినిమాలు ఎక్కువగా చూస్తారా? ఎందుకంటే మీ ఆలోచనలు.. ప్లాస్టిక్ సర్జరీ టెక్నికల్ నీడ్ అని రాధారాణి ఆగింది.

''పోనీ అలానే అనుకోండి. నాకు తెలిసి ఇంగ్లీష్ సినిమాలోనే కాదు కదా ఏ భాషా చిత్రంలోనూ లేని ట్విస్ట్ ఇందులో వుంది, అంది మోహన.

ఈ లోగా ఈ డి.వి.డి చూడండి.

మాంచి థ్రిల్లర్... అంటూ డి వి డి ప్లేయర్ లో డి వి డి పెట్టి రిమోట్ రాధారాణికి ఇచ్చి బయటకు నడిచింది మోహన. ఆ గదిలో వున్న రహస్య కెమెరాలు రాధారాణిని కవర్ చేస్తు న్నాయి.

టీవిలో డి వి డి ప్లే అవుతుంది. అది మోహన నేర చరిత్రకు సంబంధించింది. ఆమె మీద వున్న నేరాలు... ఇంటర్‌పోల్ వెతుకులాట.. రెడ్ కార్నర్ నోటీసు.. ఒకో క్లిప్పింగ్ చూస్తోంటే రాధారాణికి చెమటలు పడుతున్నాయి. తనను కిడ్నాప్ చేసింది ఒక అంతర్జాతీయ

నేరస్తురాలా? టీవి కట్టేసింది. మొహానికి పట్టిన చెమటను తుడుచుకుంది. ఎదురుగా టేబుల్ మీద ఫోటో... రెడ్ కలర్ మార్కర్ పెన్‌తో రౌండప్ చేసి వుంది...

ఆ ఫోటోను ఎక్కడో చూసినట్టు అనిపించింది. యస్ తను కాన్ఫరెన్స్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు రవీంద్రభారతి దగ్గర రోడ్డు క్రాస్ చేస్తూ... వుండగా చూసింది. ఆ ఫోటో ముగ్ధది.

⁂

కార్తికేయ ఆలోచనకు వెనక్కి వెళ్ళాయి. ఏ సినిమాలోనూ చూడని సన్నివేశం... ఎదు రవ్వని సంఘటన..

ఆ రోజు బాగా గుర్తుంది కార్తికేయకు.. కొలీగ్ను పరామర్శించడానికి హాస్పిటల్‌కు వెళ్ళాడు. అక్కడో హృదయవిదారక సంఘటన కనిపించింది. ఓ మహిళకు పురిటినొప్పులు... బిడ్డ అడ్డం తిరిగింది. తల్లీ బిడ్డ బ్రతకాలంటే మరో పెద్ద ఆసుపత్రికి షిఫ్ట్ చేయాలి. పైకె ్నన పదిహేనేళ్ళకు బిడ్డ పుట్టబోతుంది. అంబులెన్స్ రెడిగాలేదు.. పార్లమెంట్‌కు సమీపంలో వున్న ఆ హాస్పిటల్ నుంచే మరో హాస్పిటల్‌కు వెళ్ళాలి. రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్ళటానికి సెక్యూరిటీ వాళ్ళు ఆ ప్రాంతాన్ని బ్లాక్ చేసారు. రాష్ట్రపతి వెళ్ళే వరకూ ఎవరూ ఆ రూట్లో వెళ్ళడానికి వీల్లేదు. మరో దారిలో వెళ్ళాలంటే రెండు గంటలు పడుతుంది. కార్తికేయ ఒక్కటే ఆలోచించాడు. తల్లీ బిడ్డ ముఖ్యం. ఆ సమయంలో ప్రోటోకాల్.. కన్నా తల్లి పుట్టబోయే బిడ్డ ప్రాణాలు ముఖ్యం.

ఆ గర్భిణీ స్త్రీని ఆమె భర్తను తన కారులో ఎక్కించుకున్నాడు. రాష్ట్రపతి కాన్వాయ్‌ని చేదించి కారు దూసుకువెళ్ళింది. సెక్యూరిటీ, కాన్వాయ్ ఎలర్ట్ అయింది.

కారును ఆపండి... కుదరకపోతే పేల్చేయండి. సెక్యూరిటీ చీఫ్ ఆదేశించాడు.

దండులా కదిలింది ఢిల్లీ పోలీస్.

⁂

# 37.

ప్రాణాలతో పందెం... రెండు ప్రాణాలను కాపాడడానికి, తన ప్రాణాన్ని తృణప్రాయంగా భావించాడు. వెనుక సీట్లో కూచొన్న మహిళ ప్రసవవేదనతో విలవిలలాడిపోతుంది. ఆవిడ భర్త దిక్కు తోచని స్థితిలో వున్నాడు. వెనుక నుంచి పోలీస్ వెహికల్స్... ఆ ఏరియాని మిలిటరీ ఆధీనంలోకి తీసుకుంది. కార్తికేయగారు వేగాన్ని అందుకోవడం వాళ్ళకు సాధ్యపడలేదు. సరిగ్గా పదిహేను నిమిషాల్లో కారు స్టార్ హాస్పిటల్ ముందు ఆగింది. క్షణాల్లో స్ట్రెచర్ వచ్చింది. కారు వెనుక సీట్‌లో వున్న మహిళను లోపలికి తీసుకువెళ్ళడం... పోలీస్ కార్తికేయను చుట్టుముట్టడం ఒకేసారి జరిగింది. అదే సమయంలో ఆ మహిళ పండంటి బిడ్డను ప్రసవించింది.

⁂

రాష్ట్రపతి... దేశ ప్రథమ పౌరుడు. త్రివిధ దళాలకు అధిపతి... స్వాతంత్ర్య సమరయోధుడు.

మహాత్మాగాంధీతోపాటు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వ్యక్తి... కురు వృద్ధుడు. దేశభక్తి రంగరించిన వ్యక్తి... పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యక్తి... మరో తెలుగు వాడు... ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా... వెలిదిమళ్ళ లక్ష్మీ నరసింహారావ్... రాష్ట్రపతి అంటే కేవలం రబ్బర్‌స్టాంప్ మాత్రమే అన్న అపవాదును తుడిచేసిన వ్యక్తి. న్యాయ సమ్మతం కాని ఫైల్‌ని నిర్ద్వందంగా తోసిపుచ్చిన సంఘటనలు వున్నాయి. ఎన్నో కష్టాలకోర్చి సాధించుకున్న స్వరాజ్యం కాపాడుకోవడం మన విధి అని త్రికరణ శుద్ధిగా నమ్మిన వ్యక్తి. నిఘా విభాగం నుంచి వచ్చిన సమాచారం రాష్ట్రపతిని ఆందోళనకు గురి చేసింది. దేశ రక్షణకు విఘాతం కలిగించే విషయం మాత్రమే కాదు..

ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే కుట్ర... ఒక అంతర్జాతీయ నేరస్తురాలు... తీవ్రవాద సంస్థలతో చేతులు కలిపి... దేశంలో విధ్వంసం సృష్టించే కుట్ర...

ఆ కుట్ర ఎంత భయంకరమైనదంటే... దేశాన్ని అల్లకల్లోలం చేసి, ప్రభుత్వాన్ని కూల దోసి, రాజరికంవైపుదాన్ని తీసుకువెళ్ళే కుట్ర. ఒకప్పుడు రజాకార్లు చేసిన కుట్రకన్నా భయం కరమైన కుట్ర... సర్దార్ వల్లభభాయి పటేల్‌తో సహచర్యం చేసిన రాష్ట్రపతి...

ఆ రోజు సర్దార్ వల్లభభాయి పటేల్ సైనిక చర్య రాష్ట్రంలోని నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పింది... మరి ఇప్పుడు...?

⁂

హోం శాఖలోనూ, నిఘావర్గాలలోనూ... చివరి సి బి ఐ లాంటి సంస్థలలోనూ అగంతకులు ప్రవేశించారు...

ఎవరుని నమ్మాలి... ఎవ్వరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి... రాష్ట్రపతి ప్రత్యేక భద్రతాధికారి, నిఘా వర్గాల చీఫ్... రాష్ట్రపతితో పాటు బులెట్‌ప్రూఫ్ వాహనంలో వున్నారు.

సరిగ్గా అప్పుడే కల కలం... కాన్వాయ్‌ని చేదించుకుని వెళ్ళిన కార్తికేయ కారు... అరెస్ట్ చేసిన పోలీసులు... ఈ సమాచారం రాష్ట్రపతికి చేరింది. కార్తికేయ గురించి క్షణాల్లో ఎంక్వయిరీ ప్రారంభం అయింది.

కార్తికేయ కస్టమ్స్ అధికారిక అని, డ్యూటీ మైండెడ్ అని రిపోర్ట్... పైగా తెలుగు వాడు... ఆటను కాపాడింది ఒక తల్లినీ... అంతకన్నా, కోమాలోకి వెళ్లిపోతున్న మానవత్వాన్ని...

అతడిని తన దగ్గరికి సగౌరవంగా తీసుకురమ్మన్నాడు ప్రెసిడెంట్... ఈ విషయం ఏ మాత్రం బయటకు పొక్కకూడదని ఆదేశాలు జారీ అయ్యాయి.

⁂

అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య కార్తికేయను రాష్ట్రపతి భవన్‌కు తీసుకువచ్చారు. ఒక దేశాధ్యక్షుడికి ఇచ్చే గౌరవం కార్తికేయకు లభించింది. రాష్ట్రపతి ఆంతరంగిక

గది. ఆ గది వైశాల్యం ఒక పెద్ద భావన సముదాయం అంత. ఆ గది చుట్టూ పదుల సంఖ్యలో కెమెరాలు... సెక్యూరిటీ చీఫ్ ఆఫీసులో ఆ గదిలో జరిగే ప్రతి సంఘటన, చిన్న శబ్దం కూడా రికార్డు అవుతుంది. మొట్టమొదటిసారి... ఆ ఏర్పాటుకు విరామం... ఆ గదిలో జరిగే సంఘటన రికార్డు కావడం లేదు. రాష్ట్రపతి కార్తికేయ వైపు చూసాడు. చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు. చేతులు కట్టుకోవడంలో సంస్కార వినయమే తప్ప భయం కనపడడంలేదు. తెలుగు వాడిన రాష్ట్రపతికి... దాదాపు నలభై ఏళ్ళ క్రితం చూసిన పాతాల భైరవి సినిమాలోని తోటరాముడు గుర్తొచ్చాడు. రాజు ముందు నిలబడ్డ రాజసం...

⁂

''ప్రభుత్వ ఉద్యోగంలో వున్న మీరు ప్రోటోకాల్‌ని కాదని నేరం చేసారు'' ప్రెసిడెంట్ అన్నాడు.

''ప్రజలు లేకుండా ప్రభుత్వం లేదు... ప్రథమ పౌరులు అయిన మీరు లేరు... ఇలా అన్నందుకు క్షమించండి. నా దృష్టిలో ప్రాణం విలువైనది... అదీ తల్లీ, బిడ్డ ప్రాణం... అందుకే ఆ సాహసం చేసాను.''

''కానీ ఆ సాహసానికి శిక్ష ఏమిటో తెలుసా? రాష్ట్రపతి అడిగాడు.

''భారత శిక్షాస్మృతి...లోని సెక్షన్ 302 కింద మరణశిక్ష విధించినా ఆ మరణానికి నేను సిద్ధం. ఆగిపోయే నా ఊపిరి ఇద్దరికీ ఊపిరి పోసిందని సంతోషపడుతాను.''

''చావంటే భయంలేదా?

''మానవత్వాన్ని బ్రతికించే ప్రయత్నంలో చావును వెంట్రుక సమానంగా భావిస్తాను. నేను వ్యక్తిని... మానవత్వం వ్యవస్థ...''

'' ఏం చూసుకుని ఆ ధైర్యం?

'' ఈ దేశాధ్యక్షుడి నిజాయితీ చూసుకుని''

'' ఓ నా దేశ ప్రజలారా... వంద కోట్ల భారతీయుల గుండె చప్పుళ్ళ సాక్షిగా అంతా నిజమే చెబుతున్నాను. నా దేశ ప్రథమ పౌరుడి సంస్కారానికి సవినయంగా నమస్కరించి చెబుతున్నాను. నేను చేసింది తప్పయితే... నన్ను సగౌరవంగా ఇక్కడికి తీసుకురారు.

''దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారి లాటీ దెబ్బలు తిన్న మీరు... ఉప్పు సత్యాగ్రహంలో మహాత్ముడి ప్రశంసలు అందుకున్న మీరు...

మీ ఆంతరంగిక మందిరంలో నన్ను ''మీరు'' అని సంస్కారంగా సంబోధించే మీరు...''

''నేను చేసింది తప్పని భావిస్తే... మిలార్డ్ మీ ముందు దోషిని అవుతా...''

మనవత్వాన్ని బ్రతికించడం కోసం...

తల వంచినా సింహాన్ని చూసాడు రాష్ట్రపతి.

తన ఆసనం నుంచి లేచాడు. బులెట్ ప్రూఫ్ గ్లాస్‌ఛాంబర్ నుంచి బయటకు వచ్చి కార్తికేయను ఆలింగనం చేసుకున్నాడు.

ఓ అద్భుతం అక్కడ ఊపిరి పోసుకుంది. ఆ క్షణమే రాష్ట్రపతి నిర్ణయించుకున్నాడు. కార్తికేయే ఈ దేశ రక్షకుడు.

❖❖

# 38.

ఎనభై-తొంభై పడిలో వున్న కురు వృద్ధుడు... భీష్మాపితామహుడే... దేశభక్తి, సంస్కారం ఉట్టిపడే దివ్య తేజస్సు.

రాష్ట్రపతి కార్తికేయను చేరాడు. అతని భుజం మీద చేయివేసాడు.

''స్వాతంత్ర్య పోరాట సమయంలో ఇంకా నూనుగు మీసాల కుర్రాడినే... మహామహులను చూసాను... నా చిన్నతనంలో రజాకార్లను చూసాను... ఎన్నో పోరాటల ఫలితం మనం అనుభవిస్తోన్న ఈ స్వతంత్ర భారతం... స్వార్థపర శక్తుల చేతుల్లో చిక్కుకోకూడదు ఒక తల్లి ప్రాణాన్ని, ఇంకా భూమి మీదికి రాని ఓ పసిబిడ్డను కాపాడటానికి నీ ప్రాణాలను పణంగా పెట్టావు. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాతో తలపడ్డావు. నాకు ప్రోటోకాల్ అక్కర్లేదు... ఇప్పటికే చాలా కాలం బ్రతికాను. ఇంకా బ్రతకాలన్న ఆశ, కోరిక లేవు. కానీ ఈ ప్రజాస్వామ్యాన్ని, ఈ స్వాతంత్ర్య భారతాన్ని బ్రతికించాలి'' అని ఆగి ''నువ్వు బ్రతికించాలి'' అన్నాడు.

ఒక్క క్షణం భయంకరమైన నిశ్శబ్దం. నేనా ''విస్మయానందం... విభ్రమాశ్చర్యం''... కార్తికేయలో.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దేశ భక్తుడు, దేశానికి ప్రథమ పౌరుడు. త్రివిధ దళాలకు అధిపతి... అన్నింటికీ మించి విలువలకు ప్రాణంపోసే వ్యక్తి.

❖❖

రాష్ట్రపతి కార్తికేయను డైనింగ్ టేబుల్ దగ్గరికి తీసుకువెళ్ళాడు. వేడి వేడి వంట పదార్థాలు... తెలుగు రుచుల ఘుమ ఘుమలు...

గోంగూర, ఆవకాయ, వడియాలు, సాంబారు, ముద్దపప్పు... పచ్చళ్ళు...'' ఈ పూట నాతో కలిసి భోజనం చేస్తారా?

కార్తికేయ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రాష్ట్రపతి అన్నాడు... ఈ వయసులో తిని అరాయించుకునే శక్తిలేదు. ఒంటిపూట భోజనమే... ప్రపంచంలో చాలా మంది '' ఈ గుప్పెడు అన్నం కోసం కష్టపడుతూ, చివరికి డబ్బు సంపాదనలో కడుపునిండా తినడమే మర్చిపోతున్నారు కార్తికేయా... ఆకలి అంటే నాకు భయం... గౌరవం... నాతోపాటు కలిసి భోజనం చేయి...'' ఆప్యాయంగా అతని చేయి పట్టుకున్నాడు.

ఇది కలా? నిజమా?

''అధికారంలో వుంటే ఎన్నో ఫార్మాలిటీస్... నేను తినే ప్రతీ పదార్థం పరిశీలించాల్సిందే... నీ కోసం సడలించాను...'' అంటూ తనే కార్తికేయకు వడ్డించాడు. తనూ పక్కన కూర్చున్నాడు. కార్తికేయలో భావోద్వేగం చిన్నపాటి ప్రకంపనగా మారింది.

కార్తికేయ అన్నం కలుపుతున్నాడు. రాష్ట్రపతి కార్తికేయవైపు చూసి...'' నేను మృత్యువు అంపశయ్య మీద వున్న భీష్ముడిని, నాకు స్వచ్ఛందమరణం వరంగాలేదు... అందుకే నిన్నో వరం అడుగుతున్నాను...'' కార్తికేయ వెంటనే అన్నాడు... వరం కాదు, ఆజ్ఞగా ఇవ్వండి... శిర సావహిస్తాను... నేను తినే ఈ అన్నం సాక్షిగా ''మనస్ఫూర్తిగా'' అన్నాడు.

భోజనం ముగించారు... రాష్ట్రపతి ఉత్తరంవైపు వున్న గోడ దగ్గరికి వెళ్ళాడు. అక్కడ భరతమాత తైల వర్ణ చిత్రం వుంది. ఆ చిత్రాన్ని పక్కకు జరిపి చిన్న బుడిపెలాంటి దాన్ని ప్రెస్ చేసాడు. రహస్య ద్వారం తెరుచుకుంది. కార్తికేయ రాష్ట్రపతిని అనుసరించాడు. ర్యాక్‌లో నుంచి కొన్ని పెన్‌డ్రైవ్ తీసాడు... ఫోటోలు వున్న కవర్ తీసాడు. వాటిని కార్తికేయకు ఇచ్చాడు.

'' ఈ కవర్‌లో వున్న ఫోటోలు మోహన'' అనే కరుడుగట్టిన మహిళా నేరస్థురాలివి. ఎన్నో అంతర్జాతీయ తీవ్రవాద నేరాలతో సంబంధం వున్న వ్యక్తి. పెన్‌డ్రైవ్‌లో ఆమె సమావేశ మైన వీడియో క్లిప్స్ వున్నాయి. అల్‌ఖైదా, మరికొన్ని ఉగ్రవాద సంస్థలతో ఆమె జరిపిన సంభా షణల క్లిప్స్ వున్నాయి. నిప్పుకన్నా ప్రమాదం... పాదరసం కన్నా జారిపోయే తెలివి, మను ష్యుల బలహీనలతో ఆడుకుంటుంది. తను అనుకున్నది సాధించడం కోసం ఎంతకైనా తెగి స్తుంది.''

చాలా కాలంగా నిఘావర్గాలు కష్టపడి సంపాదించిన వివరాలు. ఈ ప్రయత్నంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.

భారతదేశాన్ని మళ్ళీ రాజరికం వైపు నడిపించే మహాకుట్ర... తనే నియంతగా పరిపా లించాలన్న దుష్ట ఆలోచన. దీనికి పొరుగుదేశంలోని ఉగ్రవాద సంస్థలు సహకారాన్ని అంది స్తున్నాయి. ఇదే జరిగితే స్వతంత్ర భారతం మళ్ళీ బంధించబడుతుంది. రజాకార్ల నుంచి ఓ ముస్లింసోదరి కాపాడింది. మా అన్నయ్యను తన సోదరుడు అని చెప్పింది.

అలాంటి పరిణామాలు మళ్ళీ రావద్దు.

సూర్యోదయంతో మొదలై, సూర్యాస్తమయంతో ముగిసి యుద్ధం కాదు... నిరం తరం... శత్రువు నేలకొరికే వరకు శత్రువు ఓటమి పాలయ్యేవరకూ ఈ యుద్ధం కొనసాగాలి. ఇది ప్రధానికో, హోం మినిస్టర్‌కు చెప్పవచ్చు... ఈ కేసు సి బి ఐ కి అప్పగించవచ్చు... కానీ ప్రతిచోట మోహనకు నెట్‌వర్క్ వుంది. రాష్ట్రపతి కార్యాలయం అలంకారమన్న అపోహతో ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు.

ఈ యుద్ధానికి నువ్వే సర్వసేనానివి... నువ్వే ఒక సైన్యానివి... ఏకవ్యక్తి సైన్యానివి... వన్‌మేన్ ఆర్మీవి.

''కార్తికేయ వైపు తిరిగి సెల్యూట్ చేస్తూ చెప్పాడు రాష్ట్రపతి. అతని చేతిలో రాజ పత్రం... తనకున్న విచక్షణాధికారంతో ఇచ్చిన రాజశాసనం.

దేశచరిత్రలో అద్భుత ఘటనకు రాష్ట్రపతి భవన్ వేదిక అయింది.

రాష్ట్రపతి పూజాగది వైపు నడిచాడు. నిలువెత్తు శ్రీవెంకటేశ్వరుని విగ్రహం... ఆ

విగ్రహం పాదాల దగ్గర వజ్రాలు పొదిగిన ఖడ్గం... స్వామికి నమస్కరించి ఆ ఖడ్గాన్ని చేతి లోకి తీసుకున్నాడు. కార్తికేయ దగ్గరికి వచ్చి...

'' ఇది మా వెలిదిమళ్ళ వంశానికి మాత్రమే దక్కిన అపూర్వనిధి. ఈ ఖడ్గం గురించి తెలుసా? ఆగి కార్తికేయ వైపు చూసాడు.

⁂

# 39.

ఒక్క క్షణం... ఒళ్ళు గగుర్పొడిచింది. ఇది కలా? కలలాంటి నిజమా? రాష్ట్రపతి కొన సాగించాడు.

ఇది కొన్ని వందల సంవత్సరాల క్రితం కథ. కొన్ని తరాల వెనక్కి వెళ్ళాలి.

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని అవతారాన్ని ఓ రాక్షసుడు అవహేళన చేస్తూ, శిలలా వున్న నువ్వు '' ఆపద మొక్కులవాడివా? అంటూ దూషించాడు. అయినా దేవుడు కాబట్టి సహించాడు. అక్కడితో ఆ రాక్షసుడు... ఆగక తిరుపతిని దర్శించే భక్తులను హింసిం చడం మొదలు పెట్టాడు... భక్తజన ప్రియుడైన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుడు తన భక్తు లను హింసించడం చూసి ఆగ్రహించి ఉగ్రనరసింహుడుగా మారి... పర్వత ప్రాంతంలో వున్న వేల సంవత్సరాల నాటి ఓ మహావృక్షాన్ని పెకలించాడు. భూమి దద్దరిల్లింది. ఆకాశము ఉరిమింది... సమస్త ప్రాణులు మూర్ఛిల్లాయి. ఆ మహా వృక్షాన్ని ఖడ్గంగా మార్చి... ఆ రాక్షసు డిని సంహరించాడు.

మహామాన్వి అనే మహావృక్షం, మహా విష్ణువు చేతిలో ఖడ్గమైంది. ఆ పర్వత ప్రాంతంలో తపస్సు చేసుకునే మునికి ఆ ఖడ్గం కాపాడే బాధ్యత అప్పగించాడు. అది తరాలు మారి, మా వంశానికి ఆ దేవుడి ప్రసాదంగా లభించింది.

తాళపత్ర గ్రంథాల ద్వారా తెలిసిన విషయాలు. ఈ ఖడ్గం ధరించు... ఈ దేశాన్ని, దేశ ద్రోహ అసురులను సంహరించడానికి ఈ ఖడ్గాన్ని ఉపయోగించు, ఈ ఖడ్గాన్ని ముందు ఆ తిరుపతి వెంకటేశ్వరుడి పాదాల ముందు ఉంచాలని అనుకున్నాను. నీతో దుష్ట శిక్షణ చేయిం చడానికి అది వాయిదా పడింది'' అంటూ ఖడ్గాన్ని కార్తికేయ చేతిలో పెట్టాడు.

ఒక్కసారిగా కార్తికేయ ఒళ్ళు జలదరించింది.

శరీరంలో వేన వేల మెరుపులు ప్రవేశించిన భావం. ఏదో దివ్యశక్తి తన శరీరాన్ని కవ చంలా మార్చిన అనుభూతి. ఆ ఖడ్గం చేతిలోకి తీసుకోగానే తానో రాకుమారుడిగా మారి నట్టు...

''కార్తికేయ... ప్రతీ యుగంలో దేవుడు దుష్టశిక్షణ కోసం ఓ అవతారం ఎత్తుతాడు... ఒక్కో ఆయుధాన్ని చేపడతాడు. ఆ దైవాంశ నీలో వుందని నమ్ముతున్నాను... వెళ్ళు కార్తికేయ, రాజ్యలక్ష్మిని కాపాడే తోటరాముడివి నువ్వే... విజయోస్తు... దీవించాడా కురువృద్ధుడు... మంత్ర ముగ్ధుడిలా... ఆ ఖడ్గాన్ని చేత ధరించాడు.

✣✣✣

ఆ క్షణమే కార్తికేయ రంగంలోకి దిగాడు. మోహనకు సంబంధించిన వివరాలు సేక రించడం మొదలుపెట్టాడు. ఆ ప్రయత్నంలోనే సిక్వీని వెంబడించాడు... అదే సమయంలో సి బి ఐ చీఫ్‌ని యాద్రిచ్చికంగా కాపాడాడు. రాష్ట్రపతికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ విషయాన్ని ఎవరికి చెప్పలేదు.

✣✣✣

రాధారాణి మొహానికి పట్టిన చెమటను కొంగుతో తుడుచుకుంది. ఏ.సీలోనూ చెమ టలు, చెమటలు ప్రాణభయంతో కాదు... మోహన వల్ల ముగ్ధ ప్రాణాలకు ఆపద వాటిల్లుతుం దని. అడుగుల శబ్దం... మోహన ఆ గదిలోకి వచ్చింది. రాధారాణి ఎదురుగా కూచుంది.

''చెప్పండి డాక్టర్ ఏం నిర్ణయించుకున్నారు? కూల్‌గా అడిగింది.

'' ఏం నిర్ణయించుకున్నాను అని చెప్పమంటారు మిస్ మోహనా? ప్లాస్టిక్ సర్జరీ అంటే మీకు పిల్లలు ఆడుకునే ఆట అనుకుంటున్నారా? రాధారాణి అడిగింది.

''అఫ్‌కోర్స్... కానీ మీ దృష్టిలో అదే... మీ ప్రతిభ ప్రపంచంనికి తెలుసు... ప్రపంచం లోని టాప్ వన్ హెల్త్ జర్నల్స్ మీ గురించి రాసిన ఆర్టికల్స్... అతడు ఆ జర్నల్స్‌ను రాధారాణి చేతికి ఇచ్చింది.

''మాకు కొన్ని ఎథిక్స్ వుంటాయి?

''మాకు ఎథిక్స్, మోరల్ వాల్యూస్ ఏమీ వుండవు... నా చేతిలో వుండే రివాల్వర్‌కు దయాదాక్షిణ్యాలు అసలే వుండవు...''

'' ఐ మీన్ వాట్ ఐ సే''... మీరు ఈ ప్లాస్టిక్ సర్జరీ చేయకపోతే, నా ప్రాణాలు రక్షించు కోవడం కోసం ఎందరి ప్రాణాలు అయినా తీస్తాను. ఒక విషయం కన్‌ఫర్మ్‌గా చెప్పగలను... ఒక అమెచ్యూర్డ్ సర్జన్‌తో ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తాను...

అని ఆగి నాకు కాదు... ముగ్ధకు...''

'' ఆర్యూ మ్యాడ్... అలా చేస్తే ఆమె ప్రాణాలకు ముప్పు...'' కోపంగా అంది రాధా రాణి.

''అఫ్‌కోర్స్... నాకు ఇలాంటివి సరదా... ముప్పు నా ప్రాణాలకు కాదు కదా.... ఎడారి ప్రాంతంలో కొందరు షేక్‌లు ఒంటెలకు పసిపిల్లలను కట్టేసి, ఒంటెలు పరుగెడుతూ వుంటే పిల్లలు భయంతో ఏడుస్తూ వుంటే వాహ్... వాహ్... అని ఎంజాయ్ చేస్తారు... నేనూ అదే టైపు...''

రాధారాణి మౌనంగా ఉండిపోయింది... మోహన చెప్పినట్టు చేయకపోతే... ముగ్ధ ప్రాణాలకు ముప్పు... మోహనకు మత్తు ఇచ్చి...''

''రాధారాణిగారూ... ఒకవేళ మీరు ఈ సర్జరీకి ఒప్పుకొని, మీ డాక్టర్ తెలివితేటలతో నన్ను కోమాలోకి పంపించే ప్రయత్నం చేయాలనుకున్నా కుదరదు... మీ సర్జరీని మత్తు లేకుండా చూస్తాను... ఆపరేషన్ థియేటర్‌లోని సర్జరీ సి సి కెమెరాల ద్వారా మా వాళ్ళు వాచ్

చేస్తూనే వుంటారు.''

రాధారాణి నిస్తేజమైంది... ఒకే ఒక మార్గం సర్జరీ...

''సర్జరీకి ఇక్కడ సాధ్యపడదు... సర్జరీకి కావలసిన...'' ఆమె చెప్పడం పూర్తికాక ముందే...

''సాధ్యపడుతుంది డాక్టర్...

అంటూ ఆమె ఎదురుగా వున్న కర్టెన్ లాగింది. ఒక స్టార్ హాస్పిటల్‌లో వున్న సౌకర్యాలు...

మీ సర్జరికీ కావలసిన సహాయకులు... డాక్టర్స్... అంటూ తలతిప్పి చూసింది. మోహన వెనుక ఇద్దరు డాక్టర్స్... మోహానికి ముసుగులు...

''వీళ్ళని మీలా కిడ్నాప్ చేసి తీసుకురాలేదు... డబ్బిచ్చి తీసుకు వచ్చాను. ప్రపంచంలోఅంతా మీలాంటి మంచివాళ్ళు వుంటే మా లాంటి విలన్స్ పరిస్థితి ఏమిటి? నవ్వి అంది.

ఆ నవ్వులో అతి భయంకరమైన కాలకూట సర్పం బుస విన్పించింది.

# 40.

దేవుడు మనిషికి ఇచ్చిన ఆయుష్షు వందేళ్ళు. ప్రపంచ జనాభాలో పదిశాతం మంది కూడా వందేళ్ళు దాటి కనీసం వందేళ్ళు బ్రతికి దాఖలాలు లేవు. అనారోగ్యం, ప్రమాదం, హత్యలు... ఇలా ఏవో కారణాలతో చిన్న వయసులోనే చస్తున్నారు.

ఒత్తిడి, డబ్బు మీద ఆశతో రాత్రింబవళ్ళు కష్టపడి జీవితంలోని మాధుర్యాన్ని కోల్పోతున్నారు.

కొందరు స్వార్థపరులు డబ్బుకోసం ఇతరులకు హాని చేయడానికి కూడా సిద్ధపడుతున్నారు. మోహనకు, వారికి తేడా లేదు.

ఈ మనుష్యులు ఎటు పోతున్నారు. వీళ్ళు ఎంత కాలం బ్రతుకుతారు?

రాధారాణి ఆ డాక్టర్స్ వంక చూసింది. ఆమె వైపు చూసి ధైర్యంలేని ఆ డాక్టర్స్ తలలు పంచుకున్నారు.

మోహన ఆ డాక్టర్స్‌ని వెళ్ళమన్నట్టు సైగ చేసింది. వాళ్ళు వెళ్ళిపోయారు.

''థాంక్యూ రాధారాణిగారు... నాకు పెద్ద శ్రమ లేకుండా చేసారు. మరోవిషయం... మీరు మీ వాళ్ళకు ఫోన్ చేసి మీ గురించి కంగారు పడవద్దని చెప్పండి'' మోహన చెప్పింది.

అప్పుడే మోహన సెల్‌రింగ్ అయింది.

''మామిడి పళ్ళు ఈ సీజన్లో దొరుకుతాయా? అటువైపు నుంచి వినిపించింది.

'' ఈ సీజన్లోనే దొరుకుతాయి'' మోహన చెప్పింది.

''మోహనాజీ నేను ఢిల్లీ వచ్చాను. కార్తికేయ మనకోసం పులిలా మీద పడడానికి

సిద్ధంగా వున్నాడు''

''ఖాసింజీ మీరు కంగారు పడకండి. ప్రపంచలోనే టాప్ ఫైవ్ తీవ్రవాద సంస్థల్లో ఒక టైన ముఖైదా సంస్థకు మీరు సుప్రీం... మీరిలా కంగారుపడితే ఎలా? కూల్‌గా అంది మోహన.

కార్తికేయ గురించి మీకు బాగాతెలుసు... మరో పక్క రాబర్ట్ మీ కోసం వేటకుక్కలా తిరుగుతున్నాడు.'' ఖాసిం చెప్పాడు.

''రాబర్ట్ ఈ లోకం నుంచి నిష్క్రమించి ఇరవై నాలుగు గంటలు అయింది. గుర్తుప ట్టడానికి వీల్లేకుండా కాలిపోయింది. మార్చురీలో వుంది... రాబర్ట్ డెడ్‌బాడీ కార్తికేయకు వార్నింగ్‌లాంటిది.

నేను త్వరలో ఢిల్లీ వస్తాను... మోహనగా కాదు... ముగ్ధగా బై ఖాసింజీ'' ఫోన్ కట్ చేసింది.

మోహనకు రాబర్ట్ గుర్తొచ్చాడు... అతడిని తనెలా ట్రాప్ చేసిందో గుర్తొచ్చింది. ఇరవై అయిదు గంటల క్రితం...

⁂⁂

హోటల్ వ్యూ...

థర్డ్ ఫ్లోర్ సూట్ నంబర్‌ఫైవ్...

గ్లాసెస్ నుంచి సిటీ కనిపిస్తుంది. అంతకన్నా మోహన వుండే బిల్డింగ్ కనిపి స్తుంది.మోహనను వెతుక్కుంటూ వచ్చిన రాబర్ట్‌కు ఓ దశలో మోహనను దగ్గరి నుంచి షూట్ చేసే అవకాశం వచ్చింది.

కానీ మోహనను బంధించి, తానేమిటో చెప్పి తమ ఏజెంట్స్‌ని చంపినందుకు చిత్ర హింసలు పెట్టి చంపాలి... దాన్ని వీడియో తీయాలి... అంత కసిగా వున్నాడు.

రెండు రోజులగా మోహనను గమనిస్తున్నాడు. మోహన ఓ డాక్టర్‌ని కిడ్నాప్ చేయడం చూసాడు... మోహనకి ఆ అవసరం ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు.

ముందు ఫ్రెష్ అవ్వాలి... బాత్‌రూం వైపు నడిచాడు. నైట్‌డ్రెస్ విప్పాడు... అప్పటికే టబ్‌లో నీళ్ళు ముప్పావువంత వచ్చేసాయి... సన్నగా పొగలు కక్కుతున్న నీళ్ళు... టబ్‌లో పడుకున్నాడు... క్షణంలో వెయ్యోవంతు... అరవడానికి కూడా అవకాశం లేనంత... రాబర్ట్ శరీరం నిప్పుల్లో కాలిపోతున్నట్టు...

టబ్‌లో వున్నవి వేడి నీళ్ళు కాదని యాసిడ్ అని అతనికి అర్థమయ్యేలోగా శరీరం కాలిపోయింది.

వరల్డ్‌ట్రేడ్ సెంటర్ మీద దాడి జరిగాక బిన్‌లాడెన్‌ని వెంటాడి, బిన్‌లాడెన్ చేసిన తప్పుకు ఏ తప్పూ చేయని అతని అనుచరుల భార్యలను, తీవ్రవాదులను ఘోరంగా టార్చర్ చేసి, వారిని నగ్నంగా హింసించిన రాబర్ట్ చరిత్ర ఆ విధంగా ముగిసిపోయింది.

ఆ సూట్‌లో వున్నా మరో ద్వారం గుండా వచ్చింది మోహన. ఆమె చేతిలో బొకే...

బాత్‌టబ్‌లో కాలిన రాబర్ట్ దేహంవైపు చూసి టబ్‌కు తలవైపు బొకే పెట్టి శత్రువు దొరకగానే చంపేయక కాలయాపన చేయడం నువ్వు చేసిన పెద్ద మిస్టేక్ మిస్టర్ రాబర్ట్, గుడ్‌బై...'' వెను తిరిగింది మోహన.

ఆ హోటల్‌లో ఈ పనికి సహకరించి... టబ్‌లో యాసిడ్ వచ్చేలా ప్లాన్ చేసిన, ఈ పనికి సహకరించిన వారికి భారీగా డబ్బు ముట్టజెప్పింది. వేరే దేశానికి పంపేసింది.

రాబర్ట్ డెడ్‌బాడీ

అన్ ఐడెంటిఫైడ్ బాడీగా ఢిల్లీ చేరింది..

⁂

రాష్ట్రపతి భవన్... కార్తికేయ, రాష్ట్రపతి ఇద్దరు మాత్రమే అక్కడ వున్నారు.

అమెరికా నుంచి వచ్చిన రాబర్ట్‌ని మోహన చంపేసింది... అతను రహస్యంగా ఇండియా వచ్చాడు మోహనకోసం... తనే మోహనను పట్టుకోవాలని ఆ క్రెడిట్ తనకే దక్కాలని, మనకు సమాచారం కూడా ఇవ్వలేదు.

అతని డెడ్‌బాడీ మార్చురిలో వుంది.

మరో ముఖ్యమైన విషయం... అంతర్జాతీయ తీవ్రవాది ఖాసిం ఇండియా వచ్చాడు... రాష్ట్రపతి తెలిపారు. ఖాసిం ఇక్కడికి వచ్చాడంటే పెద్దప్లాన్‌తోటే వచ్చి ఉంటాడు, కార్తికేయ అన్నాడు.

ఆ సమయంలో ఖాసిం ఢిల్లీలోని ఓ మామూలు హోటల్‌లో రామ్‌గోపాల్‌వర్మ 26/11 సినిమా పైరేటెడ్ కాసెట్ డి వి డి ప్లేయర్‌లో చూస్తున్నాడు.

⁂

# 41.

ఊరు నిద్రలోకి జారుకుంటుంది. పండు వెన్నెల ప్రకృతితో ముచ్చట్లాడుతోంది. పచ్చని పైరగాలి ఊరంతా బలాదూర్ తిరుగూత... పారాహుషార్ అంటోంది... పెరట్లో నవారు మంచి మీద కూర్చుని మోకాలి మీద చుబుకాన్ని ఆన్చి అప్పుడే వెన్నెల్లో స్నానం చేసి వచ్చినట్టు.. మెరిసిపోతున్న చంద్రుడిని చూస్తూ...'' ఆ చంద్రుడిలో తన కార్తికేయను ఆహ్వానించింది... ఉద్వేగాన్ని బ్రతిమిలాడింది... కలను రారమ్మని పిలిచింది.

⁂

కళ్ళు విప్పార్చి చూస్తోంది... ఎప్పుడెప్పుడు భూమి మీదికి వద్దామా అని ఎదురు చూస్తున్నట్టు కనిపించే చంద్రుడి స్థానంలో తన కార్తికేయ...

చంద్రబింబంలో కార్తికేయ మొహం... అలా ఆకాశంలో నుంచి కార్తికేయ నేలమీదికి, తన ఇంటి వైపుకే వస్తున్నాడు... తను ఏ జానపద సినిమానో చూడడం లేదు కదా...

అలా పైనుంచి కిందికి దిగుతోన్న కార్తికేయ పైన ఏడడుగల ఎత్తులో వున్నాడు... మరి

ఏడు క్షణాల్లో ముగ్ధను చేరుకుంటాడు. ముగ్ధ అప్రయత్నంగా తన చేతిని గుండెల మీద ఆన్చుకుంది... గుండె దడ వందల సార్లులా కొట్టుకుంటుంది.

కార్తికేయ సరిగ్గా ముగ్ధ ఎదురుగా దిగాడు.

''మీరా... మీరు మీరేనా? సందిగ్ధం... సంతోషం...''

''నేనే... నీ నేనే... సందేహమా? కుడిచేతిని దాచి అడిగాడు... ఒక్క క్షణం బిడియాన్ని బహిష్కరించి ఉద్వేగాన్ని అణచి ఆనందాన్ని ఆహ్వానించి, కార్తికేయ చేతిని తన గుండె పెద వులకు ఆన్చి...

'' ఇదిగో వినండి నా గుండె ఎలా కొట్టుకుంటుందో చూడండి...''

''అది మీకై నా గుండె సవ్వడి...'' అనగా, కార్తికేయ ఆమె పక్కనే కూచున్నాడు.

'' ఆకాశంలో ఏం చేస్తున్నారు? అడిగింది ముగ్ధ...

''నీకోసమే వెళ్ళాను...''

''నా కోసమా... నేను ఇక్కడే వున్నానుగా''

''నీ తెల్లటి పాదాలకు గోరింట పెడదామని...''

''గోరింట కోసం ఆకాశానికి వెళ్ళాలా?

''దేవుడు భూమి మీద సృష్టించిన గోరింట అమ్మాయిల చేతుల్లో మెరిసిపోతుంది...

నా ముగ్ధకోసం ఆకాశంలో వున్న గోరింటాకు కావాలనిపించింది... చంద్రుడిని అడి గాను... నా ముగ్ధకోసం గోరింట కావాలని...

'' ఇస్తే నాకేమిటి? అని అడిగాడు... నిన్ను నా ముగ్ధ అందమైన చేతుల్లో ఉండేలా చేస్తాను...'' అని చెప్పా... ముగ్ధ కార్తికేయ మెడను చుట్టేసింది.

ప్రపంచంలో ఏ ప్రేమికురాలికి ఇవ్వని కానుక... ఆకాశంలోని గోరింటాను తనకోసం తెచ్చిచ్చిన తన కార్తికేయ...

నేల మీద మోకాళ్ళ మీద వంగి కూర్చుని ముగ్ధ పాదాలకు గోరింట పెడుతున్నాడు. కొద్దిగా చీర కుచ్చెళ్ళు పైకి లేపింది. అందమైన ఆమె తెల్లటి పాదాలు అతని పెదవుల పలక రింపుతో మురిసిపోయాయి.

ఆ అనుభవాన్ని అనుభూతినిస్తోంది. అలా సుఖసుషుప్తిలో తేలిపోతుంది. ఎక్కడో దూరానున్న కార్తికేయ ముగ్ధ మరి తన మాటలు గుర్తొచ్చాయి. మాటరాని కోయిలను చేసిన మనిషి మీరు...

ఎంత గొప్పగా చెప్పిన భావం... ఇష్టంగా, ఆర్తిగా హత్తుకోవాలని అనిపించింది. ఒక గొప్ప అనుభవం స్పర్శింతోందన్న ఫీలింగ్...

ముగ్ధకు కళ్ళు తెరవాలని అనిపించలేదు...

కార్తికేయకు అది కలే... అని చెప్పాలనీ అనిపించలేదు...

నేనే కార్తికేయను... కార్తికేయ నేను అని చెప్పలేని పరిస్థితి...

ఈ అనుభూతితో ఆధ్యాయాన్ని ఇలానే ఊహకే వదిలేద్దాం.

⁂

న్యూఢిల్లీ... సాకేతపుర కాలనీ...

ఆ ఇంట్లో విషాదచాయలు అలుముకున్నాయి. ఆమెని ఎవరు పలకరించినా మాట్లా డ్డంలేదు.

''ఇందూ ఏమిటిది? చిన్నపిల్లలా? విద్యారణ్య భార్యను అనునయిస్తున్నాడు. కానీ ఇందూ అనబడే ఇందుమతి ఏడుస్తూనే వుంది. కారణం... కూతురు అల్లుడు కాశ్మీర్ నుంచి రాకపోవడం, ఫోన్ చేయకపోవడం.

విద్యారణ్య... ప్రపంచం గర్వించే మిమిక్రీ ఆర్టిస్ట్... ప్రపంచ ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ళ వేణుమాధవ్‌గారి ప్రశంసలు అందుకున్న వ్యక్తి. వెంట్రిలాక్విజంలో ఎన్నో ప్రయోగాలు చేసాడు.

కేవలం సినిమా నటుల గొంతులనే కాక, రాజకీయ నాయకులను.. వందల సంవత్స రాల క్రితం పరిపాలించిన రాజుల గొంతులూ అతని గొంతులో ప్రాణం పోసుకుంటాయి. క్షణంలో ఎవరి గొంతునైనా అనుకరించగలడు.

కొద్ది రోజుల క్రితమే మిమిక్రీ కళను విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో ఓ విశ్వవి ద్యాలయం నెలకొల్పాలని ఆలోచన చేసడు.

విద్యారణ్య కూతిరి పెళ్ళి గత నెలలోనే జరిగింది. కూతురుని, అల్లుడుని హానీమూ న్‌కి కాశ్మీర్ పంపించాడు...

రెండు రోజులుగా ఫోన్ చేస్తోన్న కూతురు సడెన్‌గా ఫోన్ చేయడం ఆపేసింది.

⁂

ఇందూ ఏమిటిది? సైట్ సీయింగ్‌కు వెళ్లొచ్చు... నువ్విలా అన్నం తినకుండా వుంటే ఎలారా? భార్యంటే పంచప్రాణాలు విద్యారణ్యకు...

''అమ్మాయి ఫోన్ చేసి మాట్లాడేవరకు... అల్లుడుగారు కారణం చెప్పేవరకు, పక్కన వున్న వాళ్ళు సాక్ష్యం చెప్పే వరకు పచ్చి గంగ ముట్టను.. ఇంట్లో పొయ్యి వెలిగించను...'' తెగేసి చెప్పేసి తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది ఇందుమతి.

⁂

ఇందూ అమ్మాయి ఫోన్... గదిలో వున్న కార్డ్‌లెస్ తియ్యి... గది బయట నుంచి అరి చాడు విద్యారణ్య.

ఇందుమతి మంచం మీది నుంచి దిగ్గున లేచి కార్డ్‌లెస్ అందుకుంది.

అమ్మా ప్రేమా ఏమయ్యావ్? ఆదర్దాగా అడిగింది ఇందుమతి ఫోన్ ఎత్తడంతోనే.

''ఏమిటమ్మా ఇది... చిన్న పిల్లలా... ఆపిల్ తోటలు చూడ్డానికి నేను మీ అల్లుడు వెళ్ళాం. రాత్రంతా ఆపిల్ తోటల మధ్య వుండాలని అనుకున్నాం... ఈ రోజు సైట్ సీయింగ్ వెళ్తున్నాం... నెట్‌వర్క్ కవరేజ్ ప్రాబ్లం... ఈలోగా నాన్నగారు ఫోన్‌చేసి నీ విషయం

చెప్పారు... ఇదంతా వద్దు కానీ ''మేము వచ్చేస్తున్నాం'' చెప్పింది కూతురు.

''వద్దొద్దు... ఏదో నువ్వు ఫోన్ చేయలేదన్న కంగారులో... అసలే రోజులు బాగా లేవు...'' ఇందుమతి అంది.

ఆ తర్వాత తన భర్తతో మాట్లాడింది తల్లితో అంది.

''వద్దమ్మా... మేము ఎక్కడికోవెళ్తాం... అక్కడ కవరేజ్ వుండదు... నువ్వు కంగారుపడతావు... నాన్నగారు నన్ను తిడతారు.

''అబ్బ వదిలేయవే... నువ్వొచ్చే వరకూ ఫోన్ చేయకపోయినా పర్లేదు... సరేనా? ఉంటానే... పాపం నువు ఫోన్ చేయలేదని మీ నాన్నగారిని కూడా పస్తులుంచాను'' అంటూ ఫోన్ పెట్టేసింది.

''మీ ఆయనంటే నీకెంత ప్రేమే... ఫోన్ పెట్టేసే ముందు కన్నీటి తడితో అంది కూతురు.

తన గదిలోనుంచి బయటకు వచ్చి '' ఏమండి సారీ... మీ కోసం పెసరట్టు ఉప్మా రెండు నిమిషాల్లో రెడీ'' అంది కిచెన్ వైపు వెళ్తూ...

కళ్ళు తుడుచుకూంటూ తన గదిలో నుంచి బయటకు వచ్చాడు విద్యారణ్య...

కూతురు, అల్లుడు ఆచూకీ తెలియక అప్పుడే ఇరవై నాలుగు గంటలు అయింది. వినోదాన్ని పంచే మిమిక్రీ ఇప్పుడు తన భార్య కన్నీటిని తుడవడానికి పనికొచ్చింది... తాత్కాలికంగానైనా...

అతనికి ఆ క్షణం తెలియదు... తన అల్లుడు, కూతురు కిడ్నాప్ చేయబడ్డారని.

# 42.

భద్రాచలం...

సీతారాముల కళ్యాణం కమనీయం... శబరి కొసరి, కొరికి తినిపించిన అమృత ఫలం... సీతారాముల పాదధూళితో పునీతమై గోదావరి పరవళ్ళలో పులకించిన భద్రాద్రి... వీరు కూడబలుక్కుని ఆ పన్నెండు మంది అక్కడికి వచ్చి చేరారు. నిజ జీవితంలో వారి వారి వృత్తిలతో వారంతా బిజీ... కానీ ముగ్ధను కలుసుకోవడం కోసం మూడు వందల అరవై అయిదు రోజుల్లో... ఈ ఒక్కరోజును అందమైన, యాంత్రిక రహితమైన రోజుగా మిగుల్చుకోవాలని నిర్ణయించుకుని వారంతా పుణ్య భద్రాద్రి చేరుకున్నారు. స్నేహానికి ఎల్లలు లేవు... స్నేహం ఆకాశం లాంటిది. మనకు కనిపించేది మాత్రమే ఆకాశం... మన చూపు అంతకు మించి వెళ్ళదు... ఆ పైనున్నదే మరదే స్నేహం.

ఢిల్లీ నుంచి వచ్చిన రోహిణి, రాధిక, భోపాల్ నుంచి బిందు, శ్రీనివాస్, హైదరాబాద్ నుంచి జ్ఞానపల్లి, తిరుపతి నుంచి సుకన్య, వైజాగ్‌నుంచి కీర్తి, శ్రీహిత, సంతోష్, ఆనూరు నుంచి పద్మ, విజయవాడ నుంచి మృదుల, శ్రీవల్లి, విజయలక్ష్మి (బుజ్జి) సిస్టర్స్, కాకినాడ

నుంచి రాణా ప్రతాప్, రాజమండ్రి నుంచి ఉమాకాంత్... అంతా శ్రీరాముల వారి సన్నిధి చేరారు. ఒక గొప్ప ఆధ్యాత్మిక భావం... మాటలకు అందని ఉద్వేగం... ఈ పరిచయం ఎంత బావుంది... నిన్న మొన్నటివరకు కేవలం కీ బోర్డు మీద మాత్రమే అంతర్జాలంలో కలుసుకున్న ఇంద్రజాలం.. ఈ రోజు నిజమై వర్ధిల్లింది... ఒక రచయిత సృజించిన పాత్ర కోసం నిజ జీవిత పాత్రల ప్రయాణం ఒక నిక్షిప్త అనుభవం... ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకు న్నారు.

కరచాలనాలింగనాలు చేసుకున్నారు. స్నేహ మాధుర్యాన్ని స్వాసించారు, అనుభూతిం చారు. స్వీయ పరిచయాలు అయ్యాయి... భద్రాద్రి రాముడి దర్శనం అయింది... ఇక ముగ్ధ దర్శనంకై తన దగ్గరికి వెళ్ళాలి.

''ఇక్కడిని నుంచి పున్నమి లాంచీలో ప్రయాణించాలి... పది నుంచి పన్నెండు గంటల ప్రయాణం... మనకోసం, నేను పున్నమిని బుక్ చేశాను'' రాజమండ్రి వాసి ఉమా కాంత్ అందరికి చెప్పాడు.

:::::

గోదావరి భుజస్కందాల మీద వీరిని తీసుకువెళ్తోంది. పాపికొండల అందాలు బాపూ కుంచెకు ప్రాణం పోసి మిమ్మల్ని నీ కుంచెతో వర్ధిల్లే భాగ్యం ప్రసాదించమన్నాయి.

''ఈ ప్రయాణం ముగ్ధ ఊహకు ప్రాణం పోసినట్టు వుంది'' సుకన్య అంది.

గోదావరిలో పున్నమి వీళ్ళ కబుర్లు వింటూ ఊగుతూ తూగుతూ ముందుకు సాగు తోంది.

కజ్జికాయలు, పులిహోర, భక్ష్యాలు, దద్దోజనం... పున్నమిని వనభోజన తోటగా మార్చారు. ఒకే కుటుంబంగా ఒకరికొకరు కొసరి కొసరి వడ్డించారు, ఒకరితో ఒకరు ప్రీతిగా సంభాషిస్తూ తిన్నారు.

:::::

వేదంలా ఘోషించే గోదావరి... రాజమండ్రిని కలిపింది. రాత్రి పది దాటింది...

అందరిలో చిన్నపాటి భావోద్వేగం... నలభైరోజులుగా తమకు దగ్గరైన ముగ్ధను ఇప్పుడు ప్రత్యక్షంగా చూడబోతున్నాం.

:::::

రేయింబవళ్ళు శ్రమించి, ప్రకృతి సృష్టించిన వర్ణచిత్రమే ప్రాణం పోసుకుని కనుల ముందు నిలిచినట్టులా ఉందా వూరు... ఎటు చూసినా పచ్చని పంటపొలాలు... వీచే చల్లని గాలుల స్వాగత పలకరింపులు... ఊళ్ళోకి అడుగు పెడుతుంటే... మధురమైన భావన, భావు కత్వమే పల్లవిగా మారినట్టు... తామంతా చరణాలం అయినట్టు...

:::::

గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టి అలానే నిలబడిపోయారు...

వాకిట్లో పెద్ద ముగ్గు... ప్రకృతి కాన్వాసు మీద సృష్టికర్త బ్రహ్మ చిత్రకారుడై, ముగ్ధ చేతుల్లోకి ప్రవేశించి ముగ్గుని సృషించినట్టు... ''స్వాగతం... నన్ను ఆదరించి అక్కున చేర్చు కున్న, నా కోసం వచ్చిన ఆత్మీయుల్లారా మీకిదే నా ఆహ్వానం... ముగ్ధ''

సప్త వర్ణాలే కాదు ఎనిమిదో వర్ణం... అన్ని వర్ణాలు కలిసిన మిశ్రమం...

ఎదురుగా ముగ్ధ... ము..గ్ధ..

పికాసో, బాపూ బొమ్మ... అద్భుత రమణీయ లలన...

:::::

తండ్రిని పరిచయం చేసింది... తమ్ముడ్ని పరిచయం చేసింది. కుశల ప్రశ్నలు పూర్త య్యాయి. ఆ రాత్రి తెలుగు వారి మమకారాల షడ్రుచులు వచ్చిన వారికి జిహ్వానందాన్ని కలిం చాయి. హాలులో కార్తికేయ తెలుపు, నలుపుల అందమైన చిత్రం...

పెరట్లో పెద్ద కార్పెట్‌ని పరిచింది... పండు వెన్నెల వీరిని స్వాగతించింది.

తమ మనసులోని మాటల ప్రశ్నలు వెలుపలికి వచ్చాయి. రోహిణి, రాధిక ముగ్ధ వంక చూసి... ''ప్రేమంటే ఏమిటి?'' అని అడిగారు.

ముగ్ధ చిన్నగా నవ్వి చెప్పింది... చిన్న కన్నీటి చెమ్మతో...

''నాకోసం నేను నా కార్తికేయ బావుండాలని సాక్షాత్తు ఆ భద్రాద్రి రాముడ్ని ఇంత మంది కలిసి మొక్కుకున్నారు.

చూడండి... అదీ ప్రేమంటే... శ్రీరాముల వారి పూజారి నాకు వరసకు బాబాయి అవు తాడు... అతడు ఫోన్ చేసి చెబుతుంటే మీ ప్రేమ చూసి నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి...''

ఒక్క క్షణం ఎవరికీ ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

''కార్తికేయలో ఏ క్వాలిటీ మీకు నచ్చింది... కేవలం కొన్ని గంటల పరిచయంలోనే ఎలా ప్రేమించారు? బిందు, మాధవి, పద్మ అడిగారు.

''మనిషిని ప్రేమించడం కన్నా మానవత్వాన్ని ప్రేమించే క్వాలిటీ... మానవత్వానికి స్వార్థం వుండదు... నా కార్తికేయకు ద్వేషించడం వుండదు. ఇంతకన్నా వేరే క్వాలిటీ ఏం కావాలి?

''అంటే మీకింతవరకూ కార్తికేయలాంటి వాళ్ళు తారసపడలేదా?'' మృదుల, రాణాప్ర తాప్, ఉమాకాంత్ అడిగారు...

''నేనెప్పుడూ అన్వేషించలేదు... తపస్సు చేయకుండానే ప్రత్యక్షమైన దేవుడు కార్తి కేయ...''

''ఒకవేళ కార్తికేయ మీకు తారసపడి ఉండకపోతే...'' జ్ఞానపల్లి అడిగింది.

''నా జీవితానికి అర్థం వుండేది కాదు...'' మనస్ఫూర్తిగా చెప్పింది ముగ్ధ.

అప్పుడే రకరకాల పళ్ళతో పెద్దబుట్టతో అక్కడకు వచ్చింది పూర్ణిమ.

ముగ్ధ పరిచయం చేసింది.

శ్రీనివాస్ పూర్ణిమ వంక చూసి... ''మీరో అద్భుతం... దేవుడినే దబాయిస్తున్నారే...'' అని ముగ్ధవైపు చూసి ''పూర్ణిమ, మిమ్మల్ని ముందు ముందు కథలో డామినేట్ చేస్తుందేమో అనిపిస్తుంది... మీరేమంటారు? అని అడిగాడు.

''పూర్ణిమ... నా అంతరాత్మ లాంటిది... అది నాలోనే వుంటుంది. నన్ను దాటి నా శరీరాన్ని చీల్చుకొనిరాదు'' అంది.

పూర్ణిమ చప్పునలేచి ముగ్ధని గట్టిగా వాటేసుకుని ఏడ్చేసింది...

ఒక్క క్షణం అక్కడ వున్న వారి కళ్ళు చెమర్చాయి. శ్రీవల్లి, విజయలక్ష్మి (బుజ్జి) సిస్టర్స్ ముగ్ధవైపు చూసి...'' ఒకవేళ దేవుడు ప్రత్యక్షమై ఒక వరమిస్తే ఏం కోరుకుంటారు? అడిగారు.

అంతా ముగ్ధ ఏం చెబుతుందా అని ఎదురుచూస్తున్నారు.

''దేవుడా... ఆనకు ఈ శ్వాస అక్కర్లేదు. కార్తికేయ శ్వాసతోనే బ్రతికే వరమివ్వు ప్రభూ'' అని వేడుకుంటాను ఆ దేవుడే ఈ వరం సంగతి తెలుసుంటే తన శ్వాసనే వరంగా ఇచ్చే వాడేమో...

కీర్తి, శ్రిహితా, సంతోష్, సుకన్య అలానే చూస్తోండి పోయారు.

సమయం పదకొండు గంటల యాభై నిమిషాలు...

ముగ్ధ అన్న మాటలు గుర్తొచ్చాయి. పన్నెండు దాటితే నా కార్తికేయ ఆలోచనలను ఆహ్వానించే సమయం...

❀❀❀

ఒక గొప్ప అనుభూతి... ఎక్కడినుంచో రివ్వున ఎగిరివచ్చిన చిలుక వీళ్ళని పరామర్శించింది.

పూర్ణిమ బుట్టలోని పళ్ళు వీరికి కానుకగా ఇచ్చింది. ముగ్ధ అందరికి బట్టలు పెట్టింది.

''మీ అభిమానమే లేకపోతనే నా పాత్రకీ ఇంత అదృష్టం దక్కేది కాదు'' చేతులు జోడించి అంది.

'' ఇది మాకు గొప్ప అనుభూతి... మీ పెళ్ళికి వస్తాం... అప్పుడు మాతో మరింత మంది వస్తారు...'' శ్రీనివాస్ అన్నాడు.

భారమైన హృదయాలతో తిరుగుమొహం పట్టారు. శ్రీనివాస్ వెళ్తూ వెనక్కి తిరిగి చూసాడు. అతనికి భద్రాద్రిలో పూజారి దేవుడితో అన్న మాటలు గుర్తొచ్చాయి. హారతి ఆరి పోయినప్పుడు...

పూజారి గుడిలోకి వెళ్ళి ''రామచంద్ర ప్రభూ... ముగ్ధ జీవితం బావుండాలని ఎక్కడి నుంచో వచ్చి నీకు పూజలు చేసారు... ఆ ముగ్ధతల్లి కూడా సీతమ్మ తల్లిలా కష్టాలుపడాలా?'' అని వాపోయాడు ఆ దృశ్యం చూసి శ్రీనివాస్ తన మనసులోనే ఆ దేవుడికి విన్నవించుకున్నాడు.

''సాకేత రామా... ముగ్ధను, కార్తికేయను కలుపు. ఈ శ్రీరామనవమి రోజు నీ కల్యాణాన్ని నేను జరిపిస్తాను''

❊❊

పూర్ణిమ, ముగ్ధ వాళ్ళని సాగనంపి ఇంటికి వస్తుండగా ఓ అగంతకుడు ఆ ఊళ్ళోకి ప్రవేశించాడు. అది గమనించిన చిలుక భయంతో రివ్వున ఎగిరి ముగ్ధ భుజాల మీద వాలింది.

❊❊

# 43.

నేరం మహావృక్షం అయినప్పుడు... ఆ నేరాన్ని పెకిలించే మహోగ్రమైన గాలి... ఆ మహావృక్షాన్ని పెకిలించే మహా ఉపద్రవమై రావాలి... ఆ మహోగ్ర చండ్ర ప్రచండ వేగం... వాయువేగం పేరే... కార్తికేయ.

❊❊

సోఫాలో కాళ్ళు బార్లా చాపుకుని రామ్‌గోపాల్‌వర్మ 26/11 సినిమా చూస్తూ ''జర్దార్...'' అంటూ కేకేసాడు... వెంటనే జర్దార్ అనే వ్యక్తి పరుగెత్తుకు వచ్చాడు. ఇండియాలో ఖాసింకు సహాయకుడిని నియమించింది మోహన. ఖాసింకు కావాల్సిన సేవలు అన్నీ చేస్తాడు... అతనికి మసాజ్ చేయడం వరకూ జర్దార్‌కు తెలియని విషయంలేదు... సినిమాలు, రాజకీయాలు మొదలు... ఇండియాలో క్రైమ్ రేటింగ్ వరకూ...

ఖాసింకు కూడా తెలియని విషయం ఏమిటంటే ''జర్దార్ ఒకప్పుడు బ్లాక్ క్యాట్ కమెండో... ఓ రాజకీయ ప్రముఖుడికి అంగరక్షకుడిగా వుండి... అతడిని ఏకే47 గన్‌తో చంపిన నేరచరిత్ర అతనిది. ప్రధాన మంత్రినే చంపిన అంగరక్షకుల చరిత్ర వున్నా మనదేశంలో ఒక సంఘటన జరిగినా, ఆ సంఘటననుంచి ఎటువంటి లెసన్స్ నేర్చుకోరు... బాంబుల సంఘటనలు ఎన్ని జరిగినా... అదే నిర్లక్ష్యం... రాజకీయ నాయకుడిని చంపగానే కొంత సమయానికి జర్దార్‌ని చుట్టుముట్టి చంపేశారు... అని అనుకున్నారు... రక్తపు మడుగులో, గుర్తుపట్టడానికి వీల్లేని విధంగా శరీరం తూటాలతో నిండిపోయింది. అదో మార్చురీ శవం... కేవలం జర్దార్ బట్టలు ఆ శవానికి వేసారు... పాతిక లక్షల డబ్బుతో జరిగిన నేరం... ఆ రాజకీయ నాయకుడు మోహనను బ్లాక్‌మెయిల్ చేయడమే దీనికి కారణం... ఆ తర్వాత జర్దార్ కొత్త అవతారం ఎత్తాడు.

మోహనకు నమ్మిన బంటు...

❊❊

''ఈ సినిమా తీసింది ఎవరు? మనకు కొత్త ఐడియాలు ఇస్తున్నాడు... ఈయన్ని కిడ్నాప్ చేద్దాం... ఏ ఇరాన్ కో తీసుకువెళ్దాం'' సాలోచనగా అన్నాడు ఖాసిం.

జర్దార్ ఓ వెర్రి చూపు చూసి పెదవి విరిచి... ''లాభం లేదు... ఆయన్ని కిడ్నాప్ చేస్తే మన దమాక్‌ని కిలోల లెక్కన తింటాడు...''

''అంత గొప్పోడా?'' అడిగాడు ఖాసిం.

''అంతకన్నా తనేం తీస్తున్నాడో తనకే తెలువదని కొందరంటారు... ఎప్పుడూ కాంట్ర

వర్సీలో వుండడం కోసం అని మరికొందరు అంటారు... కొందరు తిక్క అంటారు... ఆ మధ్య ''నా ఇష్టం'' అని పుస్తకం రాసాడు... ఇప్పుడు మన గురించి తెలిసిందనుకో... దీని మీద కూడా సినిమా తీస్తాడు.. గెవెరెమన్న ఈడు మస్తు దిమాక్ వున్నోడు...''

చాలూ జర్దార్ చెప్పాడు.

''అయితే మనం ఓ కన్నేసి ఉంచాలి... ఎప్పటికైనా వీడితో ఓ సినిమా చేయాలి'' ఖాసిం చెప్పాడు.

''కిడ్నాప్ ఐడియా మాత్రం మానుకోవాలి'' నవ్వుతూ అన్నాడు జర్దార్.

అప్పుడే జర్దార్ చేతిలోని ఫోన్ మోగింది. ఫోన్ లిఫ్ట్ చేసి ఖాసింకిస్తూ చెప్పాడు ''మోహన మేడం'' అని.

''చెప్పండి మోహనాజీ... ఇప్పుడే ఎవరో రామ్‌గోపాల్‌వర్మఅట... ఆయన సినిమా చూస్తున్న... మస్తు తీసిండు... ఆయన సినిమా చూస్తున్న.... మస్తు తీసిండు... మనకు కొత్త ఐడియాలు ఇచ్చాడు... ఇలాంటి వాడిని మనలో చేర్చుకుంటే మస్తుగుంటది.''

''మిమిక్రీ విద్యారణ్య కూతురిని, అల్లుడిని కిడ్నాప్ చేసారా? మోహన సూటిగా అడిగింది.

''వాళ్ళు గెస్ట్‌హౌస్‌లో భద్రంగా వున్నారు'' చెప్పాడు ఖాసిం.

'' ఓకే'' చెప్పి ఫోన్ కట్ చేసింది.

ఆడిటోరియంలో పిన్‌డ్రాప్ సైలెన్స్... డయాస్ మీద విద్యారణ్య... అతని ప్రదర్శన కోసం అంత ఎదురుచూస్తున్నారు...

''డియర్ ఫ్రెండ్స్... చాలా కాలం తర్వాత నా తెలుగు వారి ముందు ప్రదర్శన ఇస్తున్నాను. చాలా మందికి మిమిక్రీ అనగానే సినిమా నటులను, వారి గొంతులను అనుసరించే వారు మాత్రమేనని అనుకుంటారు.

ధ్వన్యనుకరణ అంత తేలికైనా విషయం కాదు... మిమిక్రీ ద్వారా కొందరు నేరస్తులను పట్టుకున్న సందర్భాలు వున్నాయి... ఈ మిమిక్రీ కొందరి ప్రాణాలు నిలబెడతాయి కూడా... అలా అంటున్నప్పుడు అతనికి ఉదయం ఇంట్లో సంఘటన గుర్తొచ్చింది. కూతురిలా, అల్లుడిలా మాట్లాడకపోతే భార్య అన్నమ్ముట్టేది కాదు.

కూతురూ, అల్లుడు ఏమైనట్టు...? తన ఫ్రెండ్ కమీషనర్‌ని కలిసి విషయం చెబితే? ఆలోచిస్తూ ఉండగానే ఒకతను డయాస్ మీదికి వచ్చి సెల్‌ఫోన్ ఇచ్చి వెళ్లాడు... షాకయ్యాడు విద్యారణ్య.

మామూలుగా స్లిప్‌లు ఇస్తారు... ఫలానా వారి గొంతును అనుసరించమని చెబుతారు. కానీ... అతని చేతిలోని సెల్‌రింగ్ అయ్యింది. ఉలిక్కిపడి కాల్ అటెండ్ అయ్యాడు.

''గుడ్‌మార్నింగ్ మిస్టర్ విద్యారణ్య...

ఓసారి ఈ ఫోన్‌లోని వీడియో క్లిప్ చూడండి...

నచ్చితే వెంటనే హైదరాబా వచ్చేయండి... టికెట్ మీ కారులో డ్యాష్ బోర్డులో వుంది... నచ్చకపోతే వెరీ సింపుల్'' ఈ ఫోన్ దగ్గరలో వున్న పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వొచ్చు... లేదా మీ కమీషనర్ ఫ్రెండ్‌కు ఇవ్వొచ్చు... వాళ్ళు కేసు ఫైల్ చేసి విచారణ మొదలుపెట్టే లోగా... మిస్సింగ్ కాస్తహత్యా కేసు అవుతుంది. సింపుల్... ఏది బెటర్‌గా వుంటుందో ఆలోచించండి.

విద్యారణ్య గొంతు తడారిపోయింది. వెంటనే సెల్‌లో వీడియోక్లిప్ ఓపెన్ చేసాడు... కూతురు, అల్లుడు... తాళ్ళతో బంధించబడి... నోట్లో అరవకుండా గుడ్డలు కుక్కబడి వున్నారు. అంటే కిడ్నాప్ నిజమే...

మళ్ళీ సెల్ రింగ్ అయింది... లిఫ్ట్ చేసాడు...

''సారీ మిస్టర్ విద్యారణ్య, ఇందాక ఓ విషయం చెప్పడం మరిచాను... వన్ ప్లస్ వన్... ఒకటి కొంటే మరొకటి ఫ్రీ... సెల్‌ఫోన్ అలానే కొన్నాను... మరోపీస్ మీ ఆవిడకు పంపిందా మని... మీకు ఇచ్చి ఆవిడకు ఇవ్వకపోతే ఫీల్ అవుతుంది కదా...'' అదే ఇందాకటి గొంతు...

''వద్దొద్దు... నేను హైదరాబాద్ వస్తాను... ఒక అరగంట టైం కావాలి... నా ప్రోగ్రాం కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు... ఈ డబ్బు పేద పిల్లలకు ఉపయోగపడుతుంది... ప్లీజ్...'' విద్యారణ్య రిక్వెస్ట్ చేసాడు.

'' ఒకే, నేను మంచి చెడ్డ విలన్‌ని... మీ కోసం హైదరాబాద్ ఎదురు చూస్తుంది... వెల్‌కం టు హైదరాబాద్...'' అటువైపు నుంచి వినిపించింది.

''మీరు మీరెవరు? గొంతు పెగుల్చుకుని అడిగాడు విద్యారణ్య.

'' ఇది నా సొంత వాయిస్... నా పేరు మోహన... నా మీద రెడ్ కార్నర్ నోటీస్ వుంది... ఇంకా పూర్తి వివరాలకు గూగుల్ సెర్చ్ చూడొచ్చు... బై''

***

హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్‌లోవున్నాడు విద్యారణ్య... విషాదాన్ని గొంతులో హాలాహ లంలా బంధించి వినోదాన్ని పంచాడు... ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య కన్నీళ్లు బొట బొటా నేల రాలాయి. తన కూతురిని అల్లుడిని రక్షించుకోవాలి... వాళ్ళ కోసంకాదు.. వాళ్లకు ఏమైనా అయితే తనకు దూరమయ్యే భార్య కోసం...

***

మోహన సోఫాలో కూచుంది... ఎదురుగా పెద్ద స్క్రీన్... దాని మీద వీడియో క్లిప్స్.. ముగ్ధకు సంబంధించిన క్లిప్స్... ముగ్ధ హావభావాలు... నడిచే పద్ధతి... అన్నీ జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తుంది. ముగ్ధ ప్రతీ కదలిక రికార్డు చేయించింది.

ఒక్క క్షణం చిన్నపాటి జెలసి... తనకన్నా అందంగా వున్నట్టు అనిపించింది. తన ఎత్తు... కానీ తన కన్న బొద్దుగా వుంది... ముగ్ధ చేతివ్రేళ్ళ గోళ్ళు పొడవుగా లేవు... తన గోళ్ళు షార్ప్‌గా వున్నాయి... నెయిల్ కట్టర్‌కి పని చెప్పింది. మొదటిసారి గోళ్ళు కట్ చేసింది...

ఒక్కో అంశాన్ని క్లీన్‌గా అబ్జర్వ్ చేస్తుంది...

స్క్రీన్ ప్రక్కన వున్న రెడ్‌కలర్ బల్బ్ వెలిగింది... స్క్రీన్‌మీద ఆ దృశ్యం మాయమైంది.

విద్యారణ్య లోపలికి వస్తున్నాడు... రిమోట్‌లో ఐదో నెంబర్ బటన్ నొక్కింది... విద్యారణ్య కూతురిని, అల్లుడిని బంధించిన క్లిప్... లైవ్...

⁘⁘

# 44.

''స్వాగతం విద్యారణ్యగారూ... మీ గురించి వినడమే తప్ప చూడడం కుదరలేదు...'' విద్యారణ్యకు ఎదురువెళ్ళి అంది.

''ముందు మా అమ్మాయిని, అల్లుడిని చూపించండి'' సూటిగా అన్నాడు.

''అలాగే చూడండి'' అంటూ ఎదురుగా స్క్రీన్ మీద కనిపిస్తోన్న దృశ్యాన్ని చూపించింది.

ఒక్క క్షణం విల విల్లాడిపోయాడు. కోపంగా మోహనవైపు చూసి '' ఏమిటిదంతా... ఎందుకు చేస్తున్నారు... అసలు మీకేం కావాలి...'' అడిగాడు.

''కూల్ మిస్టర్ విద్యారణ్య... ముందు కూల్‌గా కూల్‌డ్రింక్ తాగండి...'' టీపాయ్ మీద వున్న కూల్‌డ్రింక్ తీసి అతనికి ఇచ్చింది.

''ప్లీజ్ ఈ మర్యాదలు ఆపండి... విషయానికి రండి'' సోఫాలో కూచుంటూ అన్నాడు విద్యారణ్య.

''మీరు ఎవరి గొంతునైనా యిట్టే అనుకరిస్తారు... మిమిక్రీకి సంబంధించిన యూనివర్సిటీ కూడా పెట్టాలని అనుకుంటున్నారు''

''అవును... అయితే దానికీ మా అమ్మాయిని కిడ్నాప్ చేయడానికి ఏమిటి సంబంధం?

'నేను ఓ గొంతును అనుకరించాలి... అచ్చుగుద్దినట్టు... హావభావాలతో సహా...అందుకు మీరు సహకరించాలి... దానికి సంబంధించిన మెలకువలు... శిక్షణ కావాలి''

'' ఎందుకు? అనుమానంగా అడిగాడు విద్యారణ్య.

''నేను మీ అమ్మాయిని, అల్లుడిని చంపేయకుండా వదిలి పెట్టేందుకు...'' సీరియస్‌గా అంది మోహన.

విద్యారణ్యకు కొంత అర్థమైంది. ఆమె చెప్పినట్టు చేయకపోతే... తన కూతురిని, అల్లుడిని చంపేస్తుంది.

''మీరు ఎవరి గొంతును అనుకరించాలి? విద్యారణ్య అడిగాడు.

'' ఒకమ్మాయి గొంతును...'' విద్యారణ్యలా మాట్లాడింది. షాకయ్యాడు విద్యారణ్య ''నా గొంతును అనుకరించారు...''

''అవును... కానీ మీలా పర్ఫెక్ట్‌గా మాట్లాడలేను... ఎనీవే... ముందు నేను చెప్పింది వినండి... మోహన మాట్లాడుతుంది... ముగ్ధ క్లిప్పింగ్ చూపించింది... ముగ్ధ ఆడియో వినిపించింది....మోహన మాట్లాడుతుంటే... విద్యారణ్యకు చెమటలు పడుతున్నాయి. ఇలాంటి క్రిమి

నల్ బ్రెయిన్ ఎక్కడా చూడలేదు...

తను మోహన చెప్పినట్టు నడుచుకోక తప్పదు... తన బిడ్డను మాత్రమే కాదు.. ఈ దేశాన్ని రక్షించుకోవాలన్నా... ఇక మిగిలి వుంది ముగ్ధాపహరణమే...

ఇప్పుడామె టార్గెట్ శ్రీనివాస్... హైదరాద్‌లో తన మీద నిఘా పెట్టిన మాజి సిట్ ఆఫీసర్...

అతడిని ఫినిష్ చేయాలంటే ఎర వేయాలి... ఆ ఎర...?

⁂

పింక్ కలర్ చీరలో అప్పుడే ఆకాశం నుంచి భూమ్మీదికి వచ్చిన దేవకన్యలా వుంది... పూర్ణిమ, ముగ్ధ వంకే చూస్తోంది... అమ్మాయిలకే ఈర్షపుట్టించే అందం... ఓ రచయితా రాసిన రొమాంటిక్ కథలోని ఓ వాక్యం.

గుర్తొచ్చింది పూర్ణిమకు...

''ప్రకృతిని స్త్రీగా మార్చి, ఆమె ఎద సంపదలను హిమవన్నగాలతో తీర్చిదిద్ది, నయగారా జలపాతం హోరులతో నాభిని అయాస్కాంత క్షేత్రంగా మార్చి... నడుం వంపును నక్షత్రాలతో అలంకరించి... గులాబీ రేకులతో పెదవులను... తీర్చిదిద్దినట్టు...''

''ఏయ్ ముగ్ధా ఇంతందంగా ఎలా పుట్టావే? అడిగింది పూర్ణిమ...

''నా కార్తికేయ కోసం'' టక్కున చెప్పింది...

''అబ్బ ఈ కార్తికేయ జపం వదలవు కదా...'' విసుగు నటిస్తూ అంది పూర్ణిమ...

''నా శ్వావస వదిలే వరకూ వదలను'' ముగ్ధ చెప్పింది...

పూర్ణిమకు మాటలు కరువయ్యాయి... కన్నీళ్లు చిట్లి, బుగ్గలను మద్దాడను.

'' ఇప్పుడు మన ప్రోగ్రాం ఏమిటి?

''లక్ష్మీ మేడంని కలవాలి. అతి కొద్ది సమయంలో వీణ నేర్పిన వాగ్దేవి... పట్టుచీర... పండ్లు... ఇద్దాం...'' ముగ్ధ చెప్పింది.

''మంచి ఆలోచన... ఈ రోజే వెళ్దాం'' అంది.

వాళ్ళు ఆ మహా సంగీత సామ్రాజ్ఞిని చూడడం అదే ఆఖరుసారని తెలియదు''.

⁂

శ్రీనివాస్ లేచి అద్దంలో మొహం చూసుకున్నాడు.. గత మూడు రోజులుగా నిద్ర లేదు.. మోహనకు సంబంధించిన చాలా సమాచారం సేకరించాడు. ఈ రోజు తన చిన్నప్పటి నేస్తం లక్ష్మిని కలవాలి...

ఎందుకో తెలియదు భార్యా బిడ్డలు గుర్తొచ్చారు...

ఒక కన్నీటి మేఘం జ్ఞాపకాల ఆకాశంలో ఒంటరిగా తిరుగాడుతోంది.

ఒక మృత్యు విహంగం ఆ ఆకాశంలోనే రాబందుగా మారి దూసుకు వస్తోంది.

⁂

# 45.

శ్రీనివాస్ ఈడూరి...

వృత్తి నిర్వహణలో కాంప్రమైజ్ అనే పదానికి అర్థం తెలియని మనిషి. కేసు పరిశోధనలో... ఎటువంటి ఒత్తిళ్ళు ఎదురైనా లెక్కచేయని వ్యక్తి. ఓ కేసు పరిశోధనలో హోం మినిస్టర్ కార్యాలయం నుంచి ఒత్తిళ్ళు మొదలయ్యాయి. కేసు విషయంలో జోక్యం చేసుకోకూడదని చెప్పాడే... అయినా ఒత్తిళ్ళు, బెదిరింపులు ఆగలేదు.

సాక్షాత్తూ హోం మినిస్టర్నే అరెస్ట్ చేయడానికి సిద్ధపడ్డాడు. ఫలితంగా అతడి భార్యాబిడ్డలను కిడ్నాప్ చేసారు.

అక్కడితో ఆగకుండా వాళ్ళను బాంబ్ బ్లాస్ట్లో చంపేశారు. తన భార్యాబిడ్డలను చంపిన వారి మీద మాత్రమే పగ తీర్చుకోవాలని అనుకోలేదు... దీని వెనుక వున్న బలమైన వ్యవస్థను కూకటి వ్రేళ్లతో పెకిలించి వేయాలని నిర్ణయించుకున్నాడు. అదే సమయంలో కార్తికేయ నుంచి ఫోన్...కార్తికేయ చేయబోయే మహా యజ్ఞంలో పాలుపంచుకోవాలని అనుకున్నాడు. అతనికి వచ్చిన సమాచారం ప్రకారం ముగ్ధ ప్రమాదంలో వుంది. ముగ్ధ వీణ నేర్చుకునే పనిలో హైదరాబాద్ తరచూ రావడంపై రెక్కి నిర్వహించినట్టు తెలిసింది. ఆ విషయంలో కూడా తన ఫ్రెండ్ లక్ష్మి దగ్గరి నుంచి సమాచారం రాబట్టాలని అనుకున్నాడు. ఈ కేసులో తనని కూడా టార్గెట్ పెట్టుకున్న విషయాన్ని గమనించలేకపోయాడు. దానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అనుకోలేదు.

⁂⁂

లక్ష్మి నిలయం... సంగీత సరస్వతి కొలువైన ఆ నిలయంలో నిలువెత్తు సరస్వతీ దేవి ప్రతిమను పాలతో అభిషేకిస్తుంది లక్ష్మి... సిస్టంలో నుంచి సంగీత స్వరాలు మలయ మారుతాలై ఆ పరిసర ప్రాంతాన్ని సంగీత పరిమళాలతో తన్మయులను చేస్తున్నాయి. లక్ష్మి సమకూర్చిన స్వరాలు...

ఒక్క క్షణం లక్ష్మి గొంతు కన్నీటి పర్యంతమైంది. నీటిలోని చేప భూమ్మీద బ్రతకగలదా? సంగీత సముద్రంలో బ్రతికిన తను స్వరాలు ఆలపించకుండా ఉండగలదా? ఓ విధాత స్వరం లేని ఈ జీవితం వద్దు... నన్ను తీసుకువెళ్ళు... మరు జన్మలో స్వరంతోనే పుడతాను... మౌనంగా విన్నవించుకుంది.

తథాస్తు దేవతలు ఆర్ద్రమైన హృదయంతో తథాస్తు అన్నారు.

ఈలోగా పని అమ్మాయి వచ్చింది. వీణ తీగలు తెగితే బాగు చేయించుకు రమ్మని పంపించింది.

''వీణ తీసుకువచ్చావా? అని అడిగింది సైగ చేస్తూ...

''మరో పదిహేను నిమిషాల్లో వస్తుంది... పని కుర్రాడితో పంపిస్తారట మేడం...'' చెప్పింది పనమ్మాయి.

''సరే... ఈలోగా పెరట్లో మొక్కలకు నీళ్ళుపోయాలి... మనింటికి అతిథులు వస్తు న్నారు'' లక్ష్మి భాష ఆమెకు అర్థమవుతుంది... ఎంతో కాలంగా ఆమెను అంటిపెట్టుకువుంది.

అలాగే... అన్ని ఏర్పాట్లుచేస్తానని చెప్పి పెరట్లోకి వెళ్ళింది. సరిగ్గా పదిహేను నిమి షాల తర్వాత.

⁂

ఇద్దరు యువకులు వీణ తీసుకుని లక్ష్మీ నిలయంలోకి వచ్చారు... తెల్లటి లాల్చీ, పంచె, నుదిట విభూది...

''మేడం వీణను ఎక్కడ పెట్టమంటా? ఆ యువకుల్లో ఒకడు అడిగాడు.

''సరస్వతీదేవి పాదాల దగ్గర పెట్టండి'' అన్నట్టు చూపించింది.

''వాళ్ళు వీణను లక్ష్మి చెప్పిన చోట పెట్టారు... మేము వెళ్తాం మేడం అంటూ బయ టకు వెళ్ళబోతుంటే... లక్ష్మి ఆగనన్నట్టు సైగ చేసింది... పనమ్మాయి వచ్చింది...'' వాళ్ళకు చల్లటి మజ్జిగ ఇవ్వు... పాపం ఎండన పడి వచ్చారు...''

పనమ్మాయి మజ్జిగ ఆ ఇద్దరికీ ఇస్తూ ''మిమ్మల్ని ఎప్పుడూ చూసినట్టులేదు'' అంది అనుమానంగా..

''కొత్తగా వచ్చాం...'' కంగారుగా అని ఒకే ఒక గుటకలో మజ్జిగ తాగేసాడు... ఆ వెంటనే అక్కడ ఒక్క నిమిషం ఉండకుండా వెళ్ళిపోయారు...

లక్ష్మి వీణ వైపే చూస్తూ వుంది... నిన్న మహాశివరాత్రి... రాత్రి జాగారం చేసింది. వీణ మీద తలపెట్టి తీగలు ఆలపించే స్వరాలు వింటుంది.

⁂

ఆ ఇద్దరు బయటకు రాగానే వారిలో ఒకడు నిక్సన్‌కు ఫోన్ చేసాడు... ''సర్... అంతా మీరు చెప్పినట్టే చేసాం... షాపు నుంచి వచ్చే కుర్రాళ్ళను చంపేసాం... వాళ్ళ ప్లేస్‌లో మేమే వీణను తీసుకువెళ్ళాం... అందులో బాంబ్ ఫిక్స్ చేసాం... సిట్ ఆఫీసర్ రాగానే సెల్ రిమో ట్‌తో...''

''వెరీ గుడ్'' ఆ శ్రీనివాస్ బయల్దేరాడు... జాగ్రత్తగా వాచ్ చేయండి...'' చెప్పాడు నిక్సన్... అతనికి తనను శ్రీనివాస్ డ్రగ్స్ కేసులో పట్టుకుని అండర్‌వేర్‌తో రోడ్డు మీద ఈడ్చు కుని వెళ్ళిన దృశ్యం గుర్తొచ్చింది నిక్సన్‌కు... ఈ విధంగా తన ప్రతీకారం తీరుతుంది.

మోహన తెలివైన ప్లాన్ వేసింది...

శ్రీనివాస్ లోపలికి రాగానే... బ్లాస్ట్... వికృతంగా నవ్వుకున్నాడు నిక్సన్.

⁂

శ్రీనివాస్ కారు లక్ష్మి నిలయం ముందు ఆగింది.

ముగ్ధ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగింది పూర్ణిమతో సహా.

⁂

అద్దం ముందు నిలబడింది మోహన. తన ఒరిజినల్ రూపాన్ని చివరిసారిగా అద్దంలో చూసుకోవాలని అనుకుంది... కళ్ళకు వున్న కాంటాక్ట్‌లెన్స్ తీసింది... ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోగలనన్న కాన్ఫిడెన్స్ వున్న అందం మోహనది... ఆ చూపుల్లో మేజిక్ వుంటుంది... ఆ చూపుల్లో చిక్కుకొని విల విలలాడిన వాళ్ళు ఎందరో...

ముగ్ధా ఇప్పుడు ఈ రూపం నీ స్వంతం కాబోతుంది... కమాన్ రా... ఆమె గొంతులో హస్కీనెస్.

# 46.

అక్కడ గాలిలో స్వరాలు పచార్లు చేస్తున్నాయి... షికార్లు చేస్తున్నాయి. లక్ష్మి చేతివ్రేళ్ళు తీగలతో ముచ్చట్లాడుతున్నాయి. శ్రీనివాస్ అడుగుల శబ్దం విని తలెత్తింది.

లక్ష్మి పలకరింపుగా నవ్వింది... ఒక తీగను సుతారంగా శృతి మీటింది...

'' ఎలా వున్నావ్ శ్రీ? అన్నట్టు...

శ్రీనివాస్ పలకరింపుగా నవ్వి... లక్ష్మి ఎదురుగా నేల మీద వేసిన పరుపులో కూచున్నాడు.

లక్ష్మి తన స్వరాలతో... వీణ తీగను గొంతుగా చేసుకుని మాట్లాడుతుంది.

''చాలాకాలాం తర్వాత ఈ మూగ స్నేహితురాలు గుర్తొచ్చిందా?

''నీ మాటలు నాకు వినిపిస్తున్నాయి... నీ బాధ నాకు కనిపిస్తుంది...''

''సారీ... వేద పోయాక చాలాకాలం వరకూ నువ్వు బయట ప్రపంచాన్నే చూడలేదు కదూ...'' చనిపోయిన శ్రీనివాస్ భార్య వేదను ఉద్దేశించి అడిగింది.

''నాకు తెలిసి వృత్తి తర్వాత వేదే నా ప్రపంచం... తనూ... పిల్లలు ఒకేసారి వదిలిపోయాక చీకటిలా అనిపించింది...'' బాధగా చెప్పాడు.

''అనుకోకుండా గతాన్ని వెలికి తీశాను... ఆ విషాదాన్ని మర్చిపో శ్రీ...''

''విషాదాన్ని, బాధను మరచిపోగలను కానీ వేదను, పిల్లలను మర్చిపోలేకపోతున్నాను.''

లక్ష్మి ఆ టాపిక్‌ను డైవర్ట్ చేయాలనుకుంది...

''శ్రీ... కాలేజీ రోజుల్లో నువ్వు ఎవరినైనా ప్రేమించావా?

''ప్రేమించా... కానీ వర్కవుట్ అవ్వలేదు...'' బాధగా చెప్పాడు.

'' ఎవరిని.... నాకు తెలియని ఆ అజ్ఞాత ప్రేయసి?

''వహిదా రెహమాన్ అని... బాలీవుడ్ హీరోయిన్... తెలుగు రోజులు మారాలి చూసి, చెన్నైలో వున్నప్పుడు అరవంలో ప్రేమించాను...

కానీ ధైర్యం చేసి చెప్పలేదు'' నవ్వి చెప్పి...

''మరి నువ్వు ? లక్ష్మిని అడిగాడు...

‘‘మనం ప్రేమించింది... జగన్నాథుడిని... లార్డ్ కృష్ణ... కానీ అప్పటికే పదహారు వలే మంది గోపికలు... అష్ట భార్యలు... ఇంకా గోపికలు దొరుకుతారా అని వెతుకుతున్నాడుట... అందుకే అతని మీద అలిగి ‘‘నాకోసమే పుడితేనే పెళ్లి చేసుకుంటాను. అప్పటి వరకూ మాట్లా డను... అనేసాను... దేవుడు కదా... తథాస్తు అని వేణువు వాయించి ఉంటాడు... ఎవరితోనూ మాట్లాడకుండా గొంతును తన దగ్గరే వుంచేసుకున్నాడు.

‘‘వీణలోని తీగె వణికింది.

శ్రీనివాస్ చప్పున లేచి ‘‘లక్ష్మి ప్లీజ్’’ ఆమెను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు...

‘‘శ్రీ నీకు ఫిల్టర్ కాఫీ ఇష్టం కదా... కలుపుకు వస్తాను...’’ తీగలతో మాట్లాడి లేవబో యింది.

‘‘వద్దొద్దు... ఈ వేళ నేనే నీకు చక్కటి, చిక్కటి ఫిల్టర్ కాఫీ తయారు చేసి తీసుకు వస్తాను..’’ అంటూ కిచెన్ వైపు కదిలాడు... కిచెన్‌లోకి వెళ్లి

‘‘లక్ష్మి నేను ఇక్కడినుంచి మాట్లాడుతాను... నువ్వు నీ రాగాలతో పాటల మాటలు వినిపించు...’’ అన్నాడు.

అలాగే అన్నట్టు... స్వరాలతో బుదులిచ్చింది.

శ్రీనివాస్... ఫిల్టర్ వెతికాడు... గ్యాస్ వెలిగించాడు... పాలగిన్నె స్టవ్‌మీద పెట్టాడు.

⁘⁘

అప్పటి వరకూ లక్ష్మి ఇంటికి దగ్గరలో కాపు కాసిన ఆ యువకులిద్దరూ నిక్సన్‌కు ఫోన్ చేసారు...

‘‘సరిగ్గా మరో నిమిషంలో పేల్చేయండి... వీణ పేలి ఆ శ్రీనివాస్ శరీరం ముక్కల వ్వాలి. నిక్సన్ చెప్పాడు...

‘‘మరో విషయం అక్కడ బాంబ్ పేలగానే మీరు వెంటనే ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చే యండి.

⁘⁘

ఆటోలో పూర్ణిమ, ముగ్ధ వస్తున్నారు. మరో పది నిముషాల్లో వాళ్ళు లక్ష్మి ఇంటిని చేరుకుంటారు.

ముగ్ధకు సంతోషంగా వుంది... అతి తక్కువ సమయంలో తను వీణ నేర్చుకోవడానికి కారణం లక్ష్మి మేడం...

ఈ పట్టు చీరతో తనని సన్మాంచాలి. ఆవిడ ఆశీర్వాదం తీసుకోవాలి. తమ పెళ్ళయ్యాక కార్తికేయతో చెప్పి లక్ష్మిమేడంని విదేశాలకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలి. ఆటో త్వరగా పోనివ్వు... పూర్ణిమ దబాయించింది. అతను హైదరాబాదీ ఆటో... త్వరగా పొమ్మంటే ఆల స్యంగా తీసుకువెళ్ళే టైపు...

అదే ఆ రోజు వాళ్ళిద్దరి ప్రాణాలు కాపాడుతుందని వారికి తెలియదు.

❖❖❖

''లక్ష్మి షుగర్ కాస్త ఎక్కువేయనా? కిచెన్‌లో నుంచి అడిగాడు శ్రీనివాస్.

లక్ష్మి చేతివ్రేళ్ళు తీగల మీద కదిలాయి...

''జీవితంలో చేదు తప్పదు... కాఫీలో తీపి ఎక్కువే ఉండనీ...''

శ్రీనివాస్ కాఫీని రెండు కప్పుల్లోకి పోసి... కిచెన్‌లో నుంచి బయటకు రాబోతున్నాడు.

ఆ యువకుల్లో ఒకడు తన దగ్గర వున్న సెల్‌ఫోన్‌ని బయటకు తీసి రెడ్ కలర్ బటన్ ప్రెస్ చేసాడు.

''లక్ష్మి ఈ కాఫీ తాగితే జీవితంలో మళ్ళీ ఎక్కడ కాఫీ... మాట పూర్తి కాకుండానే...

''పెద్ద శబ్దం... భూకంపం వచ్చినట్టు ఆ ఇంటి పునాదులు కదిలిపోయినట్టు... ఆ ఇల్లు వణికింది... సామాన్లు చెల్లా చెదురయ్యాయి... చివరిసారిగా... శ్రీ ... అన్న కేక... శ్రీనివాస్ ఎగిరి అల్లంత దూరంలో పడ్డాడు... కాఫీ కప్పులు తునా తునకలయ్యాయి...

చుట్టూ పక్కల వాళ్ళు భయభ్రాంతులు అయ్యారు. శ్రీనివాస్ తలకు పెద్దగాయం... అయినా అదేమీ ఆలోచించడం లేదు... పై కప్పు విరిగిపడింది. లక్ష్మి దగ్గరికి చేరుకున్నాడు అతి కష్టమ్మీద... చేతిలోని వీణ ముక్కలు ముక్కలైంది... సెల్‌ఫోన్ పీసులు...

అంటే...సెల్‌ఫోన్ వీణలో పెట్టి... మరో సెల్‌తో ఆపరేట్ చేసి... ఎదురుగా సరస్వతీ దేవి ప్రతిమ ముక్కలై వుంది. రక్తపు మడుగులో లక్ష్మి... తన స్వరాలతో స్వర నైవేద్యం చేసిన లక్ష్మి... ఇప్పుడు తన శ్వాసను ఆ సరస్వతికి నైవేద్యంగా ఇస్తున్నట్టు...

ఒకప్పుడు అగ్ని ప్రమాదంలో షాక్‌తో మాట కోల్పోయిన లక్ష్మికి మరో షాక్‌తో బాంబ్ బ్లాస్ట్‌తో మాట వచ్చింది... కేవలం తన చివరి మాట చెప్పడానికే...

''లక్ష్మీ గట్టిగా అరిచాడు శ్రీనివాస్... ఎంత ఘోరం కన్నుమూసి తెరిచేలోగా... కళ్ళ ముందే తన నేస్తం కన్ను మూసే చివరి క్షణం...

''శ్రీ నా...నా...నాకు మాటొచ్చింది... కానీ కానీ నా మాటలు పాటలు కాకముందే నా పదాలు స్వరాలుగా మా...మా...మారక ముందే నేను వెళ్ళిపోతున్నాను...వె...వె...వెళ్లి... ఆగి ముక్కలైన సరస్వతీ దేవి ప్రతిమ వైపు చూసింది. మరో వైపు నటరాజు రూపంలో వున్న శివుడి ప్రతిమ...

''అమ్మా సరస్వతీ... నా జన్మ ధన్యమైంది. నీ వీణనే ఆయుధంగా మార్చి నన్ను చంపాలని ప్రయత్నించారు... అయినా నీ చేతిలో నీ వీణ ద్వారా మరణం పొందే వరమి చ్చావా... తండ్రీ బ్రహ్మదేవా అని నటరాజు వంక చూసి...''

నీకు జాగారం చేసాను... ఈ పర్వదినమే నీలో ఐక్యమవుతున్నాను... శ్వావస తీసుకో వడం కష్టమవుతుంది.

శ్రీనివాస్ అంబులెన్స్‌కు ఫోన్ చేసాడు... అప్పటికే లక్ష్మి తల వాలిపోయింది.

ఆటో దిగిన ముగ్ధ, పూర్ణిమ ఆ దృశ్యం చూసి షాక్ అయ్యారు.

❖❖❖

సెల్ రింగ్ అవ్వడంతో కారు డ్రైవ్ చేస్తోన్న కార్తికేయ కారు ఓ పక్కగా ఆపి చెప్పండి శ్రీ... ఎలా వున్నారు?

''ఘోరం జరిగిపోయింది కార్తికేయగారు.. అటువైపు నుంచి శ్రీనివాస్ మట్లాడుతున్నాడు.

శ్రీనివాస్ చెప్పిందంతా విని, షాక్ అయ్యాడు... క్షణంలో తేరుకున్నాడు... ప్రమాదంలో యుద్ధంలో త్వరగా స్పందించాలి. ముందు మీరో పని చేయండి. ముగ్ధ, పూర్ణిమలను అక్కడి నుంచి పంపించేయండి. మీ అసిస్టెంట్‌ని తోడూ వెళ్ళమని చెప్పండి. లక్ష్మి అంత్యక్రియలు కాగానే వీణలో బాంబ్ పెట్టింది ఎవరో పరిశోధించండి శ్రీ'' ఇది బాధపడే సమయం కాదు... ప్లీజ్..'' చెప్పి సెల్ ఆఫ్ చేసాడు.

ఒక బాధా వీచిక అతడి గుండెని చీల్చుకుంటూ వెళ్లింది.

''ఫ్రెండ్ ఇక సెలవంటూ వెళ్ళావా... ఈ నేస్తాన్ని మర్చిపోయావా?'' చిత్రంగా కన్నీళ్లు రాలేదు... వేదన ఘనీభవించింది.

∗∗∗

అంతా శూన్యంగా వుంది... విషాదం నియంతృత్వపాలనలా వుంది.

లక్ష్మీ మేడం రక్తసిక్త దేహం... పార్థివ దేహం... అచేతనమైంది ముగ్ధ మనసు... పూర్ణిమకు ఏం చేయాలో అర్థం కాలేదు. అంత ఆధలోనూ వెంటనే తేరుకున్నాడు.

కర్తవ్యమ్ మర్చిపోలేదు. ముగ్ధ దగ్గరికి వచ్చి ''మీరు వెంటనే వెళ్ళిపొండి'' అన్నాడు.

''అదేమిటి... ఇలాంటి పరిస్థితిలో... అంత్యక్రియలు పూర్తయ్యేవరకు...'' ముగ్ధ మాటలు పూర్తికాకుండానే...

'' ఇది కార్తికేయ గారి ఆర్డర్... ప్లీజ్... అని పూర్ణిమవైపు తిరిగి... మీరు తనకు తీసుకు వెళ్ళండి... మీ వెనుకే మా అసిస్టెంట్ వస్తాడు'' చెప్పాడు.

ముగ్ధ లక్ష్మి మేడంకోసం తెచ్చిన పట్టు చీరెను ఆమె పార్థివ దేహం మీద కప్పింది. రెండు చేతులు జోడించింది. ముక్కలైన సరస్వతీదేవి విగ్రహంలో ఆగ్రహం కనిపించింది... తన వీణను ఆయుధంగా మార్చి, తనను పూజించే భక్తురాలిని చంపినందుకు... నటరాజు త్రినేత్రం తెరిచినట్టు...

∗∗∗

ఆ యువకులిద్దరూ నిక్సన్ చెప్పినట్టు ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చారు. తమ జీపును మూడవ వీధిలోకి తీసుకువెళ్లారు. అక్కడ టెంట్‌వేసి వుంది. జీపు ఆపి పక్కవీధిలోకి వచ్చారు... సరస్వతీ దేవి ఆలయం... ఆ పక్కన శివుడి కటవుట్... మహాశివరాత్రి సందర్భంగా పెట్టిన కటవుట్... ఒకసారి పెద్ద గాలి వీచింది... ఆ కటవుట్ గాలికి అటు ఇటూ ఊగుతూ... పెద్ద శబ్దంతో ఆ ఇద్దరి యువకుల మీద కూలిపడింది. క్షణంలో వెయ్యో వంతు...

అతి బరువైన, పొడవైన కటవుట్... ఒరిజినల్ త్రిశూలంతో పెట్టిన కటవుట్...

ఆ త్రిశూలం ఆ ఇద్దరి గుండెలను చీల్చుకుంటూ వెళ్ళింది.

⁘⁘

# 47.

ఈ సృష్టిలోని ప్రాణులకు చివరిమజిలీ... చితి మంటల్లో... సమాధిలలో నిద్రించే మృత్యు ప్రాంగణం...

చీకటి విషాదానికి గుర్తుగా వుంది... మేఘాలు కన్నీటి చెమ్మతో ఆకాశంలో తిరుగాడు తున్నాయి.

ఒక సంగీతం విద్వన్మని నిశ్శబ్ద నిష్క్రమణకు విషాదమే అతిథి...

⁘⁘

చితిపై ఒక అమరస్వరమ్... అగ్నిలో కలిసిపోతుంది... ఆ స్మశానంలోని సమాధులు ఆ దృశ్యాన్ని చూసి కంటతడిపెడుతున్నట్టు వున్నాయి. అలాగే ఆ మంటల వంక చూస్తున్నాడు శ్రీనివాస్... అతని చితి మంటలు కనిపించడంలేదు... లక్ష్మి చివరి క్షణాలు గుర్తొస్తున్నాయి.

⁘⁘

వెబ్‌కామ్ ద్వారా లక్ష్మి అంత్యక్రియలు చూస్తోన్న కార్తికేయ బుగ్గలపై కన్నీటి ప్రవాహం...

''ఫ్రెండ్... మన చెలిమిని మరిచి తొందరపడి ముందే వెళ్ళిపోయావు... నా సంతోషాలు ఎవరితో షేర్ చేసుకోను... నీ స్వరాలు వింటూ... మారాం మానివేసిన చిన్నారులకు ఏం సమాధానం చెబుతావు?

లక్ష్మి వుయ్ మిస్ యు...'' ఎవరో ఎదను కోసేస్తున్న ఫీలింగ్... ఒక గాంధర్వ గానాన్ని గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేస్తోన్న ఫీలింగ్...''

వెబ్‌కామ్ క్లోజ్ చేయబోతూ ఆగాడు... వెబ్‌కామ్‌లో ఓ మూలగా ఓ అస్పష్ట ఆకారం... చేతిలో రివాల్వర్...

''శ్రీ... గట్టిగా అరిచాడు... ఎలర్ట్.. హెడ్ డౌన్... టేక్ పొజిషన్... ఎయిమ్ స్ట్రెయిట్...''

శ్రీ ఒక పోలీస్ అధికారి... కార్తికేయ మాటల్లోని వార్నింగ్ క్షణాల్లో అతని బ్రెయిన్ క్యాచ్ చేసింది... తల వంచాడు... ఓ బులెట్ అతని తలను రాసుకుంటూ వెళ్ళింది... వెంట్రుక వాసి... తేడా... తలవంచకపోయి వుంటే బులెట్ కణతలోకి దూసుకు వెళ్లేదే...

''శ్రీ డోంట్ లీవ్ హిం... కిల్ హిం... వాడు మంటల్లో మాడిపోవాలి కార్తికేయ మాటలు మంత్రాక్షరాలై వినిపిస్తున్నాయి... అసలే ఆకలిగొన్న పులి... శ్రీనివాస్... ఓ మూలాన వున్న పెట్రోల్ టిన్‌ని కాలితో ఫుట్‌బాల్‌లా తన్నేసాడు... టిన్ గాలిలోకి లేచింది... ఆ వేగానికి మూత కొండపడింది... టిన్ అగంతకుడి తలను తాకి, అందులోని పెట్రోల్ అతడిని తడిపేసింది.

శ్రీనివాస్ లక్ష్మి చితిమీద మండుతోన్న ఓ కర్రను తీసాడు... బలంగా విసిరాడు... గాలి

సైతం సహకరించింది... ఆ మండుతోన్న కర్ర అగంతకుడి తలను తాకింది... మరుక్షణం మంటల్లో అగంతకుడి శరీరం...అరుస్తున్నాడు... పరుగెడుతున్నాడు... సరిగా కొద్ది నిమిషాల్లోనే అగంతకుడు లక్ష్మి చితికి కాళ్ళవైపు పడిపోయాడు... మరో కొద్ది సేపటిలో బూడిదగా మారిపోతాడు.

ఆ అగంతకుడు నిక్సన్... బూడిదగా మారాడు... దుర్మార్గపు ఆలోచనలు చేసిన మెదడు, టపీమని పగిలిపోయింది. పరాయి దేశం నుంచి వచ్చి, పాడు పనులు చేసి... ఎవరికి దిక్కులేని చావు చచ్చి... ఇదే కదా జీవితం... ఈ రెప్పపాటే కదా జీవితం... ఎందుకీ

ద్వేషాలు... రక్తపాతాలు... ఉన్మాదాలు?

⁂

వెబ్‌కామ్‌లో అదృశ్యం చూసిన కార్తికేయ మోహంలో సంతృప్తి...

''వెల్‌డన్ మిత్రమా... మన స్నేహితురాలి ఆత్మ సంతోషిస్తుంది... ఏంతో మందిని మత్తుకు బానిసలుగా చేసి వారి జీవితాలతో ఆడుకుని చివరికి నీ చేతిలో చచ్చాడు... మాట నిలబెట్టుకున్నావు మిత్రమా''

శ్రీనివాస్ ఆ కామెంట్‌ని వినమ్రంగా స్వీకరించాడు... తన నెక్స్ట్ టార్గెట్... హైదరాబాద్‌లో మోహనాను ట్రాప్ చేయడం.

⁂

కళ్ళు మూసుకుంది ముగ్ధ... బస్సు రాజమండ్రివైపు వెళ్తోంది... నిద్ర రావడంలేదు... కన్నీళ్ళు వస్తున్నాయి... కళ్ళముందు లక్ష్మి మేడం కనిపిస్తుంది. మౌనంతో కూడా సంగీతాన్ని పలికిచింది. కార్తికేయ తనకు మంచి ఫ్రెండ్ అని చెప్పినప్పుడు పొంగిపోయింది. కానీ ఇంతలో... ముగ్ధకు భయం వేసింది... దగ్గరికి ముడుచుకుంది. పూర్ణిమకు దగ్గరగా జరిగింది.

''ముగ్ధా ఏమైందే? అడిగింది పూర్ణిమ...

అప్పటికే ముగ్ధ కళ్ళలో కన్నీళ్ళు...

''భయమేస్తుంది పూర్ణిమా... బాధేస్తుంది.

పూర్ణిమా... కార్తికేయ దగ్గరికి వెళ్ళి అతని దగ్గరే ఉండిపోవాలని అనిపిస్తుంది. నువ్వు, నేను, తమ్ముడు, నాన్న అంతా వెళ్ళిపోదామా? చిన్న పిల్లలా అడిగింది.

''డేరింగ్, డాషింగ్, డైనమిక్ కార్తికేయకు కాబోయే అర్ధాంగి మాట్లాడే మాటలా? నవ్వుతూ అంది పూర్ణిమ. ఆ మాటలు వినగానే సిగ్గు, ధైర్యం రెండూ కలిగాయి.

ఆ బస్సును ఫాలో అవుతూ ఓ పోలీస్ జీపు వస్తోంది.

⁂

అర్ధరాత్రి రెండుగంటలు... ఉలిక్కిపడి లేచాడు ఖాసి... టైం చూసుకుంటే రెండు గంటలు... నోరంతా పిడుచుకట్టుకు పోయినట్టు... ఎందుకో ఆ టైంలో విస్కీ తాగాలని అనిపించింది ఖాసింకు. సోఫా వైపు చూసాడు... సోఫాలో వుండవలసిన జర్దార్ లేడు... రాత్రి

జరిగిన సంఘటన గుర్తొచ్చింది. వద్దంటున్న వినకుండా జర్దార్ తనతో బీర్ తాగించాడు... బీర్ బాటిల్స్ లాగించినా మత్తురాని తనకు నిద్ర ముంచుకు వచ్చింది.

అలానే తినకుండా పడుకున్నాడు.

టీపాయ్ మీద చూసాడు... చికెన్ పీసెస్ వున్నాయి... చిప్స్ వున్నాయి... విస్కీ వుంది...కానీ ఇప్పుడు తాగాలని అనిపించడంలేదు... జర్దార్ ఎక్కడికి వెళ్ళాడు... వాడో పెద్ద బద్మాష్ అన్న ఫీలింగ్ ఖాసింకు.

చిన్న అనుమానం పెనుభూతం అయింది. వెంటనే జర్దార్ గదిలోకి వెళ్ళాడు. అక్కడ అతని గదిలో జర్దార్‌కు స

బంధించిన బట్టలు, వస్తువులు ఏవీ లేవు. చిన్న కంగారు... కొంపతీసి ఈ జర్దార్ తనని ఢిల్లీ పోలీసులకు పట్టించడు కదా? గట్టిగా పిలిచాడు...జర్దార్... జర్దార్... ఉల్లూకే పట్టా... గట్టిగా హిందీలో అరిచాడు.... తన గొంతు తనకు వినిపిస్తుంది.

ఏదో జరిగింది... ఏం జరిగింది? మోహనకు ఫోన్ చేస్తే...?

ఈ అర్ధరాత్రి... వెంటనే తనలో తనే అనుకున్నాడు... అదో సైతాన్... రాత్రుళ్ళు మేలుకుని ఏవో దుష్ట ఆలోచనలు చేస్తూ వుంటుంది.

వెంటనే మోహనకు ఫోన్ చేసాడు.

❖❖❖

''యస్... పోలీస్ కంట్రోల్‌రూం'' వినిపించింది అవతలివైపు నుంచి.

వెంటనే ఫోన్ కట్ చేసి సెల్‌లో వున్న సిమ్ బయటకు తీసాడు. ఖాసిం మొహానికి చెమటపట్టింది. అంటే మోహనను పోలీసులు? జర్దార్ కనిపించకుండా పోవడం... మోహనకు ఫోన్ చేస్తే... కంట్రోల్ రూంకు కనెక్ట్ అవ్వడం?

❖❖❖

# 48.

ఎంత పెద్ద క్రిమినల్ అయినా తొందరపాటులో విచక్షణ కోల్పోతాడు. ఖాసి కూడా ఆ పరిస్థితిలోనే వున్నాడు.

జర్దార్ అదృశ్యం...

మోహన ఫోన్‌లోకంట్రోల్ రూం వాయిస్... పోనీ మరోసారి మోహనకు ట్రై చేస్తే... అప్పుడు కూడా అదే వాయిస్ వస్తేతన ఫోన్ సిమ్ మార్చాలి లేదా పోలీసులు ఈ నెట్‌వర్క్ ద్వారా తనను ట్రాప్ చేయవచ్చు. మరోసారి మోహనకు ట్రై చేసాడు... సెల్ రింగ్ అవుతుంది.

❖❖❖

డబ్బింగ్ థియేటర్... మోహన గ్లాస్ చాంబర్‌లో వుంది... ఇటువైపు విద్యారణ్యా వున్నాడు... మోహన ఎదురుగా పెద్ద స్క్రీన్... స్క్రీన్ మీద కొందరి ఫోటోలు డిస్ప్లే అవుతు

న్నాయి... కొన్ని క్లిప్పింగ్స్... వాళ్ళ పెదవుల కదలికకు అనుగుణంగా మోహన డబ్బింగ్ చెబుతుంది. విద్యారణ్య మోహనవైపే చూస్తూండిపోయాడు... చేసే పనిని సీరియస్‌గా తపస్సులా చేయడం ఎంత మందికి సాధ్యం? మోహన క్రిమినలే కావచ్చు... కానీ ఈ డెడికేషన్ ఎంత మందిలో వుంటుంది? నలభై ఎనిమిది గంటల నుంచి నిరంతర సాధన చేస్తుంది. తను ఎవరి గొంతును అనుసరించిందో... వారి ఒరిజినల్ వాయిస్ చెక్ చేస్తుంది... చిన్న జీర గొంతులో పలికినా కరెక్ట్ చేసుకుంటుంది.

ముగ్ధ వాయిస్‌ని కనీసం కొన్ని వందల సార్లు విన్నది. ఒక ప్రొఫెషనల్ అయిన తను కూడా ఇంత సీరియస్‌గా సాధన చేయగలడా? నిమిషాల మీద రికార్డింగ్ థియేటర్ బుక్ చేయడం మరొకరికి సాధ్యమా?

అన్నింటికన్నా అతనికి ఆశ్చర్యానికి గురిచేసింది... ముగ్ధతన గొంతును మేనరిజంతో సహా అనుకరించి తన భార్యతో మాట్లాడ్డం...

హర్షద్ మెహతా, చార్లెస్ శోభరాజ్‌లాంటి వాళ్ళు సక్రమ మార్గంలో వెళ్తే ఎంత ఉపయోగకరంగా వుండేది? మోహన లాంటి వాళ్ళు కూడా అంతే

ముగ్ధ వీడియో క్లిప్ చూస్తూ... ఆ గొంతును ముగ్ధ హావభావాలను పరిశీలిస్తుంది. అప్పుడే ఖాసిం నుంచి ఫోన్... అంతకు క్రితమే ఫోన్ వచ్చింది... పోలీస్ కంట్రోల్ రూం నుంచి మాట్లాడినట్టు... మాట్లాడింది. ఖాసిం ఆలోచనలో పడతాడని, కన్ఫ్యూజ్ అవుతాడని తెలుసు... చిన్న ప్రాక్టికల్ జోక్... ఇలాంటి శాడిస్టిక్ సరదాలు చాలా వున్నాయి మోహనలో...

ఈసారి కూడా తను ప్రాక్టికల్ జోక్ వేస్తే ఖాసిం కాందహార్‌కు పారిపోతాడనిపించింది.

''హైదరాబాద్‌లో కరెంటు కోతలు... కరెంట్ వాతలుగా మారాయి... మీరు అక్కడ ఉండడమే సేఫ్'' కోడ్‌లో అంది మోహన.

''మోహనజీ మీరేగా... ఇందాక కంట్రోల్ రూం వాయిస్ వినిపించింది. ఈ జర్దార్ కనిపించక కంగారుపడుతున్నాను?

'' ఎక్కడికి వెళ్ళాడు? ఏమీ తెలియనట్టు అడిగింది మోహన''

అదే అర్థం కావడంలేదు మేడం... వాడి బట్టలులేవు... ఆఖరికి బాత్‌రూంలో ఆరేసుకున్న అండర్ వేర్ కూడా తీసుకువెళ్ళాడు.

''వాడి ఫోన్‌కు ట్రై చేయలేదా?

''చేసాను అవుట్ ఆఫ్ కవరేజ్ ఏరియా అని వస్తోంది''

''అయినా రాత్రికి రాత్రే ' ఉల్లూ కా పట్టా... ఎక్కడికి వెళ్ళాడు?''

''రాజమండ్రి వెళ్ళాడు'' తాపీగా చెప్పింది మోహన.

''రాజమండ్రి? అంటే హైదరాబాద్...అక్కడ వీడికి పనేమిటి?

''రాజమండ్రిలో తాపేశ్వరం కాజా తినాలనిపించి? ఒక్క క్షణం అర్థం కాలేదు... అర్థమయ్యాక...అన్నాడు..

‘‘అంటే ఇదంతా మీ స్కెచ్చేనా?

‘‘అవును నువ్వు బీర్‌తాగి మంచి నిద్రలో వున్నావ్? నీకు చెప్పే టైం లేదు...’’

‘‘నిక్సన్‌ని మాజీ సిట్ ఆఫీసర్ చంపేసాడు... ముగ్ధను కిడ్నాప్ చేయడానికి జర్దార్‌ని ఇక్కడికి రమ్మని నేనే చెప్పాను... ఈ విషయం తెల్లవారేక నేను నీకు చెబుదామనుకున్నాను...’’

‘‘ ఓకే ఢిల్లీకి వచ్చిన వెంటనే నన్ను హత్య చేయడానికి ట్రై చెయ్...’’

‘‘వాట్...? అదిరిపడి అడిగాడు.

‘‘అవును... అంటూ చెప్పసాగింది...

మొత్తం విన్నాక ఖాసిం బుర్ర తిరిగిపోయింది. తను వున్నది పాము పడగ కింద కాదు... కోటాను కోట్ల పాముల మధ్య అన్న ఫీలింగ్ కలిగింది.

⁂

ఖాసింతో మాట్లాడక రెండు క్షణాలు కళ్ళు మూసుకుంది. నిక్సన్‌ని శ్రీనివాస్ చంపుతాడని ఊహించలేదు... ముగ్ధను కిడ్నాప్ చేసే పనిని నిక్సన్‌కు అప్పగించింది. అంతే సమర్ధవంతంగా ఆ పని చేయగల నమ్మకమైన వ్యక్తి జర్దార్... అందుకే రాత్రికి రాత్రి జర్దార్ని వచ్చేయమని చెప్పింది. చార్టెడ్ ఫ్లయిట్ బుక్ చేసింది. ఒక్క క్షణం నవ్వొచ్చింది...

ఈ కరప్షన్ సిస్టం ఉన్నంత వరకూ తనలాంటి క్రిమినల్స్‌కు ఢోకాలేదు... జైళ్ళలో సెల్ ఫోన్స్... సమాంతర ప్రభుత్వాలను జైలునుంచి నడిపించే వ్యవస్థ వున్న డెమెక్రసీ...

ఈ పాటికి జర్దార్ తన టార్గెట్ పూర్తి చేసివుంటాడు...

⁂

డబ్బింగ్ థియేటర్ నుంచి బయటకు వచ్చింది మోహన...

‘‘మోహనగారు మీరు చెప్పినట్టు చేసాను... ముగ్ధ గొంతును మీరు ముగ్ధ కూడా గుర్తు పట్టనంతగా అనుకరించారు... మీరు ఇచ్చిన మాటప్రకారం...’’

విద్యారణ్య మాట పూర్తి కాకుండానే... తన చేతిలో వున్న రిమోట్ బటన్‌నొక్కింది. స్క్రీన్ మీద కూతురు, అల్లుడు ప్రత్యక్షమయ్యారు... హోటల్ రూంలో సామాన్లు సర్దుకుంటున్నారు.

మీ కూతురికి ఫోన్ చేయండి... చెప్పింది మోహన.

వెంటనే కూతురికి ఫోన్ చేసాడు.

‘‘నాన్న మమ్మల్ని ఎవరు కిడ్నాప్ చేసారో తెలియదు... ఎందుకు కిడ్నాప్ చేసారో తెలియదు. ఇందాకే వదిలేసారు... వెంటనే రూంకు వచ్చాం... బయల్దేరి వస్తున్నాం... ఇంతకీ మీరెక్కడ వున్నారు నాన్న’’ కూతురు అడిగింది.

వెంటనే విద్యారణ్య చేతిలోని ఫోన్ లాక్కుంది... ‘‘నేనువేరే పని మీద హైదరాబాద్ వచ్చాను. అమ్మతో కిడ్నాప్ వ్యవహారం గురించి చెప్పకు... ఏ దేవతో మిమ్మల్ని కాపాడి వుంటుంది... బై... హ్యాపీ జర్నీరా’’ అని ఫోన్ కట్ చేసింది. విద్యారణ్య అలానే చూస్తోండిపో

యాడు.

"సారీ... మీ గొంతును పర్ఫెక్ట్‌గా అనుకరించగలనా? అని చిన్న టెస్ట్..." చెప్పింది మోహన.

" ఒకే, నేనిక బయల్దేరుతాను..."

మీరా... మీరెక్కడికి?

"అదేమిటి? మీ వర్క్ పూర్తిచేస్తే వదిలేస్తానని అన్నారు"

"మీ కూతురి, మీ అల్లుడిని వదిలేస్తానని అన్నాను. మిమ్మల్ని కాదు... కంగారు పడ కండి... మీతో చిన్న పని వుంది ప్యాచ్ వర్క్‌లాంటి పని..." అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయింది.

విద్యారణ్య కంగారుపడలేదు... ఇందాక గ్లాస్ చాంబర్‌లో ఖాసిం మోహనతో మాట్లా డిన మాటలను డీకోడ్ చేసే పనిలో వున్నాడు... డబ్బింగ్ థియేటర్ అందులోనూ సౌండ్‌ప్రూఫ్ గది... విద్యారణ్యకు లిప్ రీడింగ్ వచ్చు...

మోహన మాట్లాడిన మాటలను వాయిస్‌గా కన్వర్ట్ చేస్తూ... వుండగా అతని ఒళ్ళు గగుర్పొడిచింది... మోహన ఏం మాట్లాడిందో అర్థమయ్యాక...

# 49.

బాధ, దుఖం రెండూ వేరు వేరు ఫీలింగ్స్... దుఖాన్ని కన్నీళ్ళ రూపంలో వ్యక్తం చేయవచ్చు... కానీ బాధను వ్యక్తం చేయడానికి కన్నీళ్ళు కూడా సరిపోవు.. మనసు భార మైంది... అనే మాటకు అర్థం ఇదే.

ముగ్ధ, పూర్ణిమ ఇద్దరూ ఈ రెండింటినీ అనుభవిస్తున్నారు. పూర్ణిమ వీటితోపాటు మరో విషయాన్నితలుచుకుని భయపడుతోంది. లక్ష్మి మరణం ప్రమాదవశాత్తు సంభవిం చింది కాదు... టార్గెట్ ఎవరు? ముగ్ధ వస్తున్న విషయం తెలుసుకుని ఎవరైనా...? అయినా ముగ్ధను చంపవలసిన అవసరం ఎవరికీ వుంది? తమకు తెలియకుండానే ప్రమాదంలోకి అడుగుపెడుతున్న ఫీలింగ్ కలిగింది పూర్ణిమకు.

ముగ్ధవైపు చూసింది. నిద్రలోకి జారుకుంది. గాలికి ముగ్ధ ముంగురులు బుగ్గలను తాకుతుంటే పూర్ణిమ వాటిని సరిచేయడానికి ప్రయత్నిస్తోంది. తన బుగ్గలమీద పడిన పూర్ణిమ చేతిని ముగ్ధ అలానే పట్టుకుని

"నాకు భయంగా వుంది. నన్ను మీతో పాటు తీసుకువెళ్ళండి" నిద్రలోనే మాట్లాడు తోంది.

ముగ్ధ కార్తికేయ మీద ఎంతప్రేమను, నమ్మకాన్ని పెంచుకుందో అర్థమైంది పూర్ణిమకు.

ఇంటికి వెళ్ళాక ముగ్ధ దగ్గర కార్తికేయ ఫోన్ నెంబర్ తీసుకుని తనే మాట్లాడాలి. తన మనసులోని భయాన్ని కార్తికేయకు చెప్పి ముగ్ధను సేవ్ చేయమని చెప్పాలి... అనుకుంది.

వీళ్ళ బస్సుకు పది కిలోమీటర్ల దూరంలో మరో బస్సులో వున్నాడు కపర్ది... శ్రీనివాస్ అసిస్టెంట్. ముగ్ధను ఫాలో అవ్వమనిచెప్పాడు శ్రీనివాస్... లక్ష్మీగా ముగ్ధ వెళ్ళిన బస్సు వెనకే మరో బస్సు దొరికింది. ముగ్ధకు తెలియకుండా ఆమెను రక్షించవలసిన బాధ్యత తనది.

ఆర్డర్లీ వ్యవస్థ కనుమరుగవుతున్న ఇంకా కొన్ని చోట్ల కొనసాగడం... రక్షించవలసిన పోలీసు...పై అధికారుల ఇళ్ళలో పనులు చేయడం నచ్చని కపర్ది తన పోలీస్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు... శ్రీనివాస్‌లాంటి నిజాయతీ పరుడైన ఆఫీసర్ దగ్గర సహాయకుడిగా చేరాడు.

⁘⁘

కపర్ది గ్లాస్ డోర్‌ని పక్కకు జరిపాడు. చల్లగాలి తగిలి హాయిగా అనిపించింది. చల్ల గాలికి నిద్ర ముంచుకు వస్తోంది... కానీ విధి నిర్వహణలో చాలా ఎలర్ట్‌గా ఉంటాడు కపర్ది. గ్లాస్ దగ్గరికి జరిపాడు. అప్పుడే కపర్ది సెల్‌రింగ్ అయింది... నంబర్ కొత్తది... ఈ టైములో ఎవరు చేసి వుంటారు? వెంటనే ఆన్ బటన్ ప్రెస్ చేసి ''హలో'' కపర్ది నేను... నువ్వు వెంటనే బస్సు దిగి వెనక్కి ఒక కిలోమీటర్ నడుచుకుంటూ వచ్చి... అక్కడ మన ఇన్ఫార్మర్ ఒకడు జీప్‌తో రెడీగా ఉంటాడు. అతనితో కలిసి నువ్వు ముగ్ధ దగ్గరికి వెళ్ళు... నా ఫోన్‌లో చార్జింగ్ లేదు... కమాన్ క్విక్'' అటువైపు నుంచి బాస్ శ్రీనివాస్ గొంతు.

మరో ఆలోచన లేకుండా ''ప్లీజ్ స్టాప్'' అని అరిచాడు కపర్ది.

డ్రైవర్ బస్సు ఆపాడు.

''సర్... ఈ టైంలో ఇక్కడ దిగుతారేమిటి? కండక్టర్ అనుమానంగా అడిగాడు.

''అర్జెంటుపని... మా వాళ్ళు వస్తారు'' అంటూ అతనికి మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా బస్సు దిగాడు.

''సర్ మీ చిల్లర'' అని కండక్టర్ అరుస్తున్న వినిపించుకోలేదు.

బస్సు కపర్దిని వదిలి వెళ్ళిపోయింది. బస్సు కనుమరుగయ్యే వరకు వుండి... వెనక్కి నడవడం మొదలుపెట్టాడు.

అంతా నిర్మానుష్యంగా వుంది... అప్పుడు గుర్తొచ్చింది కపర్దికి ''బాస్ చెప్పిన ఇన్ఫార్మర్ ఎవరు? అతను ఆలోచిస్తూ ఉండగానే అతని పక్కన జీప్ ఆగింది. చీకట్లో డ్రైవర్ మొహం స్పష్టంగా కనిపించలేదు. ''కపర్ది సర్ మీరేనా? డ్రైవర్ అడిగాడు.

''నేనే... సర్ పంపించారా?'' అడుగుతూ జీప్ ఎక్కాడు. జీపు కదిలింది.

'' ఇంతకీ మీ పేరు చెప్పనేలేదు... మిమ్మల్ని ఎక్కడా చూసిన జ్ఞాపకం లేదు? కపర్ది అని డ్రైవర్ మొహాన్ని పరిశీలనగా చూడబోయాడు... అప్పుడే డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసాడు. దాంతో కపర్ది తూలిపడబోయాడు.అప్పటికే డ్రైవర్ కుడిచేయి ముందుకు కదిలింది. ఏదో తెలియని స్మెల్... కొద్ది క్షణాల్లోనే గుర్తించింది కపర్దిలోని పోలీస్‌బుర్ర. కానీ అప్పటికే ఆలస్యమైంది. మెల్లిమెల్లిగా స్పృహ తప్పుతోంది.

రెండు నిమిషాల తర్వాత ఆ డ్రైవర్ ఫోన్ చేసాడు. ''మేడం అతడు స్పృహతప్పాడు.

అతడ్ని మీ దగ్గరికి తీసుకురమ్మంటారా? అడిగాడు.

"వద్దు... తప్పించుకుపోకుండా చూడు...అతని సెల్‌ఫోన్ తీసుకురా" అటువైపు నుంచి మోహన చెప్పింది.

"సెల్‌ఫోనా? ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును ఎవరికైనా అమ్మేద్దామని..." కూల్‌గా చెప్పింది.

డ్రైవర్‌కి చెమటలు పట్టాయి. చెప్పింది చేయడమే తెలుసు. మోహన దగ్గర నోరు జారితే ఎలా వుంటుందో తెలుసు.

"చూడు... ఈ లోగా ఏమైనా ఫోన్‌కాల్స్ వస్తే నేను చెప్పిన నంబర్‌కు కాల్ డైవర్ట్ పెట్టు..." అంటూ కాల్ డైవర్ట్ పెట్టవలసిన నంబర్ చెప్పింది.

***

పోలీస్ జీపు స్పీడ్‌గా వెళ్తుంది. మరి కాసేపట్లో ఊళ్ళోకి అడుగుపెడుతుంది. ఓసారి రియల్ వ్యూ మిర్రర్‌లో చూసుకున్నాడు ఇన్స్‌పెక్టర్ డ్రెస్‌లో వున్న జర్దార్. మోహన ఫోన్ చేయ గానే చార్టెడ్ ఫ్లయిట్‌లో రాజమండ్రి వచ్చాడు. సిటీకి దూరంలో దిగగానే పోలీస్ జీపు రెడీగా వుంది పోలీసులతో సహా... కపర్థిని తప్పించడానికి మోహన ప్లాన్ వేసింది. శ్రీనివాస్ గొంతుతో మాట్లాడింది. ఇప్పుడు ముగ్ధను కిడ్నాప్ చేయడానికి ఎటువంటి ఆటంకం లేదు.

***

పూజగదిలో దేవుడి ముందు కూచోని వున్నాడు ముగ్ధతండ్రి. గంభీరమైన రూపం... తెల్లటి మేనిచాయ, ఎన్నో అనుభవాలను చూసినట్టు ముడతలు పడిన శరీరం. ఉదయం నుంచి అతను పూజగదిలోనే వున్నాడు. ఎన్నడూ లేనిది అతని మనసు ఆ రోజు కీడును శంకి స్తుంది. సంప్రదాయాలను అంగీకరిస్తాడు. కూతురు తనప్రేమ గురించి చెప్పగానే "కూతురి వంక చూసాడు... కూతురు మొహంలో ఆకర్షణ తాలూక కోరిక కనపడలేదు... సీతా స్వయం వరంలో రామచంద్రుడిని చూసిన సీత గుర్తుకు వచ్చింది. తన కూతురి గురించి తెలుసు. తను తప్పు చేయదు. తప్పుడు నిర్ణయాలుచేయదు. హైదరాబాద్ నుంచి వచ్చిన కూతురి మొహంలో బాధ చూసాడు. భయం చూసాడు... పసి పిల్లలా పూజగదిలోకి వచ్చి తన ఒడిలో పడుకొని "నాకు భయం వేస్తుంది నాన్నగారు" అన్నప్పుడు తన మనసు చివుక్కు మంది...తన కూతురికి ఏదైనా ఆపద సంభవించదు కదా... ఆ ఆదుర్దాతోనే ఉదయం నుంచి పచ్చి గంగ కూడా ముట్టలేదు.

చిలుక వచ్చి పూజాగదిలోని దేవుడి పాదాల ముందు వాలింది.

***

పోలీసు జీపు ఊళ్ళోకి ప్రవేశించింది. దేవాలయం ముందు ఆగింది. పూర్ణిమ, పోలీసు జీపు శబ్దం విని గుడిలోనుంచి బయటకు వచ్చింది. పోలీస్ డ్రెస్‌లో వున్న జర్దార్ జీపు దిగాడు. పూర్ణిమవైపు చూసి " ఇక్కడ ముగ్ధ ఇల్లెక్కడ? అని అడిగాడు.

‘‘ ఎందుకు? అనుమానంగా అడిగింది పూర్ణిమ.

‘‘ ఎందుకోచెబితేగాని అడ్రెస్ చెప్పవా? అన్నాడు. అప్పుడే అటుగా వెళ్తోన్న రైతుని అడిగాడు డ్రైవర్. అతను చెప్పాడు. జీపుకదలింది.

పూర్ణిమలో అనుమానం బలపడింది. వెంటనే ముగ్ధ ఇంటివైపు పరుగెత్తింది.

⁂

ఎవరో తలుపు దబదబ బాదుతున్న చప్పుడు. అప్పటికే పూజగదిలో వున్న ముగ్ధ తండ్రి వెళ్లి తలుపు తీసాడు... ముగ్ధ బయటకు వచ్చింది. తమ్ముడు లేచాడు. ఎదురుగా పోలీసులు...

‘‘ ఎవరు మీరు. మీకు ఏం కావాలి? ముగ్ధ తండ్రి అడిగాడు.

‘‘మీ అమ్మాయిని అరెస్ట్ చేయడానికి వచ్చాం...’’ జర్దార్ చెప్పాడు.

‘‘చూడు బాబు... మీరు తప్పు అడ్రెస్‌కు వచ్చారు... మా అమ్మాయి అలాంటిది కాదు... మీరు పొరపడి వచ్చారు’’అన్నాడు ముగ్ధ తండ్రి.

‘‘వారెంట్‌తో వచ్చాం... అంటూ పోలీసుల వైపు తిరిగి సైగ చేసాడు జర్దార్.

పోలీసులు బేడీలు తీసారు. భీతావహరిణి అయింది... బలవంతంగా ఒక చేతికి బేడీలు వేసారు. ఒక్కసారిగా కింద కూలబడిపోయాడు ముగ్ధ తండ్రి ఆ దృశ్యం చూసి... తమ్ముడు ‘‘అక్కా’’ అంటూ అరుస్తున్నాడు... చుట్టుపక్కల వాళ్ళు వింతగా అరుస్తున్నారు. ముగ్ధను జీపులోకి నెట్టారు. అలానే స్థాణువు అయింది ముగ్ధ.

జీపు కదులుతుండగా పరుగెత్తుకు వచ్చింది పూర్ణిమ. అప్పటికే జీపు కదిలింది... అయినా జీపు వెంట పరుగెత్తింది.

⁂

# 50.

కన్ను మూసి తెరిచిలోగా ఒక మహావిషాదం... కళ్ళముందే జరిగిన దారుణం. పూర్ణిమ రోడ్డు మధ్యలో మోకాళ్ళ మీద కూలబడిపోయింది.

ఇప్పుడు ఇప్పుడు తనేం చేయాలి? పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇవ్వాలా? కార్తికేయ ఫోన్ నంబర్‌లేదు...

శ్రీనివాస్ నంబర్‌కూడా లేదు. సడెన్‌గా ముగ్ధ తండ్రి గుర్తొచ్చాడు... వెనక్కి పరుగెత్తింది. అప్పటికే అతని శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. అలాగే వున్న ఫళంగా డాక్టర్ దగ్గరికి పరుగెత్తింది.

⁂

శ్రీనివాస్ చాలా డిస్టబ్‌గా వున్నాడు. లక్ష్మి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. కేవలం తనను కాపాడడం కోసమే ఆమె బలైంది. తనే టార్గెట్... కానీ అమాయకురాలు బలైంది. మరోవైపు ముగ్ధ పరిస్థితి... కపర్దికి ఫోన్ చేసాడు. సెల్‌రింగ్ అవుతోంది... కానీ లిఫ్ట్

చేయడంలేదు... చిన్న అనుమానం క్రమ క్రమంగా పెరిగి పెద్దవ్వసాగింది. రాత్రి నుంచి గంట కోసారి ఫోన్ చేస్తూనే వున్నాడు. కపర్ది మాట్లాడుతూనే వున్నాడు. ఇప్పుడేమైంది?

⁘⁘

కళ్ళు తెరిచాడు కపర్ది. తలంతా దిమ్ముగా, బరువుగావుంది... తానో చిన్న గుడిసెలో వున్నాడు... అది పాడుబడిన గుడిసె.. చుట్టూ ఎవరూ లేరు.లీలగా రాత్రి జరిగినదంతా గుర్తొస్తోంది. ప్లాన్డ్‌గా తనని కిడ్నాప్ చేసారు.. ఎదురుగా గొర్రెల కాపరి... తలను రుద్దుకుంటూ సెల్‌కోసం చూసాడు. జేబులోనే వుంది. కాల్‌లాగ్ చూసాడు.. రాత్రి బాస్ నుంచి వచ్చిన కాల్స్ వున్నాయి. ఒక్కోకాల్ మూడు నిమిషాలు నుంచి అయిదు నిమిషాల వరకు మాట్లాడినట్టు తెలుస్తోంది. తన సెల్ నుంచి ఎవరు మాట్లాడినట్టు... అయిదు నిమిషాల క్రితం బాస్ మిస్సిడ్ కాల్. వెంటనే కాల్‌చేసాడు.

'' ఏమైంది కపర్ది... ఆర్యూ ఆల్‌రైట్? ముగ్ధ క్షేమమే కదా? ఆదుర్దాగా అడిగాడు.

''సారీ సర్... నేను ముగ్ధగారి దగ్గరికి వెళ్ళలేదు...'' అంటూ రాత్రి జరిగినదంతా చెప్పాడు. శ్రీనివాస్‌కు నమ్మశక్యంగా అనిపించలేదు. తన గొంతుతో తన అసిస్టెంట్‌కు,అసిస్టెంట్ గొంతుతో తనతో మాట్లాడింది ఎవరు? ఎందుకు ఇదంతా చేసినట్టు?

''కపర్దీ నువ్వు వెంటనే ముగ్ధ దగ్గరికి వెళ్లు... ఎప్పటికప్పుడు నాకు అప్‌డేట్ చేస్తుండు...క్విక్...'' అన్నాడు శ్రీనివాస్.

⁘⁘

కార్తికేయ ముందు గోడకు పెద్ద స్క్రీన్ వుంది. హైదరాబాద్, ముంబై, బెంగుళూర్, చెన్నై, ఢిల్లీలాంటి నగరాలు ఆ స్క్రీన్ మీద ఎర్రరంగు మార్కర్ గుర్తులున్నాయి. ఏ క్షణమైనా నగరాల్లో విధ్వంసం జరుగవచ్చు.

గోకుల్ చాట్, పార్లమెంట్‌పై దాడి ప్రయత్నం... 26/11, నిన్నటికి నిన్న దిలుసుఖ్ నగర్... ఉగ్రవాదులు తమ ఆధిక్యాన్ని చూపుతూనే వున్నారు.

ఈసారి దాడి లక్ష్యం వేరే... మోహనను పట్టుకుంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదు.

మోహనను ఢిల్లీ రప్పించాలి...

కార్తికేయ ఆలోచనలు పూర్తికాకముందే శ్రీనివాస్ నుంచి ఫోన్.

''సారీ కార్తికేయగారు... వన్ బ్యాడ్ న్యూస్... ముగ్ధను పోలీసులు తీసుకువెళ్ళారు... పోలీసులంటే వాళ్ళు నిజమైన పోలీసులు కారు... అన్ని పోలీస్‌స్టేషన్‌లలో ఎంక్వయిరీ చేశాను... ఇది మోహన పని అని అనుమానం... ఇప్పుడే మా అసిస్టెంట్ ముగ్ధ వాళ్ళింటికి వెళ్ళాడు'' అంటూ రాత్రి జరిగిన విషయం చెప్పాడు.

కార్తికేయ అలానే ఉండిపోయాడు... తన ప్రాణాన్ని... తీసుకువెళ్ళారు.. తన శ్వాసను బంధించారు. కేవలం తనను ప్రేమించినందుకు ముగ్ధ ఇన్ని కష్టాలు పడుతుందా? అయాం సారీ ముగ్ధా... నుదురు మీద కొట్టుకున్నాడు.

‘‘శ్రీనివాస్ మీరో పని చేయండి... ముగ్ధ వాళ్ళ నాన్న గారి పరిస్థితి ఎలా వుందో కనుక్కోండి... అక్కడ పూర్ణిమ అని ముగ్ధ ప్రాణస్నేహితురాలు వుంటుంది. దయచేసి ఆ ఫోన్ నెంబర్ నాకు వెంటనే పంపించండి. వాళ్ళ ఫ్యామిలీకి ధైర్యం చెప్పాల్సిన బాధత్య నీమీద వుంది...ప్లీజ్’’

‘‘ష్యూర్... మీరేమి కంగారుపడకండి... నేను పూర్ణిమ ఫోన్ నెంబర్ వెంటనే పంపిస్తాను...’’ చెప్పాడు శ్రీనివాస్.

⁂

పూజలు లేని గుడిలా వుంది... పూజారి లేని కోవెలాలా వుంది. మంచం మీద ముగ్ధ తండ్రి. దిగులుగా తమ్ముడు... ఆ ఇంటికి మరో ముగ్ధ అయింది పూర్ణిమ...

తండ్రికి ధైర్యం చెబుతుంది... తమ్ముడిని ఓదారుస్తుంది... పూర్ణిమని కోల్పోయిన దుఖాన్ని దిగమింగుతూ పైకి గంభీరంగా వుంటుంది. పుట్టి బుద్దెరిగాక దేవుడి గుడిని వదిలి బయటకు వచ్చింది పూర్ణిమ.

⁂

హాల్లో వున్న ల్యాండ్ ఫోన్ రింగ్ అయింది. పరుగెత్తుకు వెళ్లి రిసీవర్ లిఫ్ట్ చేసింది.

‘‘నేను కార్తికేయను...’’

వేన వేళ సంవత్సరాల దిగులు ఒకే ఒక క్షణంలో తొలిగినట్టు... ఒక గాంధర్వ గానం ఓదార్పు రాగమై వినిపించినట్టు...

‘‘నే..నేను..పూర్ణిమను’’ గొంతు వణుకుతుండగా అంది.

‘‘తెలుసండీ ముగ్ధ మీగురించి ఎప్పుడూ చెబుతుండేది... ఇప్పడు ముగ్ధ నాన్నగారికి ఎలా వుంది? కార్తికేయ మాటలకు పలకరింపుగా గొంతు గాద్గదికమైంది.

‘‘వాళ్ళని నేను చూసుకుంటాను... ముగ్ధను ఎలాగైనా మీరే కాపాడాలి’’

‘‘నా ప్రాణాన్ని నేను కాపాడుకోలేనా?

ఆ ఒకే ఒక మాట పూర్ణిమకు అమృతప్రాయమైంది... ముగ్ధ కార్తికేయను ఎందుకింత గాఢంగా ప్రేమిస్తుందో అర్ధమైంది.

⁂

కార్తికేయకు ఇప్పుడు రిలాక్స్‌గా వుంది. పూర్ణిమతో మాట్లాడక కొద్దిగా కుదుటపడ్డాడు. ముగ్ధ నాన్నగారి గురించి ఆందోళన తగ్గింది. అప్పుడే సెల్‌రింగ్ అయింది... ఆన్ బటన్ నొక్కి హలో...అన్నాడు...

‘‘నేను... ముగ్ధను...’’

ఒక్కసారిగా ఎలర్ట్ అయ్యాడు....

ముగ్ధ గొంతులో కంగారు... వెనుక రైల్వే అనౌన్స్‌మెంట్... రైళ్ళ శబ్దాలు.

⁂

# 51.

పూజగడిలోకి అడుగు పెట్టాడు కార్తికేయ. ఒక దివ్యత్వం ఆ గదిని దేవలోకంగా మార్చినట్టు... మహాద్వారాలు తెరుచుకున్నట్టు... శాంతాకారం భుజగశయనం...పద్మనాభం... పూజగదిలో మహా మహిమాన్వితమైన మాన్వి ఖడ్గం... శత్రుసంహారానికి ఆయత్తమైనట్టు...

రెండు చేతులుజోడించాడు కార్తికేయ.

''దేవుడా... నువ్వున్నావని నీ ఉనికి నిజమని, శిష్ట రక్షణకు, దుష్టశిక్షణకు అవరిస్తావని నమ్మేవారికోసం... ధర్మ సంస్థాపన కోసం మళ్ళీ అవరించు...''

ఆ ఖడ్గంలోని దివ్యశక్తి కార్తికేయలోకి ప్రవేశించినట్టుగా చిన్న గగుర్పాటు.

***

పార్లమెంటుకు కూతవేటు దూరంలో నలుగురు వ్యక్తులు కలుసుకున్నారు. ఒకతను చిత్తుకాగితలు ఏరుకునేవాడి వేషంలో, మరోకతను ముంతకింద పప్పు అమ్ముకునే వాడు. ఇంకోతను ఫ్లాస్క్‌లో టీ అమ్ముకునే వాడు... నాలుగో అతను ముష్టివాడు...

ఈ నలుగురూ ఒక్క దగ్గర చేరారు... అప్పుడప్పుడు ఎవరి పని వారు చేస్తున్నారు. చిత్తు కాగితాలు ఏరుకుంటూనే మాట్లాడుతున్నాడు. అతని పేరు యాహ్యాఖాన్... భారత భూబాగంలోకి చొచ్చుకు వచ్చి భారత జవానులను దొంగదెబ్బ తీసే ప్రయత్నం చేసి భారత జవాన్ల విశ్వరూపం చూసి పారిపోయాడు.

కరుడు గట్టిన ఉగ్రవాది... రెండో అతను ఒకప్పుడు ఉగ్రవాద సంస్థల్లో పనిచేసి... అక్కడ ఆయుధాలు దొంగిలించి పారిపోయాడు. మూడో అతను బాంబులను అమర్చడంలో ఎక్స్‌పర్ట్... నాలుగో వ్యక్తి ఖాసి...

***

ముగ్గిరివంక చూసి చెప్పాడు ఖాసిం... ''మనం చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి... ఇండియన్ పోలీస్‌ని, ఢిల్లీపోలీస్‌ని తక్కువ అంచనా వేయకూడదు... ఇప్పటి వరకూ అవినీతి పరుల లిస్టులో వున్న ఎంపీలు ఎవరనేది అరా తీయాలి... డబ్బుతో వాళ్ళని కొనేయాలి.. ఎవరు ఎలా మన దారికి వస్తారో అలా వాళ్ళని మన దారిలోకి తెచ్చుకోవాలి... ఢిల్లీ నగరం బాంబుల మోతతో దద్దరిల్లిపోవాలి.... ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వం మీద విరుచుకుపడాలి... అదే సమయంలో హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగుళూర్‌లలో బాంబ్‌బ్లాస్ట్‌లు జరగాలి... ఒకచోట పరిశోధన పూర్తికాకుండానే పోలీసులను మరో చోటికి పరుగెత్తించేలా చేయాలి.

దేశం అల్లకల్లోలం కావాలి... రాష్ట్రపతి పాలన వచ్చేలా చేయాలి... అదే సమయంలో...

భారత రాష్ట్రపతిని.. దేశ ప్రథమ పౌరుడిని... ఇద్దరు దేశప్రధానులను ఎలా ఈ లోకం నుంచి పంపించేసామో... అలా...

మిగతా ముగ్గురు ఒక్క క్షణం వణికిపోయారు... ఇది సాదా సీదా విషయం కాదు...

కసబ్ ఉరి కళ్ళముందు కనబడుతూనే వుంది.

'' ఇది... ఇది సాధ్యమయ్యే విషయమేనా?యాహ్యాఖాన్ అడిగాడు తడారిన గొంతును తడుపుకుంటూ...

''సాధ్యం చేయాలి... ఇది మోహన మేడం స్కెచ్... ఎక్కడ ఫెయిల్ అవ్వడానికి అవ కాశం లేదు.''

అని ఆగి...

''మనం అనుకున్నది అనుకున్నట్టు పూర్తయితే... ఈ దేశానికి రూలర్ మో...హ...న...జీ''

మిగతా ముగ్గురు మౌనంగా వుండిపోయారు... కొద్దిసేపు ఎవరి పనులు వాళ్ళు చేసు కున్నట్లు నటించారు...

'' ఇంతకీ... మోహనజీ ఢిల్లీ ఎప్పుడొస్తున్నారు? ముగ్గరూ అడిగారు.

'' ఈ పాటికి ఢిల్లీలో అడుగుపెట్టి వుండాలి'' ఖాసి చెప్పాడు.

⁂

ఢిల్లీ రైల్వే స్టేషన్...

హైదరాబాద్ నుంచి వచ్చిన రైలు ఢిల్లీస్టేషన్‌లో ఆగింది. దిక్కులు చూస్తూ దిగింది ఆ అమ్మాయి. కొంగును భుజాల మీదుగా కప్పుకుంది... మొహమంతా చెమట పట్టి వుంది. చేతిలో ఏమీ లేదు... భయం భయంగా చూస్తుంది.

''ముగ్ధా...''

ఆ పిలుపు వినగానే తలతిప్పి చూసింది... తన వెనుకే కార్తికేయ... కొద్ది క్షణాలు అలానే చూస్తోండిపోయింది.

తన వైపు పిచ్చి చూపులు చూస్తోన్న ముగ్ధను చూసి షాకయ్యాడు. ''ముగ్ధా ఆర్యూ ఆల్ రైట్...'' ముగ్ధ భుజాలు పట్టుకుని అడిగాడు. వెంటనే కార్తికేయను చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్చేసింది. అది రైల్వే స్టేషన్ అన్న విషయం కూడావిస్మరించింది.

కార్తికేయ ఆమె వేదనను ఆపే ప్రయత్నం చేయలేదు. ముగ్ధ తప్పించుకోవడం.. హైద రాబాద్‌నుంచి ఫోన్ చేయడం... తను ఢిల్లీ వస్తున్నానని చెప్పడం... అన్నీ గుర్తొచ్చాయి.

''మనింటికి వెళ్దాం పద...'' ఆమె భుజాల చుట్టూ చేయి వేసి నడిపించుకుంటూ కారు దగ్గరికి తీసుకువచ్చాడు.

⁂

సోఫాలో కూచున్నాడు కార్తికేయ... నేల మీద కూచోని తలను కార్తికేయ ఒడిలో పెట్టి అలానే ఉండిపోయాడు.

కార్తికేయ ముగ్ధ తల మీద చేయి వేసాడు.

''నాకు నాకెంత భయమేసిందో తెలుసా... మిమ్మల్ని చూడకుండానే చచ్చిపోతానేమో

అనిపించింది'' గట్టిగా పట్టేసుకుంది కార్తికేయను.

అనునయంగా ఆమె తల మీద చేయి వేసి ''నేనున్నానుగా'' అన్నాడు. ఆ చేతిని అలానే చేతిలోకి తీసుకుని పెదవులకు ఆన్చుకుంది ముగ్ధ.

''నాన్నగారు ఎలా వున్నారో? అక్కడికి వెళ్ళాలంటేనే భయమేస్తోంది'' ముగ్ధ అంది.

''నాన్న గారిని మీ తమ్ముడిని మీ ఫ్రెండ్ పూర్ణిమ చూసుకుంటుంది. నువ్వేమీ కంగారు పడకు'' అన్నాడు కార్తికేయ.

'' ఇది ఇదంతా ఏమిటి? నా మీద ఎవరి పగ? అసలు నేనేం చేసాను?

'' ఇది యుద్ధం ముగ్ధా... ఈ యుద్ధంలో నిన్నో అస్త్రంగా వాడుకోవాలని చూసారు... నువ్వేమీ భయపడకు... మీ ఫ్రెండ్ దగ్గరికి వెళ్తావా?

''ఫ్రెండ్... ఎవరు?

''మీ ఢిల్లీ ఫ్రెండ్... నువ్వు... నేను ఈ రోజు ఇలా కలవడానికి కారణమైన ఫ్రెండ్... అప్పుడే మర్చిపోయావా? కార్తికేయ నవ్వుతూ అడిగాడు.

''లేదు... ఇప్పుడు నాకు ఎవరినీ కలవాలని లేదు...'' అతని ఒడిలో తలపెట్టి కళ్ళు మూసుకుంది.

⁂

కార్తికేయ ముగ్ధ ఇంటికి ఫోన్ చేసాడు... తండ్రితో, తమ్ముడితో, పూర్ణిమతో మాట్లాడింది.

''ముగ్ధా నువ్వు కార్తికేయ గారి దగ్గరే వుండు... సమస్యలు సాల్వ్ అయ్యాక వద్దువు కానీ... నాన్నగారి గురించి కంగారుపడకు...నేను చూసుకుంటాను''

''నీకు నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడంలేదు'' ముగ్ధ అంది.

'' ఏయ్... మన మధ్య కృతజ్ఞతలు ఏమిటి? నీకేనా నాకు నాన్న కారా? పూర్ణిమ అంది.

⁂

శ్రీనివాస్ దగ్గరి నుంచి కార్తికేయకు ఫోన్ వచ్చింది.

''కార్తికేయగారు... మోహన హైదరాబాద్‌లో లేదు... జర్దార్‌కూడా కనిపించడం లేదు... బహుశా ఢిల్లీకి మకాం మార్చారని డౌట్...'' ముగ్ధ తప్పించుకుని ఢిల్లీ వచ్చిన విషయం తెలిసాక చెప్పాడు శ్రీనివాస్.

⁂

# 52.

ప్రపంచాన్ని పాదాకాంతం చేసుకోవాలని పరితపించిన వాళ్ళు సమాధుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

రాజ్యకాంక్షతలో విర్రవీగిన నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు. రక్తపాతాన్ని సృష్టించిన ముష్కరులు మట్టిలో కలిసిపోయారు... ఆరడుగుల నేలలో... చరిత్రహీనులుగా మిగిలిపోయారు.

ఒక విధ్వంసం రచనకు పథక రచన మొదలైంది. ఇది సూర్యోదయంతో మొదలై సూర్యాస్తమయంతో ముగిసే ధర్మయుద్ధం కాదు... రాక్షస యుద్ధం... అసురనీతి.

ఇక్కడ వికృత క్రీడగా మారింది.

కార్తికేయ...

ఈ యుద్ధంలో ఒకడే ఒక్కడు... వన్‌మేన్ ఆర్మీ... అతడే కృష్ణుడు... అతడే అర్జునుడు.. భీష్మ, ద్రోణాది వీరులూ అతనే...

అతని చేతిలోని మహాయాస్త్రం ప్రళయకాళ ఘోషతో... శంఖం పూరిస్తుంది.

⁘⁘

వాణిజ్య నగరం... బాలీవుడ్ బాద్‌షాల చిరునామా... డబ్బావాలాల జీవితాల నుంచి మురికివాడల బ్రతుకుల నుంచి నేర ప్రపంచ మాఫియా మహా సామ్రాజ్యాల నుంచి... బిజినెస్ దిగ్గజాల నుంచి... ఎందరెందరికో చిరునామాగా మారిన ముంబై నగరం...

అక్కడ సినిమా షూటింగ్... సహజత్వానికి వ్యాపార రంగులు అద్దుతూ పెద్ద హీరో నటించే సినిమాకు క్లయిమాక్స్ సన్నివేశం.

లక్షకు పైగా జనం... వాళ్ళంతా జూనియర్ ఆర్టిస్టులు కాదు... కూలి జనం. సినిమాలో ఏ మూలో కనిపించాలని ఆశపడే జనం...

సినిమాలో కీలకమైన సన్నివేశం. హీరోను కోర్ట్‌కు తీసుకురావడం... జనం హీరో కోసం అక్కడికి రావడం... విలన్ బాంబులతో ఆ జనాన్ని చంపడం... హీరో తిరగబడడం... నాలుగు వైపులా నాలుగు కెమెరాలు... స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగం రెడీగా వుంది.

హీరో వచ్చాడు... అతడిని కోర్ట్ లోపలికి తీసుకువెళ్తున్నారు. విలన్‌లు బాంబులు పెడుతున్నారు. ఈ విలన్‌లు మేకప్‌లో లేరు... సహజంగానే వున్నారు... విలన్‌వేషాలు వేసే ఆర్టిస్టులు ఓ మూలాన స్పృహతప్పి పడివున్నారు.

యాక్షన్...

బాంబులు పేలాయి... పెద్ద శబ్దం... శరీరాలోని భాగాలు గాల్లోకి ఎగిరాయి. మాంసపు ముద్దలు రక్తం ఒడ్డుతున్నాయి. హాహాకారాలు... షూటింగ్ చూడడానికి వచ్చిన జనం ఎంత బాగా వచ్చిందో షాట్ అనుకునేలోగా విషయం అర్థమైంది. ఆ షూటింగ్ స్పాట్‌కు కూతవేటు దూరంలో నిజం కోర్టు వుంది. అక్కడ బాంబుల దాడి కేసుల్లోని నిందితుల విచారణ జరుగుతుంది. మరో మార్గంలో తెచ్చుకున్న పర్మిషన్...

డైరెక్టర్ షాకయ్యాడు... హీరో స్థాణువు అయ్యాడు... ఇది రీల్‌లైఫ్ కాదు... రియల్ లైఫ్... రిస్క్ చేసి వాళ్ళను కాపాడలేదు... ఈలోగా మరో బాంబ్ పేలితే...? బ్రేకింగ్‌న్యూస్... షాకింగ్‌న్యూస్... శాడ్‌న్యూస్...

⁂

ప్రధాని హుటాహుటిన ముంబై బయలుదేరాడు. ప్రత్యేక విమానం ప్రధాని నివాసం నుంచి టేకాఫ్ తీసుకునే లోపు ఢిల్లీ విమానాశ్రయం సమీపంలో ఓ బాంబ్ పేలుడు జరిగింది. మరో ముప్పై క్షణాల వ్యవధిలో ప్రధానికి వచ్చిన అత్యవసర సందేశం... బెంగుళూర్‌లో బాంబ్ పేలుడు...

భద్రతా కారణాల దృష్ట్యా ప్రధాని పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది.

⁂

కార్తికేయ కిందికి వంగి షూ లేస్ బిగించాడు. హోల్‌స్టర్‌లో రివాల్వర్ పెట్టుకున్నాడు.

కిచెన్‌లో కాఫీ కలుపుతోంది ముగ్ధ. రెండు కప్పుల్లోకి వంపి తీసుకువచ్చింది. ఒక కప్పు కార్తికేయకు ఇచ్చి మరో కప్పు తను తీసుకుంది ఎక్కడికి వెళ్తున్నారు? అడిగింది ముగ్ధ.

''హైదరాబాద్...''చెప్పాడు కార్తికేయ.

''హైదరాబాద్? నన్ను ఒంటరిగా వదిలి... దిగులుగా అంది ముగ్ధ.

''రాత్రిలోగా వస్తాను...'' పోనీ మీ ఫ్రెండ్‌ని రమ్మని చెప్పనా? అడిగాడు కార్తికేయ.

''వద్దొద్దు... మీరు లేదా మీ జ్ఞాపకాలు... ఎనఫ్'' అంది ముగ్ధ.

'' ఒకే.. అని ఆగి తన హోల్‌స్టర్‌లో వున్న రివాల్వర్ ముగ్ధ చేతికి ఇచ్చాడు....

భయంగా చేతిని వెనక్కి లాక్కుంది.

''భయపడకు... ఏ క్షణమైనా ఆ మోహన నిన్ను టార్గెట్ చేయవచ్చు... జర్దార్ నీ మీద ఎటాక్ చేయవచ్చు... ఇది కేవలం ఆత్మరక్షణకోసమే...

''నాకు రివాల్వర్ పట్టుకోవడమే రాదు... ఎలా నన్ను నేను రక్షించుకోగలను?

''సింపుల్... నీ దగ్గరికి రాగానే పాయింట్‌బ్లాక్ రేంజ్లో ఇలా ట్రిగ్గర్ నొక్కు...'' ఎలా ట్రిగ్గర్ నొక్కాలో చూపించాడు.

'' ఇవేమీ వద్దు... తలుపులు లాక్ చేసుకుని వుండిపోతాను...'' చెప్పింది ముగ్ధ.

''మరేం పర్లేదు...'' అని ఆమె చేతిలో రివాల్వర్ పెట్టాడు.

ట్రావెల్ ఆఫీసుకు ఫోన్ చేసి హైదరాబాద్ ఫ్లయిట్ టికెట్ కన్ఫర్మేషన్ అడిగాడు.

⁂

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి ముంబై వెళ్ళే ఫ్లయిట్ ఎక్కాడు కార్తికేయ.

ముంబై...

సినిమా హీరో, నిర్మాత, దర్శకుడు... కార్తికేయ... నలుగురు వున్నారు.

అప్పటికే విచారణ మొదలైంది. ముంబై పోలీసులు రంగంలోకి దిగారు. కార్తికేయ హీరో వైపు తిరిగాడు. ''సర్ మీరంటే నాకూ అభిమానమే... మీ లక్షలాది అభిమానుల్లో నేనూ ఒకడిని...కానీ బాంబ్ బ్లాస్ట్‌లో చనిపోయిన వారిని కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు.

ఎంత మంది చనిపోయారో లెక్కించడానికి మనుష్యుల శవాలులేవు... విడి భాగాలే

వున్నాయి. వేల చేతులు... వందల మొండాలు... కాళ్ళు...

"హీరో తల దించుకున్నాడు... నిజాయితీతో..."

క్షమించండి మిమ్మల్ని హర్ట్ చేయడం నా ఉద్దేశం కాదు... కానీ ఈ దాడిలో చనిపోయిన వారికి ఎవరు సమాధానం చెబుతారు?

సమాధానం ఎవరి దగ్గర లేదు.

" ఓకే... పరిశోధన చేయడానికి రాలేదు...మరో బాంబ్‌దాడి జరక్కుండా చూడడానికి వచ్చాను... ఈ క్లయిమాక్స్ నాలుగు కెమెరాలతో షూట్ చేసారుగా... ఆ ఫుటేజ్ నాకు కావాలి... వెంటనే..."

⁂

ప్రివ్యూ థియేటర్...

రష్ చెక్ చేస్తున్నారు... కెమెరా క్లోజ్ యాంగిల్లో బాంబులు పెడుతున్న ఆర్టిస్ట్ దగ్గర జూమ్ చేసారు...

ఆ ఆర్టిస్ట్‌కు దూరంలో ఒక కారు... కారు దగ్గర ఓ వ్యక్తి... క్లోజ్ చేసారు... ఆ వ్యక్తి జర్దార్... కారు మీద స్టిక్కర్... ఇంకా క్లోజ్ చేసారు... హోటల్ రెడ్‌వ్యూ... అన్న స్టిక్కర్...

⁂

# 53.

హోటల్ రెడ్ వ్యూ...

ఆరవ అంతస్థులో రూం నెంబర్ ఆరు వందల పదమూడు...

జర్దార్ లిఫ్ట్ ఉందన్న విషయం మర్చిపోయి... మెట్లమీదుగా పైకి వగరుస్తూ వచ్చాడు. ముంబై పోలీసులు అన్నా భయంలేదు... కానీ కార్తికేయ అంటే అతనికి ఒంట్లో చెమటలు పుడతాయి. మోహన మేడం మరీ మరీ చెప్పింది కార్తికేయ విషయంలో కేర్‌ఫుల్‌గా ఉండమని. ఇప్పుడు తనేం చేయాలి? మోహన మేడంకు ఫోన్ చేయడానికి వీల్లేదు... తను చేసే వరకు తనకు ఎవరూ ఫోన్ చేయకూడదని స్ట్రిక్ట్‌గా చెప్పింది. కార్తికేయ అసాధ్యుడు... అతను ఇక్కడికి వచ్చేలోగా తను తప్పించుకోవాలి.

⁂

కార్తికేయ హోటల్ రెడ్ వ్యూ దగ్గరికి వచ్చాడు... జర్దార్ తన అసలు పేరుతో రూం బుక్ చేయడని తెలుసు... సింగల్‌గా హోటల్‌లో దిగిన వారి వివరాలు సేకరించాడు. ఆ హోటల్‌లో సి సి కెమెరాలు అడుగడుగునా వున్నాయి. హోటల్ గదుల్లో మినహాయించి... ఆ విషయాన్ని కార్తికేయ నోటీసు చేసాడు.

హోటల్ చుట్టూ పరిశీలించాడు... జర్దార్ ఎటువైపు నుంచి పారిపోయే అవకాశాలు వున్నాయో చెక్ చేసాడు.

జర్దారీని పట్టుకోవాలంటే ఒకే ఒక మార్గం. హోటల్‌లో వున్నా పబ్లిక్ అడ్రెస్ సిస్టం దగ్గరికి వెళ్ళాడు. స్పెషల్ అనౌన్సుమెంట్ చేయించాడు. ముంబై బాంబ్ బ్లాస్ట్‌తో సంబంధం వున్న క్రిమినల్ మన హోటల్‌లోకి ప్రవేశించినట్టు నిఘావర్గాలు కనిపెట్టాయి. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం... దయచేసి ఎవరూ... మీ మీ గదుల్లోనుంచి బయటకు రావద్దు... పోలీసులు మీ దగ్గరికి వచ్చినప్పుడు సహకరించండి.''

హోటల్ మొత్తం మార్మోగింది. పుట్టలో వున్న పామును బయటకు రప్పించే ప్రయత్నం... ఖచ్చితంగా జర్దార్ పుట్టలో(గదిలో) నుంచి బయటకు రాక తప్పదు.

⁂

కార్తికేయ అనుమానం నిజమైంది. హోటల్‌లో వున్న జర్దార్ ఈ అనౌన్స్‌మెంట్ విన గానే ఖంగుతిన్నాడు. ఇప్పుడు కార్తికేయ ప్రతీ గది వెతుకుతాడు... తను దొరుకుతాడు... దాని కన్నా ముందే తను పారిపోవాలి. ముఖ్యమైనవి ఎయిర్‌బ్యాగ్‌లో సర్దుకున్నాడు. అత్యవసర సమయంలో మింగాల్సిన సైనేడ్‌పిల్‌తో సహా... రూంలో నుంచి బయటకు వచ్చాడు.

⁂

ఎంత తెలివైన నేరస్థుడైనా ఎక్కడో తప్పటడుగు వేస్తాడు. కార్తికేయ సి సి కెమెరాల వైపే చూస్తున్నాడు... చాలా స్క్రీన్స్ వున్నాయి... హోటల్‌కు వచ్చిన వాళ్ళు అనౌన్స్‌మెంట్ తర్వాత బయటకు రాలేదు... అలా వచ్చిన వ్యక్తి జర్దార్ మాత్రమే... ఆరవ అంతస్తులో నుంచి తన గది వెనుకవైపు నుంచి పైపు ద్వారా కిందికి దిగుతున్నాడు.

అటువైపు వెళ్ళాలంటే దారి ఏది? అడిగాడు కార్తికేయ...

''కిచెన్ సెక్షన్‌కు వెళ్తుంది సర్...'' అంటూ తను కార్తికేయకు దారి చూపించాడు మేనే జర్.

''థాంక్యూ సర్... మా హోటల్ పరువు పోకుండా ఏ... మాత్రం గొడవ జరక్కుండా డీల్ చేసారు'' మేనేజర్ అన్నాడు.

'' ఇట్స్ ఓకే... కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి... హోటల్‌లో దిగేవారి పట్ల చాలా జాగ్రత్తగా వుండండి. ఏ మాత్రం అనుమానం కలిగినా వాచ్ చేయండి'' చెప్పాడు కార్తి కేయ.

''తప్పకుండా సర్'' అని కిచెన్ సెక్షన్ దగ్గర ఆగి... దీని వెనుక వైపుకు ఆ పైపు వుంది సర్...చెప్పాడు.

'' ఓకే మీరు వెళ్ళండి... మీ హోటల్లోని కస్టమర్స్‌కు మీరు కలిగించిన స్వల్ప అసౌక ర్యానికి సారీ డ్రింక్స్ అందజేయండి. నేరస్తుడు దొరికాడు'' అని చెప్పండి. అంటూ వెనుక వైపుకు నడిచాడు.

⁂

జర్దార్ జాగ్రత్తగా దిగాడు. చేతులు మంట పుడుతన్నాయి. ఎయిర్ బాగ్‌ని భుజం

నుంచి మార్చుకున్నాడు. చుట్టూ చూసి ఊపిరి పీల్చుకుని ఒకడుగు ముందుకు వేసాడు...

''హలో ఫ్రెండ్ హౌ ఆర్యూ''

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు జర్దార్... ఎదురుగా యమపాశానికి బదులు రివాల్వర్ పెట్టుకున్న యమధర్మరాజులా కార్తికేయ...

''అదేంటి ఫ్రెండ్, లిఫ్ట్ వుంది... మెట్లు వున్నాయి... ఇంత కష్టపడి పైపు ద్వారా పాక్కుంటూ... మరీ సినిమాలు ఎక్కువగా చూడొద్దు... ఓకే... మనమలా నడుచుకుంటూ మాట్లాడుకుందామా? రివాల్వర్ని జర్దార్ కణతకు గురిపెట్టి అన్నాడు.

జర్దార్ ఊపిరి బిగపట్టాడు... అయిపోయింది. తను ఏదైతే జరగకూడదని అనుకున్నాడో... అదే జరిగింది.

అతని చేయి సైనేడ్‌పిల్ కోసం వెతుకుతుంది.

'' ఆగాగు ఫ్రెండ్ సైనేడ్‌పిల్ అవసరం నీకు రాదు...''అంటూ అతని మెడలో వున్న దారంలాంటిదాన్ని లాగాడు... దానికి సైనేడ్‌పిల్ వుంది.

హోటల్ రిసెప్షన్‌కు ఫోన్ చేసాడు. ''రూం నంబర్ ఆరువందల పదమూడు చెకవుట్ టైం ఎప్పుడు ? అని అడిగాడు.

'' ఇంకా వన్ అవర్ టైం వుంది సర్... గ్రేస్ కూడా వుంటుంది...'' కార్తికేయ గొంతు గుర్తుపట్టి చెప్పాడు.

''వెరీగుడ్... తినడానికి ఏమైనా స్నాక్స్ పంపించండి... ఈ రూంలోని కస్టమర్ ఏం తింటాడో రూం సర్వీస్‌కు బాగా తెలుసు... నాకు మాత్రం ఒక వేడి వేడి ఫిల్టర్ కాఫీ... ఆ బిల్ నాకు సెపరేట్‌గా పంపించండి'' అని ఫోన్ పెట్టేసాడు.

⁘⁘

రూం నంబర్ ఆరువందల పదమూడు...

''భూమి గుండ్రంగా వుంటుంది జర్దార్... మళ్ళీ నీ గదిలోకి వచ్చావు... సరే... ఇప్పుడు చెప్పు... ఇంకా ఎక్కడెక్కడ బాంబులు పెడుతున్నారు?

''బాంబులా? బాంబులేమిటి?? రెక్‌లెస్‌గా అన్నాడు... జర్దార్.

కార్తికేయ లేచాడు... కుర్చీకీ తాళ్ళతో కట్టేశాడు కార్తికేయ...

టీవీ దగ్గరికి వచ్చాడు... అక్కడ డి వి డి ప్లేయర్ వుంది. తన చేతిలో వున్న డి వి డిని ఆ ప్లేయర్‌లో పెట్టాడు...

''జర్దార్ ఇందాక బాంబ్ బ్లాస్ట్ కేసులో సినిమా డైరెక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు అతనో డి వి డి ఇచ్చాడు. మాంచి సినిమా అని చెప్పాడు... సెంటిమెంట్ సినిమా... టైం పాస్ కోసం తీసుకువచ్చాను'' జర్దార్ కు ఏదో అనుమాం...

⁘⁘

స్క్రీన్ మీద దృశ్యం మొదలైంది. ఏడేళ్ళ పిల్లడు. పోలియోతో వున్నాడు... ఆ పిల్లాడి

వెనుక గోడకు తగిలించిన ఫోటోలో తండ్రికొడుకుల ఫోటో... తండ్రి స్థానంలో జర్దార్...

''జర్దార్ సెంటిమెంట్ లేని మనిషి, మెదడులేని రోబో ఒక్కటే... నీకు ఏడేళ్ళ క్రితం పెళ్లయింది. నీ భార్యను అనుమానంతో చంపేసావు... నీకో కొడుకు... వాడంటే ప్రాణం... కాశ్మీర్‌లో వుంచి చదివిస్తున్నావ్... నువ్వు చేసిన పాపాలకు వాడికి శిక్ష పడింది. పోలియోతో బాధపడుతున్నాడు. మరోరెండు రోజుల్లో వాడికి ఆపరేషన్... నాకూ నీలా కొన్ని సార్లు సెంటిమెంట్స్ వుండవు... నువ్వు ఎక్కడైతే బాంబులు పెడతావో ఆ ప్లేస్‌లో నీ బిడ్డను వదిలేస్తాను. సింపుల్''.

''వద్దు... నా బిడ్డు చంపొద్దు... మీకేం కావాలో అడగండి'' జర్దార్ భయంతో వణికి పోయాడు.

''గుడ్... బాంబులు ఎక్కడెక్కడ పెట్టారు? మీ స్కెచ్ ఏమిటి?

జర్దార్ చెప్పడం మొదలుపెట్టాడు... నిముషాలు గడుస్తున్నాయి. అతను చెబుతోన్న విషయాలు వింటూ వుంటే తల తిరిగిపోతుంది.

''చివరి ప్రశ్న... ముగ్ధను ఎక్కడ బంధించారు?

# 54.

ఊహించని ఆ ప్రశ్నకు జర్దార్ షాక్ తిన్నాడు. కార్తికేయ దగ్గర దబాయించి లాభం లేదని తెలుసు...

''నిజంగా నాకు తెలియదు'' జర్దార్ అన్నాడు.

''పోనీ ఖాసీం ఎక్కడున్నాడు? కార్తికేయ అడిగాడు.

''హైదరాబాద్ వెళ్ళిపోగానే అతనితో నాకున్న కాంటాక్ట్స్ తెగిపోయాయి.''

''నీ బిడ్డను ఏం చేయాలని అనుకుంటున్నావ్? సూటిగా అడిగాడు కార్తికేయ.

ఆ ప్రశ్న జర్దార్‌కుసరిగ్గా అర్థం కాలేదు.

''అంటే... లాయర్, పోలస్, డాక్టర్, కలెక్టర్... పోనీ నీలా ఓ దేశద్రోహి...''

''వద్దొద్దు... నా బిడ్డ ఈ తుపాకుల మధ్య బ్రతకకూడదు.'' వెంటనే అన్నాడు.

''మీ అమ్మ, నాన్న కూడా నీలాగే కోరుకుని నిన్ను పెంచి వుంటారు...''

తల దించుకున్నాడు జర్దార్... నిమిషానికి సగటున ఇద్దరు ఉగ్రవాదులు... గంటకో మారణహోమం సృష్టించే దేశద్రోహులు... వందేళ్ళు కూడా బ్రతకలేని ఆయుషులో నిరంతరం తుపాకీమోతల మధ్య ఉగ్రవాదం, మతోన్మాదం, తీవ్రవాదం, దేశద్రోహం... వీటి సహవాసంతో భయంతో బ్రతుకుతూ, భయంలోనే చచ్చే బ్రతుకు...

''నీకు మాట ఇస్తున్నాను జర్దార్... నీ బిడ్డను దేశానికి పనికి వచ్చే సిపాయిగా నేను పెంచుతాను... నా బిడ్డగా చూసుకుంటాను... నీ ఆత్మ సంతోషించేలా... కానీ ఫ్రెండ్ నిన్ను మాత్రం చంపకుండా వదిలిపెట్టలేను... నా ముగ్ధను కిడ్నాప్ చేసినా క్షమించాను... కానీ

ఎందరో అమాయకుల ప్రాణాల తీసావు... కేవలం నీ ఒక్కగానొక్క బిడ్డమీద మమకారంతో నిజం చెప్పావు... యుద్ధంలో కనికరం వుండకూడదు... రాచపుండు సోకిన శరీరాన్ని నరికి వేయక తప్పలేదు...''

జర్దార్‌లో ప్రాణభయం పోయింది. కన్నీళ్ళు అతని బుగ్గలను తడిపేస్తున్నాయి. కార్తి కేయ ఎప్పుడైతే...

''నీ బిడ్డను దేశానికి పనికివచ్చే సిపాయిగా నేను పెంచుతాను... నా బిడ్డగా చూసు కుంటాను... అన్నాడో....

అప్పుడే చచ్చిపోయాడు.

''అల్లా... నా తప్పులకు ప్రాయశ్చిత్తం లేదు... నామరణం ఈ ప్రపంచానికి ఒక హెచ్చ రిక కావాలి... ఒక దేవుడి దగ్గర నా బిడ్డ పెరిగే అవకాశం ఇచ్చిన నీకు కృతజ్ఞతలు...''

కళ్ళు మూసుకున్నాడు... కార్తికేయ వైపు తిరిగి అతని ముందు మోకాళ్ళ మీద కూచోని ''మిత్రమా... నీ పని కానివ్వు...సంకోచించకు... కానీ ఒక్క మాట... నీ తండ్రిని చంపే సాను అని నా బిడ్డకు చెప్పకు...''

కార్తికేయ జర్దార్ భుజం పట్టుకుని లేపాడు...

'' ఒక మనిషి... ఒకసారి చనిపోయిన మనిషిని మరోసారి చంపలే... నీ బిడ్డని అనా థని చేయను. ఇప్పుడు నిన్ను నమ్ముతున్నాను... ప్రభుత్వం దృష్టిలో, ఉగ్రవాదుల దృష్టిలో, లెక్కల్లో చచ్చిపోయావు... నీ బిడ్డ దగ్గరికి వెళ్ళు...''

జర్దార్ కార్తికేయ పాదాల మీద పడ్డాడు... అతడిని లేపి హత్తుకున్నాడు...

''దోస్త్... నేను అల్లా సాక్షిగా నీకు మాట ఇస్తున్నాను... ఈ శరీరం నీది... నీకోసమే ఈ శరీరాన్ని కాపాడుకుంటాను... నీ కోసమే ఈ ప్రాణాన్ని అంకితం చేస్తాను. అవసరమైతే బలి చేస్తాను'' ఆ గదిలోకి అడుగు పెట్టిన మేనేజర్ ఆ దృశ్యం చూసి అలానే ఉండిపోయాడు.

జర్దార్ ఒక్కో నిజం మనస్ఫూర్తిగా కార్తికేయకు చెబుతున్నాడు...

జర్దార్ అక్కడి నుండి వెళ్లిపోయాడు... వెళ్లే ముందు కార్తికేయ ముందే తన ఫోన్ తీసి ముక్కలు చేసాడు... తన దగ్గర వున్న బ్యాంకు అకౌంట్స్ వివరాలు అందజేశాడు... ఆయు ధాలు సరెండర్ చేసాడు. ఆ తర్వాత జర్దార్ ఎక్కడికి వెళ్ళాడో ఎవరికీ తెలియదు... కానీ జర్దార్ చనిపోయిన విషయం అతని డెడ్‌బాడీ గుర్తు పట్టడానికి వీల్లేకుండావున్న సంగతి... ఖాసింకి తెలిసిపోయింది. తెలిసిపోయేలా చేసాడు కార్తికేయ... మార్చురీలో అనాథ శవాలకు కొదువ లేదు... ఒక మంచి పనికోసం జర్దార్‌కు ప్రమాదం లేకుండా వుండడంకోసం కార్తికేయ వేసిన ప్లాన్.

ముగ్ధ తలుపులన్నీ వేసి తన గదిలోకి వచ్చింది. చీర అడుగున వున్న ఫాల్‌ని చేతిలోకి తీసుకుంది. ఆ ఫాల్‌లో సిమ్ ఉంది. దాన్ని తన సెల్‌లో పెట్టింది. ఓ నంబర్ డయల్ చేసింది.

అది జర్దార్ నంబర్... ఎంత చేసినా నో రెస్పాన్స్... వెంటనే మరో నంబర్‌కి డయల్

చేసింది... అవతలి నుంచి ఓ గొంతు వినిపించింది.

''చెప్పండి మోహన జీ...''

'' ఆ జర్దార్‌కి ఏమైంది... రింగ్ అవుతోంది కానీ లిఫ్ట్ చేయడంలేదు...''

''సారీ... మేమ్... జర్దార్‌ని కార్తికేయ చంపేసాడు... ఇప్పుడే న్యూస్ తెలిసింది. డెడ్ బాడీ ముంబై జనరల్ హాస్పిటల్ మార్చురీలో వుంది. హాస్పిటల్ చుట్టూ మఫ్టీలో పోలీసులు వున్నారు. అతని డెడ్‌బాడీని మనం తీసుకురావడం కష్టం.''

''షిట్... అయినా ఇప్పుడు చనిపోయినవాడి డెడ్‌బాడీతో మనకు పని ఏమిటి? టైం వేస్ట్... కాకపోతే జర్దార్ మన రహస్యాలు చెప్పి చచ్చాడా? చెప్పక చిత్రహింసలతో చచ్చాడా? అన్నది పాయింట్... ఎందుకైనా మంచిది... నేను చెప్పినట్టు చేయండి... అంటూ ఏం చేయాలో చెప్పసాగింది. అప్పుడే ఎవరో ఆ ఇంట్లోకి వచ్చిన అలికిడి.

సెల్ ఆఫ్ చేసి... తన ఒంటి మీద వున్న చీర విప్పేసింది... క్షణాల్లో జీన్స్‌లోకి మారింది. అప్పుడే ఆమె గది తలుపులు తెరుచుకున్నాయి. ఇద్దరు అపరిచిత వ్యక్తులు లోపలికి వచ్చారు. వాళ్ళ చేతుల్లో... ఆయుధాలు... కన్ను మూసి తెరిచేలోగా టేబుల్ దగ్గరికి వెళ్ళి టేబుల్‌మీద వున్న రివాల్వర్‌ని అందుకుని వాళ్ళవైపు గురిపెట్టింది. ట్రిగ్గర్ నొక్కింది... ముగ్ధ... స్థానంలో వున్న మోహన.

⁂

# 55.

అపరిచితులు ఆమెకేసి చూసారు. రివాల్వర్‌లో బుల్లెట్స్ లేవన్న విషయం వెంటనే అర్థమైంది. అంతే వేగంగా స్పందించి కుడికాలిని గాల్లోకి లేపింది... క్షణం ఆలస్యమైతే ఆ ఇద్దరిలో ఒకడి తల పగిలేదే... కానీ కార్తికేయ మెరుపువేగంతో ఆ ఇద్దరినీ వెనక్కి లాగాడు. మోహన తనను తానూ బ్యాలెన్స్ చేసుకుంది. కార్తికేయ ఆ యిద్దరిని వెళ్ళమన్నట్టు సైగ చేసాడు. వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు. కార్తికేయ సోఫాలో కూచున్నాడు. మోహనవైపు చూసాడు. మోహన ఎదురుగా వున్న కుర్చీలో కూచుంది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం...

చాలా విచిత్రమైన పరిస్థితి... తను ఎవరినైతే తన ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాడో... ఆ వ్యక్తి రూపం... కళ్ళ ఎదురుగా వుంది... కానీ ఆ వ్యక్తి తను ప్రేమించే మనిషి కాదు.

తను ఎవరినైతే పట్టుకోవాలని ట్రై చేస్తున్నాడో. ఏ వ్యక్తికోసం ఇంటర్‌పోల్ సైతం అన్వేషిస్తుందో... ఆ వ్యక్తి తన కళ్ళ ఎదురుగా వుంది... కానీ ఆ రూపం ఆ వ్యక్తిది కాదు, నమ్మశక్యంగా లేదు.

''మిమ్మల్ని కలుసుకోవడం చాలా హ్యాపీగా వుంది'' నవ్వి అంది మోహన.

ఒక్క క్షణం మోహనకేసి చూసాడు కార్తికేయ... మోహన ఫోటోని చూసాడు...

ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు. కానీ మోహన రూపాన్ని కాదు. మోహన ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

''చెప్పండి కార్తికేయ...'' ఏ మాత్రం జంకులేకుండా అంది.

''మీరు లొంగిపోవాలి...'' అన్నాడు కార్తికేయ.

చిత్రంగా చూసింది...

ముగ్ధను ప్రాణంగా ప్రేమించే కార్తికేయ... ముగ్ధ గురించి అడగకుండా... తనను లొంగిపొమ్మని అడగడం...

''నేను లొంగిపోవడం కావాలా? ముగ్ధ ప్రాణాలతో కావాలా?

''మీరు లొంగిపోవడమే కావాలి? నా ముగ్ధను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు...''

నవ్వింది మోహన... ''నేను లొంగిపోతే...? నాకు పునరావాసం కలిగిస్తారా? నా తల మీద వున్న క్యాష్ రివార్డ్ నాకిస్తారా? నన్ను జనజీవన స్రవంతిలో కలిపేస్తారా? ఇప్పటి వరకూ... మీ ప్రభుత్వాలు చేస్తున్న పనులు ఇవేగా?

కార్తికేయ మాట్లాడలేదు...

''పూలాన్ దేవి అయినా, నక్సల్స్ అయినా, బందిపోట్లు అయినా... ఎవరైనా లొంగి పోతే మీ ప్రభుత్వం గుర్తించి ఇచ్చే బంపర్ ఆఫర్''

చళ్ళున చర్నాకోలతో కొట్టిన ఫీలింగ్ కలిగింది కార్తికేయకు...

మోహన విమర్శిస్తున్నట్టుగా లేదు... వ్యవస్థలోని లోపాన్ని ఎత్తి చూపుతున్నట్టుగా వుంది.

''బంపర్ ఆఫర్...'' ఈ పదం అతడిని హంట్ చేస్తోంది.

''నేను మాట్లాడింది తప్పంటారా కార్తికేయ...

''కిడ్నాపర్ డిమాండ్ చేస్తే కష్టపడి పట్టుకున్న తీవ్రవాదులను విడుదలచేస్తారు. లొంగిపోతే పునరావాసం... నేను రాజకీయ నీతిశాస్త్రం చదువుకోలేదు... క్రిమినాలజీలో నాకే మాస్టర్ డిగ్రీలు లేవు... భారత్ శిక్షాస్మృతి గురించి... ఎవిడెన్స్ ఆక్ట్ గురించి... మీతో చర్చించ డానికి నాకు లా పట్టా లేదు... కానీ ఈ వ్యవస్థలో, చట్టంలో వున్న లోపాలు తెలిసిన క్రిమిన ల్ని...

ఒక సాధారణ దొంగ మీద ప్రయోగించే థర్డ్ డిగ్రీ... ఒక మాఫియా డాన్ మీద... రాజ కీయ నాయకుడి మీద... ఓ బిజినెస్ టైకూన్ మీద ప్రయోగించే బలమైన పోలీస్ వ్యవస్థ మనకు ఉందా?

వుంటే నాలాంటి క్రిమినల్స్ ఎందుకు పుట్టుకువస్తారు... ఆర్డర్లీ వ్యవస్త... పోలీసుల మీద పెత్తనం చలాయించే రాజకీయ వ్యవస్థ... ఇదీ మీరు బ్రతుకుతున్న భారతం... అందుకే ఈ దేశాన్ని రాచరికంవైపు... తీసుకువెళ్తాను... రూలర్‌ని అవుతాను... అప్పుడు మీలాంటి మేధావులు ఆకాశంలో వుంటారు''

కార్తికేయ మోహన మాట్లాడే ప్రతీ మాట విన్నాడు శ్రద్ధగా... రావణుడు ప్రతినాయకుడు అయినా ధర్మాధర్మాల పరమార్థం తెలిసినవాడు.

''గుడిలో వుంటే రాయి దేవుడవుతాడు... రోడ్డు పక్కన వుంటే రాయిగానే ఉంటాడు... దేవుడి గుడిలో దేవుడిగా మెట్టుగా, రోడ్డు పక్కన రాయిగా... అవి వుండే స్థానాలే వాటి గొప్పతనాన్ని సూచిస్తాయి. మీలాంటి మేథావి నిజాయితీగా రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థను మార్చవచ్చు... ఇండియన్ పోలీస్ సర్వీస్, అడ్మినిస్ట్రేషన్ సర్వీస్... ఇలా ఎలాగైనా అనుకున్న గమ్యం సాధించవచ్చు.

''అందుకని లొంగిపోయి.. బుద్ధిగా స్కూల్‌కి వెళ్లి చదువుకొమ్మంటారా? రాజకీయ పార్టీపెట్టి డబ్బులు వెదజల్లి ప్రభుత్వాలను కొనుక్కోమంటారా? అయినా ఇప్పుడు అన్ని దశలు దాటాను... ఏనుగును లొంగదీసుకోవాలని అనుకుంటే... అంకుశమే కావాలి... అంకుశమే విధ్వంసం... మీరు నా దారికి అడ్డు రాకపోయి వుంటే ఈ పాటికే ఈ దేశం మోహన దేశంగా మారి వుండేది'' మోహన అంది.

'' ఈ దేశాన్ని, ఈ దేశం పేరును మార్చడం తలరాతలు రాసే విధాత వాళ్ళ కూడా సాధ్యం కాదు. ఆ బ్రిటిష్ వాళ్ళే తోకముడిచి మన దేశాన్ని అప్పగించి వెళ్ళిపోయారు''.

''నిజమే... కానీ వాళ్ళు అప్పగించిన దేశాన్ని, మనం ఏం సాధించాం? ఎన్ని కొత్తరైలు మార్గాలు వేసాం? ఎంత అభివృద్ధి సాధించాం? నాయకుల పేర్లతో వీధులు, రాష్ట్రాల పేర్లు కూడా మారుస్తున్నాం.. వీధికో విగ్రహం... గాంధీ విగ్రహాలు ఎక్కువున్నాయా? రాజకీయ నాయకుల విగ్రహాలు ఎక్కువ ఉన్నాయా? ఈ దేశంలో మదర్ థెరిసా విగ్రహాలు ఎన్ని?

మొదటిసారి శత్రువు అయినా మోహనపట్ల ఒక గౌరవభావం కలుగుతోంది. రావణుడు ప్రత్యర్థి అయినా రాముడు. అతని సుగుణాలు కొనియాడాడు...ట. మోహన విశ్లేషణ నచ్చింది. ఇలాంటి వ్యక్తి దారి తప్పడమే బాధకలిగిస్తోంది.

''మిస్టర్ కార్తికేయ... మనం మన వాదనలను సమర్థించుకుంటాం... ఇక్కడ ఎవరు రైట్ అన్నది కాదు... ఎవరి కండీషన్ ఏమిటి?

''అంటే? కార్తికేయ అడిగాడు.

''వెరీ సింపుల్... నేను సృష్టించే విధ్వంసానికి మీరు అడ్డుపడకూడదు...''

''మీరు అనుకుంటున్నట్టు... మరో గంటలో ఎక్కడా ఏ విధ్వంసం జరగదు... చచ్చే ముందు జర్దార్‌తో చెప్పించిన నిజాలు... బాంబులను సముద్ర గర్భంలో కలిపేసాయి.

ఇప్పుడు మీకు వున్న ఒకే ఒక ఆప్షన్... లొంగిపోవడం లేదా... మోహన వైపు చూస్తూ ఆ మాట అనలేకపోయాడు... మోహన రూపంలో వున్న ముగ్ధను చూసి..

''కానీ మీకు నేను రెండు ఆప్షన్స్ ఇస్తున్నాను'' మోహన అంది.

# 56.

'' ఎదురుగా వున్నది మృత్యువు'' అని తెలిసి కూడా నిబ్బరంగా మాట్లాడే మోహన వంక చూసాడు. '' ఏమిటవి'' అన్నట్టు...

'' ఒకటి... నన్ను విడిచిపెట్టడం..

''నేను అతి ఆత్మవిశ్వాసంతో ఓ పొరపాటు చేసాను... పులి గుహలోకి అడుగు పెట్టాను... అది దుస్సాహసం అని ఇప్పుడు అనిపిస్తోంది. దానికి పెద్ద మూల్యమే చెల్లించుకున్నాను... ఇప్పుడు నేను జీరో నుంచి నా ప్రయత్నాలు మొదలుపెట్టాలి... మీ నుంచి తప్పించుకుపోవడం దాదాపు అసాధ్యమే... కానీ నన్ను మీరు విడిచిపెట్టక తప్పదు...''

''నా గురించి తెలిసేకా కూడా మోహనా, నేను మిమ్మల్ని విడిచిపెడతాను అనుకోవడం అత్యాశేమో...'' కార్తికేయ అన్నాడు.

''అవును... అందుకే రెండో ఆప్షన్ మీకు...''

''నాకా... ఏమిటది''

''న...న్ను...చం...ప..డం''

ఒక్కసారిగా కార్తికేయ ఒళ్ళు జలదరించింది...

''మృత్యువు నీ ఎదురుగా నిలబడ్డప్పుడు మృత్యువుతో కరచాలనం చేసి నీ ధైర్యాన్ని చూసి అబ్బురపడుతున్నాను... నీకు నువ్వుగా ''మృత్యువును ఆహ్వానిస్తూ... చిరునవ్వుతో నిలబడిన నిన్నుచూసి... గర్వపడుతున్నాను... కానీ నువ్వు చూపే ఈ తెగువ... ఓ అసుర కార్యం కోసమని తెలిసి... నిన్ను క్షమించలేకపోతున్నాను.''

''కార్తికేయగారూ... శత్రువు బలాన్ని తెలిసి కూడా తెగించి బరిలోకి దిగి మీ చేతిలో ఓడి చచ్చిపోయానన్న ఫీలింగ్ బ్రతికి వుండగానే నాకు కలుగ కూడదనుకుంటే... నా మరణాన్ని నా ఇష్ట ప్రకారమే పొందానన్న ఫీలింగ్ నాకు కలగాలి''

లా...జి...క్...

యుద్ధతంత్రంలో కనిపించని మెరుపువేగం తాలూకు మంత్రాంగం...?

కొనసాగించింది మోహన...

''కానీ కార్తికేయా... మీరు నన్ను చంపలేరు... యుద్ధంలో స్త్రీని చంపకూడదన్న నియమం ఉందిట... అయినా అలాంటి సానుభూతి మినహాయింపులు నా మరణానికి వర్తించకూడదు.

మీకు బందీగా దొరికాను... ఎలాంటి ప్రాసిక్యూషన్ లేకుండా చంపే పవర్ మీకు రాష్ట్రపతి ద్వారా సంక్రమించింది అన్న విషయం నాకు తెలుసు... అయినా నా తల మీద వున్నా లక్షలాది డాలర్స్ రివార్డ్ నన్ను చంపడానికి మీకు ''లైసెన్స్ టు కిల్'' పర్మిషన్ ఇచ్చినట్టే... అయినా... మీరు చంపలేరు...''

మోహన ఆగి ఒక్క క్షణం... ''మీకు ఇష్టమైన వేడి వేడి ఫిల్టర్ కాఫీ తీసుకురానా'' అని

ఆగి, మీకు ఒక విషయం తెలుసా కార్తికేయా... ముగ్ధ ఇష్టాలు తెలుసుకోవడానికి చాలా కష్ట పడ్డాను... మీకు ఇష్టమైనవి ముగ్త ఎలా తయారుచేస్తుందో నేర్చుకోవడానికి... మొదటిసారి ఆరు గంటలు కిచెన్‌లో వున్నాను... ముగ్ధలా మిమ్మల్ని నమ్మించడానికి మీకు నిజంగా దగ్గర అయ్యానేమో అనిపించింది. ముగ్ధది మంచి సెలక్షన్... మీరు నన్ను చంపుతారో... జైలులో పెడతారో... జీవిత ప్రస్థాన సీరియల్‌లో అప్పటి వరకూ చిన్న కమర్షియల్ బ్రేక్ యిద్దామా... మీతో కలిసి ముగ్ధగా కాఫీ తాగలని వుంది. భయపడకండి, పారిపోను...

చిన్నప్పుడు నాకు తెలియకుండా ప్రేమించిన మా అమ్మ మీదొట్టు...'' అని కిచెన్ వైపు వెళ్ళింది.

కార్తికేయ మనసు భారమైంది... నిన్నటి వరకూ ఒక కరుడుగట్టిన అంతర్జాతీయ నేర స్తురాలిని వెతుకుతూ నేను... ఈ రోజు తన కళ్ళముందే ఒక మామూలు ఆడపిల్లలా కాఫీ కల పడానికి కిచెన్‌లోకి వెళ్ళిన మోహన... ఇంటర్‌పోల్‌ని ముప్పు తిప్పలు పెట్టిన మోహన... మైండ్‌గేమ్‌తో ఎఫ్ బి ఐ ని మూడు చెరువుల నీళ్ళు తాగించిన మోహన... కేవలం కొన్ని వందల గ్రాముల బరువు మాత్రమే వుండే మెదడుతో... ఈ విశ్వాసాన్ని విధ్వంసం వైపు నడి పిస్తుంటే...?

మోహన వెళ్ళిన కిచెన్ వైపు చూసాడు... ఫిల్టర్ పెట్టినట్టుంది. పాలు మరిగిస్తోంది. ఒక డ్రామాకోసం పాత్రలో జీవించడం కోసం శ్రమ పడి నేర్చుకున్న విషయాలు... కిచెన్‌లో నుంచి తన బెడ్‌రూంలోకి వెళ్ళింది. డోర్స్ వేసుకుంది. అయిదు నిమిషాల తర్వాత చీర కట్టు కుని వచ్చింది. అచ్చు ముగ్ధే చీర కట్టుకున్నట్టే... మళ్ళీ కిచెన్‌లోకి వెళ్లి కాఫీ కలుపుకుని వచ్చింది... రెండు కప్పులతో...

ఓ కప్పు కార్తికేయకు ఇచ్చింది... మరో కప్పు తను తీసుకుంది. కార్తికేయ కాఫీ తాగు బోతూ ఆగి మోహన వైపు చూసాడు.

''కాఫీలో విషం ఏమైనా కలిపానని అనుమానమా?'' అని అతని చేతిలోని కాఫీ కప్పు తను తీసుకుంది. కార్తికేయ కాదు అన్నట్టు తల అడ్డంగా ఊపాడు. నేను ముగ్ధ రూపంలో వున్నాను... ముగ్ధ ప్రేమని కూడా పంచుతాను... విషం ఇచ్చి చంపను... ముగ్ధ అలా చేయదుగా...

ఆ ఒక్క మాటకు పొల మారింది... కన్నీటి పొర కంటే పొరకు అడ్డం పడింది.

''మీ ముగ్ధ తలుచుకుంటున్నట్టు వుంది'' అంది కాఫీని సిప్ చేస్తూ...

※※※

'' ఇప్పుడు మనం మళ్ళీ మాట్లాడుకుందాం... మీరు నన్ను వదిలివేయడం లేదా చంపడం దగ్గర ఆగిపోయాం... నన్నెటూ వదిలి వేయరు... పోనీ చంపగలరా? మీ ముగ్ధ రూపంలో వున్నా నన్ను... ఒకవేళ చంపితే... అని ఆగి... ముగ్ధను మోహనే అనుకుని ఇంటర్ పోల్ వెంటాడి చంపుతుంది... ఎందుకంటే... ముగ్ధ నా రూపంలో... అంటే మోహన రూపంలో వుంది.''

ఒక నిశ్శబ్ద విస్ఫోటనం... ఒక భయంకర స్వప్నం... ఒక భయానక దృశ్యం... ఒక్క సారి కళ్ళముందు... కదలాడిన అల్లకల్లోల పెనుతుపాన్...

ముగ్ధరూపంలో ముగ్ధ...

మోహన రూపంలో ముగ్ధ...

తను ఎవరిని చంపాలి?

తను ఏ రూపాన్ని చంపాలి??

# 57.

బెనిఫిట్ ఆఫ్ డౌట్... సంశయ లాభం...

చట్టంలో ఇది కొన్ని సందర్భాల్లో అతి శక్తివంతమైన ఆయుధం అవుతుంది. కళ్ళ ముందు కనిపించే తన ముగ్ధ రూపాన్ని చంపగలడా? మోహన రూపంలో వున్న ముగ్ధను పట్టుకోగలడా?

మోహన కార్తికేయ వైపు చూసి కొనసాగించింది ''ప్రతి మనిషికీ ఓ లక్ష్యం వుంటుంది... లక్ష్యం లేని మనిషి... శవంతో సమానం...

ఇరవై నాలుగంటల్లో బాడీ (శవం)లో మార్పులు... నలభై ఎనిమిది గంటల్లో వాసన... ఆ తర్వాత శరీరంలో పురుగులు... ఏ అవయవానికి ఆ అవయం ఊడిపోతుంది... లక్ష్యం లేని మనిషికూడా అలానే... ఆ లక్ష్యం ఏదైనా కావచ్చు... నేను నా వాదాన్ని సమర్థించుకుంటాను... మీరు మీ వాదాన్ని వినిపిస్తారు. కోర్ట్‌కు సాక్ష్యాలు కావాలి... మనసు కోర్ట్‌కు తన మనస్సాక్షి చాలు.

నా లక్ష్యం ఈ ప్రపంచాన్ని నా పాదాక్రాంతం చేసుకోవాలి... అవినీతి, స్వార్థం, అరాచకాలు లేని సామ్రాజ్యానికి నేనే రూలర్‌ని కావాలి... ఈ ప్రయత్నంలో ఎన్నో ఎదురుదెబ్బలు... అన్నింటినీ తట్టుకున్నాను... కానీ మిమ్మల్ని ఎదురించలేకపోయాను... నాకు తెలుసు ఏదో ఒకరోజు మృత్యువు కూడా మీ రూపంలోనే వస్తుంది అని తెలుసు. అలాంటి పరిస్థితిలో నన్ను నేను కాపాడుకోవాలంటే... మిమ్మల్ని నియంత్రించాలి.

నేను ముగ్ధను బంధించి మీ నుంచి తప్పించుకోవడం అసాధ్యం... అదే నేను ముగ్ధ రూపంలో వుంటే... ఒకటి మిమ్మల్ని తప్పుదారి పట్టించి... నా లక్ష్యం నెరవేర్చుకోవాలి... లేదా మీ నుంచి ఎస్కేప్ కావాలి... ముగ్ధరూపంలో వున్న నన్ను చంపలేరు... అలా చంపినా మరు క్షణం నా రూపంలో వున్నా ముగ్ధను ఇంటర్‌పోల్ వెంటాడుతుంది... ముగ్ధ మోహన కాదని మీరు నిరూపించేలోగా మీ ముగ్ధ మీకు దూరం అవుతుంది.

ముగ్ధను కిడ్నాప్ చేయించి నా స్థావరానికి రప్పించాను.

డాక్టర్ రాధారాణిని కిడ్నాప్ చేసాను... నేను ముగ్ధగా మారాను... ముగ్ధను మోహనగా మార్చించాను. నేను సేఫ్‌గా ఉన్నంత వరకు ముగ్ధ, డాక్టర్ రాధారాణి, విద్యారణ్య సేఫ్‌గా

వుంటారు''. మోహన ఆగి కార్తికేయ వంక చూసింది. కార్తికేయ తన మనసులోని ఫీలింగ్స్ బయటకు ప్రదర్శించలేదు.

⁂

మోహన కార్తికేయ వైపు చూసింది... అతనిలోని గాంభీర్యాన్ని చూస్తే ముచ్చటేసింది. శత్రువు తన ఎదురుగా వుంది. తను ప్రాణంగా ప్రేమించిన ప్రియురాలు బందీగా వుంది. అయినా చెరిగిపోని గుండె నిబ్బరం.

''చెప్పండి కార్తికేయ ఇప్పుడు నన్నేం చేస్తారు? చంపేస్తారా? నా నుంచి నిజం రాబట్టడానికి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? కార్తికేయ మోహనకు దగ్గరగా వచ్చాడు... ఆమె రెండు చేతులు పట్టుకున్నాడు. అతని కళ్ళలో సన్నటి కన్నీటి మెరుపు...

''మోహనా... నాకు ముగ్ధను చూడాలని వుంది. ఒక్కసారి చూపించవూ...''

ఒక్క క్షణం షాకింగ్‌గా అలానే ఉండిపోయింది మోహన. ఎంతో గుండె నిబ్బరం వున్న వ్యక్తీ...

దేవుడే వచ్చి భక్తురాలిని వరం అడిగితే?

''ప్లీజ్ మోహన... పోనీ తను క్షేమంగా వుందని నా మీద ఒట్టేసి చెప్పు...'' మోహన చేతిని తీసుకుని తన తలమీద పెట్టుకుని అడిగాడు.

ఆ చేతిని అతని తలమీది నుంచి తీయాలని అనిపించలేదు.

బండగా మారిన ఆమె గుండె హిమమై కరుగుతోంది... దుఖమై వర్షిస్తోంది.

వెంటనే బ్యాగ్‌లోని నుంచి ఐ ఫోన్ తీసింది.

ఆ క్షణం కార్తికేయ కోరిక తీర్చడం కోసం చచ్చిపోవాలని అనిపించింది మోహనకు...

నిజాయితీతో కూడిన ప్రేమకు ఇంత గొప్ప శక్తి ఉంటుందా? కార్తికేయను సోఫాలో కూచోబెట్టింది... తను అతని పక్కనే కూచింది.

ఐ ఫోన్ స్క్రీన్ మీద దృశ్యం మొదలైంది.

⁂

పాత ఢిల్లీ... పాడుబడిన విశాలమైన భవనం... ఒక గదిలో విద్యారణ్య సోఫాలో కూచొని మిమిక్రీకి సంబంధించిన పుస్తకం చదువుతున్నాడు. అతని ఎదురుగా డాక్టర్ రాధారాణి... టీపాయ్ మీద పళ్ళు... కూల్‌డ్రింక్స్... డైనింగ్ టేబుల్ మీద రకరకాల డిషెస్...

డాక్టర్ రాధారాణి విద్యారణ్య వైపు చూసి ''మనకి పనిష్మెంట్ ఇంకా ఎన్నాళ్ళు?

''బహుశా మనల్ని కిడ్నాప్ చేసిన మోహనకు కూడా తెలియదేమో... కానీ ఒక్క విషయంలో మనం మోహనను అభినందించాలి.. తాళ్ళతో కట్టేయకుండా, నోట్లో గుడ్డలు కుక్కి హింసించకుండా...'' నవ్వి అన్నాడు విద్యారణ్య.

''నిజమే... ఇక్కడ మనకు ఏ లోటూ రాకుండా చూసుకుంటుంది. ముగ్ధ పరిస్థితి తలుచుకుంటే... భయంగా వుంది. ఇక ముగ్ధను కాపాడవలసింది కార్తికేయ మాత్రమే...'' రాధా

రాణి అంది.

:::::

మెల్లి మెల్లిగా కళ్లు తెరుస్తోంది ముగ్ధ... చాలా రోజుల తర్వాత స్పృహలోకి వచ్చింది. ముగ్ధ లేవగానే ఆమెను అంటిపెట్టుకువున్న నర్స్‌లేచి మంచం దగ్గరి వచ్చింది. ముగ్ధను ఇరవై నాలుగు గంటలు కంటికి రెప్పలా చూసుకోవాలిసిన బాధ్యత ఆ నర్స్‌ది.

''నేను... నేను ఎక్కడున్నానా? ముగ్ధ గొంతు నీరసంగా వుంది... మెల్లిగా లేచి వాష్ బేస్ దగ్గరికి వచ్చింది... అద్దంలో తన మొహం చూసుకుని గట్టిగా అరిచింది. ఆ అరుపుకు హాల్లో వున్న విద్యారణ్య, డాక్టర్ రాధారాణి ఒక్క ఉదుటున లేచారు... ముగ్ధ గదిలోకి రాబో తుంటే... ముగ్ధ గది తలుపులు ఆటోమేటిగ్గా క్లోజ్ అయ్యాయి... అయ్యేలా చేసాడు యాహ్యా ఖాన్...

అతను తాగివున్నాడు... ఎర్రని ఆ కళ్ళలో పైశాచికమైన కోరిక కనబడుతుంది... తన మొహంలో వచ్చిన మార్పుకు సంబంధించిన షాక్‌లో నుంచి ఇంకా ముగ్ధ కోలుకోనేలేదు... మరో షాక్ యాహ్యాఖాన్ రూపంలో... ఆ దృశ్యం చూసిన మోహన షాకయింది. కార్తికేయ పిడికిళ్ళు బిగుసుకున్నాయి. మోహన హ్యాండ్‌బాగ్‌లో ఉన్న మరో ఫోన్ తీసింది. మోహన మొహం కోపం ఎర్రబడింది.

:::::

# 58.

కార్తికేయ మొహం అరుణ వర్ణందాల్చింది. ఏ క్షణమైనా పేలిపోయే అగ్నిపర్వతంలా వుంది. మోహన ఖాసిం నంబర్ కలిపింది. స్విచిడ్ ఆఫ్... అని వస్తోంది. మరోసారి... మరో సారి ట్రై చేసింది. ఈసారి యాహ్యాఖాన్‌కి చేసింది. మరోపక్క అక్కడ ఏం జరుగుతుందో ఐ ఫోన్‌లో కనిపిస్తోంది.

''యాహ్యాఖాన్...'' మోహన అంత గట్టిగా అరవడం మొదటిసారి... యాహ్యాఖాన్... మర్యాదగా ఆ గదిలో నుంచి వెనక్కు వెళ్ళు...''

యాహ్యాఖాన్ తాపీగా... ''వెనక్కి వెళ్ళడానికి ఈ గదిలోకి రాలేదు మేమ్... మాఫ్ కీజియే... అయినా ఈ అమ్మాయి మన శత్రువు ప్రియురాలు...'' అన్నాడు.

''ఖామూష్... యాహ్యాఖాన్ ఈ మోహన సహనాన్ని పరీక్షించకు... డీల్ డీల్‌లానే వుండనీ... నువ్వు అక్కడి నుంచి వెళ్ళిపో...''

'' ఈ యాహ్యాఖాన్ డబ్బుని, ఆడదాన్ని వదులుకోడు మేంసాబ్...''

''అక్కడ వున్నది ఈ మేమ్ రూపం''

''యస్ మేమ్ నాకు ఇంకా మజాగా వుంటుంది.. ఇద్దర్ని...''

మోహన ఫోన్ కట్ చేసింది. కార్తికేయ వైపు తిరిగింది.

''మోహనా... వాడెక్కడ ఉన్నాడో చెప్పు... వాడి తల తెగనరికి...'' ఆవేశంతో కంపించి

పోతున్నాడు.

''సారీ... నేనే వెళ్తాను... నన్ను నమ్మి నన్ను వదిలేయండి... సరిగ్గా ఒక గంటలో తిరిగొస్తాను.''

''నేనూ వస్తాను'' కార్తికేయ అన్నాడు.

''మిస్టర్ కార్తికేయ టైం లేదు నన్ను వెళ్ళనివ్వండి''

కార్తికేయ ఏదో అనబోయాడు. కోపాన్ని, అసహనాన్ని కంట్రోల్ చేసుకుంటూ కార్తికేయ దగ్గరికి వచ్చింది.

''సారీ కార్తికేయగారు... బిలీవ్ మీ... చిన్నప్పటి ఆవు పులి కథ మీకుతెలుసు... మీ ముగ్ధని కాపాడడానికే వెళ్తున్నాను... ఈ మోహన మోసగాళ్ళను మోసగించిందే కానీ మంచి వాళ్లను మోసగించలేదు...

అంటూ అతని చేతిని తీసుకుని... కళ్ళు మూసుకుంది... కార్తికేయ చేతిని తన పొట్ట మీదికి తీసుకువచ్చింది...

'' ఆకలి అంటే నాకు గౌరవం, భయం... నేను గడిపిన ఆకలి రోజులమీదొట్టు...

ఆ చేతిని, కార్తికేయ చేతిని తన గుండెల మీదికి చేర్చింది... శూన్యమైన నా మనసు మీద, నేను కోల్పోయిన ప్రేమ మీదొట్టు..

కార్తికేయ చేతిని వదిలేసింది..

''దయచేసి నన్ను ఫాలో కావొద్దు... సరిగ్గా గంటలో నేను ఇక్కడుంటాను... మీ ముగ్ధ మీద ఈగ వాలినివ్వను... ఈ ప్రయత్నంలో నేను తిరిగిరాకపోతే... చచ్చిపోయానని అనుకోండి. తెలివిగా మిమ్మల్ని మోసంచేసి పారిపోయానని అనుకోవద్దు.

అంటూ తన గదిలోకి వెళ్ళి అయిదే నిమిషాల్లో జీన్స్‌తో బయటకు వచ్చింది.

''మోహనా ఈ రివాల్వర్ వుంచండి. అవసరమైతే వాడిని కాల్చేయండి. ఇది సర్వీస్ రివాల్వర్... ఈ బుల్లెట్స్ నా అకౌంట్‌లోకి వెళ్తాయి''. రివాల్వర్ ఇస్తూ చెప్పాడు.

'' ఈ మోహన చేయే ఒక ఆయుధం...''

కార్తికేయ తనకారు కీస్ ఇచ్చాడు. మోహన బయటకు నడిచింది.

⁂

''సార్... మోహన బయల్దేరింది... ఫాలో అవమంటారా? మోహన బయటకు వెళ్ళడం చూసి అడిగాడు డిటెక్టివ్ శ్యాంసన్.

''వద్దు... ప్లీజ్ వెనక్కి వచ్చేయండి. తను నా ముగ్ధను మాత్రమే కాదు... మానవత్వాన్నీ కాపాడడంకోసం వెళ్ళింది'' మనస్ఫూర్తిగా అన్నాడు కార్తికేయ.

ఒకసారి తన చేయి వంక చూసుకున్నాడు. ముగ్ధ వేసిన ఒట్టు. ఒక్కో ఒట్టు ఒక్కో కథ చెబుతుంది... కన్నీటి చెమ్మను స్పృశిస్తుంది.

⁂

యాహ్యాఖాన్ నరరూప రాక్షసుడు... ఉమనైజర్... అందులోనూ మత్తులో వున్నాడు. ఆటను మోహన రూపంలో వున్నా ముగ్ధను... చూసి రెచ్చిపోతున్నాడు.

ముగ్ధ అద్దంలో తన రూపం మారడం చూసి షాకైంది. దానికి తోడూ యాహ్యాఖాన్ తనను సమీపించి వెకిలిగా ప్రవర్తించడం.

మోహన కారు స్పీడుకు స్పీడో మీటర్ వణికిపోతుంది. యాక్సిలేటర్ మీద ఆమె కాలు.. యాహ్యాఖాన్ పీక మీద ఉన్నంత కసిగా వుంది.

విద్యారణ్య, డాక్టర్ రాధారాణి తలుపుల మీద బాదుతున్నారు. లోపల ముగ్ధ భయంతో వణికిపోతుంది.

యాహ్యాఖాన్ ముగ్ధను సమీపించాడు...

ముగ్ధ మనసులో కార్తికేయను తలుచుకుంది. భయం నీ మొదటి శత్రువు... అన్న కార్తి కేయ మాటలు స్మరించుకుంది...

మరణం నీ ఎదురుగా వున్నప్పుడు చచ్చేవరకూ చావును ఎదురించు... అన్న కార్తి కేయ ధైర్య వచనాలు అమల్లో పెట్టింది.

టేబుల్ మీద వున్న పళ్ళు కోసే చాకు తీసుకుంది.

యాహ్యాఖాన్ పగలబడి నవ్వాడు... నవ్వుతూనే వున్నాడు... నవ్వుతూ ఒక్కసారి ఆగి పోయాడు. ఆ గది తలుపుల దగ్గర పెద్ద శబ్దం.

ఆ భవంన ముఖద్వారం కారుపట్టే వెడల్పులో వుంటుంది. మోహన కారును సరాసరి హాలులోపలికి అక్కడి నుండి ముగ్ధ గది దగ్గరికి స్పీడ్‌గా తీసుకువెళ్ళింది. కారు తలుపును ఢీ కొట్టింది.

ఆ వేగానికి తలుపువిరిగింది. మోహన అనుచరులు పరుగత్తెకు వచ్చారు. కారులో నుంచి మోహన దిగింది. ఇదంతా క్షణాల్లో జరిగింది.

యాహ్యాఖాన్ షాకయ్యాడు... మోహన యాహ్యాఖాన్ దగ్గరికి వెళ్ళి అతని కుడిచేతిని మెలి తిప్పింది. మార్షల్ ఆర్ట్స్‌లో తను నేర్చుకున్న విద్యనూ మొదటిసారి యాహ్యాఖాన్ మీద ప్రయోగించింది. అతని ఆర్తనాదాలు ఆ పాతభవనం గోడలలో ప్రతిధ్వనిస్తున్నాయి. మోహ నను ఆపే ధైర్యం ఎవరూ చేయడంలేదు.. అతని కుడి కాలు... ఎడమకాలు... ఎడమ చేయి..అన్నీ క్షణాల్లో వేలాడిపోయాయి. భయంతోనే అతని ప్రాణం ఎగిరిపోయింది.

తన ఉగ్రవాదంతో కాక మదొన్మాత చేష్టలకు విపరీతమైన కామవాంచకు భారీ మూల్యం చెల్లించుకున్నాడు. అతని శరీరం భయంకరంగా తయారైంది.

ముగ్ధ ఇంకా షాక్‌లో నుంచి తేరుకోలేదు... తన రూపంలో వున్న మోహనను చూసి అలానే ఉండిపోయింది.

యాహ్యాఖాన్ శవాన్ని భుజాల మీద వేసుకుని ఫైర్ ప్లేస్ దగ్గరికి వెళ్లి అందులో వేసింది. మంట వేసింది. అనుచరులవైపు తిరిగి ''వీడి శవం కాలేవరకూ ఇక్కడే వుండండి'' అని ముగ్ధ దగ్గరికి వెళ్లింది.

రెండు చేతులు జోడించింది.

''నన్ను క్షమించండి... మీకేమీ కాదు...'' అంటూ అక్కడి నుంచి కదలింది.

మరోసారి ఖాసింకు ఫోన్ చేసింది. ఈసారి ఖాసిం ఫోన్ రింగ్ అయింది.

''ఖాసిం.. యాహ్యాఖాన్‌ని చంపేసాను... వాడికి మనం ఇవ్వవలసిన బ్యాలెన్స్ వాడి భార్యాబిడ్డలకు పంపించండి. మన స్థావరాన్ని షిఫ్ట్ చేయండి. వీళ్ళు మన అతిథులు... బందీలు కాదు. మన లక్ష్యం అమాయకులు కాదు చెప్పి ఫోన్ కట్ చేసింది.

విద్యారణ్య, రాధారాణివైపు చూసి ''కొద్దిగా ఓపిక పట్టండి. ముగ్ధను జాగ్రత్తగా చూసుకోండి'' చెప్పి బయటకు వెళ్ళబోతుంటే...డాక్టర్ రాధారాణి ఆపింది.

ఏమిటన్నట్టు చూసింది మోహన..

రాధారాణి మోహనను దగ్గరికి హత్తుకుంది. ''రాయిలో కూడా నీళ్ళు ఉంటాయని... కన్నీళ్లు ఉంటాయని తెలుసుకున్నాను. మీ మంచితనానికి సరెండర్ అయ్యాం'' సన్సియర్‌గా అంది.

⁘⁘

అడుగుల శబ్దానికి కళ్ళు తెరిచాడు కార్తికేయ... ఎదురుగా మోహన... అలిసిపోయి...

''మీ ముగ్ధ సేఫ్.. అది చిన్న నవ్వు నవ్వి.

''నాకు తెలుసు... నా ముగ్ధకు ఏమీ కానివ్వరు... థాంక్యూ మోహనా... ఆమె రెండు చేతులూ పెదవులకు అన్చుకున్నాడు.

''అలిసిపోయాను కార్తికేయ... ఈ రోజు ప్రేమను అనుభూతించాను... ఒక్క క్షణం మీ గుండెల మీద తల వాల్చవచ్చా? అడిగింది మోహన.

సంవత్సరాల ఒంటరితనం... వేన వేల రోజుల శూన్యం...

⁘⁘

మంటల్లో తగలబడిపోతోన్న యహ్యాఖాన్ శవం వంక అలానే చూస్తూండిపోయాడు ఖాసిం.

ఒక శత్రువుకు సంబంధించిన వ్యక్తి కోసం... తనకు పనికి వచ్చే మనిషిని నిర్దాక్షిణ్యంగా చంపిన మోహన...

మంటల్లో కాలిపోతున్న తమ్ముడి శవం వంక చూసాడు ఖాసిం. తనకు తప్ప మరెవరికి తెలియని నిజం. ఆ నిజం మంటల్లో కాలిపోతుంది... ఖాసిం ద్వేషం మంట.

⁘⁘

# 59.

ఆత్మరక్షణలో పడిపోయిన ఫీలింగ్ కలిగింది కార్తికేయకు... ముగ్ధను కాపాడడం కోసం మోహన తీసుకున్న రిస్క్ తెలుస్తోంది. తన మనిషే అయినా కొన్ని విలువలకు కట్టు

బడి వుండటం సామాన్యమైన విషయం కాదు... అదీ మోహనలాంటి క్రిమినల్‌కు...

తన ముందు వున్న సమస్య మోహన... ఖాసిం... చాలా విచిత్రమైన పరిస్థితి... శత్రువు తన ఎదురుగానే వుంది... కానీ తానేమీ చేయలేకపోతున్నాడు. మోహన నుంచి ఎటు వంటి పరిస్థితిలోనూ నిజాలు చెప్పించడం సాధ్యంకాదు.

బాంబ్‌బ్లాస్ట్‌లను అడ్డుకున్నా దానికన్నా మించి ఏదో జరుగుతోంది... అదేమిటి? తను ఏ మాత్రం తొందరపడ్డా ముగ్ధ మాత్రమేకాదు... ఒక గొప్ప డాక్టర్ విద్యారణ్యలాంటి వారి ప్రాణాలకు ముప్పు... అంతకన్నా మరో విధ్వంసం జరుగవచ్చు. శత్రువును ఆయుధబ లంతో అన్ని వేళలా ఎదుర్కోవడం అసాధ్యం అని తెలుసు... హాలులో నుంచి లేచి మోహన గదివైపు చూసాడు.

పరాయివారి గదిలోకి, మదిలోకి తొంగిచూడకూడదన్న సంగతి తెలిసీ చూసాడు.

మోహణ చేతులకు గోరింటాకు పెట్టుకుంటంది. కార్తికేయ స్తబ్ధుగా ఉండిపోయాడు. ఒక అంతర్జాతీయ నేరస్తురాలు... అతి ప్రమాదకరమైన వ్యక్తీ... తాపీగా చేతికి గోరింటాకు పెట్టుకుంటుంది. ఈ అమ్మాయి మామూలు అమ్మాయి అయితే ఎంత బావుండు. యాహ్యా ఖాన్‌లాంటి ఒక ఉగ్రవాదిని ఒంటిచేతితో చంపిన వ్యక్తి.

కార్తికేయ ఆమె గదిముందు నిలబడి...'' లోపలికి రావచ్చా? అని అడిగాడు.

మోహన లేవబోయింది. ఆ అదురుకు ఆమె పైట కిందికి జారింది. ఓ చేతికి గోరింట పెట్టుకుంది... మరో చేతిలో గొరింట గిన్నె... ముందుగా ఓ అమ్మాయి... ఆ సహజసిద్ధమైన లాలిత్యం... సిగ్గు... బిడియం... కిందికి వంగి పైట సర్దుకోబోయింది... కార్తికేయ ఆ పైటను ఆమె భుజాల మీదుగా కప్పాడు.

''సారీ'' అన్నాడు కార్తికేయ.

''దేనికీ'' అడిగింది మోహన.

''మీ గదిలోకి రాకూడని పరిస్థితిలో వచ్చాను... మీ అనుమతి లేకుండా... మీ పైట...' ఆ పై మాట పూర్తి చేయలేదు.

'' ఇది మీ గది... అయినా మీరు రాకూడని ప్రదేశం కాదు... నేనే మీకు థాంక్స్ చెప్పాలి'' అంది మోహన

''థాంక్స్? ఎందుకు?

''నిజం చెప్పాలంటే... ఒక సారి కార్తికేయ వంక చూసింది... మోహన ఏం చెబుతు న్నాడా అని ఎదురు చూస్తున్నాడు...

''డెత్‌గేమ్స్... రక్తపాతాలు.. ఒక్కోసారికాదు కాదు చాలాసార్లు నేనో అమ్మాయిని అనే విషయం మరచిపోతుంటాను... అసలు గుర్తే వుండదు... ఎందుకో ఇప్పుడు మీ ముందు గుర్తొచ్చింది. నేను అమ్మాయిని అని... నాలోనూ స్త్రీత్వం వుందని...'' ఎప్పుడో చిన్నప్పుడు విన్న కథ... అమ్మ చెప్పిన కథ... రాముని స్పర్శతో రాయి అహల్యగా మారింది..ట..రాయి లాంటి రాతిగుండె వున్న ఈ మోహన మీ స్పర్శతో అమ్మాయిగా మారిందేమో...'' చిన్న

కన్నీటి మెరుపు.

కార్తికేయకు ఏం మాట్లాడాలో అర్థంకాలేదు...

''సారీ'' అంది మోహన.

'' ఎందుకు'' అడిగాడు కార్తికేయ.

''మీ ముగ్ధ తనకోసం దాచుకున్న గోరింట... ఫ్రిజ్‌లో కనిపిస్తే... ఎందుకో పెట్టుకోవాలనిపించింది. ఎర్రగా పండింది కదూ... నాకూ రక్తపు ఎరుపు తప్ప ఈ గోరింట ఎరుపు తెలియదు... గోరింట ఎర్రగా పండితే మంచి మొగుడు వస్తాడటగా...'' కార్తికేయ వైపు చూసి అంది.

కార్తికేయ మౌనాన్ని ఆశ్రయించాడు...

''ఖాసిం, జర్దార్... సిక్వే... చాలా మంది మీ గురించి చెబుతూ ఆ కార్తికేయ మనకు మొగుడయ్యాడు... అనే వాళ్ళు... ఆ ఫీలింగ్ నాకు అన్వయించుకుంటే ఎంత బావుందో...''

మోహన కార్తికేయకు చాలా దగ్గరగా వచ్చింది... ఎంత దగ్గరగా అంటే... అతని శ్వాస ఆమె గుండెలకు తగిలేంత దగ్గరగా...

''చెప్పండి నా నుంచి ఏ రహస్యం తెలుసుకోవడానికి వచ్చారు?

ఉలిక్కిపడ్డాడు కార్తికేయ... తన మనసులోని భావాలు చదివేసిన మోహన వైపు చూసాడు.

''ముగ్ధను, విద్యారణ్యను డాక్టర్ రాధారాణిని వదిలి వేయవచ్చుగా...'' తన ప్రశ్న తనకే సిల్లీగా అనిపించింది.

'' ఆ ముగ్గురిలో ఏ ఇద్దరినే వదిలేస్తానని నేనంటే...?

''విద్యారణ్యను, రాధారాణిని వదిలేయమని అంటాను...''

''మీ ముగ్ధను... తను మీ ప్రాణం కదా...''

''నా ముగ్ధను నేను కాపాడుకోగలను... లేదా నేను ముగ్ధతో పాటే... విద్యారణ్య, డాక్టర్ రాధారాణిలాంటి మేధావులు బలికాకూడదు...''

''ముగ్ధను చూస్తుంటే జెలసీగా వుంది...''

''నాకు మిమ్మల్ని చూస్తుంటే...'' కార్తికేయ ఆగిపోయాడు... ఇలాంటి పరిస్థితి ఎవరికీ వచ్చి వుండదు.

''చెప్పండి... నన్ను చూస్తూంటే...'' ఆత్రుతగా అడిగింది... ఎప్పుడు ఇంత ఉద్వేగానికి గురవ్వలేదు.

'' ఏమీ లేదు... మోహన నాకో విషయం చెప్పగలరా?

'' ఇంటరాగేషన్ లేకుండానే నిజాలు రాబట్టాలనే ప్రయత్నమా? అడగండి''

''మీ నెక్స్ట్ టార్గెట్ ఏమిటి?

''చెబితే నాకేమిటి?

''చెప్పండి మీకేం కావాలి?

''నా రెండో చేతికి గోరింట పెట్టగలరా? అలా అయితే చెబుతాను''

ఒక మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అత్యంత రహస్యమైన సమాచారాన్ని చెప్పడానికి అడిగిన ప్రతిఫలం...

మోహన తన రెండో చేతిని దాచింది కార్తికేయ వైపు...

'' ఓ అక్షర విధాతా... నన్ను సృష్టించి నీలోని వ్యక్తిత్వాన్ని నాకు ధారపోసిన ఆత్మ మిత్రమా... నువ్వు సృజించిన ఈ పాత్ర నా కన్నీటి చెమ్మను స్పృశిస్తుంది...'' కార్తికేయ గోరింట గిన్నెను చేతిలోకి తీసుకున్నాడు.

⁂

# 60.

''చందమామ కథలో చదివినట్టు జ్ఞాపకం లేదు... గాఢనిద్రలో కమ్మని కలగన్న గుర్తు లేదు.. పిండారబోసిన వెండి వెన్నెల్లో, నీలి నీలి మబ్బుల్లో నుంచి రెక్కల గుర్రమెక్కి వచ్చిన వూహలేదు... రివాల్వర్, పదునైన చాకులు, కరుడుగట్టిన ఆలోచనలు, ఇంకిపోయిన కన్నీటి చెమ్మ... ఉరుకులు పరుగులు, రక్తసిక్త దేహాల మధ్య రాటుదేలిన యాంత్రిక జీవితంలో... అభిషేకించబడిన హిమక్షీరధారలో ఈ దేహం పునీతమైనదా?

⁂

మోకాలి మీద చుబుకాన్ని ఆనించి, ఎడమ చేతిని కార్తికేయ చేతికి అప్పగించి అలానే చూస్తూండిపోయింది మోహన. ఆమె చీర కుచ్చెళ్ళు కొద్దిగా పైకి వెళ్ళాయి. ఆమె లేలేత తెల్లటి పాదాలు మెరుస్తున్నాయి. ఆమె ఎడమ చేతిని తన చేతిలోకి తీసుకుని గిన్నెలోని గోరింటని ఆమెచేతికి అలంకరిస్తున్నాడు.

ఇదో అద్భుత సన్నివేశం. ఇంటారాగేషన్ చేయవలసిన చేతులు గోరింటను పెడుతున్నాయి.

కరుడుగట్టిన నేరస్థురాలు గోరింట పెట్టించుకుంటోంది. ఆమె అరచేతిలో గోరింట పూచినట్టు... ఆ క్షణం అతనికి ముగ్ధ గుర్తుకు వచ్చింది. ఇలాంటి విచారణ ఏ కథలోనూ చదివిన జ్ఞాపకం లేదు.

''చెప్పండి మీరు అడిగిన మీకు కావాల్సిన సమాచారం మాట ప్రకారం ఇస్తాను... మీకిచ్చిన మాట నిలబెట్టుకుంటాను... ఆ రోజు రావణుడి మృత్యురహస్యం విభీషణుడు చెప్పాడు సాకేతపుర సామ్రాజ్య క్షితిపాలుడికి, శ్రీరాముడికి.

వెరైటీగా ఈ రోజు నా మృత్యు రహస్యం నేనే చెబుతున్నాను.

''మీ ప్లాన్ ఏమిటి?'' గోరింట పెడుతూ అడిగాడు.

మత్తు ఇవ్వకుండా డాక్టర్ గుండె ఆపరేషన్ చేస్తున్న ఫీలింగ్ కలిగింది మోహనకు...

''విధ్వంసం'' చెప్పింది మోహన.

''అదే ఎలాంటి విధ్వంసం? ఎక్కడ జరిగే విధ్వంసం?

''ప్రపంచమంతా పూజించే తిరుమల తిరుపతి తిరుమలేశుడి సన్నిధిలో... జరగ బోయే, జరిగే విధ్వంసం''

గగుర్పాటు పడిన కార్తికేయ చేతితోని గోరింటగిన్నె కిందపడి గోరింట నేల ఒలికింది.

''సరిగ్గా ఇరవైనాలుగు గంటల్లో రాష్ట్రపతి తిరుపతి వస్తున్నాడు. దైవభక్తి పరాయ ణుడు అయిన రాష్ట్రపతి తన హోదాలో చేసే చివరి పర్యటన... తిరుపతి పరిసర ప్రాంతాన్ని నోఫ్లెయింగ్ జోన్‌గా మార్చారు. ఆత్మాహుతి దళం... వరల్డ్‌ట్రేడ్ సెంటర్ మీద జరిపిన పద్ధ తిలో దాడి చేస్తుంది. రాష్ట్రపతిని మొదటిసారిగా టార్గెట్ చేస్తూ చేస్తోన్న దాడి... అదే సమ యంలో మిలిట్రీ స్థావరాలకు సంబంధించి దాని సాయంతో రూపుదిద్దుకున్న ప్లాన్ ప్రకారం మిలిటరీ స్థావరాల మీద దాడి జరుగుతుంది. ఓ వైపు రాష్ట్రపతి మీద ఎటాక్... మరో వైపు మిలీట్రీ స్థావరాలపైన... దాడి... ఆపై శాంతిభద్రతల సమస్య... ఇదే అదనుగా ప్రధాన నగ రాల్లో విధ్వంసం కొనసాగుతుంది''

ఊపిరి బిగపట్టాడు... మొహమంతా చెమట పట్టింది. కార్తికేయ ఇంత ఆందోళనకు ఎప్పుడూ గురికాలేదు.

'' ఇంత ఇంత విధ్వంసం అవసరమా? భరతభూమిని మరుభూమిగా మార్చి ఈ దేశాన్ని పరిపాలిస్తావా? ఆవేదనగా అడిగాడు.

'' ఇప్పటి వరకూ మరుభూమిలోనే బ్రతికాను... ఎవరూ లేని అనాథను... ఇప్పుడైనా నియంతనై పాలిస్తాను''

కార్తికేయ మనసు భారమైంది. ఒక నిజాన్ని నిజాయితీగా చెప్పినందుకు మోహనను అభినందించాలో ఒక మహావిధ్వంసం రచన చేసినందుకు శిక్షించాలో అర్థం కావడం లేదు.

''మోహనా, ఈ విధ్వంసాన్ని ఆపలేవా'' మొదటిసారి బేలగా అడిగాడు.

''నువ్వు నన్ను జీవితాంతం నీ భార్యగా చూసుకోగలవా?

నా మెడలో మూడు ముళ్ళు వేసి నీ అర్ధాంగిగా స్వీకరించగలవా?'' మోహన సూటిగా అడిగింది.

కార్తికేయ బదులివ్వలేదు... నవ్వింది మోహన...

''నిన్న పరిచయం అయిన అమ్మాయిని ఆ ప్రేమను మర్చిపోయి నన్ను చేసుకుం టావా? అని అడిగితే అంత ఆలోచిస్తున్నావు... ఇరవై ఏళ్ళకు పైగా నాతోపాటు నీడగా పెరిగిన నా కోరిక.. నా జీవిత లక్ష్యాన్ని నేనెలా వదులుకుంటాను... నాకంటూ ఎవరూ లేరు... వేద నలు... ఇంకిన కన్నీళ్ళు... ఘనీభవించిన విషాదాలు... వీటినుంచి నన్ను తరిమేసి... నేను కోరుకున్న స్వర్గానికి నన్ను చేర్చే లక్ష్యం... ఇది...''

'' ఇది లక్ష్యం కాదు మోహనా... మహా విధ్వంసం... ఈ సృష్టిలో వేల సంవత్సరాలు మనుష్యులు బ్రతికిన దాఖలాలు లేవు... ఆ దేవుడి యుగంతోపాటు అవతారాన్ని చాలిం చాడు... ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు బ్రతుకుతావు మోహనా... బ్రతికినా ప్రతీ క్షణం శత్రువుల నుంచి నీ ఉనికిని కాపాడుకేనే ప్రయత్నంలో మనశ్శాంతి కోల్పోయి బ్రతకాలి... నీ కోసం బ్రతికే

మనిషి అసలు ఎవరైనా వున్నారా? నీకోసం కన్నీళ్ళు కార్చేప్రాణి ఉందా?'' కార్తికేయ ఉద్వే గంగా అన్నాడు.

''అందుకే... అందుకే ఈ విధ్వంసరచన...'' మనసులో అనుకుంది మోహన.

***

రాత్రి పదకొండు దాటుతుండగా వచ్చాడు కార్తికేయ. డిటెక్టివ్ శ్యాంసన్‌తో కలిసి ముగ్ధను ట్రేస్ అవుట్ చేయడానికి ప్రయత్నించాడు. రాష్ట్రపతికి పొంచి వున్న ప్రమాదం గురించి ఇప్పుడే చెప్పకూడదు.

మోహనను తను హౌస్ అరెస్ట్ చేసినా ఆమె చేసిన స్కెచ్ ప్రకారం అంతా జరుగు తుంది. మోహన శత్రువు అయినా ఆమె తెలివిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఇంట్లోకి అడుగుపెట్టి ఇంకా లైట్లు వెలుగుతూ వుండడం చూసి ఆశ్చర్యపోయాడు. డైనింగ్‌హా ల్‌లో డైనింగ్‌టేబుల్ మీద తలపెట్టి కళ్ళు మూసుకుంది మోహన. ఆమె రెండు చేతులు గోరింట చెదరకుండా చేతులను క్రాస్ ఆకారంలో పెట్టుకుంది.

తను శ్యాంసన్‌తో పాటే హోటల్‌లో భోం చేసాడు. కళ్ళు తెరిచింది మోహన. ఎదు రుగా కార్తికేయ...

''భోం చేస్తారా? అడిగింది... తన ప్రశ్న తనకే చిత్రంగా అనిపించింది మోహనకు. ఇదివరకెప్పుడూ లేనిది...

''నేను తినే వచ్చాను... మీరు తిన్నారా?

తలూపింది మోహన... కార్తికేయకు అలసటగా వుంది ''గుడ్‌నైట్'' చెప్పి తన గది లోకి వెళ్ళాడు.

***

అర్ధరాత్రి పన్నెండు దాటింది. సడెన్‌గా మెలకువ వచ్చింది. ఫ్రిజ్ దగ్గరికి వెళ్ళి చల్లని నీళ్ల తాగి, అప్రయత్నంగా మోహన గదివైపు చూసాడు. తలుపులు వేసుకోలేదు... వెళ్ళి ఏసీ ఆన్ చేసి తలుపులు దగ్గరగా వేయబోయి ఆగిపోయాడు.

రెండు చేతులు వెనక్కి పెట్టుకుని నిద్రపోతుంది. అదికాదు అతను ఆలోచిస్తుంది... మోహన రెండు చేతులకు పట్టివున్న గోరింట... అంటే దీన్ని బట్టి చూస్తే మోహన భోజనం చేయలేదు, చేసే అవకాశం లేదు... ఉదయంనుంచి... చివుక్కుమంది కార్తికేయ మనసు. తన తోపాటు తన ఇంట్లో వున్న మనిషి ఎంత శత్రువైనా సరే తను భోజనం చెయ్యకుండా వుంటే తను బయట భోంచేసి వచ్చి యింట్లో వున్న తన ఆకలి విషయం మర్చాడు. ఆనాదిగా పేరు గాంచిన భారతీయుల ఆదరణ ఆకలిదప్పులు తీర్చే ఆప్యాయతకే తీరని మచ్చ. ఏదో గిల్టీఫీ లింగ్. వెంటనన కిచెన్‌లోకి వెళ్ళాడు.

అయిదు నిముషాల తర్వాత కంచంలో అన్నీ వడ్డించుకుని అన్నం కలుపుకుని మోహనకై తెచ్చాడు కార్తికేయ... లోన చూస్తే బెడ్‌మీద మోహన కనిపించలేదు.

డంగైపోయాడు కార్తికేయ. ఇప్పటిదాకా పడుకున్న మోహన ఏమైనట్టో?

# 61.

మోహన కనిపించక పోవడంతో ఒక్కోక్షణం భయడిపడిపోయాడు. అతని చేతిలో అన్నం ప్లేట్ వుంది. తన వెనక చిన్న అలికిడి. తల తిప్పి చూస్తే మోహన.

''మీరు అన్నం తినలేదు కదూ...'' అడిగాడు కార్తికేయ.

''తినలేకపోయాను'' గోరింట చేతులు చూపిస్తూ చెప్పింది మోహన.

''కూచోండి... నేను తినిపిస్తాను''

మోహన కూచుంది. కార్తికేయ తినిపిస్తున్నాడు. అతని సన్నటి చేతివ్రేళ్ళ మధ్య వున్నందుకు అన్నం మురిసిపోతుందేమో. అలా ఆలోచిస్తూ మోహన తన చిన్ని నోరుని తెరిచింది. అనుకోకుండా ఆమె కళ్ళలో సన్నటి నీటి చెలమ.

'' ఏమైంది... కారం ఎక్కువైందా? కంగారుగా అడిగాడు.

''కారం కాదు మమకారం ఎక్కువైంది'' అనలేదు పైకి... అనుకుంది మనసులోనే...

''చిన్నప్పుడు అన్నం తిననని మారాం చేస్తే అద్దంలో చందమామను చూపించిన కథే జ్ఞాపకం... వెండి గిన్నెలో అన్నం తిన్న జ్ఞాపకం లేదు... అమ్మ చంకలో ఎక్కి బువ్వ తిన్న గుర్తులేదు... ఆకలితో పోరాటం... ప్రాణాలు తీసి రాక్షసత్వం... రక్తపాతాల దాహం... ఇదే నా ప్రపంచం... ఆకలేస్తే వైన్ తాగుతాను... దాహమేస్తే విస్కీ తాగుతాను... నిద్రవస్తే కరెన్సీ మీద పడుకుంటాను... కానీ ఒక్క... ఒక్క ఏడుపు వస్తే మాత్రం... ఏమీ చేయలేను... చివరికి ఏడవాలనిపించినా అహం అడ్డొస్తుంది'' కళ్ళలో కన్నీటితో, మనసులో ఆలోచిస్తూ యధాలాపంగా పైకి అనేస్తూ నవ్వుకుంది మోహన.

''మోహన నువ్వు మారవచ్చుగా?

''ఇప్పుడు మారిపోయానుగా అదే నీ ముగ్ధగా''

''అలా కాదు...'' ఎలా చెప్పాలో తోచలేదు.

పొలమారింది మోహనకు.

కార్తికేయ వాటర్ గ్లాస్ ఇచ్చాడు.

∴∴

''థాంక్యూ'' అంది మోహన.

'' ఎందుకు?

''చిన్నప్పుడు అమ్మ చేతి గోరుముద్దలు తినలేదన్న బాధ పోగొట్టినందుకు''

''థాంక్యూ''అన్నాడు కార్తికేయ

'' ఎందుకు?''

'' ఇంకా నీలో సెంటిమెంట్ బ్రతికే వున్నందుకు. దాన్ని బతకనిచ్చిందుకు''

మోహన మాట్లాడలేదు.

∴∴

కార్తికేయ తన గదిలోకి వెళ్ళాడు.

సరిగా అప్పుడే అతని చేతిలోని సెల్ రింగ్ అయింది. ఆన్ బటన్ ప్రెస్ చేసాడు. అటు వైపు నుంచి అపరిచిత గొంతు... మగగొంతు...

''మిస్టర్ కార్తికేయ... మీకో ఇన్ఫర్మేషన్ ఇస్తున్నాను... చాలా ముఖ్యమైనది''

'' ఏమిటది'' ఇంతకూ మీరెవరు?

''శత్రువుకు శత్రువు మిత్రుడు...''

''అంటే...

మోహనకు సంబంధించిన సమాచారం... మిలటరీ స్థావరాలకు సంబంధించిన సమాచారం...

''మీకెలా తెలుసు?

''అది మీకు అనవసరం... నాకు ప్రతిఫలం కావాలి''

ఒకే చెప్పండి?

'' ఈ రహస్యాలను చెప్పినందుకు మోహనను చంపాలి'' కార్తికేయ మాట్లాడలేదు.

''మౌనం సమాధానం కాదు కార్తికేయ...'' అవతలిగొంతు పలికింది.

''మీ సాయం అక్కర్లేదు'' కార్తికేయ అన్నాడు.

''మీరు దేశాన్ని కాపాడుకునే అవకాశం మిస్సవుతున్నారు''

''నా దేశాన్ని, మోహనను ఎలా కాపాడుకోవాలో తెలుసు... మోహనను చట్టానికి మాత్రమే అప్పగిస్తాను... నా గొంతులో ఊపిరి ఉన్నంతవరకు మీరు మోహన నీడను కూడా సమీపించలేరు. అయినా మోహన సివంగి... మీలాంటి వారు మోహనను ఏమీ చేయలేరు''

''వెరీగుడ్... ఒక నేరస్తురాలిని పొగడుతున్నారే?

'' ఆమె నేరస్తురాలు అయినా ఆమెలో కొన్ని క్వాలిటీస్ వున్నాయి... అవి మీకు చెప్పినా అర్థం కావు''

'' ఓకే ఓకే... నాకు మోహన పతనంకావాల... అందుకోసమైనా మీకు ఓ రహస్యం చెబుతాను... మిలటరీకి సంబంధించిన రహస్యాలు వున్న పెన్‌డ్రైవ్ సత్తార్ దగ్గర ఉంది.... అతను తిరుపతిలో వున్నాడు... ఈ రోజు హోలీ సంబరాల్లో జనం వుంటారు... రేపు తిరుపతి వస్తోన్న రాష్ట్రపతిని...'' అవతలి వ్యక్తి చెప్పడం మొదలుపెట్టాడు.

పదిహేను నిముషాల తర్వాత ఆ వ్యక్తి ఫోన్ పెట్టేసాక... కార్తికేయ టైం చూసుకు న్నాడు. తను తెల్లవారి తిరుపతి వెళ్ళాలి.

మోహనకు సంబంధించిన అత్యంత సున్నిత రహస్యాలు తెలిపిన అజ్ఞాతవ్యక్తి ఎవరా? దీర్ఘంగా ఆలోచిస్తూ అనుకున్నాడు కార్తికేయ.

∴∴

మోహన సెల్ ఆఫ్ చేసింది. మిలటరికీ సంబంధించిన రహస్యాలు వున్న పెన్‌డ్రైవ్

సత్తార్ దగ్గర వున్న విషయం కార్తికేయకు చెప్పాక రిలీఫ్‌గా అనిపించింది. మొదటిసారి తను మారిపోతున్నానేమో అనుమానం కలిగింది మోహనకు. విద్యారణ్య నేర్పిన మిమిక్రీ ఇందుకు ఉపయోగపడినందుకు నవ్వుకుంది మోహన.

:::::

సత్తార్... మనుష్యుల మెదళ్ళు తినే మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్... చాలాకాలం పిచ్చాసుపత్రిలో వున్నాడు. అలాంటి సత్తార్ తిరుపతిలో తిష్టవేసాడు. ఏం జరగబోతుంది.

:::::

# 62.

ప్రపంచమంతా భక్తి పారవశ్యంలో మునిగే పవిత్ర పుణ్యక్షేత్రం. కోట్లాది భక్తుల విశ్వాసం. గోవిద నామస్మరణంతో... మార్మోగే ఆధ్యాత్మిక క్షేత్రం. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులతో నిత్యం విలసిల్లే శ్రీనివాసుడు కొలువైన చోటు...

ఎక్కడ చూసినా భక్తుల తాకిడి... ఏడుకొండలవాడా వెంకటేశ్వరా... వడ్డీకాసులవాడా... గోవిందా గోవిందా... అంటూ భక్తులు

పరవశించిపోతున్నారు. పట్టణమంతా పూర్తి బందోబస్తులో వుంది. ఆ రోజు భారత రాష్ట్రపతి స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తున్నాడు. రాష్ట్రపతికి స్వాగతం పలకడానిక సియం ఇతర మంత్రులూ వస్తున్నారు. గవర్నర్ వస్తున్నారు... నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడికక్కడ నాకాబందీ జరుగుతుంది.

:::::

తిరుపతిలో చిన్న హోటల్... ఇరుకైన గది... శబ్దం చేసి సీలింగ్ ఫ్యాన్... నుప మంచం... ఒక రేకు కుర్చీ... మసకబారిన అద్దం. ఆ గదిలో సత్తార్ ఉంటున్నాడు. కొద్దికాలం పిచ్చాసుపత్రిలో గడిపిన సత్తార్ ఇటీవలే బయటకు వచ్చాడు. మనుష్యులను చంపి వారి మెదళ్ళు తిన్నాడన్నా అభియోగం... అతని మీద వుంది... ఒక్కోసారి శాడిస్ట్‌గా ప్రవర్తిస్తాడు... తనలో తనే మట్లాడుకుంటాడు... అతనిలో సైకో లక్షణాలు వున్నాయని కోర్టు విశ్వసించింది. అతను ప్రమాదకరమైన వ్యక్తిగా భావించింది. కొన్నాళ్ళు అతనికి ట్రీట్‌మెంట్ అవసరమని భావించి ఆసుపత్రిలో ఉంచింది.

అక్కడ డ్యూటీ డాక్టర్‌ని చంపి పారిపోయి వచ్చాడు. ఖాసింకు నమ్మినబంటు... మిలటరీ రహస్యాల పెన్‌డ్రైవ్ అతని దగ్గరే ఉంది. దానిలో కొన్ని రహస్య స్థావరాల వివరాలు డీకోడ్ చేయాలి... ఇలాంటి వాటి గురించి తెలిసిన వ్యక్తిని కలిసి వాటిని డీకోడ్ చేయించే బాధ్యత సత్తార్‌ది.

:::::

ఖాసిం బాసింపట్టు వేసుకున్నాడు. అతను తిరుపతి వచ్చి అప్పుడే ఇరవై నాలుగు

గంటలు దాటింది. మోహన ప్లాన్ ప్రకారం ఇక్కడికి వచ్చాడు. మిలటరీ రహస్య స్థావరాల వివరాలు డీకోడ్ చేసే వ్యక్తికోసం సత్తార్ అన్వేషిస్తున్నాడు. రాష్ట్రపతి తిరుపతి వచ్చేలోగా తను చేయవలసిన పనులు చాలా వున్నాయి. రాష్ట్రపతిని ఈ లోకం నుంచి తప్పించడం చిన్న విషయం కాదు... తనే దగ్గరుండి ఈ పనిని పూర్తిచేయాలి. బాంబ్ బ్లాస్ట్ స్కీం ఇక్కడ కుదరదు అని అర్థమైంది. రివాల్వర్స్‌ని పసిగట్టే డిటెక్టర్‌లూ వచ్చాయి...

తిరుపతి క్షేత్రం ప్రశాంతంగా వుంది... రానున్న కొద్ది గంటల్లో ఒక మహా విధ్వంసం జరుగుతుందన్న విషయం అక్కడ ఎవరికీ తెలియదు.

మరో కొద్ది గంటల్లో రాష్ట్రపతి తిరుపతి వస్తున్నాడు. సత్తార్ మిలటరీ రహస్యాలు డీకోడ్ చేసే వ్యక్తి కోసం బయల్దేరడానికి సిద్ధంగా వున్నాడు. అప్పుడే అతను వున్న గది తలుపు మీద శబ్దం వినిపించింది.

వచ్చింది ఎవరు? రూం బాయ్? లేదా...?

సత్తార్ దిండు కింద వున్న రివాల్వర్ బయటకు తీసాడు.

⁂

ఆరోజు ఉదయమే శ్రీనివాస్ ఈడూరి తిరుపతి వచ్చాడు. రాత్రి కార్తికేయ ఫోన్ చేసిన విషయం చెప్పాడు. అర్జెంటుగా చేయవలసిన పని చెప్పాడు. సత్తార్‌కు సంబంధించిన ఫైల్ మెయిల్ చేసాడు.

సత్తార్ ఫోటో చూసి షాకయ్యాడు. ఒకప్పుడు తన చేతిలో చావుదెబ్బలు తిన్న వ్యక్తి. హైదరాబాద్‌లో ముగ్గురు అమ్మాయిలను ఘోరంగా చంపిన వ్యక్తి. తిరుపతి రావడంతోనే ఫ్రెష్ అయి సరాసరి సత్తార్ వున్న హోటల్‌గదికి వచ్చాడు.

⁂

దేవుడి గదిలోకి వెళ్ళాడు కార్తికేయ... అక్కడి దృశ్యం చూసి షాకయ్యాడు. పూజగదిలో దేవుడికి పూజ చేసింది మోహన. ఆధ్యాత్మిక భావాలను వెదజల్లే అగరొత్తుల పరిమళం... దేవుడి విగ్రహం ముందు మహామాన్వి ఖడ్గం. మోహనను సంహరించడానికి తీసుకు వచ్చిన ఖడ్గం... తనను చంపే ఆయుధానికి తనే పూజ చేస్తుందా? రెండు చేతులో జోడించి దేవుడి ముందు నిలబడి కళ్ళు మూసుకున్నాడు.

''దుష్టశిక్షణ కోసం నేను చేపట్టిన ఈ ఆయుధం మంచివారికి రక్షణ కలిగించాలి. నేను ఏ తప్పూ చేయకుండా, నా చేతిలోని ఈ ఖడ్గం అమాయకులను శిక్షించకుండా చూడు స్వామీ''

కార్తికేయ మహామాన్వి ఆయుధాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

ఒక్కసారిగా కార్తికేయ శరీరం జలదరించింది. వేన వేల విద్యుత్తు తరంగాలు తన శరీరంలోకి ప్రవేశించిన ఫీలింగ్ కలిగింది. ఏదో దివ్యత్వం తనను చుట్టుముట్టినట్టు...

మోహన కార్తికేయ వంకే చూస్తోంది. ఆ ఇంటి చుట్టూ కాపలా రెట్టింపు అయింది.

కార్తికేయ మోహన వైపు చూసాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

''మీ మనసులోని కోరిక నెరవేరాలి'' మనస్ఫూర్తిగా అని చేయి చాచింది.

ꕥꕥ

సరిగ్గా గంట క్రితం ఓ అనూహ్య సంఘటన జరిగింది. ఇంటర్‌పోల్ నుంచి వచ్చిన అధికారులకు మోహనకు సంబంధించిన సమాచారం తెలిసింది. ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్‌కాల్... దాంతో ఇంటర్‌పోల్ ఎలర్ట్ అయింది. కార్తికేయ వుండగా మోహనను చంపడం అసాధ్యం... మోహనను హౌస్ అరెస్ట్ చేసిన కార్తికేయ ఇంట్లోనే చంపివేయాలి... మోహన దగ్గర ఏ ఆయుధమూ వుండే అవకాశంలేదు.

ఆవిధంగా కార్తికేయకు తెలియకుండానే అక్కడి బందోబస్తు రెట్టింపు అయింది.

ꕥꕥ

# 63.

ఒక అనూహ్య కలయిక... ఒక విచిత్ర వీడ్కోలు... వీధి వైచిత్రి అనుకోవాలా? విధాత లలాట లిఖితం అనుకోవాలా?

కార్తికేయ కుడిచేతిలో మహామాన్వి ఖడ్గం... కళ్ళు పెద్దవి చేసి చూసింది మోహన... తనపై దూయవలసిన ఖడ్గం...?

కార్తికేయ మోహనవైపే చూస్తున్నాడు... ఉదయమే తలారా స్నానం చేసి దేవుడి గదిలో దీపం వెలిగించి, ధూప, నైవేద్యాలతో... పూజగదిని కోవెలగా మార్చింది. ఈ యుద్ధంలో తను గెలిస్తే మోహన ఏమవుతుంది?

''మోహన నేను ఓడిపోతే... ఈ యుద్ధంలో మరణిస్తే... ముగ్ధను వాళ్ళ తండ్రి దగ్గరికి చేర్చుతావు కదూ...''

''అక్షరమా కన్నీటి చుక్కవై... మెరిసావా? పదమా గొంతు భారమై మౌనమ య్యావా? వాక్యమా మూగవైపోయావా? నిన్నటి జ్ఞాపకం... ఇప్పటి వర్తమానం... రేపటి భవి ష్యత్తును శాసిస్తుందా?

కార్తికేయను చేరింది. అతని కుడిచేతిని కొద్దిగా పక్కకు జరిపింది. అతడిని గట్టిగా పట్టుకుంది.

ఒక చేతిలో ఖడ్గం... మరో చేయి అలానే ఉండిపోయింది.

''మీరు ఓడిపోతే ధర్మం తల దించుకుంటుంది... రాజసం తల వాలుస్తుంది. మీరె ప్పుడూ తూర్పున ఉదయించే సూర్యుడే... పశ్చిమాన అస్తమించే భాస్కరుడు కాదు...

ఇది మీరు యుద్ధభూమిలోకి అడుగుపెడుతున్నప్పుడు మీ ముగ్ధ ఇచ్చే కౌగిలి... ఈ ఆలింగనం మీకు విజయకేతనం... నాలో ముగ్ధను చూసుకోండి. ఇది స్వార్థంతో చెప్పడం లేదు... ఒట్టు...''

కార్తికేయ ఎడమచేయి (అ) ప్రయత్నంగా మోహనను చుట్టేసింది. ఆమె ఉఛ్వాస, నిశ్వాసాలు అతని ఎదను తాకుతున్నాయి.

''ఇది మోహన అనబడే ఒక నిజమైన ప్రాణనేస్తానికి మనస్ఫూర్తిగా ఇస్తోన్న వీడ్కోలు. విజయంతో తిరిగివస్తే... ప్రాణాలతో నిన్ను చట్టానికి అప్పగిస్తాను. నిన్ను మార్చుకుంటాను... నాతో గడిపిన కొద్ది రోజులు నిజాయితీగా వున్నావు... నా ముగ్ధను కాపాడావు... నా మనసులో ఒక ఆత్మీయ అథితిగా వున్న నా నేస్తానికి ఈ కౌగిలి ఒక అందమైన వీడ్కోలు... ఇందులో కోరిక లేదు... కృతజ్ఞత వుంది... నమ్మకం వుంది...'' ఆమె నుంచి విడిపడ్డాడు.

కార్తికేయలో మొదటిసారి కన్నీళ్ళ మెరుపును చూసింది మోహన.

ఆ క్షణమే నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం మోహన జీవితాన్ని అనూహ్యమైన మలుపుకు తీసుకు వెళ్ళింది.

⁂

కార్తికేయ మోహన వైపు చూసాడు.

ఆమెలో ఏ భావమూ కనిపించడంలేదు. ఎన్నో భావాలను బంధించింది...

మనసులోని ప్రేమను... కళ్ళలోని కన్నీళ్ళను... ఓటమిలోని గెలుపునూ... చివరికి తన ప్రాణాన్నీ...

మరో పది నిమిషాల తర్వాత కార్తికేయ ఇంటి ముందు ఓ కారు ఆగింది. అందులో నుంచి బురఖా ధరించిన మహిళ దిగింది. లోపలికి వచ్చింది.

బురఖా ధరించిన మహిళ లోపలికి రాగానే కార్తికేయ తలుపు వేసాడు. ఆ మహిళ బురఖా తొలగించింది.

''ఈ అమ్మాయి ముగ్ధ స్నేహితురాలు... పేరు హేమంత... అని హేమంత వైపు తిరిగి... తను మోహన... అని పరిచయం చేసాడు.

స్నేహపూర్వకంగా చేయి చాచింది హేమంత. మోహన అలానే చూస్తూ ఉండిపోయింది.

''థాంక్యూ మోహనగారూ... మీరు మా ముగ్ధను కాపాడినందుకు...'' సిన్సియర్‌గా అంది హేమంత.

''నేను మీ ముగ్ధను కిడ్నాప్ చేసినందుకు కోపంగా లేదా? మోహన అడిగింది.

''ఉంది... దానికన్నా కృతజ్ఞత ఎక్కువగా వుంది''

కార్తికేయ మోహన వైపు తిరగి... ''మీరు ఈ బురఖా ధరించండి... మీ స్థానంలో హేమంత వుంటుంది'' చెప్పాడు.

''ఎందుకు... నన్ను అరెస్ట్ చేస్తున్నారా? పారిపోతానని భయమా? అడిగింది మోహన.

''కాదు మిమ్మల్ని చంపేస్తారన్న భయం'' చెప్పాడు కార్తికేయ.

విభ్రాంతిగా, అపనమ్మకంగా చూసింది మోహన.

ఈ క్షణం బ్రతకాలని వుంది... ఒక్క క్షణం కార్తికేయ మనిషిగా... ముగ్ధకు ఆత్మీయురాలిగా, ఈ ప్రపంచాన్ని ప్రేమించే మోహనగా బ్రతకాలని ఉంది. తనను చంపడానికి ఒకరు

సిద్ధంగా వున్నారు... ఆ ఒక్కరు ఎవరో తెలుసుకోవాలంటే... మోహన ముగ్ధను కాపాడిన రోజు ఏం జరిగిందో తెలుసుకోవాలి.

:::::

# 64.

నన్ను చంపేస్తారా? ఎవరు'' మోహన అడిగింది.

'' ఇంటర్‌పోల్... మిమ్మల్ని అరెస్ట్ చేయడం... కోర్ట్‌లో ప్రవేశపెట్టడం.. వాళ్ళకు ఇష్టం లేదు''.

''అంటే ఎన్‌కౌంటర్ అన్నమాట'' నవ్వింది.

అవునన్నట్టు తలూపాడు కార్తికేయ.

''అదీ ఒకందుకు మీకు మంచిదేగా... లేక వాళ్ళు నన్ను ఎన్‌కౌంటర్ చేస్తే మీ ముగ్ధ మీ వాళ్ళు ఎక్కడున్నారో తెలుసుకోలేరన్న భయమా?'' మోహన అడిగింది.

''వాళ్ళను కాపాడుకోగలనన్న నమ్మకం వుంది... నా ఆశ్రయంలో వున్న మనిషిని కాపాడుకోవాలన్న తాపత్రయం... అందులోనూ నా ముగ్ధ రూపంలో వున్న మిమ్మల్ని ఎన్‌కౌంటర్ చేస్తే ఎలా ఊరుకుంటాను... అదీకాక నేను ప్రాణంగా ప్రేమించే నా ముగ్ధను రక్షించారు''

''సో... ఇన్ని కారణాల వళ్ళ నన్ను కాపాడుతున్నారు... '' ఇందులో మరో కారణం'' ఏమైనా వుంటే మరింత సంతోషించేదానిని...'' మనసులో అనుకుంది మోహన.

''మీరు ఈ బురఖా వేసుకోండి... నాతో పాటు రండి...''

''మరి ఈ అమ్మాయి?

''మనం వెళ్ళాక వస్తుంది... అప్పటికే మీరు సేఫ్ జోన్‌లోకి వెళతారు''

మోహన కార్తికేయ చెప్పినట్టు చేసింది. బురఖాతో బయటకు నడిచింది. మోహనకు కావల్సిందీ అదే... వీళ్ళు వెళ్ళిన కాసేపటికి హేమంత బయటకు నడిచింది. ఇంటర్‌పోల్ ఈ పరిణామాన్ని ఊహించలేదు.

:::::

సత్తార్ ఒక్కక్షణం సందిగ్ధంలో పడి ఎడమచేతిలో రివాల్వర్ పట్టుకుని తలుపు తెరిచాడు. ఎదురుగా కనిపించిన అపరిచిత వ్యక్తి.

''హలో... నా పేరు రాజేష్... పెన్‌డ్రైవ్ డీకోడ్...'' 'పెన్‌డ్రైవ్ ఏమిటి? మిమ్మల్ని ఎవరు పంపించారు? మీ ఐ.డి చూపించండి? సత్తార్ అనుమానంగా అడిగాడు.

''అదేమిటిసార్? అంటూ అతడు లోపలికి వచ్చాడు. సత్తార్ రివాల్వర్‌ని అతడి వైపు గురి పెట్టాడు...

అతడు ''కూల్ సాబ్.. కూల్... మీక్కావలసింది నా ఐ.డి.నే కదా.. ఇదిగోండి'' అంటూ చేతులు ప్యాంటు జేబులో పెట్టి బయటకు తీసాడు. అతని చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది. సత్తార్ తేరుకునేలోగా రివాల్వర్ సత్తార్ కణతకు గురిపెట్టబడివుంది.

''పూర్ సత్తార్ నీ మెమోరీ దెబ్బతిన్నది... ఇప్పుడు గుర్తొస్తుంది...'' అంటూ కుడి చేయి పిడికిలి బిగించి అతని దవడమీద కొట్టాడు.

''శ్రీనివాస్... సిట్ ఆఫీసర్'' కిందపడ్డ తన రివాల్వర్‌ని చూసి అన్నాడు. అప్పుడు ప్రవేశించింది అతనిలో భయం శ్రీనివాస్‌తో తలపడితే పులితో తలపడినట్టే...

''గుడ్ మెమోరీ... అదే మోమోరీతో నాకో ఇన్ఫర్మేషన్ ఇవ్వు...'' అతని చేతులు వెనక్కి విరిచి కట్టి అడిగాడు.

సత్తార్ తన నాలుకను పళ్ళ మధ్యకు తీసుకువచ్చాడు. ఏ క్షణమైనా ఆ నాలుక సగ భాగం తెగిపడడానికి సిద్ధంగా వుంది.

⁂⁂

# 65.

శ్రీనివాస్ రివాల్వర్ అతడి నాలిక చివరికి ఆన్చి...''నేను ట్రిగ్గర్ నొక్కితే... నాలిక మాత్రమే కాదు... నీ గొంతులో నుంచి బుల్లెట్ దూసుకు వెళ్తుంది. నువ్వు నిజం చెప్పకపోయినా పర్లేదు... నిన్ను టార్చర్ చేసి నీ రెండు చేతులు నీ స్వాధీనంలో లేకుండా చేయడం... నీ రెండు కాళ్ళు చచ్చుబడేలా చేయడం నా ధ్యేయం... అన్నట్టు ఎప్పుడైనా పందికొక్కులు సంచీలో వుండగా మొహాన్ని సంచీలో కుక్కి పందికొక్కులతో నీ మొహాన్ని ఓ ఆట ఆడుకునేలా చేస్తూ ఎలా వుంటుందో ఊహించావా?' అడిగాడు సత్తార్ వైపే చూస్తూ...

''నన్ను చంపితే నువ్వు బ్రతికిపోతావా? మరో కొద్ది గంటల్లో ఈ తిరుపతి...సర్వనా...'' సత్తార్ నోట్లో నుంచి మాట పూర్తికాకుండానే అతడి చెంప చెళ్ళుమంది.

''అప్పటి వరకూ నువ్వు బ్రతికి వుంటే కదా... అయినా నీలాంటి వాడితో డిస్కషన్ అనవసరం... ఒక్క బుల్లెట్‌చాలు... సెకండ్ బుల్లెట్ కూడా వేస్ట్...'' అని కంట్రోల్‌రూంకి ఫోన్ చేసాడు.

'' ఇక్కడ ఒక డెడ్‌బాడీ వుంది. సారీ వుంటుంది... మీ రికార్డ్స్‌లో వున్న పాత నేరస్తుడే... పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో షూట్ చేయబడుతాడు...'' అని ఫోన్ కట్ చేసాడు.

'' ఏయ్... మీరేం చేస్తున్నారు? కా... కావాలంటే నన్ను అరెస్ట్ చేయండి. కోర్టులో హాజరు పర్చండి. భయంగా అన్నాడు.

''నేను పెన్ డ్రైవ్ ఇస్తాను... నన్ను వదిలేస్తారా? ఆశగా అడిగాడు సత్తార్.

''వదిలేస్తాను'' శ్రీనివాస్ చెప్పాడు.

సత్తార్‌కు తను సేఫ్‌గా ఉండడమే ముఖ్యం... మాటకు కట్టుబడే మనిషి కాదు. ఖాసింకు ఇచ్చిన మాట కన్నా తన ప్రాణం ముఖ్యం. అందుకే పెన్‌డ్రైవ్ ఇచ్చేసాడు.

శ్రీనివాస్ పెన్‌డ్రైవ్ చెక్ చేసుకున్నాడు. తర్వాత సత్తార్‌వైపు తిరిగి ''నువ్వు అయిదు నిముషాల్లో ఇక్కడి నుంచి పారిపోవాలి... ఆ తర్వాత నా బాధ్యతలేదు'' అన్నాడు.

సత్తార్ మూడు నిమిషాల్లో అక్కడి నుంచి బయటపడ్డాడు. శ్రీనివాస్ పోలీస్ కంట్రో

ల్‌రూంకి ఫోన్ చేసి...'' సత్తార్ అనే కిల్లర్ పారిపోతున్నాడు... పట్టుకోవడానికి ప్రయత్నిం చండి'' అంటూ తను వున్న లొకేషన్ చెప్పాడు. తర్వాత కార్తికేయకు ఫోన్ చేసి విషయం చెప్పాడు.

''థాంక్యూ శ్రీ... నేను మరో గంటలో తిరుపతి వస్తున్నాను. మీరు ఎలర్ట్‌గా వుండండి'' చెప్పాడు కార్తికేయ.

సత్తార్ పారిపోయాడు... అతడిని పోలీసులు పట్టుకోలేకపోయారు... ఖాసిం ట్రేస్ చేయలేకపోయాడు. ఒక ప్రొఫెషనల్ కిల్లర్ చంపేసాడు... మోహన ఏర్పాటు చేసిన కిల్లర్ అతను.

***

కార్తికేయతో పాటు మోహన వచ్చింది. ఆ ఇంటివైపు చూసింది. అంజలి కార్తికేయను చూసి పరుగెత్తుకు వచ్చింది. ముగ్ధ రూపంలో వున్న మోహనను చూసి గట్టిగా పట్టుకుంది.

తనకూ ఓ చెల్లెలు వుంటే ఇలానే ఉండేదా? మోహనలో విచిత్రమైన ఆలోచన. కార్తి కేయ అంజలి గురించి క్లుప్తంగా చెప్పాడు ''నేను వచ్చేవరకు మీరు ఇక్కడే వుండాలి... ఎక్క డికీ వెళ్ళకూడదు'' చెప్పాడు.

అలాగే అన్నట్టు తలూపింది మోహన.

''నేను వెళ్తాను... టైంలేదు'' చెప్పాడు కార్తికేయ.

''నేనూ వెళ్తాను. నాకూ టైంలేదు'' మనసులో అనుకుంది మోహన.

కార్తికేయ బయల్దేరాడు. వెళ్ళే ముందు ముగ్ధ రూంలో వున్న మోహనను చూసాడు... అదే చివరిసారి... అని మళ్ళీ మోహనను అలా చూడలేని ఆ క్షణం కార్తికేయకు తెలియదు.

***

వియస్సార్ హాస్పిటల్స్...

డాక్టర్ వి.సాకేత్... చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్...

ప్రపంచంలోని అతికొద్ది మంది ప్రముఖ సర్జన్స్‌లో ఒక్కడు... తన తాతగారు క్యాన్స ర్‌తో మరణించడంతో తండ్రి కోరిక మేరకు ఈ హాస్పిటల్‌ని స్థాపించాడు సాకేత్.

క్యాన్సర్‌తో తన దగ్గరికి వచ్చే వారు తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో వెళ్ళాలన్నది అతని ఆశయం. తండ్రి ప్రేరణతో ఈ రోజు అతడు కొన్నివేల కుటుంబాలలో దీపం వెలిగించిన వాడ య్యాడు.

మెడికల్ జర్నల్ తిరగేస్తున్నాడు. ప్రతిరోజు ఇంట్లో నుంచి వచ్చేటప్పుడు దేవుడిని అతను ఒకేటే కోరుకుంటాడు.

''క్యాన్సర్ వ్యాధి నివారణకు వచ్చే వ్యక్తికి నేనెప్పుడూ నెగటివ్ రిపోర్ట్ ఇచ్చే పరిస్థితి తీసుకురావద్దని'' కొన్నిసార్లు దేవుడు అతని మొరను వినడు.

వంద రకాల క్యాన్సర్లు... ఆరోగ్యకరమైన కణాల మీద దాడిచేసి క్యాన్సర్ కణం...

క్యాన్సర్ కణాలు అపరిమితంగా పెరిగిపోయి లింఫ్ నాళాల ద్వారా రక్తంద్వారా మిగతా భాగాలకు కూడా వ్యాపించి, అక్కడి అవయవాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేసి తల నుండి కాళ్ళ వేళ్ళ వరకు వ్యాపించి మనిషిని అర్ధాంతరంగా తీసుకువెళ్ళే వందకుపైగా వున్న క్యాన్సర్‌లోని రకాలు...

సామాన్యులకు తెలియని విషయాలు కనీసం తెలుసుకునే ప్రయత్నమైనా చేస్తే బావుండు.

తన మనసులోని ఆలోచన తెలిసినట్టు తండ్రి చెప్పేవరకు తెలియలేదు.

''సాకేత్ నీ ఆలోచన, తపన ఆ దేవుడికి తెలిసిపోయింది. సామాన్యులకు అర్థమయ్యే అచ్చ తెలుగులో ఓ పుస్తకం వచ్చింది. ఆ పుస్తకం పేరు ''క్యాన్సర్‌ని జయించండి'' చెప్పాడు తండ్రి.

ఇలాంటి పుస్తకాలు సామాన్యులను చేరాలి... అనుకున్నాడు సాకేత్. అప్పుడే అతనికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది.

''గుడ్ మార్నింగ్ డాక్టర్... నేను మిత్రని... ఆ రోజు...'' అవతలి వైపు మాటలు పూర్తి కాకుండానే.

'' ఐ రిమెంబర్... వెంటనే సర్జరీ చేయించుకోవాలని చెప్పానుగా... మీ వాళ్ళు వచ్చారా? సాకేత్ అడిగాడు.

''రాలేదు... నేనే వెళ్ళాలి వస్తుందేమో...'' ఆమె గొంతులో చిన్న బాధా వీచిక.

సాకేత్ కొద్ది క్షణాలు మౌనంగా వున్నాడు.

''డాక్టర్ గారూ... నాకూన బ్రతకాలని వుంది'' ఆమె గొంతులో తడి...

''నేనూ అదే కోరుకుంటున్నాను... మీరేమీ వర్రీ కాకండి. వెంటనే రండి. సర్జరీకి ఏర్పాట్లు చేస్తాను'' ఆ రోజు తన దగ్గరికి వచ్చిన మిత్ర గుర్తుకు వచ్చింది.

''తప్పకుండా వస్తాను'' తన ఎదురుగా తననే గమనిస్తోన్న అంజలి వైపు చూసి చెప్పింది ఆమె.

# 66.

తిరుపతి...

రాష్ట్రపతి తిరుపతికి ఆ రోజే వస్తున్నాడు. మొత్తం బందోబస్తు పూర్తయింది. ఎక్కడి కక్కడ ట్రాఫిక్ ఆంక్షలు...

రాష్ట్రపతిని చేరాలంటే కాన్వాయ్‌ని చీల్చుకుని వెళ్ళాలి. జడ్ కేటగిరి భద్రత... ఏమాత్రం తేడా వచ్చినా జరుగబోయేది వేరు.

శ్రీనివాస్... ఉత్తర ద్వారం వైపు వున్నాడు... సి బి ఐ చీఫ్ మెరికల్లాంటి అధికారులను సెక్యూరిటీగా నియమించాడు... ఓ పక్క నిఘావర్గాలు... పోలీసులు... వీళ్ళ మధ్య ఖాసిం...

:::::

పాడుబడిన ప్రాంతంలో కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఇల్లు... అందులో ఖాసిం వున్నాడు... అతని ఎదురుగా వందమందికిపైగా ఆత్మాహుతి దళం... ఆల్‌ఖైదాలాంటి ఉగ్ర వాద సంస్థనుంచి వచ్చిన వారు... కరుడుగట్టిన నరహంతకులు... డబ్బుకోసం కన్న వారిని తెగనరికే కసాయిలు వున్నారు. వాళ్ళకు ప్రాణం మీద ఆశలేదు... వాళ్ళ మనస్సులో విద్రో హాన్ని, విద్వేషాన్ని నింపాడు ఖాసిం.

రగులుతోన్న అగ్నిపర్వతంలా వున్నాడు ఖాసిం... తన సోదరుడు యాహ్యాఖాన్‌ని మోహన చంపడం... జర్ధార్ చనిపోవడం... సత్తార్ ఎన్‌కౌంటర్... ఇవన్నీ అతనిలో వణుకు పుట్టిస్తున్నాయి.

:::::

ఖాసిం తన ఎదురుగా వున్న ఆత్మాహుతిదళం వైపు చూసాడు. గొంతు విప్పాడు... ''ఇది జీహాద్... మనం చేసే పవిత్ర యుద్ధం... మీరంతా ప్రాణాలకు తెగించాలి... మనం మన ప్రపంచాన్ని నిర్మించుకుందాం. మీకోసం అంతులేని సంపద ఎదురుచూస్తోంది'' ఖాసిం వాళ్ళ బలహీనలతో ఆడుకుంటున్నాడు.

అక్కడున్న వాళ్ళంతా ట్రాన్స్‌లో వున్నట్టు వింటున్నారు... వాళ్ళ చేతుల్లో మారణాయు ధాలు... వాళ్ళ శరీరంపై బాంబులు.. బెల్ట్‌బాంబులు... ఏ క్షణం ప్రమాదం ముంచుకు వచ్చినా చనిపోవడానికి వాళ్ళు సిద్ధంగా వున్నారు. తొంభై వయసు దాటినా పండు వృద్ధులతో రాష్ట్రపతి సమావేశం అవుతున్నాడు. వాళ్ళ పుట్టిన రోజు వేడుకలను దగ్గరుండి మరీ జరిపిస్తున్నాడు. మీరు నలువైపులా తిరుపతిని చుట్టుముట్టండి. నేను ముదుసలి వేషంలో వెళ్తాను... నా చేతిలో కర్రలో వున్న ఈ తల్వార్‌తో... చేతి కర్ర పిడి విప్పాడు... పదును తేలిన తల్వార్... చేతి కర్రలో నుంచి ప్రత్యక్షమైంది. ఈ తల్వార్‌తో రాష్ట్రపతి తల నేలరాలుతుంది. ఈ లోగా మీరు నాలుగు వైపుల నుంచి విధ్వంసం సృష్టించండి.'' ఖాసిం చెప్పి లోపలికి వెళ్ళి పదిహేను నిము షాల్లో వచ్చాడు. అతనిప్పుడు పండు ముదుసలి గెటప్‌లో వున్నాడు. అతని చేతిలో కర్ర... తల్వార్ వున్న కర్ర. ఆ పాడుబడిన ఇంటి ముందుకు ఓ మిలిటరీ జీపు వచ్చింది. అందులో నుంచి ఎనిమిది మంది నలుపు రంగు దుస్తులతో దిగారు. పలు ఉగ్రవాద సంస్థల అధిప తులు... అందులో ముఖ్యమైన వ్యక్తి హుస్సేన్... ఖాసిం ద్వారా ఈ ఎటాక్‌ని జరిపిస్తోన్న వ్యక్తి మోహన ఆవేశాన్ని, ఆలోచనను తన స్వార్థానికి ఎలా ఉపయోగించుకోవాలో తెలిసిన వ్యక్తి.

అతడిని చూడగానే ఖాసిం ఎదురుగా వెళ్ళాడు. ఖాసిం, హుస్సేన్ మిగతా వ్యక్తులు ఓ గదిలో సమావేశమయ్యారు.

:::::

''ఖాసిం అంతా మనం అనుకున్నట్టే జరుగుతుంది కదా...'' హుస్సేన్ అడిగాడు.

''మీకే మాత్రం అనుమానం అక్కర్లేదు... మన మనష్యులు సిద్దంగా వున్నారు. కొన్ని గంటల్లో ఈ పుణ్యక్షేత్రం రక్తసిక్తమవుతుంది. రక్తం ఏరులై పారుతుంది. తిరుపతికి చాలా

దూరంలో వున్నాం... ఈ అడవిలాంటి ప్రాంతానికి ఎవరూ రారు...'' ఖాసిం చెప్పాడు.

'' ఆ కార్తికేయ పులిలాంటి వాడు. ఏ క్షణమైనా దూకుతాడు... హైదరాబాద్‌కు చెందిన సిట్ ఆఫీసర్ మరో వైపు ఇక్కడ మకాం వేసాడు. మనం ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మన తలలు ఇండియా బోర్డర్ దాటి వెళ్ళవు... ఈ ఇండియన్స్ చాలా డేంజర్...'' హుస్సేన్ చెప్పాడు.

''మనవాళ్ళు చాలా జాగ్రత్తగా వున్నారు...''

''మోహన పరిస్థితి ఏమిటి? హుస్సేన్ అడిగాడు.

ఆమె కార్తికేయ కస్టడీలో వుంది. తను సేఫ్‌గా వుండాలని అక్కడ వుంది. పూర్ మోహన... మనం తన పని చేసిపెడతామని నమ్ముతుంది. ప్రభుత్వం దృష్టిలో మోహనే ఇదంతా చేస్తుంది... ముగ్ధను కిడ్నాప్ చేయించడం, ప్లాస్టిక్ సర్జరీ చేయించడం.. దేశంలో విధ్వంసం సృష్టించే కుట్రకు సంబంధించిన ప్లాన్ తాలుకూ వీడియో... అన్నీ నా దగ్గర భద్రంగా వున్నాయి... వీటి తాలూకకు కాపి నిఘా వర్గాలకు పంపించాను. అనుమానం మోహన మీదికి వెళ్తుంది. మనం పని ఫినిష్ చేస్తాం... ఈ దేశం మరోసారి స్వాతంత్ర్యం కోల్పోతుంది. ఈ సారి శాశ్వతంగా...'' క్రూరంగా నవ్వి చెప్పాడు ఖాసిం.

''మోహనను తక్కువ అంచనా వేయకూడదు... ఇప్పటి వరకూ మోహనలోని ఆవేశాన్ని మనం రెచ్చగొడుతూ వచ్చాం... మోహనకు మన మీద అనుమానం వస్తే కష్టం...'' చెప్పి లేచాడు హుస్సేన్.

ఖాసిం నల్ల రంగు పాతకాలం నాటి అంబాసిడర్ కారులో బయలుదేరాడు. జీపులో ఆ ఎనిమిది మంది బయల్దేరారు. ఇక అక్కడ వున్న వందమంది ఆత్మాహుతి దళం విధ్వంసాన్ని సృష్టించడానికి సిద్ధంగా వుంది.

ఆ ఎనిమిది మందిలో ఒకతను తన చేతికి వున్న వాచీ బటన్ ప్రెస్ చేసాడు. అప్పటి వరకూ అక్కడ జరిగిన సంభాషణ అవతలి వ్యక్తికి చేరిపోయింది.

ఆ వ్యక్తి...?

ఆ అడవిలాంటి ప్రాంతంలో గుర్రం రెక్కల చప్పుడు యముని మహిషపు లోహ గంటల వలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ గుర్రం మీద వున్న ముసుగు వ్యక్తి చేతిలో పొడవాటి పదును తేలిని ఖడ్గం... గుర్రం వేగానికి దుమ్ము రేగిపోతుంది... ఎదురు వస్తోన్న జీపుకు గుర్రం అడ్డంగా నిలిచింది. సడెన్ బ్రేక్‌తో జీపు ఆగింది.

జీపులోని వ్యక్తులు ఊహించని పరిణామం... ఆయుధాలు తీసుకునేలోపు గుర్రం మీద వున్న ముసుగువ్యక్తి చేతిలోని ఖడ్గం ఇద్దరి తలలను వేరు చేసింది. వాళ్ళు ఆ షాక్‌లోంచి తేరుకునేలోగా మరో రెండు మృతదేహాలు ఆ అడవిలో పడిపోయాయి... ఏకే 47 నిప్పులుక క్కేలోగా మిగతా ముగ్గురు హతమయ్యారు... రెప్పపాటు కాలంలో రెచ్చిపోయిన ముసుగు వ్యక్తి చేతి కరవాలానికి ఏడు తలలు నేల రాలాయి.

మోహనలోని ఆవేశాన్ని తన స్వార్థానికి, దేశవినాశనానికి ఉపయోగించుకోవాలని చూసిన హుస్సేన్ తల ముసుగు వ్యక్తి పాదాల దగ్గర పడింది.

ఎనిమిదో వ్యక్తి ముసుగు వ్యక్తి ముందు నిలబడ్డాడు.

''మిత్రమా... నువ్వు చేసిన సహాయానికి కృతజ్ఞతలు... నేను చేసిన తప్పును నేనే సరి దిద్దుకునే అవకాశం ఇచ్చావు. ఈ డబ్బుతో ఎక్కడైనా స్థిరపడు... నీ వాళ్ళతో సుఖంగా జీవించు'' గుర్రానికి కట్టి వున్న డబ్బు మూటని అతనికి అందించి... నెత్తుటితో తడిసిన కర వాలాన్ని ఓసారి చూసుకుంది. ముసుగు తొలిగించి మోహన.

''మీరు ఎన్నోసార్లు నన్ను ఆదుకున్నారు. అందుకే మీరు చెప్పగానే ఈ గ్యాంగ్‌లో చేరి ఎప్పటికప్పుడు మీకు సమాచారం అందిస్తూ వచ్చాను'' ఎనిమిదో వ్యక్తి చెప్పాడు.

''నాకు సమయం లేదు మిత్రమా... మళ్ళీ కలుద్దాం... ఈ సారి మిమ్మల్ని ఓ మామూలు వ్యక్తిగా ఓ కుటుంబానికి పెద్దగా చూడాలి'' అంటూ గుర్రాన్ని ముందుకు దూకిం చింది.

''తనకు ఎక్కువ సమయంలేదు...'' ఆమె ఆలోచనలు అశ్వవేగాన్ని మించాయి.

❖❖

# 67.

జరిగినదంతా ఒక కలలా... ఒక సినిమా కథలా అనిపిస్తుంది మోహనకు... అంజలిని మాటలతో మభ్యపెట్టి తను బయటపడింది. తనకు ఎక్కువ టైం లేదు. ఒక పారిశ్రామికవేత్త సాయంతో చార్టెడ్ ఫ్లయిట్ సంపాదించగలిగింది. ఒక్కో నిజం తెలుస్తోన్న కొద్దీ తన ఆలోచ నల సామ్రాజ్యం కుప్పకూలుతోన్న ఫీలింగ్ కలిగింది. ఈ ప్రపంచంలో డబ్బు, అధికారం ఈ రెండు మాత్రమే కిక్కుని ఇస్తాయని నమ్మింది... ఇతరుల కళ్ళలో ఆనందం కూడా మనకు కిక్కుని ఇస్తుందని అనిపిస్తోంది.

సమయం... ఒకే ఒక పదం... అది జీవితాన్ని ఎలా శాసిస్తుందో అర్ధమవుతోంది. గడిచే ప్రతీ క్షణం మనం కోల్పోయే ఆనందమే... అనిపిస్తోంది. కళ్ళ ముందు టార్గెట్ కనిపి స్తుంది... కాలంతో పోటీ పడక తప్పదు. అడవిలాంటి ప్రాంతంలో గుర్రం డెక్కల చప్పుడుకు పక్షులు ఎగిరిపోతున్నాయి. ఇది వరలో కలగని ఆనందం ఇప్పుడు కలుగుతుంది మోహ నలో... ఒక మంచి పని చేసినప్పుడు కలిగే ఆనందం.

కొన్ని గంటల్లో జరుగబోయే మహా విధ్వంసాన్ని ఆపాలి... అందుకు తన మరణాన్ని ఫణంగా పెట్టినా సరే...

❖❖

పరమ పవిత్రమైన తిరుపతి దేవస్థానం... శ్రీనివాసుడి నామస్మరణ ఆ ప్రాంగణంలో వినిపిస్తోంది. ఎనభై దాటిన వృద్ధులు అక్కడ సేదతీరుతున్నారు. జీవితం చివరి మజిలీలో ఆ దేవుడి దర్శనం... రాష్ట్రపతి చేతుల మీదుగా వేడుకలు...

ఆ వృద్ధులను ప్రత్యేక ద్వారం గుండా తీసుకువచ్చారు. నడవలేని స్థితిలో వున్నా వారిని వీల్‌చైర్‌లో తీసుకువచ్చారు. కొందరు చేతి కర్రల సాయంతో వచ్చారు. అయితే వారి వయసు దృష్ట్యా రాష్ట్రపతి ఆదేశాలతో పెద్దగా వారిని చెక్ చేయలేదు. ఆ వృద్ధుల సమూహంలో ఖాసిం వున్నాడు. అతని చేతి కర్రలోపదును తేలిన ఖడ్గమూ వుంది.

:::::

కార్తికేయ కారు దిగాడు. కారు వెనక సీట్లో మహామాన్వి ఖడ్గం వుంది. ఏడుకొండల నుంచి ఒక మెరుపు వచ్చి ఖడ్గంలో విలీనమైన ఫీలింగ్. అతని పులి కళ్ళు ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఖాసిం ఇక్కడికి వస్తాడన్న పక్కా సమాచారం వుంది. ఎలా వస్తాడు? ఏ వేషంలో వస్తాడు? శ్రీనివాస్ సత్తార్‌ని ఫినిష్ చేసాక కొద్దిగా రిలీఫ్ వుంది. ముగ్ధ జాడ తెలియాలి.

ఖాసింని ఫినిష్ చేయగలిగితే... మోహనను మార్చవచ్చు అన్న నమ్మకం వుంది కార్తికేయకు..

మరో మూడు గంటల్లో రాష్ట్రపతి వస్తాడు. వేద పండితులు, ప్రధాన అర్చకుడు, ఛైర్మన్ అంతా రాష్ట్రపతి రాకకోసం ఎదురుచూస్తున్నారు. బందోబస్తు పకడ్బందీగా వుంది. ఒక్క క్షణం నవ్వొచ్చింది... బాధతో కూడిన నవ్వు... ఇద్దరు ప్రధానులు బందోబస్తు వున్నా బలైపోయారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి రాకూడదు.

సరిగా కూతవేటు దూరంలో జర్దార్ వున్నాడు... కార్తికేయను వెంబడిస్తూనే వున్నాడు. అతను హిందువు వేషంలో వున్నాడు.

:::::

పాడుబడిన భవంతిలోకి ప్రవేశించింది మోహన. అప్పటికే అక్కడవున్న వందమంది ఆత్మాహుతి బృందం... సిద్ధంగా వుంది. కరుడుగట్టిన కర్కశత్వం వాళ్ళ మోహాల్లో కనిపిస్తుంది. వాళ్ళ నడుములకు బెల్ట్ బాంబులు ఫిక్స్ చేయబడివున్నాయి. మోహన వాళ్ళవైపు చూసింది. వాళ్ళ బలహీనత తెలుసు... ఎన్నోసార్లు వాళ్ళను హిప్నటైజ్ చేసి ట్రాన్స్‌లోకి తీసుకువెళ్ళి వాళ్ళతో విద్రోహపూరిత కార్యకలాపాలు కొనసాగింది.

మోహన అక్కడికి వస్తూనే వాళ్ళ వైపు డ్రగ్స్ విసిరేసింది. రోజుల తరబడి ఆహారం లేకుండా ఆకలితో వుండి ఒకేసారి భోజనం దొరికితే ఎలా వుంటుందో వారి పరిస్థితి అలా వుంది.

అందరూ ఎగబడుతున్నారు.

''స్టాపిట్'' అరిచింది మోహన. అదరూ సైలెంట్ అయ్యారు. మోహన వైపు చూస్తున్నారు. ఆమె స్వరం వారికి చిరపరిచితం.

'మీరంతా నా వైపే చూస్తున్నారు. మీకు నా మాటలు మాత్రమే వినిపిస్తున్నాయి. ''మోహన గొంతులో గాంభీర్యం... కమాండింగ్...

''మీరంతా ఫారెస్ట్‌లోకి వెళ్తున్నారు. అక్కడ టెంట్‌లో వున్నా తీవ్రవాద సంస్థల నాయ

కులను కలుస్తున్నారు. అక్కడ వున్న నాయకులను అతి దారుణం బెల్ట్ బాంబులతో చంపేస్తు న్నారు''

వాళ్ళకు సజెషన్స్ ఇస్తుంది.

వాళ్ళు మంత్రముగ్దుల్లా వింటున్నారు. వాళ్ళు మోహన ఏది చెబితే అది చేస్తారు.

''కమాన్ స్టార్ట్ యువర్ ఆపరేషన్... మూవ్'' అంది. అంతా యుద్ధ సైనికుల్లా ముందుకు కదిలారు.

మోహనకు తెలుసు. వాళ్ళంతా ఫారెస్ట్ ఏరియాకు బయల్దేరారు... అక్కడ వున్న తీవ్ర వాద సంస్థల నాయకులను ఫినిష్ చేస్తారు. ఒక మంచి పనికోసం ఈ వంద మందిని బలిచే యక తప్పదు. చిన్న వయసు నుంచే వీళ్ళలోకర్కశత్వాన్ని నింపారు. వీళ్ళను మార్చడం సాధ్యం కాదు. ఎప్పటికైనా ప్రమాదకరమే...

తిరుపతిలో జరిగే విధ్వంసాన్ని కళ్లారా చూడాలని వచ్చిన ప్రత్యర్థి దేశాల తీవ్రవాద నాయకులను ఇలా చంపడమే కరెక్ట్. తనలో వచ్చిన ఈ మార్పు తనకే ఆశ్చర్యాన్ని కలిగి స్తుంది. అంతకన్నా ఆనందాన్ని కలిగిస్తుంది.

***

అదే భవనంలో వున్న రెండో అంతస్థులోకి వెళ్ళింది. అక్కడ విద్యారణ్య, డాక్టర్ రాధా రాణి, మోహన రూపంలో వున్న ముగ్ధ... వున్నారు. వాళ్ళ చుట్టూ బాంబులు ఫిక్స్ చేయబడి వున్నాయి. ఎవరూ కాపలా ఉండకుండా, వాళ్ళు తప్పించుకుపోకుండా ఈ ఏర్పాటు అప్పుడు మోహనే చేసింది. బాంబులు ఎక్కడ వున్నాయో తెలుసు. వాటిని క్షణాల్లో డిస్‌కనెక్ట్ చేసింది.

'' ఈ క్షణం నుంచి మీరు స్వేచ్ఛాజీవులు... నావళ్ళ మీకు ఇబ్బంది కలిగితే క్షమిం చండి. ముగ్ధకు వెంటనే సర్జరీ జరగాలి. మీరు వెళ్ళండి. మరో పది నిమిషాల్లో వెహికల్ వస్తుంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి వెళ్ళండి. ఆల్ ది బెస్ట్...'' వాళ్ళని వదిలేసి అంది.

ముగ్ధ మొదటిసారి తన రూపంలో వున్న మోహనను చూస్తోంది. తనను తను చూసుకుంటున్నట్టు వుంది. స్వతహాగా మనుష్యులను ద్వేషించని ముగ్ధ, మోహన మంచిత నాన్ని తనను కాపాడిన రోజు చూసింది. మోహన దగ్గరికి వెళ్లి హత్తుకుంది.

ఒక క్షణం ఆ స్పర్శ తనను తానూ హత్తుకున్న స్పర్శలా అనిపించింది. మనసు పొరల్లో చిన్న ఉద్వేగం...

''మరి మీరు?'' డాక్టర్ రాధారాణి అడిగింది.

నవ్వి మౌనంగా ఉండిపోయింది. మోహన చెప్పినట్టుగా వెహికల్ వచ్చింది. వాళ్ళని సాగనంపింది. ఒక విచిత్ర వీడ్కోలు. తనే కిడ్నాప్ చేసి...

ఒంటరిగా మిగిలింది ఆ శిథిల భవనం ముందు మోహన.

ఆమె సెల్ రింగయింది. డాక్టర్ సాకేత్ నుంచి వచ్చిన కాల్...

'' ఎక్కడున్నారు? సర్జరికీ ఎన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి''

''వస్తున్నాను డాక్టర్... ఇప్పుడే నా బాధ్యతలు పూర్తి చేసుకున్నాను'' చెప్పింది

మోహన.

మరో కొద్ది సేపట్లో దుమ్ము రేపుకుంటూ అక్కడికి వచ్చింది ఓ హెలికాప్టర్.

మోహనను తీసుకుని వెళ్ళింది.

అదే సమయంలో రాష్ట్రపతి తిరుమల చేరుకున్నాడు.

⁘⁘

# 68.

వేదమంత్రాల మధ్య దేశ ప్రథమ పౌరుడికి ఘనస్వాగతం లభించింది. శ్రీనివాస్ ఓ వైపు, శ్యాంసన్ మరో వైపు ఎలర్ట్‌గా వున్నారు. ఫారెస్ట్ ఏరియాలో వున్న ఉగ్రవాద సంస్థల నాయకులు రాష్ట్రపతిపై జరిగే హత్యాయత్నాన్ని చూడాలని ఉబలాటపడుతున్నారు. అక్క డక్క టెంట్స్... లాప్‌టాప్‌లో లైవ్ చూస్తున్నారు... తిరుపతిలో పలుచోట్ల జరుగవలసిన ఆత్మా హుతి దాడులకు సంబంధించిన వార్తలు ఇంకా రాకపోవడం వారికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ పాటికి ఆత్మాహుతి దాడులు జరగాలి.

సరిగ్గా అదే సమయంలో ట్రాన్స్‌లో వున్నట్టు వందమంది ఆత్మాహుతి సభ్యులు నాలుగు వైపుల నుంచి ఆ ప్రాంతాన్ని ముట్టారు.

సడెన్‌గా ఆత్మాహుతి దళం తమ ముందు ప్రత్యక్ష్యం కావడంతో ఉగ్రవాద సంస్థల నాయకులు ఖంగు తిన్నారు. ఆత్మాహుతి దళం మొహంలో ఎలాంటి భావాలు కనిపించడం లేదు. యంత్రాల్లా వున్నారు. వాళ్ళ చేతులు నడుం మీదికి వెళ్లాయి.

'' ఏయ్... ఏం చేస్తున్నారు... మీకు చెప్పిందేమిటి? మీరు చేస్తున్నది ఏమిటి?'' ఓ ఉగ్రవాద నాయకుడు కోపంగా అడిగాడు.

వాళ్ళు మట్లాడలేదు. బెల్ట్‌బాంబ్ మీద చేయివేసారు...

''రేయ్ ఖాసంకు ఫోన్ చెయ్... వీళ్ళని ట్రాన్స్‌లోకి తీసుకురావడం వాడి వల్లే అవు తుంది...'' ఓ నాయకుడు అరిచి చెప్పాడు. మరొకడు ఖాసింకు ఫోన్ చేసాడు. అదే వాళ్ళు చేసిన పొరపాటు.

⁘⁘

కార్తికేయ కంట్రోల్ రూంలో వున్నారు. తాత్కాలికంగా ఏర్పాటుచేసిన కంట్రో ల్‌రూం... రాష్ట్రపతి దేవుడిని సందర్శించే క్రమంలో కొన్ని సి సి కెమెరాలు రహస్యంగా ఏర్పాటు చేయబడ్డాయి. అన్ని వైపుల నుంచి కవర్ చేస్తున్నాయి ఆ కెమెరాలు.

కార్తికేయ చాలా నిశితంగా గమనిస్తున్నాడు. ఖాసిం ఏ మార్గంలో ఎటాక్ చేయబోతు న్నదో అంతుచిక్కడంలేదు.

⁘⁘

వృద్ధులను పలకరిస్తున్నాడు రాష్ట్రపతి. వృద్ధుల్లో వున్న నిరాశ, నిస్పృహలను పార

ద్రోలే పనిలే వున్నాడు.

''వృద్ధాప్యం అంటే మరణానికి ముందు వున్న దశకాదు... జీవితంలో సాధించలేని వాటిని సాధించే ప్రయత్నం చేయాలి. మీ అనుభవాలు పిల్లలకు తెలియజేయాలి. వృద్ధాప్యం అనివార్యం... అందరికీ వస్తుంది. యవ్వనం శాశ్వతం అని విర్రవీగకూడదు...'' తన మనసు లోని మాటలు చెబుతున్నాడు.

అక్కడున్న వృద్ధులకు ఆనందంగా వుంది. ఇలా రాష్ట్రపతి తమతో స్వయంగా మాట్లా డుతాడని అనుకోలేదు.

మరికాసేపట్లో స్వామివారి దర్శనానికి బయల్దేరుతాడు. అప్పటికే సి బి ఐ చీఫ్ వచ్చాడు. కార్తికేయను ఆప్యాయంగా హత్తుకున్నాడు. నువ్వు ఉన్నావంటే నాకు కొండంత అండ అన్నాడు. కొద్దిసేపటికి క్రితం వరకు సి బి ఐ చీఫ్‌కు కార్తికేయ ఎవరన్నది తెలియలేదు. సమయం వచ్చింది కాబట్టి కార్తికేయ అసలు విషయం చెప్పాడు.

⁂⁂

తనతో పాటే వృద్ధులకు ప్రత్యేక దర్శనం చేయించాలని నిర్ణయించుకున్నాడు రాష్ట్ర పతి. వాళ్ళంతా రాష్ట్రపతితో కలిసి ప్రత్యేక ద్వారం గుండా వెళ్లడానికి సిద్ధపడుతున్నాడురు. కార్తికేయ రాష్ట్రపతి ప్రతీ కదలికను గమనిస్తున్నాడు.

ఖాసిం ఆ వృద్ధుల్లోనే వున్నాడు. అతని చేతిలో కర్ర వుంది. అందులో కరవాలం వుంది. రాష్ట్రపతి కోరిక మేరకు వృద్ధులను పెద్దగా చెక్ చేయలేదు. ఖాసింకు ఫోన్ వచ్చింది... అది వైబ్రేషన్ మోడ్‌లో వుంది... చిన్నగా వులిక్కిపడ్డడు... ఈ టైంలో ఫోన్ చేసిందెవరు?

సిసి కెమెరాల ద్వారా జాగ్రత్తగా వాచ్ చేస్తోన్న కార్తికేయ ఓ వృద్ధుడి కలవరపాటు గుర్తించాడు. అతని చూపులు గమనించాడు. నేరస్థుడి సైకాలజీ తెలిసిన వ్యక్తి... వెంటనే ఎలర్ట్ అయ్యాడు... తన పక్కనే వున్న మహామాన్వి ఖడ్గాన్ని చేతిలోకి తీసుకున్నాడు... బయటకు పరుగెత్తాడు... క్షణకాలంలో జరిగిన సంఘటన.

⁂⁂

ఆపరేషన్ థియేటర్...

డాక్టర్ రాధారాణి మొహంలో స్వేదం... అలిసిన కళ్ళు... మోహనగా మారిన ముగ్ధ తిరిగి ముగ్ధగా మారబోతుంది. మామూలు ఆపరేషన్ కాదు... ఒక మెలోడ్రామా... ఒక అద్భుత అనుభవం... దైదీ భావాలు... ఇదంతా కలలా వుంది. తమ కిడ్నాప్... సర్జరీ... రక్తపా తాలు... బ్రహ్మదేవుడు సైతం రాలేని లలాట లిఖితంలా అనిపిస్తోంది.

⁂⁂

మోహన కళ్ళు మూసుకుంది. కొద్ది సేపట్లో ఢిల్లీలో అడుగు పెడుతుంది. విధి ఆడిన విచిత్ర క్రీడ... నిన్నటి తను నేడు ఏమైంది? నేటి తను రేపేమవుతుంది? అసలు తనకు రేపు అనేది ఉంటుందా? పై నుంచి చూస్తే ఢిల్లీ ఒక మినీయేచర్ సెట్‌లా కనిపిస్తుంది.

ఆ దేవుడి సృష్టిలో ఈ ప్రపంచం ఒక మినీయేచర్‌సెట్... తామంతా చిన్న చిన్న బొమ్మలు... నవ్వొచ్చింది మోహనకు... తనేమిటి ఇలా ఆలోచిస్తుంది? ఇది వేదాంతమా? వైరాగ్యమా? తనకు... తనకు క్యాన్సర్...? తనిక బ్రతకదా?

:::::

# 69.

ఉపసంహారం...

మంత్రోచ్ఛారణల వేద ఘోష... పరమ పవిత్రమైన తిరుమలేశుడి సన్నిధిలో జరుగబోయే మహా సంగ్రామం... కార్తికేయ చేతిలోని కరవాలం... త్రినేత్రుడి ముక్కంటిగా, మహావిష్ణువు సుదర్శనచక్రంగా, విశ్వరూపం దాల్చిన మహోగ్రరూపమై... ఖాసింకు అర్థమైంది... కార్తికేయ ఉగ్రరూపం కళ్ల ముందు కనిపిస్తోంది. నరసింహావతారమా... ప్రళయకాల యముడి... అగ్రహోదగ్రుడై... వాయువేగాన్ని అధిగమించి, పరుగెత్తుకు వస్తున్నాడు. ఆ వేగాన్ని చూసి మేఘాలు చెల్లాచెదురయ్యాయి. ఉరుములు ఉరిమాయి... పిడుగులు గొంతు విప్పాయి.

ఖాసింకు రాష్ట్రపతి కన్నా ముందు కార్తికేయను చంపితేనే తన ప్రాణాలు నిలుస్తాయని అర్థమైంది. సెక్యూరిటీ ఎలర్ట్ అయ్యేలోగానే సెక్యూరిటీ చేతిలో వున్నా స్టన్‌గన్ తీసుకున్నాడు... ఒక్కసారిగా బుల్లెట్స్ వర్షం కురిపించింది అప్పుడే వినిపించింది ఓ గొంతు... ఒళ్ళు గగుర్పొడిచేలా... గొంతును చీల్చుకుంటూ అల్లా హో అక్బర్... ఏ అల్లా... జర్దార్ మెరుపు వేగంతో కార్తికేయకు అడ్డు వచ్చాడు... స్టెన్‌గన్‌లోని బుల్లెట్ల వర్షం జర్దార్ శరీరాన్ని తూట్లుపొడుస్తోంది... తిరుపతి ప్రాకారాన్ని చూస్తూ... అల్లాని ప్రార్థిస్తూ అతని కనులు మూ...త...ప...డు...తు...న్నా...యి.

జర్దార్... కార్తికేయ జర్దార్ తలను తన ఒళ్ళోకి తీసుకున్నాడు.

దోస్త్... మేరా దోస్త్... నా బిడ్డకు పునర్జన్మను ఇచ్చిన మిత్రమా... ప్రేమలోని అల్లా తత్వాన్ని చెప్పిన సోదరా... నా మరణం ఒక పశ్చాత్తాపం... అల్లా దగ్గరికి వెళ్తున్నాను... ఏ అల్లా నువ్వు చెప్పిన ప్రేమను కొందరు మతోన్మాదులు తప్పుదారి పట్టిస్తున్నారు... నువ్వు మంచిలోవున్నావు... ఇతరులకు ప్రేమను పంచడంలో వున్నావు. నీ ప్రేమతత్వాన్ని అర్థం చేసుకుని బ్రతికే అవకాశం కోసం మరోసారి పుట్టించు  అని అల్లాను కోరుకోవడం కోసం వెళ్తున్నాను.

అదిగో దోస్త్... నీ దేవుడిలోనూ నాకు అల్లా కనబడుతున్నాడు... నీ లోనూ కనపిస్తున్నాడు... వుంటాను మిత్రమా... నా బిడ్డను నీకు అప్పగిస్తున్నాను. వాడిని కార్తికేయలాచూడాలి…

జర్దార్‌కు శ్వాస తీసుకోవడం కష్టమవుతోంది?

మిత్రమా నాకోసం నువ్వు నీ ప్రాణాలు అర్పించావా? కార్తికేయ కళ్లలో కన్నీళ్ళు.

కాదు దోస్త్... మంచితనాన్ని బ్రతికించడం కోసం... ఖాసిలాంటి దేశద్రోహిని బట్టి మా ముస్లిం సోదరులంతా అలాంటి వాళ్ళే అనుకోవద్దని చెప్పడంకోసం నా ప్రాణాలు ఖర్చు చేసాను.

జర్దార్... అతని చేతిని స్నేహపూర్వకంగా నొక్కాడు కార్తికేయ.

ఇది కంట తడిపెట్టే సమయం కాదు దోస్త్... ఆ నీచుడిని అంతమొందించు... ఆ దృశ్యాన్ని చూసి హాయిగా కన్ను మూస్తాను.

కార్తికేయ తల ఎత్తాడు... సెక్యూరిటీ తేరుకునేలోపే ఖాసిం రాష్ట్రపతిని టార్గెట్ చేయాలని అనుకున్నాడు. చేతి కర్రలోనుంచి కరవాలాన్ని తీసాడు.

ఆకాశం మేఘావృతమైంది. ఒకసారిగా మారిన వాతావరణం... ఖాసిం చేతిలోని కరవాలం గాల్లోకి లేచింది. పోలీసులు తిరుమలను చుట్టుముట్టారు. ఆకాశంలో మెరిసిన మెరుపుకు ఖాసిం చేతిలోని కరవాలం తళుక్కున మెరిసింది. కొద్ది క్షణాల వ్యవధి... స్ప్లిట్ సెకన్... క్షణంలో వెయ్యోవంతు...

కార్తికేయ చేతిలోని మహామాన్వి ఖడ్గం గాలిలోకి లేచింది... గురి చూసి బలంగా విసిరాడు...

వాయుదేవుడు దారి చూపాడు... వరుణుడు హర్షించి, వర్షించాడు... ఏడుకొండలు... గోవిద నామస్మరణతో ఆ మహామాన్వి ఖడ్గానికి దిశానిర్దేశం చేస్తున్నాయి.

కురుక్షేత్రంలోని పర్జన్య శంఖారావం ఆకాశంలో పిడుగుపాటై వినిపిస్తోంది. భక్తులంతా కళ్ళు మూసుకున్నారు... సాక్షాత్తు ఏడుకొండలు కంపించాయి... పాపనాశనం ఒక్కసారిగా ఉప్పొంగింది...

మహామాన్వి ఖడ్గం ఒకే ఒక వేటుతో ఖాసిం తలను మొండెం నుంచి వేరు చేసింది. ఆ తల ఏడుకొండలు దాటి నేల రాలింది.

జర్దార్ ఆ దృశ్యం చూడడంకోసమే బ్రతికి వున్నట్టు... కన్ను మూసాడు... తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు.

ఒక్కసారిగా ఆకాశం వర్షించింది. ఆ వర్షధారలో కార్తికేయ శాంతించాడు.

***

ఒక్కసారిగా కలకలం... టీవీ ఛానెల్స్ లైవ్‌లు మొదలుపెట్టాయి. జరిగిన విషయం పూర్తిగా తెలియదు. కేవలం రాష్ట్రపతిని చంపడానికి పెద్దకుట్ర జరిగిందని అభివర్ణించాడు. అయిన ప్రతీ ఒక్కరూ చావుతో మూల్యం చెల్లించుకున్నారు. ఈ మహా విధ్వంసానికి మూల్యం చెల్లించుకున్నారు. ఈ మహా విధ్వంసానికి కీలకమైన మోహన పశ్చాత్తాపంతో పరిహారం చేసుకుంది. ఒక మహా విధ్వంసాన్ని, తను సంధించిన విధ్వంస అస్త్రాన్ని తనే నియంత్రించింది. అందుకు తన ప్రాణాలను ఫణంగా పెట్టింది. మృత్యువుతో పోరాడుతుంది.

***

కార్తికేయ స్వయంగా ముందుకు నడిచాడు. రాష్ట్రపతి స్వహస్తాల మీదుగా మహా

మాన్వి ఖడ్గాన్ని, రత్నఖచిత వజ్రవైడ్యూరాలు పొదిగిన ఖడ్గాన్ని శ్రీనివాసుడి పాదాల చెంత ఉంచారు. ఒక అవతారలక్ష్యంతో సృష్టించబడిన ఆ ఆయుధం తిరిగి ఆ దేవదేవుడి చెంతకు చేరుకుంది. రాష్ట్రపతి కార్తికేయను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకున్నాడు. దేశాన్ని మహా విపత్తు నుంచి కాపాడిన ధీరోదాత్తుడిగా అభివర్ణించారు.

కార్తికేయ మనసంతా ముగ్ధ మీద వుంది... మోహన గురించి ఆలోచిస్తుంది. సరిగ్గా అప్పుడే హేమంత నుంచి ఫోన్...

అంజలిని మభ్యపెట్టి మోహన తప్పించుకుంది  కార్తికేయ అలానే ఉండిపో యాడు. మోహన తప్పించుకుండా? తన నమ్మకాన్ని వమ్ముచేసి... అంటే...?

# 70.

యుగాంతం ఎలా వుంటుంది...?

ద్వాపర యుగంలోశ్రీకృష్ణ నిర్యాణం ఎలా జరిగింది?

ఒక ప్రళయం తర్వాత ప్రకృతి ఎలా వుంటుంది?

ప్రపంచానికి తెలియదు... ఈ ప్రజలకు తెలియదు... ఒక బాంబ్ బ్లాస్ట్ జరిగినప్పుడు మీడియాలో వార్తలు... చర్చావేదికలు... నిరసనలు... పోలీసులు రంగంలోకి దిగుతారు. కానీ ఒక దేశ స్వాతంత్ర్యానికి ముప్పు వాటిల్లిందని ఎందరికి తెలుసు? రాత్రి కాగానే ముసుగు తన్ని పడుకునే సగటు మనుష్యులు, ఆఫీసు నుంచి రాగానే అలిసి, కాసేపు టీవీ సీరియల్స్ వార్తలు చూసి పడుకునే ఉద్యోగస్తులు, ఇలా రకరకాల మనుష్యులు... ఒక రాత్రి ఏం జరుగుతుంది? సరిహద్దుల్లో వుండే జవాన్లు వణికించే చలిలో ఎలా కంటిమీద కునుకు లేకుండా కాపలా కాస్తారు? ఇవన్నీ మనలో చాలా మందికి తెలియవు? తెలుసుకునే ప్రయత్నం చేసేవారెవ్వరు?

అట్లాగే చాలా మందికి కార్తికేయ చేసిన సాహసం, చూపిన ధైర్యం తెగువ తెలియవు. చాలా మందికి వుండే ప్రచార కుతి, కీర్తి కండూతి పట్ల మమకారం లేవు. కార్తికేయకి తెలిసిన దల్లా కర్తవ్య నిర్వహణ, దేశరక్షణ అందులో ప్రాణం పోయినా అది మిన్న అన్న భావన. కార్తికేయకు పదిమంది ముందు తన దర్పాన్ని, తన గొప్పతనాన్ని, వీరత్వాన్ని చాటుకోవడం, ప్రదర్శన చెయ్యడం అస్సలు నచ్చదు. అందుకే కార్తికేయ సవినయంగా రాష్ట్రపతి నుంచి సెలవు తీసుకున్నాడు. తనకు ఏ అవార్డులు, అలంకారాలు వద్దన్నాడు.

దుష్టశిక్షణకోసం అవతారం ఎత్తిన దేవదేవుడు, తన అవతార లక్ష్యం నెరవేరగానే... అవతారాన్ని చాలించినట్టు... ఎప్పుడైతే ఉగ్రవాదాన్ని అణిచి, దేశాన్ని కాపాడాడో అప్పుడే తన పని ముగిసినట్టు మామూలు కార్తికేయగా వీడ్కోలు తీసుకున్నాడు.

శ్రీనివాస్‌లాంటి సమర్థుడైన ఆఫీసర్‌ని తిరిగి విధుల్లోకి తీసుకునేలా చూడమని విజ్ఞప్తి చేసాడు.

మోహన చివరి క్షణంలో చేసిన సాయాన్ని గుర్తుంచుకుని, ఆమెను వదిలి వేయవల సిందిగా, భవిష్యత్తులో ఆమె వల్ల ఏ ప్రమాదం జరిగినా తనే బాధ్యత వహిస్తానని చెప్పాడు. జర్దార్ కొడుకు బాధ్యత వ్యక్తిగతంగా తనే తీసుకున్నాడు.

ఇంత మందికి ఇన్ని చేసి తన కోసం ఏ కోరికా కోరలేదు... రాష్ట్రపతి మొదటిసారి కార్తికేయకు మనసులోనే సెల్యూట్ చేసాడు.

⁂⁂

న్యూఢిల్లీ...

కార్తికేయ సరాసరి అంజలి దగ్గరికి వచ్చాడు. అక్కడే వుంది హేమంత.

ఏం జరిగింది? అడిగాడు కార్తికేయ.

చిన్న పని వుందని వెళ్ళింది... ఎంతకీ రాకపోయేసరికి అంజలి భయమేసి నాకు ఫోన్ చేసింది హేమంత చెప్పింది.

మోహనకు సంబంధించిన వస్తువులు ఇక్కడే వున్నాయా? కార్తికేయ అడిగాడు.

ఉన్నాయి... అంజలి మోహనకు సంబంధించిన వస్తువులు తీసుకువచ్చింది. మోహ నకు సంబంధించిన దుస్తులు... రివాల్వర్, బుల్లెట్స్... వివిధ పేర్లతో వున్నా పాస్‌పోర్ట్‌లు... వాటి మీద రెడ్ కలర్ స్కెచ్‌తో అడ్డంగా ఇంటూ మార్క్ పెట్టింది. క్రెడిట్ కార్డ్స్... డబ్బు... డాలర్స్... అన్నీ వెదికాడు... దుస్తుల అడుగున ఓ మెడికల్ రిపోర్ట్...

వణుకుతోన్న చేతులతో ఆ రిపోర్ట్ చదివాడు.

కార్తికేయ మొహం కళ తప్పింది. ఒక కన్నీటి చుక్క అతని కనుకొలకుల నుంచి ఆత్మార్పణ చేసుకోవడానికి సిద్ధపడింది. మోకాళ్ళ మీద కూచున్నాడు. మోహనకు క్యా...న్స...ర్...

అదీ చివరి క్షణాల్లో...

అప్పుడు వినిపించిందో గొంతు...

ఎక్స్క్యూజ్ మీ

అందరు తల తిప్పి చూసారు... ఆజానుభావుడు... కళ్ళలో తేజస్సు... చూడగానే నమస్కరించాలని అనిపించే రూపం... కార్తికేయ వైపు వచ్చి చేయిచాపి... నా పేరు జగ న్నాథ్... అన్నాడు.

మీరు...?

డాక్టర్ సాకేత్, నా కొడుకు హి ఇస్... సన్నాఫ్ జగన్నాథ్... మోహనకు సర్జరీ చేస్తోన్న చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ సాకేత్ మా అబ్బాయే... కాసింత గర్వంగా చెప్పాడు.

ఓహ్... గ్రేట్ సర్... మీ రాక మాకు ఆనందంగా వుంది... మీరు...

మీలాంటి దేశ భక్తుడుని స్వయంగా అభినందించి పోదామని వచ్చాను

మీకు మీకెలా తెలుసు? కార్తికేయ ఆశ్చర్యపోతూ అడిగాడు.

ఒకప్పుడు RAW ఆఫీసర్ ని...

కార్తికేయ విస్మయానందంతో చూసాడు రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్... జగన్నాథ్... ఈ పేరు ఎక్కడో విన్న గుర్తు... యస్... సమర్ధుడైన...

రా... ఆఫీసర్... రాజకీయ పరమైన కారణాలతో... ప్రభుత్వంతో విభేదించి బయటకు వచ్చిన ఆఫీసర్... పార్లమెంట్ మీద దాడి జరిగినప్పుడు ఒంటిచేత్తో ముగ్గురిని హతం చేసాడు. ఉగ్రవాదులను మట్టి కరిపించాడు. అలాంటి గొప్ప వ్యక్తి తనను వెతుక్కుంటూ... రెండు చేతులు జోడించాడు కార్తికేయ...

జగన్నాథ్ కార్తికేయను దగ్గరికి తీసుకున్నాడు. నేను మరో పని మీద కూడా వచ్చాను... మోహన గురించి

మోహనకు ఎలా వుంది సర్   కార్తికేయ ఆందోళనగా అడిగాడు.

సర్జరీ జరుగుతుంది. ఆపరేషన్‌కు ముందు   ఆమె తరపున సంతకం ఎవరైనా చేస్తారా? అని అడిగితే   తనకు వున్నా ఒకే ఒక ఆత్మీయులు మీరే   అని చెప్పింది... మీరు అందుబాటులో లేరనీ చెప్పింది. అప్పుడే మీ గురించి, మోహన గురించి ఎంక్వయిరీ చేసాను... రిలేషన్ అనేచోట... మీ గురించి దేవుడు... అని రాసింది. నా మనసు చెమర్చింది. తన గురించి చెప్పవద్దని అంది. అయినా మనసాగక వచ్చాను చెప్పాడు జగన్నాథ్.

ప్లీజ్ సర్ నేను మోహనను వెంటనే కలవాలి అన్నాడు కార్తికేయ.

అంతా వియస్సార్ హాస్పిటల్స్‌కు బయల్దేరారు.

⁂

హాస్పిటల్‌కు బయల్దేరుతుండగా డాక్టర్ రాధారాణి నుంచి ఫోన్... ఆ ఫోన్‌కాల్ రిసీవ్ చేసుకుని రాధారాణి చెబుతున్నది విని ఆశ్చర్యపోయాడు. మోహన స్వయంగా వాళ్ళను విడిపించడం, ఉగ్రవాదులను ఏరిపారేయడం... ఒంటరిగా అడవిలోకి వెళ్లడం... అదీ మృత్యువు సరిహద్దులో ఉండి... ముగ్ధకు చేసిన ఆపరేషన్ సక్సెస్ అయింది. మోహనే స్వయంగా ఓ కార్పోరేట్ హాస్పిటల్‌తో మాట్లాడి వాళ్ళకు పెద్ద మొత్తం ఆఫర్ చేసింది ఆపరేషన్ థియేటర్ కోసం...

అంతా వియస్సార్ హాస్పిటల్‌కు బయల్దేరారు.

⁂

హాస్పిటల్‌కు వెళ్లేసరికి ముగ్ధ ఎదురువచ్చింది... కొద్ది క్షణాల మౌనం... ఒక ఆత్మీయ ఆలింగాన స్పర్శ వాళ్ళ ఎడబాటును కాంపెన్సేట్ చేసింది. విద్యారణ్య స్నేహపూర్వకంగా చేయించాడు. డాక్టర్ రాధారాణి కార్తికేయ వైపే చూస్తోండిపోయింది. ఈ మహా కలయికకు సూత్రధారి, దుష్టశిక్షణకు అవతరించిన వ్యక్తి... చెక్కుచెదరని కార్తికేయ నిబ్బరానికి మనసులోనే అభినందలు తెలిపింది.

అంతా ఆపరేషన్ థియేటర్ దగ్గరికి వచ్చారు. బయట గ్రీన్‌లైట్ వెలుగుతూ వుంది. డాక్టర్ సాకేత్ వీళ్ళకు ఎదురు వచ్చాడు... వస్తూనే ఒక షాకింగ్ న్యూస్ చెప్పాడు.

ఆపరేషన్ సక్సెస్ అయింది... కానీ మోహన కనిపించడం లేదు...

విషాదపు మేఘాలు కమ్ముకున్నాయి...

# 71.

డాక్టర్ సాకేత్ కార్తికేయవైపు చూసాడు. కార్తికేయ మోహంలో ఆందోళన కనిపిస్తోంది. సెక్యూరిటీ సిబ్బంది భయం భయంగా చేతులు కట్టుకుని నిలబడ్డారు.

సారీ కార్తికేయగారు... మా హాస్పిటల్లో ఇలా జరగటం మొదటిసారి... ఈ విషయంలో మీరు ఏం చేయాలని అనుకుంటున్నారు? అడిగాడు.

మోహన గురించే... ఇలాంటి పరిస్థితిలో వెళ్ళడం గురించే... కార్తికేయ అన్నాడు.

జగన్నాథ్, కార్తికేయ భుజం మీద చేయివేసి మీకు తెలియనిది కాదు...

ఒక్కటి మాత్రం నిజం, మోహన వెళ్తూ, వెళ్తూ, తనకు సంబంధించిన జ్ఞాపకాన్ని మాత్రం ఇక్కడే వదిలి వెళ్ళింది. ఆమె మీకోసం వదిలి వెళ్ళిన ఖరీదైన... కాదు కాదు విలువైన వస్తువు అదొక్కటే... కార్తికేయకు మోహనకు సంబంధించిన విషయాలు చెప్పాక అన్నాడు జగన్నాథ్. ఆ మాట అందరినీ కదిలించింది...

అప్పుడే హాస్పిటల్ సెక్యూరిటీ చీఫ్ అక్కడికి వచ్చాడు.

సర్ ఈ కవర్ మన సెక్యూరిటీలో వదిలి వెళ్లారు. కవర్ మీద కార్తికేయగారి పేరు వుంది అంటూ ఓ కవర్ ఇచ్చాడు.

కవర్మీద మోహన దస్తూరీ... కవర్ విప్పాడు... లోపల వుత్తరం... వణుకుతున్న చేతులతో అక్షరాల వైపు కళ్ళని పరుగెత్తించాడు.

చిన్నప్పుడు ఎప్పుడో పలకమీద నేర్చుకున్న అక్షరాలు... ఇంతకాలం ఒక యంత్రంలా బ్రతికిన నేను... ఈ యంత్రాన్ని మనిషిగా మార్చిన కార్తికేయ గారికి... మిమ్మల్ని ఎలా పలకరించాలి? ఏమని సంబోంధించాలి? ఎక్కడో ఎప్పుడో చదివిన గుర్తు నిముషానికి డెబ్భైరెండుసార్లు గుండె కొట్టుకుంటుంది...ట...

నా శత్రువులు నాకసలు గుండె లేదని అంటారు... కార్తికేయగారు... నా ప్రపంచంలో రక్తపాతాలు, చంపడాలు తప్ప మరేమీ లేవు. అసలు నేనో ఆడపిల్లని అన్న సంగతి మిమ్మల్ని కలిసేవరకూ గుర్తించలేదు.

ముగ్ధలోని మీ మీద ప్రేమను చూసే వరకూ తెలుసుకోలేదు... మనసు అనే మాటకు అర్థం తెలియనిదానిని... మనసుకు ఏ ఆకారం వుంటుంది? ఎలాంటి రంగులో వుంటుంది?

నిన్న మొన్నటి వరకూ కరడుగట్టిగన ఈ మనిషి ఇప్పుడిలా బేలగా మారిపోయిందేమిటి? అనుకుంటున్నారా? లేదు ఈ మోహన ఎప్పుడు పులిలానే వుంటుంది.

యుద్ధం తర్వాత రక్తపాతం, తెగిపడిన తలలు చూసి అశోకుడు శోకతప్తుడయ్యాడ...ట... మరణమృదంగ ధ్వనుల మధ్య బ్రతికిన నేను మీ సెంటిమెంట్స్ అనే అంద

మైన నేపథ్య సంగీతాన్ని విన్నాను. ఒక ఇష్టం ఇంత గొప్పగా ఉంటుందా?

నాకు మీరు అన్నం తినిపించినప్పుడు మా అమ్మను మీలో చూసుకున్నాను. నన్ను నమ్మి ముగ్ధను కాపాడడానికి పంపించినప్పుడు ఒక మూర్తీభవించిన నిజాయితీని చూసాను. ఒకే ఇంట్లో వున్నా, నన్ను కంటికి రెప్పలా చూసుకున్నప్పుడు ఒక మంచి స్నేహితుడిని మీలో చూసాను.

అన్నింటికీ మించి ఒక మగాడిని... ఒక స్త్రీ కోరుకునే క్వాలిటీస్ వున్నవాడిని చూసాను.

ఏ క్షణం మీ మీద ప్రేమతో నేను ముగ్ధను చంపేస్తానో అన్న భయం కూడా కలిగింది.

చివరికి... నాకు క్షమాభిక్ష పెట్టమని మీరు రాష్ట్రపతిని అభ్యర్థించినప్పుడు మీలో ఒక దేవుడిని చూసాను.

మోహనలో పశ్చాత్తాపం కలిగింది... ప్రభుత్వానికి లొంగిపోయింది... అనే క్లయి మాక్స్ నా జీవితంలో, ఈ కథలో ఉండడానికి వీల్లేదు.

మోహన ఎప్పుడూ మోహనే... ఆ రోజు ముగ్ధను నేను కాపాడిన రోజు చిన్నపాటి బాధతో హాస్పిటల్‌కు వెళ్ళినప్పుడు...

క్యాన్సర్ అనే మరో శత్రువు కూడా ఇన్నాళ్ళు నన్ను అంటిపెట్టుకునే వుందని తెలి సింది.

మరణం అనివార్యం అని తెలిసినప్పుడు చిరునవ్వుతో దానిని ఆహ్వానించాలని ఎక్కడో ఎప్పుడో ఒక రచయిత రాసిన వాక్యాలు గుర్తొచ్చాయి...

నన్ను కాపాడిన డాక్టర్ సాకేత్‌కు, నా వల్ల ఇబ్బందులకు గురైనా నన్ను ప్రేమిస్తున్నా నని చెప్పక చెప్పి కంటతడి పెట్టిన డాక్టర్ రాధారాణికి, విద్యారణ్యకు... ఇన్నాళ్ళు నా రూపాన్ని భరించి, ధరించిన ముగ్ధకు వీడ్కోలు...

నేను ఆత్మహత్య చేసుకోను... బాధతో జీవితాన్ని నరకం చేసుకోను... మీ జ్ఞాపకాల శ్వాసతో పాటు నెమరువేసుకుంటాను...

ది మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ మోహన పారిపోయింది. ఆమె కోసం ఇంటర్‌పోల్ వెతు కుతుంది... అనే వార్తనే నాకు, నా ఈగోకు సంతోషాన్ని ఇస్తుంది.

కానీ ఒక్కటి మాత్రం నిజం, ఈ దేశాన్ని ప్రేమిస్తాను... ఎందుకంటే ఈ దేశంలో నేను ప్రే..మిం..చే కార్తికేయ వున్నాడు... నేను వదిలివెళ్తున్న నా కన్నీళ్ళు వున్నాయి... ఎప్పుడైనా ఖాసింలాంటి వాళ్ళు వస్తే అక్కడ ఈ మోహన వుంటుంది... మీ పనిని నేను చేస్తాను. చివరిగా ఒక్క మాట... నా నలుపు తెలుపుల సంపాదన మీ పరం చేస్తున్నాను.

మరో మోహన తయారవ్వడానికి నేను ఒప్పుకోను. మోహన ఒక్కరే వుండాలి. నా రక్తపు సంపాదన... ఒక మంచి కోసం ఉపయోగపడాలి... క్యాన్సర్‌తో బాధపడే నిస్సహాయు లకూ ఉపయోగపడాలి...

అదేమిటో కార్తికేయగారు... ఇలా రాస్తున్నప్పుడు, మీరు గుర్తొస్తున్నప్పుడు కళ్ళలో

కన్నీళ్ళు వస్తున్నాయి. ఘనీభవించిన కన్నీటి మేఘాన్ని కదిలించారుగా... అందుకేనేమో...

నేను ముగ్ధరూపంతోనే వెళ్తున్నాను... ఎప్పుడైనా, ఎక్కడైనా మీలాంటి కార్తికేయ లాంటి వ్యక్తిత్వం వున్న మగాడు తారసపడితే... అతడిని కిడ్నాప్ చేసి... మీ రూపాన్ని ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తాను... డాక్టర్ రాధారాణి గారిని కిడ్నాప్ చేసైనా సరే... అప్పటి వరకూ ఈ రూపం లోనే మీ మనసుకు దగ్గరగా వుంటాను.

వీడ్కోలు... మిత్రమా... నా ప్రాణమా... నా కంటిలో వున్న కన్నీటికి గుర్తుగా మిగిలిన నా ఆత్మీయ అతిథికి వీడ్కోలు... మీ... ముగ్ధమోహనం...

ఇది ఏ విధాత రాసిన లలాట లిఖితం... ఉత్తరం పూర్తయ్యేసరికి కార్తికేయ మనసు ద్రవించింది. తన శరీరంలోని ఒక భాగం తన భాగాన్ని తను తీసుకుని, కోసుకుని వెళ్ళిపో యిన ఫీలింగ్. ఒక శత్రువు... ఒక కరుడుగట్టిన తీవ్రవాది... ఇలా తన వీడ్కోలుని కన్నీటి పర్యంతం చేసి, ఇంత మందిని కన్నీటితో కదిలించి, అభిజాత్యాన్ని సైతం ఆర్ద్రతగా మార్చి... మోహనను పట్టుకోవడం అసాధ్యం... తనకు తానుగా దొరికితే తప్ప... బరువైన హృదయా లతో బయటకు నడిచారు. జగన్నాథ్, డాక్టర్ సాకేత్ వీడ్కోలు చెప్పారు.

కార్తికేయ, ముగ్ధ, డాక్టర్ రాధారాణి, విద్యారణ్య కారు ఎక్కారు. వాళ్ళ కారు కదిలే సమయంలో... హాస్పిటల్‌పైన టెర్రస్‌లో వాటర్ ట్యాంక్‌లో నీళ్ళ మధ్య చిన్న కదలిక... అప్ప టివరకూ వూపిరి బిగపట్టి జల స్తంభన విద్యతో వాటర్‌ట్యాంక్‌లో నీళ్ళ మధ్య వున్న మోహన పైకి వచ్చింది. తడిచిన దుస్తులతో... కిందికి చూసింది... విషాద వదనాలతో వెళ్తోన్న కార్తికేయ బృందం కనిపించింది... ఆమె చేయి గాలిలోకి లేచింది.

# 72.

ఎక్కడో మొదలైన నా ప్రయాణంలో ఉనికిని కోల్పోయిన మోడుబారిన చెట్టుని... మమకారపు నీరు పోసి, ఆర్ద్రతను ఎరువుగా మార్చి, నాలోని అట్టడుగు పొరల్లో వున్న భావోద్వేగపు కంట తుడిని చిగురింపజేసిన ప్రాణమా... నాలోని మనసును నా నుంచి వేరుచేసి తీసుకువెళ్తున్నావు... రక్తపాతమే నా జీవితమనుకున్న నాకు జీవితంలో రక్తపాశం ప్రేమావేశం ఎలా వుంటుందో చూపించావు. అమ్మవయ్యావు. స్నేహితుడివయ్యావు... చివరికి నా ప్రాణమే నువ్వయ్యావు... ఇన్నీ అయిన నువ్వు ఇప్పుడు నా నుంచి దూరం అవుతు న్నావు...

ఆమె చేయి గాలిలో అతనికి వీడ్కోలు చెబుతోంది... అది చూసిన మనసున్న మేఘం తోటి మేఘాలతో చెప్పి, చెమ్మగిల్ని ఆమె తలమీదుగా వ్యాపించాయి... ఆకాశంలో మేఘాలు కలిసాయి... వీచే గాలి కన్నీటితో చల్లబడి చల్లగా మరుమెల్లగా ఆమె భావాలను మోసుకుని కార్తికేయ వైపు వెళ్తోంది.

నువ్వు చూపించిన నిజాయితీ, ఆప్యాయత, ప్రేమ... మానవత్వం... నీ ఉన్నతమైన వ్యక్తిత్వం... నాలోని దాగున్న నన్ను నిలదీసి, కొత్త నన్నుగా మార్చాయి. ఇది నిజం...

ఆమె దుస్తులు నీళ్లతో తడిసాయి... ఆమె నల్లటి కళ్ళు కన్నీళ్ళతో స్నానించాయి...

జనన-మరణాల మధ్య ఇంత గొప్ప అనుభూతి ఉంటుందా?

కనురెప్పల మధ్య ఇంత గొప్ప తడి తపనగా తచ్చట్లాడుతుందా?

⁘⁘

కారులో కూచోబోతున్న కార్తికేయలో చిన్న ఉలికిపాటు... ఎవరో తనను పిలుస్తోన్నట్టు... ఎవరో తనని వెంటాడుతున్నట్టు... ఓ నీడ తన వెంబడి వస్తున్నట్టు... చిన్న ఉలిక్కిపాటు... తల వెనక్కి తిప్పాడు...

మోహనను ఎవరో వెనక్కిలాగారు. ఒక్క క్షణం అటు ఇటు అయితే కార్తికేయ మోహనను చూసేవాడే...

మోహన తనను లాగిన జగన్నాథ్ వైపు చూసింది. రెండు చేతులు జోడించింది. ఆ రెండు చేతులను ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకున్నాడు.

మీరే లేకపోతే కార్తికేయను చివరిసారిగా, కనులారా చూసేదానిని కాదు అంది మోహన.

రాగద్వేషాల, రక్తపాతాల ఈ జీవితంలో నువ్వు ప్రేమరాహిత్యంలో దెబ్బ తిన్న పక్షివి... నా జీవితంలో ఒక మంచి పని కోసం ఒక చిన్న అబద్ధం ఆడాను. నిన్ను కొందరి మనస్సుల్లో నిలిపి ఉంచడానికి, ఈ నీళ్ళ ట్యాంక్‌లోని కన్నీళ్ళను కలిపి దాచాను. వెళ్ళు మోహనా... ఇన్నాళ్ళు దిక్కులేని దానిలా ఏదో దిక్కులో వున్న నువ్వు ఇప్పుడు సూర్యుడు ఉదయించే తూరుపు దిక్కుకు వెళ్ళు... ఇక నీకు సూర్యాస్తమయం వుండదు. వుండకూడదు... నీ రాకకోసం కార్తికేయ మాత్రమే కాదు... నేను... నాలాంటి చాలా మంది ఎదురుచూస్తారు. ఆల్ ది బెస్ట్... ఆమె చేతిని స్నేహపూర్వకంగా నొక్కి వదిలి చెప్పాడు.

మోహన అక్కడి నుంచి కదిలింది.

⁘⁘

మోహన వెళ్ళిన కాసేపటికి జగన్నాథ్ RAW (రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్)కు ఫోన్ చేసాడు. డైరెక్టర్‌తో మాట్లాడాడు.

థాంక్యూ సర్... నా మీద గౌరవంతో మోహనను ఒక గొప్ప రా ఆఫీసర్‌గా తీర్చిదిద్దడానికి ఒప్పుకున్నందుకు... జీవితంలో ఏ తప్పూ చేయని వాడు తప్పు చేస్తుండవచ్చు... కానీ ఒకసారి చేసిన తప్పును గుర్తించిన వ్యక్తి మళ్ళీ ఆ తప్పు చేయరు... మోహన గొప్ప ఆఫీసర్ అవుతుంది. ఈ దేశాన్ని కబళించే వారి పట్ల సివంగిలా మారుతుంది. ఎందరు ఉగ్రవాదులకో, బందిపోట్లకో క్షమాభిక్ష పెట్టిన మనం ఒక మారిన మనిషిని అస్త్రంగా మారుద్దాం.

కార్తికేయ ఏ ఆశయం కోసం అహరహం తపించాడో, తన ప్రాణాలను పణంగా

పెట్టాడో... ఆ ఆశయాన్ని నెరవేర్చే ఆయుధంగా మోహనను మార్చి కార్తికేయ దేశభక్తికి కానుకగా ఇద్దాం, జై హింద్ అంటూ జగన్నాథ్ ఫోన్ పెట్టేసాడు.

అతని కళ్ళముందు ముగ్ధరూపంలో వున్న మోహ  దేశాన్ని కాపాడే యోధురాలిగా కనిపిస్తోంది... ఈ మహిలో ధరిత్రి ఎరుగని మహత్తర చరిత్ర...

ఒక రచయిత సృజించిన పాత్ర... త్రివర్ణ పతాకంలో సప్తవర్ణశోభితమయ్యే రోజు దగ్గరలోనే వుంది... అస్తూ... తథాస్తు.

⁂

ఈ గదిలో తన మది తలుపు తెరిచింది. గుండె బరువు దిగేవరకూ కార్తికేయ హృదయానికి కన్నీటి అభిషేకం చేసింది. క్షణాలు, నిమిషాలు... గంటలు గడిచినా ముగ్ధ కార్తికేయను వదిలిపెట్టలేదు.

వూళ్ళో వున్న పూర్ణిమకు ఫోన్ చేసింది ముగ్ధ.

పూర్ణిమకు ఏడుపు తన్నుకు వస్తోంది. ఎంతకాలమైంది?

పూర్ణీ... నేను, నా కార్తికేయ కలిసివస్తున్నాం. నా పెళ్ళి కన్నా ముందు నీ దత్తత స్వీకారం జరగాలి... నా తమ్ముడికి అక్కగా స్వీకరించే శుభలగ్నంతో వస్తున్నాను... ఎందుకంటే ఇక నుంచి నాన్నను, తమ్ముడిని చూసుకోవలిసింది నువ్వే కదా ముగ్ధ అంది.

పూర్ణిమ ఫోన్ పక్కన పెట్టి గుడికి పరుగెత్తింది. గుడి తలుపులు మూస్తున్న పూజారిని వారించింది.

జగన్నాథుడిముందు మోకరిల్లింది.

నిన్ను రోజు తిట్టి పోస్తున్నానని భయపడి, అనాథవైన నన్ను ఓ ఇంటికి కూతురిగా పంపిస్తున్నావా? ఇందుకే నన్ను అనాథను చేసి నాతో తిట్లు తిన్నావా? సారీ... నన్ను క్షమించు. ఇక నిన్నెప్పుడు తిట్టాను... కాకపోతే నాకూ కార్తికేయలాంటి మంచి మొగుడిని వెతికిపెట్టు... లేదంటే నిన్ను వదిలిపెట్టను... నిన్నే.. అని చెంపలు వేసుకుని బయటకు పరుగుపెడుతుంటే పూజారి మొదటిసారి ఏడ్చేశాడు.

స్వామీ ఆ అమాయకురాలిని మన్నించు... ఇకనైనా ఆ తల్లిని చల్లగా చూడు అని వేడుకున్నాడు.

ముగ్ధ కార్తికేయుల పెళ్లికి దేవలంతా ఆహుతులే... రాష్ట్రపతి ప్రత్యేక కానుక పంపించాడు. సి బి ఐ చీఫ్ తరలివచ్చాడు...

అదే సమయంలో మోహన రాజస్థాన్ ఎడారిలో ఒకప్పుడు కార్తికేయ పొందిన శిక్షణ పొందుతుంది... దేశద్రోహులపై ఎక్కుపెట్టిన ఆయుధంగా మారబోతుంది. ఏదో ఓ రోజు మోహన కార్తికేయను తప్పక కలుస్తుంది... మోహనగా, ముగ్ధమోహనంగా, మనోహరంగా..

(అయిపోయింది)

# ముగ్ధమోహనం

*A Novel by*
**VISURAJA**



**నా** పేరు ముగ్ధ... కోనసీమ ఒడిలో పెరిగిన నేను తెల్లవారక ముందే కోయిల కూజితంతో నిద్ర లేస్తాను.... ఇంటిముందు ముగ్గుతో సూర్యుడి లేలేత కిరణాలను ఆహ్వానిస్తాను.
అమ్మ నేర్పించిన ఇంటిపని...
నాన్న వినిపించే భగవద్గీత...
తమ్ముడితో కలిసి జామచెట్టెక్కి చిలుక కొరికిన జామకాయలు కోసుకోవడం... ఇదే నా ప్రపంచం...
నేనో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ని అన్నారు... ఇంటర్‌పోల్ నాగురించి వెతుకుతుందిట... రెడ్ కార్నర్ నోటీస్ వుందిట... ముగ్ధ (మామూలు అమ్మాయి)

**నా** పేరు మోహన...
ఐ హేవ్ నో సెంటిమెంట్స్...
బ్లడ్ అన్నా, బ్లడీ మనీ అన్నా నా కిష్టం.
నా రివాల్వర్ మేగజైన్‌లో బుల్లెట్స్... నా చూపుల్లోని మిస్సయిల్స్ ఎప్పుడూ శత్రువులను టార్గెట్ చేస్తూనే వుంటాయి.
"ది మోస్ట్ డేంజరస్ లేడీ" గా పేరున్న నన్ను "ఢిల్లీ ఎయిర్‌పోర్ట్"లో నిలదీసిన ఒకే ఒక మగాడు...
అతన్ని ఇప్పుడు టార్గెట్ చేసాను...
నా మైండ్‌గేమ్ పవర్ ఏమిటో చూపిస్తాను...
అన్నట్టు మీకు ముగ్ధ అనే అమ్మాయి గురించి తెలుసా?
మోహన (అంతర్జాతీయ నేరస్తురాలు)
అశ్వవేగంతో చదివించే విసురజ ముగ్ధమోహనం.

అసురుడిని సంహరించ డానికి సాక్షాత్తు దేవుడు మహామాన్ని అనే మహా వృక్షాన్ని ఆయుధంగా మార్చాడు.. అసురుడిని సంహరించాడు. అప్పుడా ఖడ్గం వెలిమళ్ళ వంశానికి చెందిన రాష్ట్రపతిని చేరింది. దుష్టశిక్షణ కోసం కార్తికేయ ఖడ్గాన్ని చేతపట్టారు.

First of its kind....




www.manrobo.net
తెలుగు వెర్షన్ English Vesrion
manrobo
మేన్‌రోబో
Online Magazine

ఇది మేన్‌రోబో క్రియేషన్ ప్రచురణ

Manrobo Creations ప్రచురణ

www.manrobo.net